
కలకత్తా ఫిలిం ఫెస్టివల్





ఇంటింటి మాసపత్రిక

వెల: 7 రూపాయలే



'కంప్యూటర్స్ టుడే'
ఎడిటర్ తో
ఇంటర్వ్యూ

1990
గ్రహ ఫలాలు
విశ్లేషణాత్మకంగా

భమిడిపాటి, శ్రీసుభా,
ప్రతాప్ రవిశంకర్,
కాకాని చక్రపాణి కథలు.

మధ్యతరగతి మందహాసం
ముద్దం శెట్టి
నవలిక

ఫిబ్రవరి 1990

వ్యవస్థాపకులు

కీ. శే. వి. వి. రాఘవయ్య

ఎడిటర్

భోగాది వెంకట రాయుడు

సంపుటి : 28 ఫిబ్రవరి 1990 సంచిక : 2

ఇదండీ వరస

పాఠకుల సరదా పజిల్ – 3

1. దేవీలాల్	1. ప్రధానివలె వ్యవహరిస్తున్నారు. 2. ప్రధానిని ఇబ్బందుల్లో వేస్తున్నారు. 3. రాజ్‌నారాయణ్ పాత్ర పోషిస్తున్నారు.
2. చంద్రబాబునాయుడు	1. అసెంబ్లీలో బాగా రాణించారు. 2. మాట్లాడుతుంటే, నవ్వొస్తున్నది. 3. 'దేశం' సమైక్యతను నిలబెడతారు.
3. స్పీకర్ రామచంద్రారెడ్డి	1. నిష్పక్షపాతంగా వ్యవహరించారు. 2. కాంగ్రెస్ (3)ను బాగా ఇబ్బంది పెట్టారు. 3. ఇంకా ఆ పదవికి అలవాటుపడలేదు.
4. ఎన్.టి.రామారావు	1. ప్రతిపక్షపాత్ర బాగా పోషించారు. 2. నష్ఫల మయ్యారు. 3. రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తారనిపిస్తున్నది.
5. రోశయ్య	1. మరీ ఎక్కువగా మాట్లాడుతున్నారు. 2. సమర్థవంతంగా మంత్రి పదవి నిర్వహిస్తున్నారు. 3. చెన్నారెడ్డిని బాగా కాకా పడుతున్నారు.

'జ్యోతి' పాఠకుల కోసం ప్రవేశపెట్టిన ఈ 'సరదా పజిల్'కు సంబంధించి మా వద్ద ప్రత్యేకంగా సమాధానాలు ఏమీలేవు. ప్రతి ప్రశ్నకు మూడు సమాధానాలు యిచ్చాము. వాటిలో దేనికి పాఠకుల సమాధానాలు అత్యధిక సంఖ్యలోవస్తే, అదే సరైన సమాధానంగా భావిస్తాం. ఆవిధంగా అన్ని ప్రశ్నలకు సరైన సమాధానం పంపిన వారికి బహుమతి రూ116/-లు అందచేస్తాం. సరియైన సమాధానాలు పంపిన పాఠకులు ఒకరికంటె ఎక్కువగా వుంటే బహుమతి మొత్తాన్ని వారికి సమానంగా పంచుతాం.

- ఈ కూపన్ మాత్రమే వినియోగించాలి.
- ఉత్తరప్రత్యుత్తరాలకు తావులేదు.
- ప్రతి 'స్టేట్‌మెంట్‌కు' సమాధానాలుగా యిచ్చిన మూడింటిలో ఒకదానికి మాత్రమే 'టిక్' పెట్టాలి.
- విజేతలు పేర్లు మార్చి సంచికలో చూడండి.

సరదా పజిల్-2 ఫలితాలు

'జ్యోతి' జనవరి సంచికలో ఇచ్చిన సరదా పజిల్-2 ఫలితాలు ఈ విధంగా వున్నాయి.

1. "పేరిని చూస్తే జాలేస్తుంది..." అన్నదానికి "ఎన్.టి.రామారావు"కు అత్యధిక సంఖ్యలో 68.75 శాతం, రాజీవ్ గాంధీకి 18.75, చంద్రబాబు నాయుడుకు 12.5 శాతం ఎంట్రీలు వచ్చాయి.

2. వి.పి.సింగ్‌కు 68.75 శాతం, చెన్నారెడ్డికి 31.25 శాతం ఎంట్రీలు లభించాయి. ముద్రగడ పద్మనాభంకు ఒక్కటంటే ఒక్కటి కూడా లభించలేదు.

3. ఎన్.టి.రామారావుకు అత్యధిక సంఖ్యలో 75 శాతం, రాజీవ్ గాంధి చెన్నారెడ్డిలకు చెరిసగం 12.5 శాతం వంతున ఓట్లు లభించాయి.

4. 'దేశం పార్టీ నాయకత్వానికి వీరు అర్హులు' అనే స్టేట్‌మెంట్ కు ఎన్.టి.రామారావుకు 43.75 శాతం, దగ్గుబాటి వెంకటేశ్వర రావుకు 31.25 శాతం, చంద్రబాబు నాయుడుకు 18.75 శాతం ఓట్లు లభించాయి.

5. వార్తా పత్రికలు పార్టీల వారిగా తయారయ్యాయని 62.5 శాతం ఎంట్రీలు పేర్కొంటుండగా, కులవారీగా వున్నాయని 18.75 శాతం మంది, నిష్పక్షపాతంగా వున్నాయని మరో 18.75 శాతం మంది పాఠకులు పేర్కొన్నారు. చిత్రమేమిటంటే ఈ అత్యధిక సమాధానంతో ఏకీభవించిన ఎంట్రీ ఒక్కటి కూడా రాలేదు (జనవరి 22 వరకు) అందువల్ల బహుమతి మొత్తాన్ని ఈ నెల ఎవరికీ పంపడంలేదు.

శ్రీసుభా



సారీ ఫర్ ది ఇంటరప్షన్!

నేను అనవసరపు పన్లు ఎక్కువగా చేస్తుంటానని నా స్నేహితులు అంటూంటారు. అవును, ప్రతీవిషయాన్నీ నెత్తిన వేసుకోవడం, మోయలేనని తెలిసీ బరువును తలకెత్తుకోవడం నాకో శాపం అని నేను అనుకుంటూ వుంటాను. నామాట పెళుసు అని అనే స్నేహితులూ నాకు తెలుసు. పెట్టే చీవాట్లేమన్నా వుంటే అవి పళ్ళెంలో పెట్టి ఆ మనిషికి సగౌరవంగా అందించకుండా మొహానికి తగిలేటట్టు చేసి, ఆపైనే తేలికపడి తెరవెనక్కి తప్పుకోవడం నాకు అలవాటు!

ఎవరైనా బడ్డింగ్ రైటర్స్ ఘాటైన కథ వ్రాసి దానికి అనవసరపు నగిషీలుగా, సెక్సునీ, ఆపైన హింసనూ జొప్పించి, చదవండని నా మొహాన కొడితే నాలుగు పేజీలు చదివి, పెదవి చప్పరించి ఇది కథకాదే అని విసుక్కుంటాను. షార్ట్ సైట్‌తో కథ వ్రాసి పాఠకుల్ని అంధుల్నిచేసేచర్యఅమానుషం అంటాను!

సరే- మంచి కథలు మాత్రమే వ్రాయాలని - దేశోన్నతికి కంకణం కట్టుకున్న చందాన, ఆపైన మడికట్టుకుని నేనెన్ని గొప్ప కథలు వ్రాశానో నా కయితే తెలియదు గాని - ఇక ముందు మాత్రం వంటింటి కథలా, 'చిత్తు' కదలా వ్రాయకూడదని ఓ నిర్ణయానికైతే వచ్చాను. అంతటితో కాగితానికీ కలానికీ విడాకుల మహోత్సవం ఒకటి ఏర్పాటు చేసి జీవితం తాలూకు వ్యాపకాల్లో పడాలనుకున్నాను. కానీ తోటి రచయితలూ, దగ్గర స్నేహితులూ కలిసి హఠాత్తుగా నాకు ఓ సన్మాన సభ ఏర్పాటు చేశారు. నిన్నటి నా కథలూ, వాటి గొప్పతనాన్ని చిలవలు పలవలుగా వర్ణించి నన్ను ఆకాశం ఎక్కించే ప్రయత్నంలో విఫలమయి, నాకాళ్ళు మాత్రం నేల మీద ఆనకుండా చేశారు. నాపాత కథలు అత్యవసరంగా ఒక సంపుటిగా తీసుకురావాలనీ, అవి- ఎడారిలో గొంతు తడి ఆరిపోయిన మానవుడికి ఒయాసిస్సులుగా, ఆశలుడిగి చీకటిలో తడుముకుంటూ పోతున్న వ్యక్తికి విద్యుల్లత కాంతిలాగా నాపాఠకులకు నాకథలు విందులన్నారు. కథా సంపుటి తయారవడానికి పడే ముందటి పురిటి నొప్పులన్నీ నాతో పాటు వాళ్ళూ పడతామన్నారు.. నేను మౌనంగా వుండి, మింగుడు పడని ఆలోచనలు గొంతును పట్టుకుంటూంటే, "హమ్మయ్య నిన్ను ఒప్పించగల్గాం" అంటూ ముక్త కంఠాలతో నేననని నా మాట వాళ్ళు అనేసి నన్ను వాళ్ళ చేతులతో ఎత్తి కుదేశారు... కాఫీ వంకన నన్ను లోపలకు పిల్చి మా ఆవిడ అరుణ, మీ చెల్లెలు సంపూర్ణకి పెళ్ళీడువచ్చింది. ముందు ఆమె సంగతి చూడండి. నా ఉద్దేశంలో మీకథలు యింట్లో వుండి, మరో రెండేళ్ళు మీద వేసుకున్నా ఏంకాదు. పాత బంగారంలాగా పాతిపెట్టిన సారాసీసాల్లాగా కదలు కూడా పాతబడ్డకొద్దీ రాటుదేలుతాయని మానాన్నగారు అనేవారు అంటూ నేను నొచ్చుకోవడానికి అవకాశంలేని సలహా ..

మీకు తెలుసా ?

ప్రపంచమంతటిలో చిన్న గడియారం స్విట్జర్లాండులో తయారు చేయబడినది. దాని వెడల్పు 3 / 16 అంగుళాలు.

ఒకటి యిచ్చింది! అయినా ఆ క్షణంలో నాకు మా సంపూర్ణకంటే నా కథా కన్యలే ముఖ్యంగా కన్పించారు!!

* * *

పుస్తకం ఏరకంగా అచ్చువ్వాలి, అక్షరాలు ఏ టైపువి వాడాలి, కవరు పేజీ ఆఫ్‌సెట్‌లో ముద్రించాలా లేక సాదాసీదాగా చేస్తే చాలా అన్నది మొదటి ఆలోచన అయితే పుస్తకానికి ముందుమాట ఎవరిచేత వ్రాయించాలన్నది యింకో సమస్య అయ్యింది. తెలుగు కథ మీద అధికారం వున్న చేయి తిరిగిన రచయితలు దేశంలో చాలామంది వున్నా - నాకథలకు ముందుమాట వ్రాయడం కోసం ముందు కొచ్చే ఆత్మీయులెవరన్న విషయం దగ్గర నేను కొంచెం తటపటాయించవల్సి వచ్చింది. నన్ను కథకుడిగా పరిచయం చేసినవాళ్ళు, నా కథంటే యిలా వుండాలి అని నిర్వచనం చెప్పి, ఆపైన నాచెయ్యి పుచ్చుకుని నడిపించిన వాళ్ళ సమయానికి అందుబాటులో లేకుండా పోయారు.


"అసలు గొప్ప పుస్తకాలకు ముందుమాటలు, వెనకమాటలూ పెద్ద అవరోధం తెలుసా? నీరచనల్ని, నువ్వే ఉద్దేశంతో వ్రాస్తే నీకు కితాబులు యివ్వకపోతే నొచ్చుకుంటావని దాంట్లో లేనివీ, వున్నవి కలబోసి కొత్తరుచులు చూపించపోయి పుస్తకాన్ని కాలకూట విషతుల్యంగా మార్చే ప్రక్రియ కూడా జరగదని హామీ యివ్వలేం! పైగా ముందుమాట వ్రాసే వాళ్ళకి కాస్తంత అహంకూడా అప్పుడు తోడైతే నిన్ను ముందు పెట్టుకుని వాళ్ళ సమకాలికుల్ని ఏకి పారేస్తారు. దాంతో నీ పుస్తకాన్ని విమర్శకులు ఏకిపారేస్తే." నారాయణరావు ధర్మ సంశయం వెలిబుచ్చారు.

"పోనీ నాన్‌కాంట్రవర్షియల్ ఫిగర్ చేత ముందుమాట వ్రాయిస్తే పోలా" అన్నాడు రాజా.

ఇలా వారం కొట్టు మిట్లాడిన తర్వాత ముందుమాటకి మంగళ హారతి పాడేద్దమనే నిర్ణయానికి వచ్చాను. అంతటితో సగం యిబ్బందులు తప్పాయి. అయితే - వెంటనే మరో సరికొత్త యిబ్బంది - నేను ఊహించంది, నా ఆలోచనలకు అందందీ రాజేంద్ర నాముందు పెట్టాడు.

ఏ వస్తువుకయినా ప్రచారం అవసరం కాబట్టి, సరుకు అమ్మకాల్లో ముందు వుండాలంటే, సరుకు నాణ్యత కన్నా - సరుకు గురించిన అరుపులే ప్రముఖ పాత్ర వహిస్తాయి కాబట్టి - నా కథా సంపుటికి ఏ హడావిడీ లేకుండా మార్కెట్‌లోకి వదలడం తప్పు అన్నాడు. నెలకు యిన్ని సినిమాలనీ, వారానికో మిడ్‌నైట్ పిక్చరని టీ.వి వాళ్ళూ, రాబోయే వాకొత్త పుస్తకంలో మొదటి పేజీలోనూ, ఆఖరి పేజీలోనూ రెండు తాయిలాలు పెట్టామనీ, అవి ముందుగా పోల్చుకోగల్గిన పాఠకులకు, రచయిత ఆటోగ్రాఫ్ జతకలిపిన మేలురకం ప్రతిని బహుమతిగా యిస్తామని ప్రచురణ కర్తలూ చెవినిల్లు కట్టుకుని పోరుతున్న ఈ రోజుల్లో మనం కూడా పుస్తకావిష్కరణ సభ అంటూ ఒకటి ఏర్పాటు చేయాలన్నాడు. ఒక ఆవిష్కర్తనీ, యిద్దరు ఉపన్యాసకుల్ని పిలిచి పుస్తకానికి పండగ చేద్దామన్నాడు.

అప్పటికే ఆడపిల్ల పెళ్లి ఖర్చుని మించి శరవేగంతో దూసుకుపోతున్న పుస్తకం ఖర్చుకి నేను డీలా అవుతూనే వున్నాను. కనబడ్డ ఆత్మీయుల దగ్గర అప్పుజేయడం, ఆఫీసులో లోనులు



తీయడం జరగనే జరిగింది. అయినా ఎక్కడవని అక్కడే వుంది. పైగా ఆవిష్కరణ మహోత్సవం అంటే మాటలు కాదు. అతిథుల్ని అందునా తోటి రచయితల్ని కవుల్ని వాళ్ల తాహతుకు తగ్గట్టు గౌరవించాల్సివుంటుంది.

"ఎక్కడ తేలతానో ఏమో భయంగా వుంది" అన్నాను, ఓ రాత్రివేళ పక్కనే పడుకుని కదులుతున్న అరుణతో, "ఏమిటండీ పలవరింతలు. ఆ పుస్తకం అచ్చువని మొదలు పెట్టినప్పటి నుంచి మిమ్మల్ని చూస్తున్నాను. ఇప్పటికే మనిషి సగం అయ్యారు".

నేను మాట్లాడ లేదు.

" మాతాతయ్య యాగాలూ, యజ్ఞాలూ చేశాడు. అయినా పిడుగులా అన్ని పనులు చేసుకు పోయేవాడు. నాకు తెలియక అడుగుతాను. ఈ రోజుల్లో కథలపుస్తకాలు కొని దాచుకునేదెవరండీ.. గిరాకీ అంతా నవలలకే వుంది.

నాకు నవ్వొచ్చింది. మా ఆవిడ ఈ సలహా ఓ నెల ముందు ఇచ్చి వుండవల్సింది అనుకున్నాను. మాటమారుస్తూ అన్నాను, "మనవాళ్లు పుస్తకావిష్కరణ చేసి తీరాలంటున్నారు. నాకేం తోచకుండా వుంది. ఇప్పటికే నాలుగువేలయ్యింది."

"అయితే"

" ఇంకో మూడువేలు దాకా పోకొచ్చు. ఖర్చు.."

అరుణ అంది నవ్వేనస్తూ "మిమ్మల్ని ఇరవై ఏళ్లబట్టీ చూస్తున్నాను. మీరేమిటో, మీ నైజం ఏమిటో నాకు తెలియంది కాదుగా..

ఏ ఆలోచనైనా పని మొదలు పెట్టే ముందే వుండాలి. కానీ మీరు దానికి బద్ధ విరోధులాయె! కానివ్వండి.. నామెళ్ళో కాసిగాయగుళ్ళూ, ముత్యాలదండా వున్నాయి. అల్మైరాలో వెండికంచం, మరచెంబూ వున్నాయి. ఇవి నామెళ్లోనూ, అవి నాలుగైదు ఏళ్లుగా అదే చోటులో కాళ్లు కట్టి పడేసినట్లు కదలకుండా పడివున్నాయి -పాపం! వాటిని నెలా రెండు నెలలపాటు ఆ ఆనంద్‌లాల్ సోహన్‌లాల్ గారి షాపులో తాకట్టుగా వెళ్ళి తాత్కాలిక ఆనందాన్ని పొంది రానివ్వండి. పుస్తకాల అమ్మకం జరిగిన తర్వాతో,మీ ఎరియర్స్‌తోనో వాటిని తిరిగి ఇంటికి పిల్పించుకుందాం" అంటూ పెద్దగా ఆవలించి, ఆ ఆవలింత పూర్తికాకుండానే 'నిద్రపోండి' అనే మాటను జతచేసి ముందుగా తనావనికి సిద్ధమవుతూన్న దానిలా పక్కకి వత్తిగిల్లింది.

అప్పుడు ఆ చీకట్లో నాకు - అరుణ నేనంత వరకూ సృష్టించని పాత్ర తాలూకు గుణగణాలు దాచుకున్న మనిషిలా కన్పించింది. నిత్య జీవితంలో కొందరు మనుషులు అసాధారణ కృత్యాల్ని కూడా ఏ గుండెలూ బాదుకోకుండా, గంభీరపడిపోకుండా అవలీలగా చేసేస్తూ వుంటారు, కాబోలు! కథలు వ్రాయడం అలవాటయినప్పటి నుంచి బరువయిన పాత్రలు సృష్టించి - వాళ్లకోసం మరీ బరువయిన సంభాషణలూ, సన్నివేశాలు పేర్చడంతో, వచ్చే యిబ్బందే యిదేమో! దూరదృష్టి మీద మోజు పెరిగి, దూరపు కొండలే అందంగా కన్పిస్తూ వుంటాయి. నేను నెలగా సాలె గూడులో చిక్కుకుని కిందామీదా అవుతూంటే, అరుణ అరక్షణంలో నా మార్గాన్ని సుగమం చేయడంతో నాకు ఆశ్చర్యం, ఆనందం రెండూ కల్గాయి.

అప్పుడే నా కన్పించింది: నాతో కాపురం చేస్తూ, సుఖాలకన్నా కష్టాలే ఎక్కువగా భరించింది - ఏ బలహీన క్షణాల్లో కూడా మాటనీ మనసునీ కూడా వికృతం చేసుకోంది. నవ్వులో నాణ్యతనీ, మనసులో మంచి తనాన్ని

సమపాళ్లలో రంగరించి, యింటిని మినీ స్వర్గంగా కాపాడు కొస్తున్న అరుణకు - నా కథా సంపుటిని అంకితం యివ్వడం సముచితం అని!!

నేనూ, నారాయణగారూ, రాజా, రాజేంద్ర ఒకటికి పదిసార్లు ఆలోచించి, ఆఖరికి పుస్తకావిష్కరణకు ఒకనాటి నా గురువూ, తెలుగు కథకు ఆదిగురువూ అయిన వినయమూర్తి గారిని పిలవాలని నిశ్చయించుకున్నాం. నిజమే ఈ వేళ రోజున వినయమూర్తిగారు తెలుగు కథ గురించీ, నవల గురించీ ఏకబిగిని మాట్లాడగలిగే సత్తావున్న వ్యక్తి.. ఆనాటి వీరేశలింగం గారి మీదనుంచి, చిలకమర్తివారిని పలకరిస్తూ, శ్రీపాద వారిని దాటి, చలాన్నీ బుచ్చిబాబునీ బుజ్జగించి, కొడవటిగంటిని కొడవలిగంటి అంటూ ఎవరి రచనలపైనైనా ఎప్పుడో ఉపోసన పట్టినట్లు మాట్లాడ గలరు. తెలుగు కద మీద అథారిటీతో విదేశాలకు వెళ్లి విదేశగాలితో పొల్యూట్ అయిన తెలుగు వాళ్ల మెదడులో తెలుగు కథల బీజాలు వెదజల్లిన ధీశాలి! 'వచనా మాత్యుడు', 'పదబ్రహ్మ', 'కథా మాంధాత' బిరుదులు పొందిన స్నేహశీలి.

* * *


నేను వెళ్లేసరికి వినయమూర్తిగారు అంతదూరంనుంచే నన్ను చూసి, లేచినంత పనిచేసి, ఆపైన ఆ చర్యకు స్వస్తి చెప్పి నాకో కుర్చీ చూపించారు.

నేను వారి ఆరోగ్యం గురించీ, వారి శ్రీమతి గారికి సోకిన షుగర్ వ్యాధి గురించీ, ఎమ్సెట్ పరీక్షలో అపజయం పాలైన సుకుమార రత్నం గురించీ, వారి సోఫాసెట్ గురించీ మాట్లాడాను. ఆయనగారు కూడా వే చెప్పిన విషయాలన్నీ సావధానంగా విని, నా పాతకథల్ని గుర్తున్నట్టుగానే మాట్లాడి, 'ఫలానాకథ మనం వేశాం చూడు' అంటూ అన్నీ నాచేత చెప్పించి, తను మధ్యలో అందుకుంటూ, ఆపైన అలాంటి నా కథలకోసమే తెలుగువాళ్ళు మొహంవాచి వున్నారని నన్ను పుచ్చేసి తనని అమెరికాలో తెలుగువాళ్ళు ఆదరించిన వైనం, తనొద్దంటున్నా వాళ్లు యిచ్చిన బిరుదుల గురించి చెప్పి ముక్తాయింపుగా కాఫీతో నోటికి విశ్రాంతి యిచ్చారు.

"నువ్వు బాగా వ్రాస్తావయ్యా.. నీ కథలు ఇంగ్లీషులోకి రావాలి, ఇప్పటికే ఆలస్యం అయ్యింది" అన్నారు.

మీకు తెలుసా ?

జింకల మీద మునురుతూ ఉండు బాట్ ఫ్లై అను జాతి ఈగ గంటకు 818 మైళ్ళ వేగముతో ఎగుర గలదు. ప్రపంచములోని జీవకోటిలో మిక్కిలి వేగముగా ప్రయాణించు ప్రాణి ఇదియే.



నానోరు ఊరుకోలేదు. "ఆపని మీలాంటి వాళ్లేచేయాలి" అన్నాను. ఆ తరువాత నేను వచ్చిన సంగతి చెప్పాను. ఆయన ఆహా, అలానా, బావుంది, చాలాబావుంది లాంటి విశేషణాల మధ్య వూగిసలాడారు. ఇంతలో ఏమనుకున్నారో, "పుస్తకం ఎవరికైనా అంకితం యిస్తున్నావా" అని చటుక్కున్న నన్ను ప్రశ్నించి, నేను సమాధానం చెప్పకుండానే ప్రస్తుతం తెలుగుదేశంలో యువరచయితలు, పెద్దరచయితల్ని ఎలా గౌరవించాల్సి వుందో, పెద్దరచయితలూ, కవులూ చిన్నవాళ్లను ఎలాపైకి తీసుకురావాలో, లైమ్‌లైట్ లోకి రావాలనీ మనుషులు ఎలా ప్రవర్తిస్తున్నారో, బ్రతకాలంటే ప్లాట్స్ అల్లడంతో పాటు సర్కిల్‌ని ఎలాపెంచుకోవాలో చెప్పారు. ఈనాటి రచయితలు

ధనకాంక్షకన్నా కీర్తి కాంతకు పెద్దపీట వేస్తున్నారనీ, ఇది దేశంలో ఈనాటి 'ఫినామినా' అంటూ మాట్లాడి కాసేపుఆగి పుస్తకాల రేక్ దగ్గరకు వెళ్లి, తచ్చాడి, తిరిగివస్తూ, "నీలాంటి రచయిత వ్రాసి స్వయంగా అచ్చువేసిన పుస్తకాన్ని అంకితం తీసుకోవడంకన్నా నాకువేరే ఆనందం ఏముంటుంది? ప్రతి అల్లాటప్పా పుస్తకాలకూ ముందుమాట వ్రాయడం ఎంత అవివేకమో, చిల్లర పుస్తకాలకు స్వీకర్త కావడం కూడా అంతే నేరం. సరే – ఫంక్షన్ ఏర్పాటు చేయి. ప్రెస్ వాళ్లని పిలు. పబ్లిసిటీ కి నువ్విచ్చే ప్రాముఖ్యం బట్టే నీ పుస్తకానికి విలువ వచ్చేది..."

నాకు మాటలు రావడంలేదు. అవును, నామాటలుకూడా ఆయనే మాట్లాడుతున్నారు. ఆయన హృదాయాన్నే, ఆలోచనల్నే నావిగా కాపీ చేసుకోమంటున్నారు! ఆశ్చర్యం, భయం, అవమానం లాంటి నవరసాల మధ్య నేను బందీనయ్యాను! అవుతున్నాను!!

"అన్నట్టు – నువ్వు చిన్నవాడివి. ఈ ఆవిష్కరణ మహోత్సవానికి అంకితం కార్యక్రమానికి కొన్ని ఆచారాలు ఏడ్చాయి. నీ పుస్తకం అంకితం తీసుకునే నేను–నీకు అల్లుణ్ణవుతాను. నువ్వు పువ్వు తాంబూలంతో, పుస్తకాన్ని కలిపి నాకిస్తే మామగారిగా నీకు నేను మళ్ళూ మాన్యాలూ యివ్వాలి. ఇది విధిగా చేయాలి. లేకపోతే సభామర్యాద అనిపించుకోదు. అందుకని

మీకు తెలుసా ?

ఆస్ట్రియాకు చెందిన మోహను హర్లింగర్ అను వ్యక్తి చేతుల మీద నడుస్తూ 55 రోజులలో 871 మైళ్ళు ప్రయాణం చేశాడు.

ఓ రెండువేలు సభాముఖంగా యిస్తాను, సరేనా" అన్నారు.

"ఎందుకులెండి సారదబ్బు.. మేం ఏదో సరదాగా చేస్తున్న.." ఆయన నన్ను అడ్డుకున్నారు. "ఈ ఏడాది చివర్న లండన్‌లో తెలుగురచయితల సమావేశం జరగొచ్చు. నన్ను కన్వీనరుగా వుండమని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇప్పుడే చెప్తున్నాను. జనవరిలోనువ్వేవన్నా పెట్టుకోకు. నన్ను అక్టోబరులో ఓసారి వచ్చి కలు. నీలాంటి వాళ్లు తెలుగు కథకు నీరాజనాలర్పించవల్సివుందక్కడ" అంటూ పుస్తక ఆవిష్కరణకు నేను పిలవాలనుకుంటూన్న వ్యక్తులపేర్లని చూసి పెదవి విరిచి, వారితో తనకు సన్నిహిత సంబంధాలు లేవని చెప్పి, ఆ స్థానంలో తనకు నచ్చిన మరో రెండు పేర్లు జేర్చారు. వారిద్దరూ ప్రస్తుతం ప్రభుత్వ అండదండలతో పైకి ఎగబాకిన నిన్నటి కాదు – మొన్నటి రచయితలూ!

ఇంతలో వినయమూర్తిగారి భార్య లోపలినుంచి – అల్లం, కొత్తిమీర, పచ్చిమిరపకాయముక్కలూ కలిపిన మజ్జిగ తెచ్చి యిచ్చింది.

ఆవిడ నన్ను గుర్తుపట్టారు. "నీ పుస్తకం కూడా వీరికేనా నాయనా అంకితం యిస్తున్నది అని" ఆపైన కూర్చుని "మీ గురువుగారికి నేనొక్కత్తినీ సరిపోలేదు. నెలకిద్దరు కావ్యకన్యల చొప్పున తెచ్చి ఇల్లంతా నింపుతున్నారు. చూడు" అంది, చిన్నగా నవ్వుతూ..

తప్పదుకదే – కుర్రవాళ్లు అడుగుతూంటే ఎలాకాదంటాం.. పైగ శిష్యుడాయే!"

"నన్ను వదిలిపెట్టమన్నా వీరికే అభ్యంతరం వుండదు. ఈసభలూ, సన్మానాలూ, అంకితాలూ వుంటే చాలు.."

"అవునోయ్.. సరిగ్గా మొన్నే సెంట్రల్ లైబ్రెరీ లో స్వామిలేడు, అతగాడు నీకు తెలుసు – తన కవితా సంకలనాన్ని అంకితం యిచ్చాడు... అని భార్య వైపు చూసి "ఏమే వచ్చేనెల ఆ అమ్మడు ఎవరూ, పి.హెచ్.డి చేస్తోంది, తన మొదటి నవల స్వీకరించాలని ఒకటే గొడవపెడ్తోంది."

వినయమూర్తి గారు చెబుతున్నారు. నేను వింటున్నాను – కాదు వినవల్సి వస్తోంది!!

* * *

ఇంటివైపు బయలుదేరాను. తలతిరుగుతోన్నట్టు అన్పిస్తే మంచి టీ ఒకటి తాగాను. జరిగిన విషయాలు స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాను వాళ్లు ఫోన్‌లోనే తమ సానుభూతిని దీర్ఘ నిట్టూర్పులతో అందజేశారు. అయినా వినయమూర్తిగారు నా వెనకే వస్తున్నట్టుగా వుంది. ఆయన తన మాటలు పెట్టెలో పెట్టి తాళం వేసి నాచేతికి యివ్వడమే కాకుండా, నాకు తెలియకుండానే తనమాటల తాలూకు నకళ్లను నా మెదడులోకి జొప్పించి పారేశాడనిపించింది!


ఇంట్లో అడుగుపెట్టాను. అరుణ పడగ్గదిలోంచి వచ్చింది. చేతిలో బట్టలు వున్నాయి.

"చూడండి, బాలిగాడు సంపూర్ణ ఏం చేశారో – ఇది మీకు లాల్చి కోసం తెచ్చిన ఖద్దరుబట్ట. ఇదిగో నాకీ వెంకటగిరి చీర. ఖరీదుని ఇన్‌స్టాల్ మెంట్స్‌లో తీర్చవచ్చుని సలహా యిస్తున్నారు."

వారం పదిరోజుల్లో జరగబోయే పుస్తక ఆవిష్కరణ సభ తాలూకు హడావిడి అరుణ కళ్లల్లో ఛాయామాత్రంగానూ, యింట్లో అడుగడుగునా కన్పిస్తూనే వుంది. ప్రెస్ నుంచి తీసుకు వచ్చిన పుస్తకం

మీకు తెలుసా ?

క్యూబాలోని ఒక మేలు రకము ఆవు రోజుకు ఒకంటికి 106 లీటర్ల పాలు ఇచ్చి ప్రపంచ రికార్డు స్థాపించింది.



రెండో పేజీలో 'ఈ పుస్తకం నా శ్రీమతి – అరుణకు అంకితం' అనేచోట ఆగి బాలిగాడు అన్నాడు.

"నాన్నగారూ, అమ్మకు యిలా పొడి మాటలతో పుస్తకం అంకితం యివ్వడం బాగోలేదు.. ఇది ఇంగ్లీషు వాడి పద్ధతి."

'అవును అన్నయ్యా, వదిన మీద మీరు కనీసం ఒకటి రెండు సీసపద్యాలు వ్రాసి –కింద ఈ మాటలు వుంచండి.." అంది సంపూర్ణ.

మామూలుగా అయితే వాళ్ల హాస్య చతురతకు నేను నవ్వేవాణ్ణే!!

భోజనాలు అయి – నేను పడగ్గదిలోకి వెళ్ళిన తర్వాత కాస్త ఆలస్యంగా అరుణ వచ్చింది. అంతకు ముందే గుర్తు పెట్టుకున్న దానిలా పుస్తకం తెరిచి " చూడండి, పేజీకి కనీసం రెండు తప్పులైనా అచ్చుగుద్దాలని మీ ప్రెస్ వాళ్ళు కంకణం కట్టుకున్నట్టు కనబడుతోంది. పూల దారులు అనివుంటే పూలుదారాలు అని కొట్టాడు. కనీ కన్పించని పూలదారులని' రచయిత అంటే– కంపోజిటర్ కనీకన్పించని పూలుదారాలు అనే కొత్త ప్రయోగం "నవ్వుతోంది.

"అరుణా..."

"ఏమిటట.."

"నీ సంతోషానికి చిన్న అంతరాయం.."

అరుణ నావైపు చూసి "కథ" అంది.

"కాదు" అంటూ జరిగింది చెప్పాను. చెబుతూ అరుణని చూస్తూనే వున్నాను. అరుణ ఏమీకాలేదు. కాని నన్ను కొత్తగా చూస్తోన్నట్టు మొహం పెట్టింది. "ఇంతేకదా.. అంకితం యిస్తేనే మీ పుస్తకాలు నావి అవుతాయి, లేకపోతే కావా.. భలేవారండీ! ఆ పుస్తకాలూ అందులో అక్షరాలు ఎక్కడకు వెళ్లినా వాటి జన్మస్థానం యిక్కడే.." అంది నన్ను నవ్విస్తూ, గుండెలమీద నుంచి వీపు వైపుకు చేతిని పోనిస్తూ.

"నువ్వూ కథలు వ్రాయవచ్చు.."

"అలాగే వ్రాస్తాను.."

'అదిసరే. పిల్లలకీ విషయాలన్నీ చెప్పకు .. అలాఅలా ఈ మాటలు బయటకు వెడతాయి.

అలా అన్నా నాకు ఇంకా వెల్తిగానే వుంది! నాకు నచ్చని పని నేను చేస్తోన్నట్టు – నా ప్రమేయమే లేకుండా ఏదో ఘోరం జరగబోతోన్నట్టూ ఆలోచన్లు పుడుతూంటే – తాత్కాలిక పుపశమనంగా కళ్లు మూసుకున్నాను.

ఆ సాయంకాలమే పుస్తకావిష్కరణ మహోత్సవం! కథా సంపుటి సర్వాంగ సుందరంగా తయారయ్యింది! మావాళ్లంతా

'ఆడిటోరియమ్‌లో సభకు కావల్సిన ఏర్పాట్లు చూస్తున్నారు. కాలునిలవక నేను అటు వెళ్ళాను.

"మిత్రమా.. సాయంకాలం వరకూ నువ్వు కొత్త పెళ్ళికూతిరిలా ఎవరికంటా పడకూడదు. మర్చేపోయాం. మేం పిల్చిన వెంటనే వేదికమీదకు నువ్వు, నీ శ్రీమతి గారితో కలిసి రావల్సి వుంటుంది. పుస్తకం అంకితం యివ్వకపోయినా – బెటర్ ఆఫ్‌కి పక్కన చోటు యివ్వడం ధర్మం" అంటూ హెచ్చరించారు.

సాయంత్రం ఆరు గంటలయ్యింది. స్నేహితులు వస్తున్నారు. శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇంతలో వినయమూర్తిగారు మిగిలిన అతిధులూ వచ్చారు. అందరం ముందు వరుసలో కూర్చున్నాం.

"హాదావిడి బాగానే చేశారే! లిటరరీ మీటింగ్‌కి యింత మంది జనమా? వీళ్ళందరూ నీభక్తులేనా? అంటూ జోక్ చేశారు.


సభ పదినిమిషాల్లో ప్రారంభమవుతుందని పదోసారి నిర్వాహకులు హెచ్చరిక చేస్తున్నారు! హాల్లో మాటలు..నవ్వులు.. ఎవరి ధోరణిలో వాళ్లువున్నారు.


ఇంతలో వినయమూర్తిగారు నా చెవిదగ్గర తన నోరు పెట్టి , "చూడు, సడెన్‌గా పెద్ద యిబ్బందిలో పడ్డాను. మాకుర్రవాడు ఎమ్‌సెట్ తప్పాడుగా. డొనేషన్ కట్టి ఇంజనీరింగ్‌లో జేర్పించవలసి వస్తోంది. పదివేల వరకూ ఖర్చు అవుతుంది. నీకు స్టేజిమీద నేను రెండువేలు కేష్ యిస్తాననుకో.. కానీ అది తిరిగి నాకు యివ్వాలోయ్.. ఓ నెల తర్వాత నీకు మళ్లీ సర్దుతాను" అన్నారు, నెమ్మదిగా.

"ఫరావాలేదండి..అసలు డబ్బు ఇవ్వనవసరం లేనేలేదు.."

"నీ గురించి కాదు.. నా మర్యాదకోసం యివ్వాలి.. ఆ మర్చే పోయాను, చెప్పడం.లండన్‌లో జరిగే తెలుగు కథా సమ్మేళనం ఓ కాలిక్కి రాబోతోంది.. నీ పేరు కూడా.."

అంతే! చటుక్కున కరెంట్ పోయింది! జనం రకరకాలుగా ఆ సంఘటనకి స్పందిస్తున్నారు. ఇంతలో కొవ్వొత్తులు వెలిగాయి. నిర్వాహకులు తెల్లమొహాలు వేసుకుని చీకటి దెయ్యాల్లా తిరుగుతూ పని చేయని మైకు ముందు నుంచుని క్షమాపణలు చెబుతున్నారు. అరగంట గడిచింది! రామగుండం పవర్





తేలిగ్గా రాయచ్చు. అయినా నీకు టైము వుంటుందా" అన్నాను.

"టైము వుండటం ఏమిటి సార్... ఎల్లాగో ఎడ్జస్టు చేసుకోవాలి..." చెప్పాడతను మూకుడులోని మిర్చి బజ్జీలను కదుపుతూ.

"ముందు పూర్వపు రచయితల రచనల్ని చదువు అదే దారి చూపుతుంది. నేటి రచనల్లో వేగం వుంది."

మిర్చివాలా చెప్పాడు "ఇప్పుడు అవన్నీ చదివేందుకు టైము, ఓపిక లేదు. ఏ అనుభవం లేకుండా కథలు రాయడం కుదరదా...నేటి

రచయితలు, రచయిత్రులు యిలాగే చేస్తున్నారా"

ఏం చెప్పాలో తోచలేదు నాకు. ఎవరిష్టం వారిది. నేనే మాత్రం నాటి నేటి రచనలు చదవనని కాదు. మంచి రచనలు చేసేందుకు నాటి రచనలు పునాదిగా సహకరిస్తాయని నా నమ్మకం. వాటిల్లో నేను అనుభూతి తృప్తి, అనిర్వచనీయమైనదేదో పొందుతుంటాను." గర్వంగా చెప్పాను.

మర్నాడు తను రాసిన కవితలు, వ్యాసాలు, కొన్ని నాకు చూపాడు. వాటిని చదివి ఎంతో సంతోషించాను. ఓ అనుభవజ్ఞుడైన రచయిత, చేయి తిరిగిన రచయితకు ఏమాత్రం తీసిపోని విధంగా వున్నాయి అతను రాసిన కవితలు. ఇక వ్యాసాలు కూడా ఏమాత్రం తీసిపోనట్టుగా వున్నాయి.

"సార్... మీకు శిష్యరికం చేసి కథలు రాయాలని అనుకుంటున్నాను. మీరు రాసిన కథలు యివ్వండి.. చదివి నేర్చుకుంటాను. మీరు రాసే కథలకు ఫెయిరు కాపీ చేసిపెట్టాను." అన్నాడు మిర్చివాలా.

ఆ మర్నాడు నేను వేయించిన కథల సంపుటి కాపీని మిర్చివాలాకు యిచ్చాను. పుస్తకం మీదున్న ధర చూసి పదిహేను రూపాయలు యివ్వబోయాడు.

"భలేవాడివోయ్.. ఈ పుస్తకాన్ని నీకు ఉచితంగా యిస్తున్నాను." అన్నాను.

"అదేమిటి సార్.. ఈ రోజుల్లో యిలా కథాసంపుటాలు వేయించుకోటం, రచనలు చేయటం వ్యాపారం అని విన్నాను. ఏం చేసినా డబ్బు కోసమేగా..... మీరెందుకు వద్దంటున్నారు." అని అడిగాడు.

"కావచ్చు..కాని నేను సరదాగా కథలు రాయటం ఆరంభించాను. నేను కథల కార్ఖానా ప్రారంభించలేదు. కథలు రాసి సంపాదించాలన్న ఆరాటం, ఆశలేవు." అన్నాను. ఆ క్షణంలో ఆఫీసులోని కొందరు రచయతలు గుర్తుకొచ్చారు. ఓ మహా రచయత

అయిదువేలు ఖర్చుపెట్టి, కథాసంపుటాన్ని వేయించుకుని ప్రముఖ సినిమా రచయతను ఆహ్వానించి, సన్మానం చేయించుకుని, మరో పెద్ద రాజకీయ నాయకుడి సమక్షంలో ఆవిష్కరింప చేసాడు. అయితే స్నేహితులకు, తోటి రచయతలకు ఒక్క కాపీ కూడా యివ్వలేదు. కావాలంటేసగం ధరకు కొనుక్కోమని నిర్మొహమాటంగా చెప్పాడు. ఆ తరువాత ఓ పబ్లిషరుకు గుత్తగా అమ్ముకున్నాడు. అదృష్టం కలిసొస్తే నడిచొచ్చే కొడుకు పుడ్తాడట. ఓ ప్రముఖ వార పత్రిక

నిర్వహించిన కథలపోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. వెంటనే టి.వి. సీరియల్ ప్రసారం అయింది. రెండుమూడు సినిమా అవకాశాలు వచ్చాయి. దానితో ఎవరినీ లెక్కచేయడం మానేసాడు.

"మీలాగే అందరూ నిజాయితీగా, చిత్తశుద్ధితో వుంటే ఈ దేశం ఎంతో బాగుపడుతుంది కదూ..మీకభ్యంతరం లేకపోతే మీ యింటికి రావచ్చా.." అని అడిగాడు మిర్చివాలా.

"తప్పకుండా రావయ్యా..ఇందులో పోయేది ఏమిటి.. నాకు తోచిన సలహాలు చెప్తాను. ఆ తరువాత నీ యిష్టం.."అని మాత్రం అన్నాను. అంతకంటే ఏం చెప్పాలో తోచలేదు.

ఈ విధంగా మా పరిచయం పెరగసాగింది.

ఓసారి–


నేను పది రోజులు సెలవుపెట్టి వూరుకెళ్ళాను. ఆ విషయమే మిర్చివాలాతో చెప్పాను. అప్పుడు అతని ముఖంలో విచారం కనిపించింది. "పది రోజుల్లో వచ్చేస్తాను. మళ్ళీ మనం కొత్త సంవత్సరంలోనే కలుసుకుంటాము. అడ్వాన్సుగా నీకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను.అయితే కొన్ని రోజులు నా మూలంగా ఆదాయం వుండదు..సారీ" అన్నాను.

"ఫరవాలేదు సార్. మీ పనులు నా కోసం మానుకోలేరుకదా...క్షేమంగా వెళ్ళిరండి. కొత్త సంవత్సరంలో నేను మీ ఆశీస్సులతో కథావ్యాసంగానికి దిగుతున్నాను." అన్నాడతను.

నేను వూరికెళ్ళిపోయాను.

* * *

ఇంటికి రాగానే శ్రీమతి నాకు నాకొచ్చిన గ్రీటింగ్సు చూపించిది. ఏటా నేను ఏభై రూపాయలదాకా గ్రీటింగ్సు నిమిత్తం ఖర్చుచేస్తాను. అలాగే నాకు స్నేహితులు, చుట్టాలు నుంచి వస్తుంటాయి. విప్పి గ్రీటింగ్సు అన్నీ చదివాను. అందులో ఓ గ్రీటింగు చదివి ఆశ్చర్యపోయాను.





"తేజమైన మీ మనసుకి
ఉత్తేజమైన మీ భావానికి
కాంతివంతమయిన సంక్రాంతి
శుభాకాంక్షలు".

"రాధ"

రాధ! ఎవరా రాధ! ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. ఏవో సందేహాలు, అనుమానాలు... మా చుట్టాల్లో 'రాధ' పేరుగలవాళ్ళెవరూ లేరు. మరి ఎవరైవుంటారు.... పోనీ ఆఫీసులో నా కథలు చదివి, నా గురించి తెలిసినవారు ఎవరైనా వున్నారా అంటే, ఎవరూ లేరు. ఈ శుభాకాంక్షల చాటున ఎంతో అర్థవంతమైన భావం వుంది. కవరు మీద వుండే పోస్టలు ముద్ర చూసాను. కాని ముద్రలోని అక్షరాలు అలుక్కుపోయినట్లుగా వుండి అర్థంకాలేదు. నాలో ఆత్రం, అనుమానం, భయం, ఆందోళన పోటీ పడుతున్నాయి. నా కథలు చదివినవారు, నా గురించి తెలిసినవారు యీ శుభాకాంక్షలు పంపించేరేమో అనుకోటానికి కూడా వీలులేదు. నా కథలమీద ఎవరూయింత వరకూ ఆఫీసుకుగాని యింటికిగాని ఉత్తరాల ద్వారా అభిప్రాయాలు రాయలేదు. కేవలం పత్రికల్లో చదవటమే!

ఇప్పుడు యీ రాధ ఎవరు! ఎలా తెలుసుకోవాలి! తెలుసుకుని ఏం చేయాలి! అనే ప్రశ్నలు నాలో తలెత్తాయి. నాలో టెన్షను పెరిగింది.

ఆఫీసు నిబంధనల ప్రకారం అటెండెన్సు రిజిస్టరులో ఇంటి చిరునామా వ్రాయాలి. నేను కథలు రాస్తానని ఆఫీసులో చాలా మందికి తెలుసు. వారిలో అమ్మాయిలే ఎక్కువమంది. నేను ప్రేమ కథలు ఎక్కువగా రాస్తానని వారికి తెలుసు. ఎప్పుడూ ఆ కథల గురించి ప్రస్తావించడం నాకు అనుభవమే. ఇది తెలిసే చాలామంది నన్ను అంటుంటారు "నీకేమయ్యా... నువ్వు గోపాలకృష్ణుడివి...గోపికలు నీ చుట్టూ తిరుగుతున్నారు. ఇంతకీ మీ బృందావనం ఎక్కడుంది" అని.

గ్రీటింగ్సు ఎన్నిసార్లు చదివానో...

తేజం..మనస్సు..ఉత్తేజం..భావం.. కాంతివంతం.. అంటూ గొప్పగా శుభాకాంక్షలు తెలిపిన ఈ "రాధ" ఎవరో!

అన్నట్టు మిర్చివాలా దగ్గరుకెళ్ళి కడుపునిండా అతని టిఫిను తినాలి.. మిర్చిబజ్జీ, ఎగ్ బోండా, పునుకులు... ఊహిస్తుంటేనే నోరూరుతోంది... ఎప్పుడు లంచ్ టైము అవుతుందో మరి....

లంచ్ టైమకు ముందే బయలుదేరాను.

మిర్చివాలా వుండే కాలేజీ వైపు నడిచాను.

కాని ఆ చెట్టు కింద మిర్చిబండి, మిర్చివాలా కనిపించలేదు. అయిదారుగురు విద్యార్థులు మాట్లాడుకుంటున్నారు.

"ఈ రోజు మిర్చివాలా రాలేదా..." అని అడిగాను వారిని.

"మిర్చివాలా మీకెలా తెలుసు...మీకేం కావాలి" అని ప్రశ్నించారు.

"నేను అతని కస్టమరుని.. పది రోజులయింది అతని టిఫిను తిని" అన్నాను ఆత్రంగా.

"అయితే మీకు తెలీదన్నమాట... రెండు రోజుల క్రితం మిర్చిబండిని ఓ ఆటో వచ్చి గుద్దేసింది. మిర్చివాలాకు మూకుడులో కాగుతున్న నూనె వంటి మీదపడి వళ్ళు కాలింది. ప్రస్తుతం ఆసుపత్రిలో వున్నాడు." అంటూ ఆసుపత్రి, వార్డు, బెడ్ వివరాలు చెప్పాడు ఓ విద్యార్థి.

"పాపం, స్నేహితులకు, బంధువులకి గ్రీటింగ్సు కూడా పంపించాడు. చూడండి సార్... ఎంత చక్కటి భాషలో అక్షరాలు పేర్చాడో... అతనిలా సాహితీ తరంగాలు ఉప్పొంగటం లేదూ... ఇదిగో చదవండి" అంటూ మరో విద్యార్థి గ్రీటింగు కార్డు తీసిచ్చాడు.

గ్రీటింగ్సు చదివి ఆశ్చర్యపోయాను.

నాకు వచ్చిన గ్రీటింగ్సు కూడా అలాగే వున్నాయి.

తేజం.మనస్సు...భావం..కాంతివంతం... అంటూ నానోటివెంట అప్రయత్నంగా వచ్చేసాయి.

"మరి "రాధ" అని రాసుకున్నాడే" అని అడిగాను వారిని.

"అతని పేరు రాధాకృష్ణ ఎప్పటికీ ఆడపిల్లలు కలగకపోతే. మిర్చివాలా తల్లిదండ్రులు 'రాధ' అని పిలుచుకుని మురిసిపోయేవారుట... ఆ పిలుపు కొన్నాళ్ళకు నిజమయింది. అతనికి ఓ చెల్లెలు పుట్టింది. ఆమె పేరు 'రాధ'. అయితే రాధాకృష్ణని యింట్లో 'రాధ' అని యిప్పటికీ పిలుస్తారుట...చాలా చమువుగా, సరదాగా వుంటాడతను. ఈ నోకాల్డ్ హోటల్సుకెళ్ళి రూపాయలు తగలేసి రుచీపచీలేని టిఫిను తినేకంటే, రెండు రూపాయలతో కడుపునిండా టిఫిను తినచ్చు. ఎప్పటికి కోలుకుంటాడో... అంతవరకూ అతని కుటుంబానికి ఆదాయంవుండదు. మా కాలేజీ నుంచి అయిదువందలు విరాళంగా యిచ్చాము..." విద్యార్థుల గొంతులు పలుకుతున్నాయి.

నేనెంత తెలివి తక్కువగా ప్రవర్తించాను. ఇన్నాళ్ళ స్నేహంలో మిర్చివాలా పేరు తెలుసుకోలేదు స్నేహానికి మారు పేరుగా గుర్తుంచుకోవలసిన పేరు రాధాకృష్ణ!

గ్రీటింగ్సులోని భావాన్ని గుర్తు చేసుకుంటూ, అక్షరాలని మననం చేసుకుంటూ రాధాకృష్ణని చూసేందుకు ఆసుపత్రి వైపు బయలుదేరాయి నా కాళ్ళు..

* * *

మీకు తెలుసా ?

ఆస్ట్రేలియాలో క్వీన్‌లాండ్‌లో ఉన్న ఒక గాగ తాబేలు ప్రపంచమంతటిలో ఎక్కువ వయస్సు గల ప్రాణి దాని వయస్సు 1982 నాటికి 134 సం|| లు.



(గత సంచిక తరువాయి)

పైపు వెలిగించు కుంటూ అన్నాడు మహాపతి.

"ముందు ఓ ప్రశ్నకి సమాధానం చెప్పు 'అకాల్ట్‌సైన్సెస్' మీద నమ్మకముందా?"

ఆశ్చర్యంగా చూశాడు శశిధర్. అది అతడు ఊహించని ప్రశ్న "అంటే ...బాణామతి... చేతబడి... అవేనా?"

"అలాంటి పేర్లు ఇంకా చాలా ఉన్నాయి. నీకు నమ్మకముందా?"

"ఎందుకు?!"

"నమ్మకముంటే ఆదారి నుండి మరలించే ప్రయత్నం చేస్తాను. లేకుంటే నా దారిగురించి చెప్తాను."

శశిధర్ నవ్వాడు. "అలాంటి నమ్మకాలేం లేవు. కాని కొన్ని 'ఆర్టికిల్స్' చదివాను."

పైపు సవరించుకున్నాడు మహాపతి "సంవత్సరం క్రితం ఇక్కడ ఓ 'హేతువాద సమాజం' ఏర్పడింది. దానికి నేను సెక్రటరీని. 'అకాల్ట్‌సైన్సెస్' అంటే 'తంత్రశాస్త్రం' అని మనం చెప్పుకోవచ్చు... అదో శాస్త్రమనీ, దాన్ని గుప్పెట్లో పెట్టుకుంటే ఇతరులకి చెడూ తమకి మంచీ చేసుకుని లక్షలూ, కోట్లూ గడించ వచ్చునన్న మూఢనమ్మకాలు చాలామందిలో ఉన్నాయి. అంతే కాక కొన్ని రుగ్మతల మూలంగా బాధపడే చాలా మంది జనం అదో 'చేతబడి' అనో అలాంటిది ఇంకేదో అనుకుని కృంగిపోతూ ఉంటారు. అలా నమ్మే వాళ్ళకి ఆ నమ్మకాల నుండి విముక్తి కలిగించటం, నిజం ఏమిటో తెలియజెప్పడం మా సమాజం యొక్క ముఖ్య లక్ష్యాలు..."

"కొంతమంది అలా ఉండొచ్చు. కాని 'చాలామంది' అంటే నేవొప్పుకోను.

"ఫ్రాంక్‌గా మాట్లాడుతున్నందుకు థాంక్స్. కాని శశిధర్! వీటిమీద చాలామందికి నమ్మకముందని నిరూపిస్తాను."

"ఎలా?"

"రేపు నువ్వు ఓ పది దుకాణాలకి వెళ్ళి ఏదో ఒకటి కొనుక్కో. కొనుక్కోకపోయినా ఫర్వాలేదుగాని, లోపలికి వెళ్ళగానే గుమ్మం పైన, గుమ్మానికి ఎదురుగా చూడు. 'ఫ్రేమ్' కట్టించిన యంత్రాలు, గుడ్డలో చుట్టినవి, నిమ్మకాయలతో చేసినవి ఇలా చాలా రకాల యంత్రాలున్నాయి. వాటిల్లో ఏదో ఒకటి నీకు కనిపిస్తుంది. యంత్రాలు కనిపించే షాపుల సంఖ్యని బట్టి మన దేశంలో యంత్రాల మీద నమ్మకమున్న మనుషుల సంఖ్యని లెక్కవేయవచ్చు."

"రేపు అలాగే వెళ్ళి గమనిస్తాను. మీరు చెప్పినదే నిజమనుకుంటే... మరి వీళ్ళంతా ఎందుకు ఆకర్షింపబడుతున్నారు."

"మనిషి సుఖంగా వున్నప్పుడు దేవుణ్ణి మొక్కుబడిగా పూజిస్తాడు. కష్టాల్లో వున్నప్పుడు మనస్ఫూర్తిగా ప్రార్థిస్తాడు. అతని కష్టాలు 'గట్టెక్కనపుడు' ఆలోచిస్తాడు. 'గాలిలో దీపం పెట్టి భగవంతుడా నీదే భారం అంటే ఎలా?' లాంటి ఆలోచనలవి. అప్పుడు 'ఏదో చేయాలి' అని మరింత ఆలోచిస్తాడు, కష్టపడి పనిచేయాలని చాలామంది

ఆలోచించరు. ఎందుకంటే వాళ్ళ వుద్దేశ్యంలో వాళ్ళు చాలా కష్టపడి పనిచేస్తున్నామనే అనుకుంటారు. ఆత్మ విశ్వాసం గురించి అసలు ఆలోచించరు. ఎందుకంటే తమకు ఆత్మవిశ్వాసం లేదంటే ఒప్పుకోరు. 'ఎంత కష్టపడి పనిచేసినా ఏం ప్రయోజనం లేకుండా పోతోంది. ఎక్కడో ఏదో లోపం ఉంది' అన్న 'డిప్రెషన్‌కి' లోనవుతారు. స్నేహితులని సంహోందుగుతారు. 'ఎక్కడయినా ఎవరయినా ఏదయినా చేశారేమో!' లాంటి మాటలు ఒకరిద్దరు అంటారు. అనటమే కాదు 'దానికి విరుగుడు కూడా చేయించుకొమ్మని తెలిసిన 'మంత్రగాళ్ళ' అడ్రసులిస్తారు. అలా ఈ 'అకల్ట్‌సైన్స్' వలలోకి బలవంతంగా లాగబడతారు. ఓ సామాన్యుడిని మంత్రగాడి వృత్తిలో వున్న మనిషి చాలా సులభంగా ఆకర్షిస్తాడు. వాళ్ళు చూపెట్టే అనేక అద్భుతాలు' నేనూ చూపెట్టగలను. ప్రస్తుతం స్టేజీమీద నేనిచ్చే ప్రదర్శనలన్ని అలాంటివే. వాటి రహస్యాలని కూడా ప్రేక్షకులకు విడమరచి చెప్తాను.

ఈ రహస్యాలు తెలుసుకున్న వాళ్లల్లో కనీసం ఒక శాతం ప్రేక్షకులయినా ఈ మంత్ర తంత్రాలమీద నమ్మకాలని వదులుకుంటే నా జన్మ ధన్యమయిందనే అనుకుంటాను".


"ఒక శాతం ఎందుకు? ఇవన్నీ తెలిసాక కూడా మూఢనమ్మకాలను అందరూ వదులుకోరని ఎందుకనుకుంటున్నారు?"

"వదులుకోరు శ్రీధర్! అక్కడే మనుషుల తత్వం అర్థంకాదు. ఉదాహరణకి ఓ 'బాబా' గాల్లోనుండి విభూతి తెప్పించి ప్రసాదించడం అందరికీ బాగా తెలిసిన విషయం. అతడి లాగే ఓ సాధారణ మెజిషియన్ చేయగలడు. ఆ మధ్య స్టేజీ మీద చేసి చూపించాడు. అదెలా వీలవుతుందో కూడా పత్రికల్లో అతని విశ్లేషణ అచ్చువేశారు. 'చంకలో అమర్చుకున్న ఓ 'వాక్యూమ్' పరికరం తో ఎవరయినా అలా చేయవచ్చు' అని అందరికీ తెలిసిపోయింది. అయినా ఆ బాబా దగ్గరికెళ్ళే జనం తగ్గి పోలేదు. గొప్ప గొప్ప రాజకీయవేత్తల దగ్గర నుండి సమాజంలో అట్టడుగు మనిషి వరకు అతని భక్తులున్నారు. 'అకల్ట్‌సైన్స్' తెలిసిన వ్యక్తులవల్ల ఏదో లాభం పొందాలని ఆశ వాళ్ళనలా అట్టేపెట్టేస్తుంది. ముఖ్యంగా లాభాలు కోల్పోతున్న వ్యాపారస్తులు, ప్రమోషన్లు రాని ఉద్యోగస్తులు.. వాళ్ళ సమస్యలన్నీ డబ్బుతో కూడుకున్నవి. కేవలం డబ్బుకోసమే వీటిని ఆశ్రయించారని కుంటే అది పొరపాటే.వేరే విధమైన సమస్యలతో సతమతమయ్యేవాళ్ళు కూడా..."

"సారీ..ప్రపంచంలో అందరి సమస్యలూ డబ్బుతో కూడుకున్నవే."

"ఆ సిద్ధాంతం సామాజిక జీవనానికి సంబంధించింది. నేను చెప్పేది వ్యక్తిగత జీవితాలకి సంబంధించింది."

"మనిషి సంఘజీవి అలాంటప్పుడు సామాజిక జీవితం, వ్యక్తిగత జీవితంలో తేడా





ఏముంది! రెండూ ఒకటే."

'చిన్నతేడా వుంది. ఇందాక అన్నావే.. " ప్రపంచంలో అందరి సమస్యలూ డబ్బుతో కూడుకున్నవే' అని – అది సమాజిక జీవితం. 'ప్రపంచంలో అన్ని సమస్యలూ డబ్బుతో కూడుకున్నవి కాదు' అని నేనంటాను. ఇది వ్యక్తిగత జీవితం.

"అలా అనుకున్న డబ్బుతో సంబంధం లేని సమస్య ఏముంది?"

"అలాంటి సమస్యలేమీ లేవా?"

"ఖచ్చితంగా లేవు."

"పొరపడుతున్నానేమో!"

"ఉదాహరణకి ఒకటి చెప్పండి."

"ప్రస్తుతం నీకున్న సమస్య ఏమిటి?"

"..........."

"నీ భార్య అనారోగ్యంగా వుంది. ట్రీట్‌మెంట్ చేయించటానికి నీ దగ్గర డబ్బులేకపోతే అది డబ్బు సమస్య. కాని నీ దగ్గర డబ్బుంది. కాబట్టి అది డబ్బు సమస్యకాదు . ఆమె ఆరోగ్యం సమస్య. ఆమె నీ భార్య అయినందుకు నీ సమస్య ఇపుడు డబ్బు నీకు అవసరమేకాని సమస్య మాత్రం కాదు. అంటే నీ ఈ సమస్య డబ్బుతో సంబంధంలేనిది. ఒప్పుకుంటారా?"

"మీ 'లాజిక్' తమాషాగా వుంది. సరే, ఒప్పుకుంటాను. కాని ఇది నా ఒక్కడి విషయం. అందరి పరిస్థితీ ఇలాగే వుండదు."

"ఒక్కడికి సంబంధించిన దానినే 'వ్యక్తిగతం' అంటారు. లోకంలో అందరికి ఇలాంటి వ్యక్తిగత జీవితం ఒకటుంటుంది. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే అన్ని సమస్యలూ డబ్బుతో కూడుకున్నవి కాదు. గుర్తింపులేని మేధావికి 'డిప్రెషన్' ఓ సమస్య. కోట్లున్న ధనవంతుడికి మెరుగుపడని 'అనారోగ్యం' ఓ సమస్య. నువ్వేచెప్పు. ఇవి డబ్బుతో కూడుకున్న సమస్యలా?"

"అఫ్‌కోర్స్... కాదు?"

"నీకు సులభంగా అర్థమవ్వటానికి అలా చెప్పాముగాని, చాలా సమస్యలు మానసిక రుగ్మతల మూలంగా సృష్టింపబడ్డవి. అలాంటి మానసిక బలహీనతలని 'క్యాష్' చేసుకోవటానికి కొందరు అతితెలివిగా ఎప్పుడో సృష్టించారు ఈ 'అకల్ట్‌సైన్స్'ని. దీన్ని అమాయకులచేత నమ్మించి తమ ఉనికిని సుస్థిరం చేసుకోవటానికి వాళ్ళు అహర్నిశలు ప్రయత్నిస్తూ వచ్చారు. తరాలు గడుస్తున్నా, శతాబ్దాలు కూడా కాలగమనంలో

గడిచిపోతున్నా ఈ పద్ధతి మారలేదు, మారదుకూడా."

"హై మగదిలో జరుగుతున్నదేమిటో తెలిస్తే అలా నెమ్మదిగా కారు పోనిచ్చేవాడు కాదు శశిధర్.

"మారదని మీకు నమ్మకమున్నాక ఎందుకీ ప్రయత్నాలన్నీ?"

"చెప్పానుగా. నా ప్రయత్నంవల్ల ఏ కొద్దిమంది మారినా చాలు. ప్రపంచంలోని మనుషులందరినీ మార్చటం ఎవరివల్లా అయ్యేపని కాదు. ఇప్పుడు చెప్తాను.... నేనెందుకు బెంగుళూరు వెళుతున్నానో..." మరోసారి పైపు సర్దుకున్నాడు. "అక్కడో గ్రామంలో చిత్రమయిన సంఘటనలు జరుగుతున్నాయని మాకు సమాచారం వచ్చింది. ఇళ్ళమీద రాళ్ళ వర్షం పడటం, కొంతమంది వంటిమీద బట్టలు కాలిపోవటం, రాత్రుళ్ళు వీధుల్లో కాగడా మంటల్లాంటివి తిరగటం ఇలాంటివి జరుగుతున్నాయట. ప్రజలు అదంతా 'బాణామతి' అని భయభ్రాంతులవుతున్నారనీ మంత్రగాళ్ళను పిలిపించి నానా హంగామా చేస్తున్నారనీ తెలిసింది. ఈ 'మిస్టరీ'ని 'అన్‌ఫోల్డ్' చేసి ప్రజల్లోని భ్రాంతిని పోగొట్టడానికి వెళుతున్నాను."

"ఎలా!?"

"కొంతమంది స్వార్థప్రయోజనాల కోసం ఇలాంటివి సృష్టిస్తారు. అది నిరూపించగలిగితే చాలు. ప్రజల్లో చోటు చేసుకున్న భయం ఇట్టేపోతుంది.

"కాని, మీరు చెప్పినవి....రాళ్ళవర్షం, గుడ్డలు కాలిపోవటం... వీటన్నిటినీ మీరెలా ఆపగలరు?"

"ప్రతి విషయానికీ ఓ శాస్త్రీయమయిన కారణం అంటే 'సైంటిఫిక్ రీజనింగ్' ఉంటుంది. అక్కడికెళ్ళి చూశాక ఏం చేయాలో నిర్ణయించుకుంటాను."

"మీది చాలా 'అడ్వెంచరస్' నేచర్."


"ఒక్కోసారి ప్రాణాలమీదకి కూడా వస్తుంది."


"ఎందుకు?"

"'మాంత్రికులం' అని చెప్పుకునేవాళ్ళు మమ్మల్ని ఆగర్భ శత్రువుల్లా చూస్తారు. అవకాశం దొరికితే చావు దెబ్బ కొట్టి అది కూడా 'దుష్టశక్తి' చర్యేనని నిరూపించటానికి వెనుకాడరు. అలాంటి సంఘటనలు కూడా జరిగాయి."

"మరెందుకండి ఈ ప్రయాస అంటాను? ఎవరి మానాన వాళ్ళనొదిలేస్తే మీకొచ్చే నష్టమేమిటి?"

"నష్టం..." నిర్లిప్తంగా నవ్వాడు." అదేదో సంభాషణ ఏళ్ళక్రితమే భరించాను శశిధర్.





అలాంటి అనుభవం శత్రువుకు సైతం కలుగొద్దనే నా తాపత్రయమంతా."

"ఏం జరిగింది?"

"ఓ హత్య జరిగింది. నా కళ్ళముందే నా తల్లి చంపబడింది."

"..............."

"కాని హంతకులని ఏ చట్టమూ శిక్షించలేక పోయింది."

"ఏందుకు?"

"'చేతబడి' చేసి హత్య చేశారు. చట్టపరిధిలో వాళ్ళు హంతకులుగా గుర్తించబడలేదు. నా 'ఐ విట్‌నెస్'ని ఎవరూపట్టించుకోలేదు."

"సారీ, గతం గుర్తు చేసి మీ మనసునొప్పించాను."

"ఒక్కోసారి చేదు గతం గుర్తుకొస్తేనే మంచిది. దాంతోపాటు గమ్యం కూడా తానున్నానని గుర్తు చేస్తూ ఉంటుంది."

"గమ్యం అంటే... మీ గమ్యం... ఏమిటి?"

"నా తల్లిని ఒక స్త్రీ, ఇద్దరు మగవాళ్ళు కలిసి చంపారు. పెద్దయ్యాక వాళ్ళని చంపాలని అప్పుడే గట్టిగా తీర్మానించుకున్నాను. కాని నేను పెద్దయ్యే లోపల ఒకరు జ్వరంతో మరొకరు 'యాక్సిడెంట్'లో మరణించారు. వాళ్ళని చంపే అదృష్టం నాకు దొరకలేదు. ఇంకొకరు ఇంకా బ్రతికేవున్నారు. కావాలంటే ఈ క్షణంలో చంపేయగలను. కాని,...ఒక్క బుల్లెట్‌తో చంపితే ఏమొస్తుంది? ప్రాణం సుఖంగా పోతుంది. అలా కాదు. ఓ కొత్త పద్ధతిలో చంపేస్తాను."

"ఎలా?"

"అన్ని ఉన్న మనిషికి జీవితం ఓ వరం. ఏమీలేని మనిషికి అదే జీవితం ఓ శాపం. కాని, అన్ని ఉండీ, ఏమీ లేనట్టు బ్రతకాల్సి వచ్చేవాడికి ఆజీవితం ప్రత్యక్షనరకం. అదిగో ఆ నరకంలో బ్రతికిస్తూ చంపుతున్నాను. నెమ్మది నెమ్మదిగా...."

ఒకసారి మహాపతి వైపు చూశాడు శశిధర్. సగం చీకట్లో అతని మొహం అస్పష్టంగా కనిపిస్తోంది. మొదటిసారి అతని మీద జాలి, అతడంటే భయమూ కలిగాయి.

విశాలమయిన రోడ్డుమీద నెమ్మదిగా వెళ్తోంది కారు.

మహాపతి ఇంటి నుండి నర్సింగ్ హోంకి వెళ్ళటానికి మాములుగా అయితే పదిహేడు నిమిషాలు పడుతుంది. కారు స్లో చేయటంవల్ల మరో మూడు నిమిషాలు ఎక్కువ సమయం పడుతుంది. కారు 'స్టార్టు' చేసిన పదిహేనవ నిమిషంలో హై మగదిలో జరగబోయేదేమిటో తెలిస్తే అలా స్పీడు తగ్గించేవాడు కాదు శశిధర్. దాన్ని

అతడెలాగూ విరోధించలేదు. కాని పదిహేడవ నిమిషంలోగాని హైమగదిలోకి అడుగుపెట్టగలిగితే ఓ ఊహ కందని విషయం తెలుసుకోగలిగేవాడు. ఆ మానాన్ని పోగొట్టుకుంటున్నాడని అతనికి తెలియదు. తెలిస్తే వేగం మరింత పెంచేవాడు. ఓ అనర్థాన్ని ఆపగలిగేవాడు.

• • •

కారు స్టార్టయిన పదిహేను నిమిషంలో....


నిరూప బయటకెళ్ళటం మరో వార్డులో నుండి అతడు గమనించాడు. టైమ్ చూసుకున్నాడు. పన్నెండు పది. అతనిలో ఆలోచనలు గబగబ కదిలాయి. 'రేపు డాక్టర్ కేతాకి నిరూప తన ప్రవర్తన మీద 'కంప్లయింట్' ఇవ్వవచ్చు. ఆమె కంప్లయింట్ ఇవ్వటానికి ముందే తనో 'మెమో' ఇప్పిస్తే? అలా మెమో ఇప్పించినందుకు గాను తనమీద కోపం కొద్దీ దుర్బుద్ధితో అలా 'కంప్లయింట్' ఇచ్చిందని చెప్పుకోవచ్చు. ఇప్పుడు నిరూప ఎక్కడికెళ్తోంది? మరో నర్సుతో కాసేపు 'హస్కు' కొట్టడానికేమో? ఇలాంటివి సర్వసాధారణం. డ్యూటీ డాక్టర్లు చూసీచూడనట్టు వూరు కుంటారు. తను ఇవ్వాళ డ్యూటీ డాక్టరు. అలా ఊరుకోడు. తన ప్లాను అమలులో పెట్టేందుకు ఆలోచిస్తూనే హైమగదిలోకి నడిచాడు. 'నిరూప వచ్చేవరకు ఆ గదిలో వుంటాడతను. వచ్చాక పేషంటుని వదిలి ఎక్కడికెళ్ళావని 'ఎక్స్‌ప్లనేషన్' అడుగుతాడు. ప్రస్తుతం తనకా అధికారం ఉంది. ఆమె సమాధానం చెప్పలేకపోతుంది. అలా బాధ్యతా రహితంగా ప్రవర్తించినందుకు వెంటనే ఓ 'మెమో' ఇప్పించే ఏర్పాటు చేస్తాడు. అక్కడితో అయిపోలేదు. ఇది తను నిరూపకి ఇప్పించే 'మొదటి మెమో' మాత్రమే. ఇలాంటివి ఇంకా చాలా ఇప్పిస్తాడు. చివరికి ఉద్యోగం తీయించేస్తాడు. సింహాచలం అంటే ఏమిటో అప్పుడు తెలుస్తుంది.

అతడు హైమగదిలో కూర్చున్నాడే గాని నిరూప వచ్చేవరకూ ఏంచేయాలో పాలుపోలేదు. అటువంటి సమయంలో అతనిదృష్టి హైమమీద పడింది. చెదిరిన పైట, వెల్లకిలా పడుకున్న తీరు అతణ్ని ఆకర్షించాయి.

దగ్గరగా వెళ్ళి చూస్తూ నిలబడ్డాడు. చూస్తున్నకొద్దీ అతనిలో పశువు నెమ్మదిగా నిద్రలేవసాగింది.

అయినా ఎక్కడో చిన్న సందేహం. 'డాక్టర్ కేతా ప్రత్యేకంగా చూస్తున్న పేషంటు ఓ గొప్పింటి అమ్మాయి కావచ్చు...ఎలా?'

అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కాని మెదడులో పురుగు మరింత వేగంగా తొలుస్తోంది 'అయితేనేం? కోమాలో ఉన్న పేషెంటు, అరవదు. గొడవ చేయదు.



జరిగింది ఎవరికీ చెప్పుకోలేదు. అసలేం జరిగిందో ఆమెకే తెలియదు. చుట్టూ ఎవరూ లేరు.'

స్థిర నిశ్చయానికొచ్చి దాన్ని కార్యరూపంలో పెట్టడానికి ముందుకు వంగాడు. బిగుసుకున్న అతని పిడికిళ్ళు విచ్చుకున్నాయి. ఒక చేయి హైమ వంటిమీదకు వెళ్తోంది. అతని మొహం హైమ పెదాల మీదకి వంగింది.

వెనక ఏదో చప్పుడయింది.

ఉలిక్కిపడి తిరిగి చూశాడు.

తలుపు ముందుకూ వెనక్కీ కదులుతోంది.

తన పొరపాటుకి తనని తాను తిట్టుకుంటూ వెళ్ళి తలుపులువేసి లోపల 'బోల్టు' కూడా పెట్టి తిరిగి వచ్చాడు.

ఘోర పిశాచాలు అనేవి నిజంగా ఉంటే....

మనిషిలోని కోరికల పిశాచాలు వాటికంటే ఘోరమయినవేమో!

సింహాచలం ఇదివరకటి కంటే 'స్టడీ'గా ఉన్నాడు. అరక్షణం హైమకేసి చూసి ఓ అడుగు వెనక్కి వేశాడు.

ఇప్పుడు అతడు హైమని తాకలేదు.

ముందు తన 'బెల్టు' విప్పాడు.

(ఇంకా ఉంది)

ఎవరో!

"ఒరే శ్రీనూ! ఎవరికో ఉదాహరణ చెప్పు" అడిగారు మాస్టారు.
"మా తాతయ్య అబద్ధం సార్" తక్కున చెప్పాడు శ్రీను.

ఏం చేయొద్దు!

"పది మందిని కన్నాం. ఇక మాకు సంతానం ఆపాలంటే మేమేం చేయాలి?" అడిగారు దంపతులు.
"ఇంకేం చేయకండి" ముసిముసిగా నవ్వుతూ చెప్పాడు డాక్టర్.

కవి

"[illegible] కవుల్లో నీకు ఏ కవంటే ఇష్టం?" అడిగారు మాస్టారు.
"ముందు బెంచీలో కూర్చున్న కవి అంటే సార్" తక్కున చెప్పాడు శ్రీనివాసులు.

చెప్పా!

"నా పదొందలు ఎప్పుడిస్తావు?"
"ఓ అర్నెల్ల తర్వాత కలువు"
"అప్పుడు ఇవ్వటంగా ఇస్తావా?"
"లేదు. ఎప్పుడిచ్చేది అప్పుడు చెప్తాను"

ఫ్రెండ్!

"మీకు గర్ల్ ఫ్రెండుందా?" అనుమానంగా అడిగింది భార్య.
"లేదు. ఏం?" అడిగాడు భర్త.
"నా బాయ్ ఫ్రెండ్ చెప్తే హడలిపోయి వచ్చాను." పోయింగా అంది.

-పద్మశ్రీ (మాణిక్యారం)

ముగ్గు-మొగ్గ

దాసరి వసంతి
ఎ. నాగరత్న కుమారి

"మొగలిరేకులాంటి మొగుడీనీయవే" అని పాడుకుంటూ వస్తున్నాడు రవి. బస్సు ప్రయాణంలో అలసి పోయిన ముఖం, భుజాన ఎయిర్‌బాగ్, పొద్దున్నే ముగ్గులేస్తున్న మధుబాల వెనక్కి తిరిగి చూసింది. అతన్ని చూడగానే ఆమె హృదయం గతి తప్పింది.

"అదేం పాట? ఇప్పుడేనా ఊరినుంచి రావటం" అంది తెప్పరిల్లి.

"ఇప్పుడే" అన్నాడు రవి ఆమెవేస్తున్న ముగ్గు వంక చూస్తూ.

"ఎంతసేపే ఆ ముగ్గులు. హిందువులకంటే అతి పోతున్నావు "అని తల్లి ఇంట్లోనుండి కేకేసింది.

"వస్తున్నా, అయిపోయింది" అని ముగ్గుబుట్ట పట్టుకులేచింది మధుబాల.

"ఇవాళ కనుమ కదా. మీకు ఈ రోజా పండగే అనుకుంటాను " అంది అతనితో.

" అవును కనుమ రోజు బయలు దేరగూడదు. అందుకని నిన్నే బయలు దేరతీయించింది అమ్మ" అన్నాడతను.



"వస్తాను"

"వుందు" అంటూ ఖజానా వున్న బాగులోనుండి మొగలి రేకుల గుత్తినందించాడు రవి. మొగలిరేకుల సౌరభం, పరిమళం వాతావరణమంతా నిండిపోయింది.

"అమ్మో, ఇన్ని రేకులా" అంది మధు మురిసిపోతూ

" మా ఊళ్ళో అన్నీ మొగలి పొదలే" అన్నాడు రవి.

"అబ్బ గుచ్చుకుంది" అంది మధు, అతని చేతిలోనుండి మొగలి రేకులనందుకునేటప్పుడు రేకుల చివర ముళ్ళు గుచ్చుకోగా.

"మరి జాగ్రత్త. అలా కాదు, ఇలా పట్టుకోవాలి" అని ఆమెకు చూపించి తనగది తాళం తీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు రవి.

ఇంట్లోకి పోయి తల్లికిచ్చింది మొగలిరేకులను "రవి తీసుకొచ్చాడంటూ"

"అబ్బ! ఎంత సువాసనే, అమ్మా మొగలి పొదల్లో నాగులుంటాయట కదా! నిజమేనా? " అడిగింది తల్లిని మధుబాల చెల్లెలు వాణి.

"అవునట, సువాసనకు చేరతాయట" అంది తల్లి. ముగ్గు బుట్ట స్టోర్ రూం కిటికీలో పెట్టి స్నానానికి బయలు దేరింది మధుబాల. రవిని చూస్తే ఆమె మనస్సు విహ్వలమై పోతుంది. అతన్ని చూడాలనీ, అతనితో మాట్లాడాలనీ ఆమె తనువూ, మనసూ ఉవ్విళ్ళూరుతాయి. అతడి రూపం - సన్నగా, పొడుగ్గా, పచ్చటి రంగులో, నల్లటి గుబురు మీసాలతో, నుదుటపడే జుట్టుతో, కాస్తంత పొగరుగా, అధికారస్వరంతో మాట్లాడే అతను అపురూపంగా వుంటాడు ఆమెకు. అతని మాటలు అమృతధారల్లా, అతని ప్రతివనీ అందంగా వుంటాయి ఆమెకు. ఎక్కువసేపు నిటబడితే చురుక్కుమనేటట్లు వుండే చలికాలపు ఎండలా వెచ్చగా వుంటాడతను. మొగలిరేకుముల్లు గుచ్చుకునేటట్లు గరుసుగా వుంటాడతను ఆమెకు.

కృత్రిమమైన మర్యాదలంటే అతనికిగిట్టవు.

"ఇదిగో ... నీ పేరేంటి?" అని అడిగాడతను ఆమెతో మాట్లాడిన మొదటి రోజే, కాలేజికి వెళ్తాంటే ఆమెవెనగ్గానడుస్తూ.

ఆమె వెనక్కితిరిగి చూసింది. తమ ఇంటిముందు గదిలో అద్దెకుండే బాచలర్. అంతవరకు చూపులు ఊహల్లో తేలిపోవటాలేగాని మాటల్లేవు.

"మధుబాల" అంది సంభ్రమంగా.

"పేరుబావుంది" అన్నాడతను

" మీ పేరు"

"రవి"

అతని పేరూ నచ్చింది ఆమెకు. ఆమాట పైకనలేదు.

"కాలేజీలో ఏం చదువుతున్నావు?"

"బి.యస్.సి. రెండోఏడు"

"షీర వేస్ట్ ఆఫ్ టైం అండ్ ఎనర్జీ"

"అదేంటి?"

"ఇంత అందమైన ఆడపిల్ల చదువుకోసం ఇంతగా శరీరాన్ని రొమ్ము పెట్టుకోవటం నాకు నచ్చలేదు."

ఇవేం భావాలు? మధుబాలకు ఆశ్చర్యమనిపించింది. అతని మాటలు వింటూంటే తనకు కోపం రావటంలేదే? ఈ మాటలెవరయినా అంటే తనుపూర్కొనేదా?

"అంటే అందంలేని ఆడపిల్లలు చదువుకోవచ్చన్నమాట" అంది.

"అసలు ఆడపిల్లలకు పెద్ద చదువులు అనవసరం.

"షటప్" అనాలనిపించింది ఆమెకు కాని విచిత్రం - అనలేకపోయింది.

ఇలాగే ఓసారి చర్చికి వెళ్తున్నప్పుడు-

"చర్చికి వెళ్తున్నాం వస్తావటయ్యా!" అని అడిగాడు అతన్ని ఆమెతండ్రి పాల్‌ప్రభాకర్.

"మేం హిందువులం రావచ్చునా?"

"ఆ ఆ రారా. చూద్దువుగాని. మా ఆచారాలు, మతం అంటే ఏమిటో నీకూ తెలుస్తుంది.

తల్లి, తండ్రీ, చెల్లెలూ, తమ్ముడూ ముందునడుస్తున్నారు. మధుబాల రవి కబుర్లు చెప్పుకుంటూ వెనగ్గా వస్తున్నారు. అతను తమ ఇంట్లో అద్దెకు దిగినప్పటి నుండి ఆమెకు అలంకరణమీద శ్రద్ధ పెరిగిపోయింది. ఆరోజు చూడీదార్ వేసుకుని వచ్చింది. గులాబి రంగులో చక్కగా నప్పినట్లనిపించింది తన డ్రస్ ఆమెకు.

"ఈ చూడీదార్లు ఎందుకేసుకుంటావు. నిక్షేపంగా చీరలు కట్టుకోరాదూ? చీరలో ఆ అందమే వేరు,"

"నాకివే బావుంటాయి" అంది ఆమె

"ఈడ్రస్‌లో పొట్టిగా కన్పిస్తావు. ఎనీవే ఐ లైక్ టు సీ యూ ఇన్ శారీ"

" నా ఇష్టం వచ్చిన డ్రస్ వేసుకుంటాను మధ్యలో మీకేంటి?" అంది ఆమె.

" నాక్కాపోతే ఎవరికి కావాలి? నువ్వుచీరలోనే బావుంటావు"

"రవీ!... మధూ!... రండి, వెనకపడిపోయారు" అని తండ్రి పిలవటంతో వాళ్ళ మధ్య మాటలు ఆగిపోయాయి.

చర్చిగేటుముందు సుధాకర కనిపించాడు.

"మీ పేరెంట్స్ రాలేదుటోయ్" అడిగాడు పాల్‌ప్రభాకర అతన్ని.

"వెనక వస్తున్నారంకుల్"

"దిసీజ్ మిష్టర్ రవి. వర్క్స్ ఇన్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఏజ్ జూనియర్ ఇంజనీర్. మై టెనెంట్. సుధాకర్ - అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఇన్ గాంధీహాస్పిటల్ సన్ ఆఫ్ మై కొలీగ్" అని పరిచయం చేశాడు పాల్‌ప్రభాకర ఒకళ్ళ, నొకళ్ళకు.

"గ్లాడ్ టు మీట్ యు" అని చెయ్యిచాస్తూ ముందుకొచ్చాడు సుధాకర్.

"మీ డాక్టర్లక్కూడా దేవుడూ, దయ్యాలూ వుంటాయన్నమాట" అని నవ్వాడు రవి చెయ్యి కలుపుతూ.


"డాక్టర్లూ మనుషులేకదండీ! అందరికీ వుండే జ్ఞానమో, అజ్ఞానమో మాకూ కాస్తంత వుంటుంది."

"ఏవేం మాటలు చర్చికొచ్చి. పదండి, పదండి లోపలికెళ్దాం" అంది మధుబాల తల్లి ప్రమీలాపాల్.

సుధాకర్ చామనచాయ. పొడుగ్గా ధృఢంగా వుంటాడు. ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. రెండుకుటుంబాల మధ్య చాలాకాలంగా సన్నిహితం వుంది. పైకెవరూ అనుకోలేదు కానీ, మధుకూ, సుధాకర్‌కూ ముడిపెట్టాలని రెండు కుటుంబాల పెద్దలకూ వుంది. అయితే రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసినట్టు రవిముందు సుధాకర్ తేలిపోయినట్టుంటాడు మధుబాలకు. రవిలో వున్న రాజసం, ఠీవి, అధికారపు గొంతు, తనుకావాల్సింది ఏమైనా లాక్కోవాలనే తత్వం ఆమెనాకట్టుకున్నాయి. ఎప్పుడూ అపోలజిటిక్‌గా వుండే సుధాకర్ ఆమెకు నచ్చడు. ఎంతోకాలంగా

మీకు తెలుసా ?

12 సం॥ లు వయస్సు గల వైరుషాయాంగ్ అను చైనా బాలునకు విచిత్రమైన నేత్రములు కలవు. అతడు గోడ అవతలనున్న వస్తువులను కూడా చూడగలడు.



పరిచయంవున్నా, 'నాకునువ్విట్లావుంటే బావుంటావు. నువ్విలా వుండు, ఇలా అలంకరణ చేసుకో' అని ఎప్పుడూ అనడు. 'పట్టి చచ్చు మంచివాడు' అని ఆమె అభిప్రాయం అతనిపట్ల.

రవితో అంతగా పరిచయంలేని రోజుల్లో సుధాకర్, మధుబాల స్కూటర్ మీద సినిమాకు వెళ్తూంటే పక్కనుండి దూసుకుపోయాడో హీరో హోండా పెద్దమనిషి. అతడి బండి హాండిల్‌బార్ తగిలి క్లచ్ పట్టుకున్న సుధాకర్ ఎడమచెయ్యి గీరుకుపోయి, రక్తం రాసాగింది. అంత ట్రాఫిక్ వున్నరోడ్డు మీద రాష్ డ్రైవింగ్ చేసే ఆ హీరో పై కోపం వచ్చింది మధుబాలకు. తనూ వాడిలా నడిపి, వాణ్ణి పట్టుకు ఉతికేయకుండా, బండిని మెల్లగా నడిపిస్తూ ఓ మెడికల్ షాపు ముందు ఆపిన సుధాకర్ మీద మరీకోపం వచ్చింది మధుబాలకు. 'ఇదేం మనిషి', మరీ ఇంత పిరికితనమా' అనుకుంది. అనుకోవట మే కాదు పైకే అంది.

"ఆ రాస్కెల్‌ను పట్టుకు ఉతకాల్సింది. ఇంత ట్రాఫిక్ రోడ్డులో అంత రాష్ డ్రైవింగా" అని.

"రాష్ డ్రైవింగ్ పొరపాటే. అలా అని అతన్ని పట్టుకోవడంకోసం మనమూ రాష్ డ్రైవింగ్ చేయటం ఎంతవరకు మంచిదని అంటావు?" అన్నాడు.

"నువ్వెప్పుడూ ఇంతే. ఇలాంటి గాడ్దెలకు బుద్ధెలావస్తుంది?" అంది ఆమె.

"బావుంది. అందరికీ బుద్ధి చెప్పటానికే మనం పుట్టామా?" అన్నాడు సుధాకర్ మెడికల్ షాపులోకి వెళ్తూ.

షాపులో ఆయింట్‌మెంటూ, దూది, గాజుగుడ్డా కొని, రక్తాన్ని తుడిచేసి ఆయింట్‌మెంట్ రాసి, దూది పెట్టి గాజుగుడ్డతో ఎడం అరచెయ్యిమీద కుడిచేత్తో కట్టుకుంటూ తిప్పలు పడ్డాడు కాని ఆమె సహాయం అడగలేదు.

"నేను సాయం చేసేదా?" అని అక్కడికీ తనే అడిగింది ఆమె...

"అక్కరలేదు. డాక్టర్లం మాకు అలవాటేగా." అన్నాడతడు.

తనను పెళ్ళిచేసుకోవాలని అనుకుంటూన్న అతను, ఆత్మీయంగా తన సాయం ఎందుకు తీసుకోడు? 'గీరుకుపోయి మంటగా వుంది' అని కూడా అనకుండా నెప్పిని మౌనంగా భరించే మనుషులంటే విరాకు ఆమెకు.

'అబ్బ! బాగా నెప్పిగావుంది. కొంచెం ఈ ఆయింట్‌మెంట్‌రాసి, ఈ గాజు గుడ్డతో కట్టరాదూ, అలా చూస్తూ నిలబడపోతే' అని అతనన్నట్లయితే ఆమెకు తృప్తిగా వుండేది.

అతనికంటే రవి ప్రవర్తన నచ్చింది ఆమెకు. ఓసారి అతను తలనొప్పి వచ్చి పడుకున్నాడు గదిలో మధుబాల కాలేజీనుండి వస్తూనే రవిగది తలుపు తెరచివుంటే లోపలకు తొంగి చూసింది.

"ఎవరూ? మధూ..." అన్నాడతను ఆమెను చూసి.

"అవును. ఏం అలా పడుకున్నారు?"

"తలనొప్పిగావుంది గాని, మీ ఇంట్లో అమృతాంజనం వుందా?"

"లేదనుకుంటాను"

"పోనీ టేబ్లెట్లేమయినా వున్నాయా?"

"లేవనుకుంటాను? నేం తలనొప్పికి టేబ్లెట్లువాడం"

"మరేం వాడతారు? సరే కాస్తంత రోడ్డుమీద దాకావెళ్ళి అనాసిన్, ఆస్ప్రోనో పట్టా. టాబ్లెట్‌తో పాటు కాఫీ కలిపిస్తే మంచిది. అన్నట్టు అమృతాంజనం సీసాకూడా ఓటి పట్టా" అన్నడతను.

అతని మాటల్లో అర్థంవు వుండదు. హక్కున్నట్లు డిమాండ్ చేస్తున్నట్లు అడుగుతాడు. ఆత్మీయుల దగ్గర అర్థించాల్సిన పనిలేదు. అడిగి చేయించుకోవాల్సిందే. అతని పద్ధతి ఆమెకు నచ్చింది.

తలనొప్పి మాత్రలు, అమృతాంజనం కొని తీసుకువచ్చింది. తల్లికి చెప్పి కాఫీ కలిపించివేడివేడి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. తలనొప్పి బాధకు అతను మూలుగుతున్నాడు.

"కొంచెం అమృతాంజనం నుదిటికి పట్టించి రుద్దరాదూ?" అన్నాడు.

"అమ్మో ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?" అంది ఆమె భయపడ్తూ.

"ఏమనుకోరులే రాయి"

"నావల్లకాదు బాబు! మీరే రాసుకోండి" అని ఆమె వెళ్ళిపోయింది.

అలా చెప్పిన మాట వినకుండా ఆమె వెళ్ళిపోయినందుకు అతనికి కోపం వచ్చింది. మర్నాడు ఎవరూ లేకుండా చూసి, ఆమెను గదిలోకి పిల్చి, 'మొద్దూ! తలనొప్పిగా వుంది. అమృతాంజనం, నుదుటికి రాయమంటే విన్పించుకోకుండా వెళ్ళిపోతావా?" అని తలమీద మెట్టికాయవేశాడు. ఆదెబ్బ ఆమెకు చల్లగా, హాయిగా తగిలింది.

బావుంది. నువ్వుకట్టుకున్న భార్యనా, ఏపనిబడితే ఆపనిచేయటానికి" అని ఆమె అడగ లేదు.


"ఎవరయినా చూస్తే బావుండదు" అని మాత్రం అనగలిగింది ఆమె.

"అలాంటప్పుడు గదితలుపు వేసి రాయాల్సింది" అన్నాడతను.

"ఛీ, పొండి" అని వెళ్ళిపోయిందామె.

అలా అధికారం చెలాయించే మొగవాడంటే ఆమెకు మక్కువ.

తన షెల్వార్, కమీజ్‌ల మీద రవి వ్యాఖ్యానం చేసినప్పటినుండి, వాటిని



తొడుక్కోవటం మానేసింది. "ఏవిటే, ఆగుడ్డలసలు వాడటంలేదు" అని తల్లి అడిగితే, "నాకూ అవి బావుంటంలేదమ్మా. చీరలే బావుంటాయి. ఇహనుండి చీరలే వాడ్తాను" అంది.

"అదేవిటే? చక్కగా వున్న గుడ్డలు, పైగా కొత్తవి, మోజుపడి కొనుక్కున్నవి, వేసుకోనంటావు" అంది తల్లి.

"నాకిప్పుడు బావుండటం లేదమ్మా అవి" నాన్సి వేసుకుంటుందిలే వాట్ని" అంది ఆమె

రవిపట్ల ఆరాధన షెల్వార్, కమీజ్‌లతో ఆగలేదు. ఓరోజు పొద్దున అతని గది దాటి కాలేజీకి వెళ్తుంటే "మధూ!" అని పిల్చాడతను.

"ఏంటి?" అని ఆమె వెనక్కి తిరిగి గదిలోకి వచ్చింది.

'ఓసారి నీముఖం అద్దంలో చూసుకో" అన్నాడతను.

"ఏం? ఏమయింది?" అని అక్కడేవున్నా అద్దాన్ని తీసుకుని, బుగ్గలమీద పౌడరు ఎక్కువగా వున్నట్లుంటే చేతితో సరిచేసుకుంటూ ఏంవుంది, నా మొహం మీద? ఏంలేదే" అంది.

"ఇప్పుడు చూడు అద్దంలో" అని వెనగ్గా వచ్చి మామిడిచిగురు రంగు బిందియా ఒకటి ఆమె నుదిటిన అంటించాడు.

"ఛీఛీ ఇదేంటి? మేం క్రిష్టియన్లం. బొట్టు పెట్టుకోం" అని తీసేయబోయింది.

"వుండు తీసేయకు. అది పెట్టుకుంటే నీముఖానికెంతకళ వచ్చిందో తెల్సా. అద్దంలో చూసుకో ఎలావున్నావో' అన్నాడు అతను.

ఆమె అద్దంలో తనముఖం చూసుకుంది. అతనన్నట్లు తనముఖం కళగా అందంగా అన్పించింది.

"ఇప్పుడెలావున్నావో తెల్సునా, అప్సరసలావున్నావు" అని ఆమె దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యేసి దగ్గరకు లాక్కుని బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు.

"ఛీ, ఛీ, ఇదేం పాడుపని. ఎవరయినా చూస్తే " అంది ఆమె అతన్నుండి దూరం జరుగుతూ.

"చూడకపోతే ఫరవా లేదన్నమాట"

"ఛీ, పో..'' అని బయటకడుగేస్తూ నుదుటిమీద బిందియా తీసేసింది.

కాలేజీలో అన్యమనస్కంగా వుండిపోయింది ఆమె. మనస్సంతా రవిచుట్టూనే పరిభ్రమిస్తోంది. క్లాసులో పాఠాలు ఆమెబుర్రలోకి జొరబడలేదు. చివరకు విసుగనిపించి క్లాసులెగ్గొట్టి ఇంటి కొచ్చింది. వస్తూ, ముందుగదిలో రవి ఉన్నాడా అని చూసింది. లేడు, ఆఫీసుకెళ్ళాడు.

"ఏవిటే, అప్పుడే వచ్చావు కాలేజీనుంచి" అని అడిగింది తల్లి.

"తలనొప్పిగా వుందమ్మా! కాసేపు పడుకుంటే అదే తగ్గిపోతుంది." అని భుజాన బాగు ఓమూల పారేసి బెడ్‌రూంలోకి వెళ్ళి మంచంమీద పడుకుంది. ఎన్నో ఆలోచనలు రాసాగాయి. "రవి, రవి, రవి" అని అతని నామజపం చేసింది. దిండుపైకి వేసుకు కూర్చుని ఓ కాయితం మీద పెన్నుతో 'రవి, రవి' అని రామకోటి రాయసాగింది. ఓపేజీ నిండిపోయింది. అప్పుడు స్పృహలోకి వచ్చిన మధుబాల 'ఛీ! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?' అనుకుంది. కాయితాన్ని చింపటం ఇష్టంలేక పదిలంగా కవబోర్డులో తన చీరల అడుగున దాచుకుంది. పొద్దున అతను బొట్టుపెట్టటం, చుంబించటం మనసులో మెదిలాయి. వెర్రి ఆనంద పారవశ్యంలో మునిగిపోయింది ఆమె. అతని వేళ్ళు తాకిన తననుదుటి భాగాన్ని, బుగ్గను మృదువుగా చేత్తోరానుకుని వేళ్ళను ముద్దుపెట్టుకొంది. బుగ్గలు ఎరుపెక్కి వేడి ఆవిర్లు వచ్చాయి విచ్చెక్కినట్టయింది ఆమెకు. డ్రస్సింగ్‌టేబిల్ ముందు నిలబడి అద్దంలో ముఖం చూసుకుంది. ఇంట్లో బొట్టుపెట్టుకునే ప్రశ్నే లేదు కాబట్టి తిలకం, కుంకమలాంటివి వుండవు. అద్దంలో చూసుకుంటూ నుదుటిన పెన్నుతో గుండ్రంగా బొట్టు దిద్దసాగింది.

స్కూలు నుండి వచ్చిన నాన్సి అక్కచేసే పని చూసి "అదేంటి, హిందువుల్లా బొట్టు పెట్టు కుంటున్నావు?" అని అడిగింది.

"బొట్టు హిందువుల సొంతమా? మనమూ ఎందుకు పెట్టుకోకూడదు? అది ఒట్టి అలంకరణ మాత్రమే. వాళ్ళూ చీరలు కడ్తున్నారు. మనమూ కడ్తున్నాం. అలాగే ఇదీ. తప్పేంవుంది?" అంది మధుబాల.

ఆపిల్లకు అక్క లాజిక్ అర్థంకాలేదు.

"మమ్మీ! అక్క బొట్టు పెట్టుకుంటోందే" అని అరిచింది గదిలోనుండే .

"అదేంపనే పెద్దమ్మాయి? మనమతానికి విరుద్ధంగా ఆ బొట్టేంటి? చెరిపెయ్యి" అంది.

చెల్లెలిదగ్గర వుపయోగించిన లాజిక్ తల్లిదగ్గర పనిచేయదని ఆమెకు తెల్సు. అందుకని ముఖం కడుక్కుని వచ్చింది. అయితే తల్లికి భయపడి ఇంట్లో బొట్టుపెట్టకోవడం మానేసింది కాని, ఇంట్లోనుండి బయట పడిన తరువాత, తన హాండ్ బాగ్‌లోనుండి బిందియా తీసి నుదిటిన అంటించుకోసాగింది.

రవిపట్ల ప్రేమలో పీకల వరకు దిగబడిన మధుబాల చదువునశ్రద్ధ చేయసాగింది. రెండో ఏటి పరీక్షల్లో రెండు సబ్జక్ట్ లు తప్పింది.

"మధుకి చదువుమీద శ్రద్ధతగ్గింది. పెళ్ళి చేసేస్తే మంచిది" అంది తల్లి రిజల్ట్సు వచ్చింతరువాత తండ్రితో.

"గ్రాడ్యుయేషన్ కానీ చూద్దాం" అన్నరాయన.

"దీని నడక చూస్తుంటే ఆ చదువు పూర్తి చేసేట్టు కన్పించటంలేదు" అంది ఆమె.

"అదేం?"


"ఏమో ఎప్పుడూ కూనిరాగాలు తీసుకుంటూ, పక్కమీద పడుకుండటమే కానీ, పుస్తకం తెరిచిన పాపాన పోవటంలా"

"ఆ చిన్నతనంలే, అదే చదువుకుంటుంది."

"ఇంకేం చిన్నతనం. ఆసుధాకర్ తల్లిదండ్రులతో సంబంధం విషయం కదిలించరాదూ!"

"అలాగే" అన్నాడాయన.

మధుబాలకి సంభాషణ విన్నప్పటి నుండి భయంగా ఆతృతగా వుంది, తల్లిదండ్రులు తన మనసు



తెలుసుకోకుండా, మాట వినకుండా ఎక్కడ సుధాకర్‌కి కట్టబెట్టేస్తారోనని. ఎలాగో కష్టపడి సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పిన సబ్జెక్టులు పాసయింది. రవిలేక తను క్షణంబతుక లేదు. అతనితోడిదే తనబతుకు. అతన్ని పెళ్ళి చేసుకోవాలి. అతని అర్ధాంగై, అతని పిల్లలతల్లిగా ఊహించుకుంటూ మురిసిపోయేది. సంక్రాంతికని నాలుగు రోజులు శలవుపెట్టి తమ ఊరువెళ్ళిన రవి, ఎప్పుడు తిరిగి వస్తాడా అని కళ్ళు కాయలు కాచేట్టు ఎదురుచూసింది ఆమె. అతను వచ్చాడు. వస్తూ, వస్తూ తనకు మొగలి రేకులు తెచ్చాడు. మొగలి రేకుల్లాంటి మగవాడతను, మొగుడయితే.. ఈ ఆలోచనలో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

"ఏవే మధూ!.. ఎంతసేపు బాత్‌రూంలో. గంటయింది బాత్‌రూంలో దూరి. బయటకురా" అంటూ అరుస్తున్న తల్లి గొంతుకకు ఉలిక్కిపడి ఊహాలోకంనుండి ఇహలోకానికొచ్చింది మధుబాల. త్వరత్వరగా చీరె చుట్టుకుని బయటపడింది.

అతనితో మాట్లాడి పెళ్ళి విషయం తేల్చాలి అని ఆలోచిస్తోంది ఆమె. ఓరోజు సాయంత్రం ఇంట్లో వాళ్ళందరూ బంధువుల ఇంటికి పార్టీకి వెళ్తుంటే, ఒంట్లో బావుండలేదని చెప్పితను ఇంట్లోనే వుండిపోయింది.

సాయంత్రం రవి తాళం చెవుల రింగ్ చేతిలో పట్టుకుని, చెయిన్ని గుండ్రంగా వేలిచుట్టూ తిప్పుకుంటూ వచ్చాడు తనగదికి. బయట నిలబడ్డ మధుబాలని చూసి, "హలో! నువ్వెళ్ళలేదా పార్టీకి" అన్నాడు ఆమెని పలకరిస్తూ.

"వెళ్ళలా"

"సరేరా, నాగదిలో కూర్చుందాం" అన్నాడతను.

గదిలో కుర్చీలో కూర్చుంది ఆమె. అతను గుడ్డలు మార్చి లుంగీ కట్టుకుని బెడ్‌మీద నడుం వాలుస్తూ 'ఆ సిగరెట్‌పెట్టె, అగ్గిపెట్టె ఇలా ఇవ్వు' అన్నాడు.


ఆమె టేబుల్ మీదనుండి వాటిని తీసి ఇచ్చింది. అతను సిగరెట్టొకటి నోట్లో పెట్టుకుని, "ఊ వెలిగించు" అన్నాడు. ఆమె అగ్గిపుల్లగీసి వెలిగించింది.

"ఏంటలా కాలంవృధాచేస్తూ మూగనోము పట్టికూర్చున్నావు? ఏమైనా మాట్లాడు" అన్నాడు అతను సిగరెట్ పొగ వదుల్తూ.

ఆమెకి విషయం కదపాలనేవుంది. ఎలాగో తెలియటంలా.

"కాఫీ తెచ్చేదా?" అంది.

"అక్కర్లా, తాగే వచ్చాను. సరే, ఈ ఎఱ్ఱ రంగు చీరె ఎక్కడ దొరికింది నీకు? డేంజర్ కలర్. మొన్న కట్టుకున్నావు చూడు బంగారు వన్నె చీరె. అది కట్టుకురాపో" అన్నాడతను.



"ఏ చీరయితే ఏం లే" అంది ఆమె లేవకుండా.

"అరె వెళ్ళి రమ్మంటే. కట్టుకురాపో"

ఏం? ఈ చీరెలో బావుండనా నేను?"

"బానే వుంటావుకానీ, ఆ చీరెలో అయితే ఇంకాబావుంటావు. ముద్దొస్తూ వుంటావు. అసలు చీరే లేకపోతే ఇంకా ఇంకా బావుంటావు"

"ఛీ పో" అంది ఆమె.

అతను సిగరెట్ పీక మూలకి విసిరేసి, తలుపు గడియవేసి వచ్చాడు.

"తలుపెందుకేశావు?"

"ముద్దుపెట్టుకోటానికి, జస్ట్ ఎ బిట్ ఆఫ్ రొమాన్స్"

"అవ్వేం కుదరవు"

"ఎందుకు కుదరవు" అంటూ ఆమెను మంచమీదకులాగి, కౌగిలించుకుని గాఢంగా చుంబించాడు రవి.

మధుబాల అతన్ని కాదనలేదు. ఏదో తన్మయస్థితిలోపడిపోయింది. శరీరాలు పెనవేసుకుంటున్నాయి. ఉద్రేకం తారస్థాయిలోవుంది. రవి ఆమె జాకెట్‌హుక్‌లు తీసేస్తున్నాడు. ఈ లోకంలో లేని మధుబాల అభ్యంతర పెట్టలేదు. ఎక్కడెక్కడో తడిమేస్తున్నాయి రవి చేతులు. ఆమె స్పృహకోల్పోయింది.

ఇంతల్లో బయటనుండి 'పోస్టమన్' అన్న కేకవినపడి, ఓ ఉత్తరం తలుపుసందులో నుండి గదిలో పడింది. ఆ అరుపుతో ఆమె చేతనావస్థకు వచ్చింది.

"ఏంటి? ఏం చేస్తున్నావు. వదులు నన్నొదులు" అంది ఆమె గాబరాగా.

"నీకు తెలీదా ఏం చేస్తున్నానో, నీకు మాత్రం అవసరం లేదా ఈ అనుభవం" అన్నాడతను ఇంకా ఆమె శరీరాన్ని తడుముతూనే.

"పెళ్ళి కాకుండానే నాకెలాంటి అనుభవమూ వద్దు" అంది ఆమె అతన్ని వదిలించుకుని లేచి కుర్చీ దగ్గరకు వెళ్తూ.

"అదేంమాట. నాకు తెల్సు. నీకు కావాలి. రా టైం వేస్ట్ చేయకు.

"రవీ ఓ మాట చెప్పు. మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం?"

"మనం పెళ్ళి చేసుకుందామన్నానా నేను?"


"అంటే నన్ను పెళ్ళి చేసుకోవా?"


"ఎలా? నువ్వు క్రిస్టియన్‌వి. నేను సనాతన ఆచారపరుల కుటుంబంలో పుట్టిన హిందువుని, మనపెళ్ళెలాగవుతుంది?"

"ఎందుకు కాదు? ఈ మతాలు, కులాలు మనం కల్పించుకున్నవేగా. అవి అడ్డంకికాదు మన పెళ్ళికి"

"మరి మీ వాళ్ళు ఒప్పుకుంటారా?"

"వాళ్ళొప్పుకున్నా, లేకున్నా నే లెక్కచేయను"





"కాని మావాళ్ళు ఇలాంటి మతాంతర, కులాంతర వివాహానికంగీకరించరు. వాళ్ళమాటలు నేను లెక్క చేయాల్సి వస్తుంది."

అంటే నన్ను పెళ్ళ చేసుకోవా?"

"అబ్బ! పెళ్ళి, పెళ్ళి అని సతాయించక. లెట్స్ ఎంజాయ్. టైమ్ ఫాస్ట్ మూవింగ్" అన్నాడు అతను ఆగలేక ఆమె చెయ్యి పట్టుకులాగుతూ.

ఆమె అతని చెయ్యి విదిలించికొట్టింది.

"అయితే ఇదంతా ఎందుకుచేశావు? నాలో ఆశలు ఎందుకురేపావు."

"బావుంది. తప్పంతా నాదే అన్నట్లు మాట్లాడుతున్నావు. ఆడామగా ఒకరిపట్ల ఒకరికుండే ఆకర్షణ సహజం. నువ్వు పెళ్ళికి పట్టుబడ్తావని నేననుకోలేదు. నీలాంటి ఫాషనబుల్ ఎడ్యుకేటెడ్ గాళ్ కూడా ఇలా ఛాందసంగా ఆలోచించటం బాగలేదు. రా, దగ్గరకురా, మొరాయించకు" అన్నాడతను.

అప్పుడప్పుడే ఆమెకు కనువిప్పు కలుగసాగింది.

"అంటే ఫాషనబుల్, ఎడ్యుకేటెడ్ గాళ్స్ అందరూ పెళ్ళికాకుండానే అనుభవానికి తహతహలాడతారని నీ. ఉద్దేశ్యం?"

"అందరిసంగతి నాకు తెలియదు. నీ సంగతంతే. నాకూ ఏమీ అభ్యంతరంలేదు. లెట్స్ ఎంజాయ్ ఫర్ టైం అండ్ ఫర్గెట్ట్. జస్ట్ ఎ బిట్ ఆఫ్ రొమాన్స్ లేకుండా బ్రతికేం ప్రయోజనం"

ఆమె లేచింది.

'ఇప్పు డర్ధమయింది నాకు నువ్వెలాంటివాడివో. పెళ్ళికి మతం అడ్డుకాని, అనుభవానికి అభ్యంతరం లేదు. నీ కభ్యంతరం లేకపోయినా నాకుంది. నాకలాంటి రొమాన్స్ అక్కరలేదు. ఇహనువ్వెప్పుడూ నన్ను పలకరించకు, నావంక చూడకు. ఐ కాంట్ఫర్గెట్యు, బట్ ఐ షల్ ట్రైటు స్మారర్ ఎనీథింగ్ స్వీట్ ఇన్ యువర్ మెమరీ. గుడ్బై" అని బయలుదేరింది ఆమె.

"ఎక్కడకు పోతావు? ఇవాళకాకాపోతే రేపయినా నా చేతిలోకి వచ్చేదానివే. నీ సంగతి నాకు తెలిదా?" అన్నాడు అతను వెకిలిగా ఆమెవంకచూసి నవ్వుతూ.

మధుబాల గడియతీసి, థామ్మని తలుపేసి అతని గదిలోనుండి బయటకొచ్చేసింది. ఇంటి తలుపులన్నీ బిగించుకుని ముఖం మీద దిండు పెట్టుకుని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఆ తరువాత రవి ఆమెని వదలలేదు. ఆమెను తన దారిలోకి తెచ్చుకోటానికి ఎంతో ప్రయత్నించాడు. ఆమె అతనిని చూడటం, మాట్లాడటం మానేసింది. చిత్రంగా ఆమెకి అతనిపట్ల కోపం కలగలేదు. అతను పలకరిస్తే నిగ్రహించుకోలేక సతమతమై పోయేది. రవికి ఆ ఊరినుండి ట్రాన్స్ఫర్ కావటంతో ఓవిధంగా ఆమె సమస్య పరిష్కరింపబడినట్లయినా, ఆమె అతన్ని మర్చిపోలేక పోయింది. అతని తోడిదే తన జీవితం అనుకుంది. అతను కాదన్నా తను అతని భార్యే, అతని స్త్రీయే, తన శరీరం, మనసు అతడివే. వాటిని మరొకరికి అర్పించలేదు తను. బ్రహ్మచారిగా జీవితాంతం వుండిపోతుందితను.

అయితే కూతురువడే ఈ అంతర్మథనాన్ని గుర్తించని తల్లిదండ్రులు ఆమెపెళ్ళిచేయ నిశ్చయించారు. సుధాకర్ తల్లితండ్రులు కూడా ఈ పెళ్ళకంగీకరించారు. మొదటి నుండి ఒకరికొకరు పరిచయమున్నలేకాబట్టి పెళ్ళిచూపులు తతంగంలేదు. మధుబాలకీ పెళ్ళి ఇష్టం లేదు. తను సుధాకర్ను పెళ్ళి చేసుకుంటే మానసిక వ్యభిచారమవుతుంది రవితోడి తన ప్రణయమంతా తన హృదయంలో భర్తగా ప్రతిష్ఠించుకున్న రవికి కాక మరొకరికి తనతనువెలా అర్పించగలదు? తల్లిదండ్రులతో తనకిపెళ్ళి ఇష్టం లేదని చెప్పి ప్రయోజనం లేదు, అందువల్ల సుధాకర్తోనే ఈ విషయం చెప్పాలని నిర్ణయించుకుంది మధుబాల. అతన్ని తమ ఇంటికి రమ్మని ఫోన్ చేసింది. "రేపు క్రిస్మస్ కదా గ్రీటింగ్స్ చెప్పటానికెలాగో వస్తాను. అప్పుడు మాట్లాడుకుందాంలే" అన్నాడు సుధాకర్.


క్రిస్మస్ సందర్భంగా ఇంట్లో హడావుడిగావుంది. అయితే మధుబాల మనస్సే రోదిస్తోంది. "రేపు జీసస్ పుడతాడు. ప్రపంచానికి పాపాన్నుండి. విముక్తి లభిస్తుంది కాని, తన జన్మకి విముక్తి లేదు" అనుకుంది ఆమె.

మర్నాడు సాయంత్రం సుధాకర్ వచ్చాడు ఆమె ఇంటికి, చేతిలో పెద్దపొట్లంతో. కాబోయే భార్యకు ఏదో క్రిస్మస్ గిఫ్ట్ తెచ్చాడనుకున్న పెద్దలు అది ఏమిటి అని అతన్నేమీ అడగలేదు. సుధాకర్ని డాబాపైకి తీసుకెళ్ళింది మధుబాల.

"మెర్రీ ఎక్స్ - మాస్" చెప్పాడు సుధాకర్

ఆమె తిరిగి అభినందనలు చెప్పింది.

"ఏం మధూ! ఎందుకంతడల్గా వున్నావు. నీ పరీక్షలయ్యాకే పెట్టుకుంటే



బావుంటుందని చెప్పా పెళ్ళి. ఏమంటావు?" అన్నాడు సుధాకర్

మధుబాల మాట్లాడలేదు.

"వింటున్నావా?
ఏమాలోచిస్తున్నావు?"

"ఈ పెళ్ళి ఇష్టం లేదని ఎట్లా చెప్పాలా అని"

"ఏంటీ?" ఆశ్చర్యపోతూ అన్నాడు సుధాకర్

"ఔను సుధాకర్! నామీద నీకేపాటి స్నేహభావమున్నా, నామాటంటే నీకేపాటి విలువున్నా ఈ పెళ్ళికి వప్పుకోకు, ఇంకెవర్నయినా చేసుకో ప్లీజ్!"

"ఏం, నే నచ్చలేదా?"

"అది కాదు, నాకు వేరే కథవుంది.?"

"కథా, కాకరకాయా, హాస్యం చేయకు"

"నా జీవితమే హాస్యాస్పదమై పోయింది. ఇంక నేనే హాస్యమాడ్తాను.

"ఏం భారీ డైలాగులు చెప్తున్నావు విషాదం చాల్లే, విషయానికిరా" నవ్వాడు సుధాకర్.

"ప్లీజ్ సుధా! నన్నేం అడక్కు, నేనేం చెప్పలేను."

"చెప్పలేవా, చెప్పకూడదా?"

"ఏమైనా అనుకో, నా పరిస్థితి అది"

"ఏవిటో ఆ పరిస్థితి. కాస్తంత వివరంగా చెప్పొచ్చుగా. నేనేం నిన్ను బలవంతంగా పెళ్ళి చేసుకోనులే చెప్పు"

"నేను రవిని ప్రేమించాను..." అంటూ మొదలుపెట్టి మెల్ల మెల్లగా తన కథంతా చెప్పింది మధుబాల. ఇంకా చెప్పింది. "నన్నొదిలినా అతడే నా ప్రియుడు, నా భర్త."

"దట్స్ గుడ్, అయితే ఏం చేద్దామనుకుంటున్నావు?"

"ఏముంది చేయటానికి? నేనింక. జీవితంలో పెళ్ళి చేసుకోను."

"భేష్ బాగుంది. అదేనా పరిష్కారం?"

"మరేం చేయాలి? అతన్ని మర్చిపోలేను. అతను గుర్తున్నంతవరకూ ఈ తనువూ, మనసూ ఇంకెవ్వరికీ అర్పించలేను."

"నిన్నెవరు మర్చిపోమన్నారు?"

"అతని జ్ఞాపకాలతో బతుకుతూ ఇంకోర్ని ఎలా చేసుకోను?"

"ఇదంతా ట్రాష్. నీకంటూ ప్రేమించే మనసున్నప్పుడు, రేపు నన్నూ ప్రేమిస్తావు."

"స్టాపిట్ - సుధా! అట్లా మాట్లాడకు. ఇంకెవర్నీ ప్రేమించలేను. ఒకవేళ ప్రేమించాననుకుంటే అది భ్రమ."

"భ్రమా... జీవితంలో ఎన్ని భ్రమలు తొలగిపోవాలో. అయినా నీ మనసంత సంకుచితమా?" ఇల్లు ఇరుగ్గావున్నా ఫర్లేదుగానీ, మనసు మాత్రం విశాలంగా వుండాలి" అన్నాడు నవ్వుతూ సుధాకర్.

మధుబాల వెక్కి వెక్కి ఏడవసాగింది. సుధాకర్ ఆమె కన్నీళ్ళు తుడుస్తూ "ఏడవకు. ఇప్పుడేమైందని ఇందులో వింతా విడ్డూరం ఏమీ లేదు. ప్రతిదాన్నీ భూతంలా ఊహించుకుని భయపట్టం మంచిదికాదు. అన్నిటినీ తేలిగ్గా తీసుకోవటం నేర్చుకో" అన్నాడు.

మధుబాల ఏడుపు ఆపలేదు. "ఇది చిన్న విషయమా?" అంది అలాగే వెక్కుతూ.

సుధాకర్ చెప్పసాగాడు.

"సాన్నిహిత్యం, మనం మెచ్చే లక్షణాలున్న వ్యక్తి పట్ల అనురాగాన్నేర్పరుస్తాయి. దీని ప్రేమనుకో, మరేమయినా అనుకో. జీవితంలో ఎన్నో కాంపొనెంట్స్. అందులో ఏ ఒకటీ సంపూర్ణం కాదు. ఎవరో కవి చెప్పినట్టు షడృతువులు కలిస్తేనే సంవత్సరమవుతుంది. అయితే ఏ ఒక్క ఋతువూ సంవత్సరం కాదు."

ఓ మనిషి పట్ల ప్రేమే సర్వస్వం కాదు. ఇంకా వుంది జీవితం...."

ఓ క్షణమాగాడు సుధాకర్. పక్షులు గూళ్ళు చేరుకుంటున్నాయి. చిరుచలిగాలి వీస్తోంది. మళ్ళీ చెప్పసాగాడు అతను.

"మనసున్నప్పుడు స్పందన సహజం. నీవు మెచ్చేవాటికి స్పందించటం సహజం. నువ్వు మెచ్చిన రవిని ప్రేమించకపోయినట్లయితే అది నీలో లోపమవుతుంది. స్పందన, ఆర్ద్ర భావంలేని జీవితమేం జీవితం? నీ మనసు అతని పట్ల మొగ్గు చూపింది. అతను స్పందించలేదు. వెళ్ళిపోయాడు. అందుకని మనోపుష్పపు దళాల్ని తిరిగి ముకుళింపచేసుకుని, ఇతరులెవరూ ఆ సుగంధాన్ని ఆస్వాదించరాదనటం నేరం. నువ్వు చేసింది తప్పుకాదు, చేయబోయేది తప్పు."

"నా కన్నీళ్ళు తుడవడానికి నన్ను సమర్థించకులే" అంది ఆమె. అప్పుడప్పుడే తెరపిన పడ్తోంది ఆమె.

"నేనలా పైపై కబుర్లు చెప్పను. ఆ విషయం నీకూ తెల్సు. నీ మానస వీణపై రాగం మార్చు. కొత్త గీతం ఆలాపించు. దానికి సబ్జెక్ట్ని నేనే."

"నా మానస వీణా తంత్రులెప్పుడో తెగిపోయాయి."


"అదే నిజమైతే నువ్వింత సున్నితంగా ఆలోచించవులే. ఇదిగో నా క్రిస్మస్ గిఫ్ట్" అని పొట్లాన్ని విప్పి, డాబా పిట్టగోడ మీద పెట్టి, దోసిళ్ళతో మల్లెపూలు ఆమె తలపై పోశాడు సుధాకర్. ఓ పూవు ఆమె తలలో తురిమాడు.

"ఇదేవిటి?" అంది ఆమె.

"నేను నిన్ను వరించాను. నీకు తొందరేంలేదు. నీకు వీలైనపుడు మొదలెట్టు. అయితే మన పెళ్ళి మాత్రం ఖాయం. పద వెళ్దాం" అంటూ ఆమె భుజం మీద చెయ్యేసి ముందుకు నడిపించాడు సుధాకర్.

మధుబాల మనసు ఆర్ద్రమయింది. మల్లెపూల సువాసన మృదువుగా మనసును తాకుతోంది. మొగలిరేకంత గుబాళించలేదీ పరిమళం. మేనికీ, మనసుకీ హాయిని గొల్పే సుతారపు సౌరభం. అయినా గుచ్చుకునే మొగలిరేకు సాంద్ర పరిమళం మరపురానిది. పొదలో మిన్నాగు లేకపోతే అదీ పారిపోవాల్సిన సురభిళపరిమళం కాదు.

* * * *





కె. ఉషారాణి

(గత సంచిక తరువాయి)

టక టక టకా...

టక టక టకా...

గిరగిరా తిరుగుతున్న చక్రాలు లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి.

మెత్తగా దిగబడిపోతున్న సూదులు నిర్విరామంగా కదులుతున్నాయి.

కత్తెర పదును సోకి బట్టలు నిశ్శబ్దంగా ముక్కలవుతున్నాయి.

ఎటు పోతున్నాడో, ఎందుకు ఆవైపు వస్తున్నాడో తెలియని స్థితిలో ప్రొడక్షన్ ఆఫీసు దగ్గరకు వచ్చిన సుధాంశ, లోపల వెలుగుతున్న దీపం, ఓరగా వేసి వున్న తలుపూ చూశాడు.

అసంకల్పితంగా దిగ జారిన మత్తు.

ఏంజరుగుతుందో!. దొంగతనమా?

ఎవరికి అంతధైర్యం?

సుధాంశ కిటికీ పక్కకు వెళ్లి లోపలికి తొంగిచూశాడు.

సుధాంశకు ఇంకా మిగిలిన కొద్దిపాటి మైకం దిగిపోయి.. అరమూతల కళ్లు విశాలంగా మారాయి.

లోపల...

అది ఎప్పటి తన ప్రొడక్షన్ ఆఫీసులా లేదు.

చిన్న కార్ఖానాలా వుంది.

మిషన్స్ ప్లేట్ల మీద కంటిచూపు కందనివేగంతో పాదాలు కదులుతున్నాయి.

సాధన, రత్నం భార్య ఏకాగ్రతతో కుడుతున్నారు.

తిలక్, రత్నంలు కత్తెరలు పట్టుకుని తెల్లటిగుడ్డను కొలతల ప్రకారం ముక్కలు చేస్తున్నారు.

బాబ్జీ నీలం, ఎరుపు రంగులతో గుండ్రంగా రాస్తున్నాడు.

నేడే చూడండి. సుధాంశ 'సాధన'.

అంతకు మించి మరొక్క పదం కూడా లేదు. బ్యానర్లుగా మారిన గుడ్డలను కట్టేందుకు వీలుగా వాటి చివర్లకు తాళ్లను కడుతున్నారు రత్నం ఇద్దరు పిల్లలు.

సుధాంశకు కంటి చూపు పై రెప్ప వాలనివ్వని దృశ్యం.

ఎంత అద్భుతమయిన దృశ్యం అది!

కాశ్మీర లోయల్లోని సుందర జలపాతాలు కాక పోవచ్చు!

హిమాలయ శిఖరంపై తొలి వెలుగు కిరణాల మంచు మెరుపులు కాకపోవచ్చు!

వెన్నెల కాంతిలో మిలమిల్లాడే తాజ్‌మహల్ కాకపోవచ్చు!

కానీ వీటన్నింటినీ మించిన అనుభూతి,

అంతకు మించిన ఆనందం అతడి కందించిన అపురూపమయిన దృశ్యం!

రేపటి కథానాయకుడుగా అందరి జేజేలు అందుకోనున్న తిలక్!


సినిరంగాన్ని మొత్తం తనుకనుసన్నల నయ్యాట లాడించబోయే సాధన!

అంగదుడి పాదంలా పరిశ్రమలో పాతుకు పోబోతున్న బాబ్జీ!
వారందర్నీ మించిన రత్నం, అతడికుటుంబం, ఎవరు వీళ్లు?
డబ్బుకోసం తన చిత్రానికి పని చేసిన వాళ్ళేనా?
ఎందరు, ఎందరు, ఎందరు వీళ్ళలా నిస్వార్థంగా.. నిర్మాతల క్షేమం ఆశిస్తారు?
చిత్రం జయాపజయాలు, విడుదల.. నిర్మాతల సమస్యలు, బాధలు – ఏవీ పట్టించుకోకుండా కేవలం యంత్రాలలా మసలుకునే .. వీళ్ళలో .. ఇంత మంచి తనం!
సుధాంశ తనను తాను మందలించుకున్నాడు.
'ఎంత వెర్రి వాడవోయీ నువ్వు! ఇందరు నీ వాళ్లని నీ చుట్టూ పెట్టుకుని ధైర్యం కోసం ఓ వ్యసనాన్ని ఆశ్రయించావా?'
అతడికి గిల్టీగా వుంది.
అతడు అక్కడ తాగుతూ కూర్చున్న క్షణాలే ఇక్కడ వీళ్ల శ్రమను అతడికి ధార పోశాయి.

తలుచుకుంటున్న కొద్దీ గుండె కరిగి కళ్లల్లోకి చేరుకుంటోంది.
"ఒకటి, రెండు, ముప్పయ్యారు, నలభై మూడు – మొత్తం యాభైరెండు." తిలక్ లెక్క పెట్టాడు."మొత్తం యాభైరెండు వున్నాయ్ రత్నం బాబాయ్!"
"వూహూ.. చాలవు, మరో ముప్పయ్ దాకా కావాలి."
"వెట్ క్లాత్ ఐపోయిందంటే!" సాధన చెప్పింది.
"అయ్యో, ఇప్పుడెలా?" రత్నం కంగారు చూసి నవ్వాడు బాబ్జీ.
"ఐపోతే ఏం, తెద్దాం."
""రాత్రి రెండు దాటింది, మనకోసం ఇప్పుడు బట్టల కొట్టు ఎవ్వరూ తెరవరు." తిలక్ నిరుత్సాహంగా అన్నాడు.
"ఈరోజు బ్యానర్లు రెడీ అవుతే, మనం వాటిని సప్లై చేసేందుకూ, సిటీ అంతా కట్టించేందుకూ... కనీసం మూడు రోజులు కావాలి.." రత్నం దిగులుగా అన్నాడు.
"మనం ఎంతశ్రమ పడ్డా ఆపైన ఏం ప్రయోజనం?"
"మాఫ్రెండ్ యోగికి క్లాత్ ఎంపోరియం వుంది. బాబ్జీకి హఠాత్తుగా గుర్తు వచ్చింది. అతడ్నడిగి తెద్దాం."
"ఇస్తాడా ఇంత రాత్రి?"
"డెఫనెట్‌గా ఇస్తాడు. కానీ.. ఇంతరాత్రి ఎలా వెళ్తాం అంతదూరం, కారు కూడా పంపించేశాను." అంతలో మళ్ళీనిరుత్సాహం.
"కారు లేకపోతేనేం.. సైకిలుందిగా నాది, వెళ్దాం పదండి."
సైకిల్ మీద, ఈ రాత్రి పూట ఇద్దరూ అంతదూరం వెళ్లడం..
ఎవరికోసం అదంతా.?
సుధాంశ మరోసారి బ్యానరు వంక చూశాడు. నేడే చూడండి సుధాంశ 'సాధన'.
అతడి పెదవులపై పల్చటి నవ్వు.
సుధాంశ సాధనా ఇది, కాదు, కానేకాదు!
అతడు అప్పటి దాకా వ్యర్థం చేసిన కాలం ఇంకా.. అతడ్ని దాటుకు పోతూ

"రాగం మారింది"

"మీ ఆవిడ ప్రతిరోజూ అలా ఘోరసంగీత ప్రాక్టీసు చేస్తోంది కదా! నీవు అడ్డుచెప్పవా?"
"చెప్పాను"
"ఏమైంది"
"గతంలో మూడున్నర రాగంతో పాడేది. ఇప్పుడు ఆరున్నర రాగంతో పాడుతోంది".



వెక్కిరిస్తోంది.
సుధాంశ కిటికీ దగ్గర్నుంచీ కదిలి తలుపు దగ్గరకు నడిచాడు.

• • •

సుధాంశ సాధన నేడే చూడండి.
గాలికి ఊగుతున్న బ్యానర్లు సిటీలో అక్కడక్కడా కనిపిస్తున్నాయి.
థియేటర్ను ముందు మాత్రమే రిలీజ్ వున్న డేట్ పెట్టారు. ఇంకెక్కడా కనీసం విడుదల తేదీ కూడా లేదు.
నటీనట వర్గం తెలియదు.
సాంకేతిక వర్గం తెలియదు.
చిత్రం గురించి ఏ చిన్న వివరమూ తెలియని ప్రేక్షకులకు హఠాత్తుగా రాత్రికి రాత్రి నగరంలో వెలిసిన బ్యానర్లు ఆశ్చర్యం కలిగించాయి.
సుధాంశ డైరెక్టర్‌గా అందరికీ తెలుసు. అప్పటిదాకా ఎన్నో భారీ హిట్ చిత్రాలు అతడి దర్శకత్వంలో వచ్చాయి.
అదీ తెలుసు!
కానీ ఈ సాధన ఏమిటి?
అదే ఎవరికీ అర్థం కావడం లేదు.
అప్పుడెప్పుడో ఓమూల సుధాంశ స్వంత చిత్రనిర్మాణం గురించి వచ్చిన ప్రకటన ఎప్పుడో మరిచి పోయారు.
పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ కోర్టు గొడవల్లో చిక్కుకోవడంతో బయటపడని కటవుట్స్, పోస్టర్సు..
ఇప్పుడు హఠాత్తుగా ఆకాశంలో వూగిసలాడే కొంగరెక్కల్లా... కదలాడే బ్యానర్లు.
సుధాంశకు ఎన్నో ఫోన్లు, మరెన్నో పరామర్శలు...
'పబ్లిసిటీ ఇన్ ఛార్జ్ గొడవ వల్ల ఇంత నష్టపడ్డా అయ్యావా? మాకు ఒక్క ముక్క చెప్పలేదేం?
'ఈ బ్యానర్లు పిక్చర్ హిట్‌కి సాయపడవు. కనీసం సెకండ్‌వీక్‌కి ఐనా కలక్షన్ అందుకుంటుంది. నా మాటవిను సుధాంశ!'
ఇప్పటికైనా మించిపోయింది లేదు. పిక్చర్‌ని రేపే ప్రెస్‌కు చూపించు సుధాంశ! ప్రెస్ పబ్లిసిటీని మించింది లేదు.
సుధాంశ అన్నీ వింటున్నాడు. మౌనంగా విని కొట్టి పారేస్తున్నాడు.

ఇప్పుడు అతను ఇక ఏ ప్రయత్నాలు చెయ్య దల్చుకోలేదు.

తనకోసం రాత్రంతా నిద్ర మేల్కొని తన వాళ్లు తయారుచేసిన బ్యానర్లు సాధించలేని విజయం-

ఎనభై అడుగుల ఎత్తున్న కటవుట్స్ కూడా సాధించలేవు.

కృషి, తపన, సాధనా - సాధనను విజయం వైపు నడిపించాలిగానీ.. పబ్లిసిటీ కాదు.

'సార్! ఉత్తరం'.

ఒక్క నిర్మల ఉత్తరం మాత్రమే రత్నం ఓపెన్ చెయ్యకుండా అతనికి ఇస్తాడు.

చాలా రోజులయ్యింది నిర్మల ఉత్తరం రాసి. ఆమె ఆ మధ్య వ్రాసిన రెండు, మూడు ఉత్తరాలకు అతను తన గొడవల్లో తనుండి సమాధానం ఇవ్వనేలేదు. సుధాంశ ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

ప్రియమైన మీకు!


పత్రికలూ, రత్నం మీ విషయాలు ఎప్పటి కప్పుడు తెలియజేస్తున్నారు. మరో మూడు రోజుల్లో మీ 'సాధన' కూ 'వాహిని'కి పోటీ - వచ్చేస్తోంది తలుచుకుంటూ వుంటే! వాహినికీ మీకూ మధ్య పోటీయా? స్నేహం మధ్య ఆత్మీయతలే తప్ప అహంభావాలకు చోటుంటుందా! వాహిని తొందర పడితే మందలించాల్సిన మీరే ఈ విధంగా రెచ్చ గొడతారా? తప్పుకదూ?


ఇక మీ 'సాధన' విషయానికి వస్తే.. రత్నం వ్రాశాడు మీరు ఎదుర్కొన్న ఇబ్బందులు. ఆశయసాధన కోసం ఆమాత్రం శ్రమ పడక తప్పదుగా!

రాహుల్ రత్నం ఉత్తరం చదివి ఏమన్నాడో తెలుసా! ఇన్నాళ్ళకైనా డాడీకి ఓ మంచి పిక్చర్ తియ్యాలనిపించింది. నువ్వు డాడీకి లెటర్ రాస్తే నా విషస్ చెప్పు మమ్మీ!' అన్నాడు. అంటే.. అర్ధమైందిగా మీతరం పెమ్మల్ని అర్ధం చేసుకోక పోయినా ఈతరం మీ ఆదర్శాన్ని, సాహసాన్ని అభినందిస్తుంది. ఈ ధైర్యం చాలదూ మీకు మరిన్ని సాధించేందుకు?

సాధన ఫెయిలంటూ ఐతే మకాం మార్చెయ్యక తప్పదంటూ వ్రాశాడు రత్నం! మరేమీ భయం లేదని చెప్పండి. పగలంతా అలసి మీరు ఏ సాయంత్రం వేళకో ఇల్లు చేరతారు. నా చిరునవ్వు లాలింపులో సేదతీరుతారు అంటూ నిత్యమూ నేను కమ్మటి కలను మీ అపజయం నిజం చేస్తుందంటే... నాకు అంతకంటే ఏంకావాలి?

భార్యగా మీరు ఓడిపోవాలని ఆశించినా.. ఒక్క మంచి చిత్రం ప్రజాదరణకు నోచుకోలేదూ అంటే అది రాబోయే మరిన్ని చిత్రాలకు గొడ్డలిపెట్టు కదూ! నా స్వార్థం





కోసం ఎంతో ధైర్యంగా మీలో తలెత్తిన మీ సామర్థ్యాన్ని తలవంచనిస్తానా? వూహూ! అందుకే... మీ సాధన హిట్ కావాలన్నదే నా అభిమతం.

ఆఖరుగా ఒక్క విన్నపం.

గెలుపే కాని, ఓటమే.. కానీ.. ఇంతటితో అంతా ఐపోయిందంటూ భ్రమించకండి. ఇది ప్రారంభం మాత్రమే!

నా విన్నపాన్ని మన్నిస్తారు కదూ?

మీ.....

నిర్మల.

సుధాంశ కళ్లు దీప్తివంతమయ్యాయి.

'నా కోసం, నా అభిమతం కోసం, నా ఆశయం కోసం నన్నే త్యాగం చెయ్యగల ఓ అర్ధాంగీ! నీ ఋణం నేనే విధంగా తీర్చుకోగలను!'

అతడి పెదవులు నిర్మల 'మీ' అంటూ వ్రాసిన చోట ముమ్మారు వాలాయి.

* * *

రాత్రి నల్లగా వుంది.

ఆగదిలో చల్లగా వుంది.

ఎయిర్ కండిషనర్ చప్పుడు లేకుండా ప్రసారం చేసే చల్లదనాన్ని ఏమాత్రమూ అనుభవించనివ్వని అలజడి.

వాహినికి నిద్ర రావడం లేదు.

గాలికి ఊగుతూ కనిపించిన బ్యానర్లు ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే వున్నాయి.

సుధాంశ సాధన.....

ఏమవుతుంది ఫలితం?

ఒకవేళ ఫలితం అతడి కనుకూలంగా లేకపోతే ఎవరు దానికి కారణమవుతారు? తను, తనే కదూ?

తెలుసుకున్న సమాధానం భరించలేనంటూ ఆమెలోని మంచితనం బాధగా మూలిగింది.

ఇన్‌కమ్‌టాక్స్ రెయిడింగ్,

గౌతమ్ పై కోర్టు వారంట్...

ఎన్ని ప్రయత్నాలు చేసింది, సుధాంశ సాధనను ఆపేందుకేగా అవన్నీ..

ఏవీ, అవేవీ ఆపలేకపోయాయిగా!

తెల్లగా కదిలే బ్యానర్లు సుధాంశ పట్టుదలలోని స్వచ్ఛతలా మెరుస్తుంటే....

నిలువెత్తున నిలబెట్టబడిన రంగురంగుల కటవుట్లూ, పోస్టర్లూ తన స్వార్థం లోని క్రూరత్వంలా వికృతంగా తోస్తున్నాయి.

స్వార్థం ... అవును స్వార్థంతోనేగా ఇంత నీచస్థితికి దిగజారింది!

స్వార్థంతోనేగా సుధాంశలోని సామర్థ్యానికి సమాధి కట్టాలను కుంది.

స్వార్థంతోనేగా .. సాధనను ఓడించి ఈ వాహిని విజయం సాధించాలనుకుంది!

వాహిని గుండెలపై రెపరెపలాడుతున్న కాగితం వైపు చూసుకుంది.

ఆమె ఇప్పుడు మళ్ళీ ఆ ఉత్తరం చదివే అవసరం లేదు. అందులోని అక్షరాలు.. ఆమె కళ్లల్లో ముద్రించుకు పోయాయి ఎప్పుడో!

వాణీ!

నీ సుధాంశతో, నీ ప్రాణంతో నీకు పోటీయా! ఏమిటమ్మా ఇది? ఎందుకీ తొందర పాటు? రేపు నువ్వే గెలిచి ఆయన ఓడిపోతే.. నీ గెలుపు నీకు సంతోషాన్ని ఇస్తుందా? చెమ్మగిల్లిన నీ కళ్లు అప్పుడు కార్చేవి ఆనంద భాష్పాలే నంటూ నిన్ను నువ్వు నమ్మించు కోగలవా?'

గుండెను తూట్లు పొడుస్తున్నాయి మనోఫలకంపై ముద్రించుకు పోయిన అక్షరాలు.

ఔను, సుధాంశ ఓడిపోయి ఈ పరిశ్రమకు దూరమై పోతే.. తను ఏమై పోతుంది?

గుండె మండుతూ....

గొంతుక మండుతూ.....

కళ్లు మండుతూ......

వాహిని అశాంతిగా కదిలింది.


'సుధా! అవివేకంగా ఇంత దూరం నేను వస్తోంటే నువ్వు నీ అధికారంతోనైనా నన్ను కట్టిపడెయ్య లేక పోయావేం! ఔనులే, అభిమానానికే లొంగని దాన్ని అధికారానికేం లొంగుతాను? అనుకునివుంటావు కదూ?'

ఆమె మాట్లాడు తున్న సుధాంశ ఆమె ఎదురుగా లేదు.

ఆమె మనసులో వున్నాడు.

'ప్రతిభకు పోటీ వుండాలి వాహినీ! అప్పుడే అది మరింత రాణించేది' – దర్శకుడిగా తనకు పాఠాలు చెప్పే సుధాంశ.

'నాలుగు రోజులపాటూ తళుకుమన్న తారలా రాలిపోకు వాణీ! నటిగా పదికాలాలు అందరి హృదయాల్లో నిలిచిపో!'



ఆప్యాయంగా తన ఉన్నతినాశించే తన సుధ.

అతడు చేస్తున్న యజ్ఞాన్ని విచ్ఛిన్నం చేయాలనుకున్న రాక్షసి తను.

సుధాంశతో తను పెంచుకున్న పోటీ ఫలితం... నటిగా ప్రజలముందు తలెత్తుకుని నిలబడగల వాహిని ఉద్భవించింది.

ఆదే తనతో పోటీ పడ్డ సుధాంశ సామర్థ్యం, తపన, ఆదర్శం, సాధన అన్నీ తన కారణంగా సర్వనాశనం కావాలంటూ కోరుకుంటోంది తను!

స్వచ్ఛమైన ఈ అంతరంగంలో ఎలా ఈ పిశాచి కోరిక తిష్ఠవేసింది!

ఏ బలహీన క్షణంలో స్వార్థానికి లొంగి పోయింది తను!

ప్రక్షాళనం అవుతున్న మనసు.. కన్నీటితో చేసిన తప్పును కడుక్కుంటోంది.

ఈ పరిశ్రమలో శాశ్వతంగా ప్రథమస్థానంలో వుండాలను కోవడం బంగారు లేడి వెంట పరుగులు తియ్యడం లాంటిదే! పిచ్చీ! అందినట్టే అంది నిన్ను బురిడీ కొట్టించి పారిపోతుంది. జాగ్రత్త.

నవ్వుతూ నవ్వుతూ ఎన్నెన్ని పాఠాలు తనకు నేర్పాడు.

అవన్నీ మరచిపోయి..

ప్రేమ మరచిపోయి...

అనుబంధం మరచిపోయి...

ఆత్మీయత మరచిపోయి...

ఇలా రాక్షసిలా రూపాంతరం చెందిందేం తను?

వాహిని తెల్లవార్లూ కుదిపి, కదిపి ఆమెలోంచి ఆమెను బయటకు రప్పించిన అంతరంగం ఆఖరుకు విజయం సాధించింది.

'సుధా! నువ్వు ఓడిపోవు. నిన్ను నేను ఓడిపోనివ్వను.'

మూగది!

"నేను మా బెస్ట్ వర్మతో తిరుగుతున్నానని తెలిసినా మా యావిడేం మాట్లాడటం లేదు" గొప్పగా అన్నాడు శ్రీను.

"అంటే మీయావిడ చాలా ఉత్తమురాలన్నమాట" అడిగాడు శంకర్.

"కాదులే. మూగది" చెప్పాడు శ్రీను.

"అనుమానం"

"గ్రామంలో ప్రతి స్త్రీని నీ చెల్లిలా, తల్లిలా చూసుకోవాలి. అప్పుడు నిన్నందరూ సచ్చరిత్రుడూ అంటారు" ఓ తిరుగుబోతును సంస్కరించే ఉద్దేశ్యంతో అన్నాడో పెద్ద మనిషి.

"భలే వారే. అప్పుడు మా నాన్నగారి శీలంపై జనానికి అనుమానం రాదూ" అడిగాడా పితృభక్తి పరాయణుడు.

బిల్లు!

"ఆ డాక్టర్ శ్రీనును ప్రేమించి నేను పొరపాటు చేశాను. బుద్ధి తక్కువైందే కోపంగా అంది వర్మ.

"ఏమైందే?" ఆశ్చర్యంగా అడిగింది వర్మ ఫ్రెండ్ రాణి.

"మేం కలుసుకొన్న ఇరవై సార్లకు కన్సల్టింగ్ ఫీజ పంపమని బిల్లు పంపాడు" విసుక్కుంటూ చెప్పింది.

–వర్మశ్రీ (మాణిక్యారం)

* * *

" మీరు నన్ను క్షమించాలి మేడమ్!" సంపత్ కుమార్ అయిష్టంగా ముఖం పెట్టాడు.

"ఎంత కష్టపడి ముగించాం పిక్చరు, ఎందుకూ, త్వరగా విడుదల చెయ్యాలనేగా, అలాంటిది ఇప్పటికిప్పుడు పిక్చర్ రిలీజ్ డేట్ పోస్ట్ పోన్ చెయ్యడమంటే.. నన్ను మన్నించండి, నా వల్ల కాదు."

ఖరాఖండీగా చెప్పేశాడు సమాధానం.

సినిమా నిర్మాణం జరిగినంతకాలం 'అలాగేనంటే, మీ ఇష్టం మేడమ్ మీరు చెప్పినట్టే చేద్దామమ్మా!' లాంటి సమాధానాలు తప్ప మరొకటి మాట్లాడి ఎరగని అతడు ఇప్పుడింత ఖచ్చితంగా కాదని చెప్పెయ్యగలిగాడు.

వాహిని నిర్లిప్తంగా నవ్వుకుంది.

"పిక్చర్ మీ ఒక్కరి స్వంతం కాదు వాహినీ! మీ ఇష్టప్రకారం రిలీజ్ చెయ్యాలనుకోవడం, ఆ తర్వాత ఒద్దనుకోవడం... హౌ స్ట్రేంజ్ ఇటీజ్."

విజయేంద్ర చాలా కాలం నుంచీ సుధాంశను రీప్లేస్ చేసి ఆ స్థానం దక్కించుకోవడం కోసం ఎదురు చూస్తున్న వ్యక్తి.

సాధన విడుదల సందర్భంగా సుధాంశ ఎదుర్కొంటున్న ప్రాబ్లమ్స్.

సరిగ్గా అదే రోజున విడుదలవుతున్న వాహిని.. అతడికి తెలుసు వాహిని తప్పక సాధనను బీట్ చేస్తుంది.

అంటే తను .. సుధాంశను..

అలాంటి అవకాశం ఎందుకు ఒదులుకుంటాడు?

వాహిని విఫలురాలై.. వచ్చేస్తూ వుండగా సాధన ఎదురైంది స్టూడియో గేటు ముందు ఆటో దిగుతూ...

వాహిని కారు ఆగింది.

"హలో, సాధనా! హౌ ఆర్ యూ?"

వాహిని తనను చూసి ఆగడం, పలకరించడం, సాధన ఆశ్చర్యం నుంచీ తేరుకుంటూ చేతులు జోడించింది.

"నమస్తే మేడమ్!"

"ఇలా వచ్చావేం, ఏమిటి వర్క్?" కారు దిగింది వాహిని.

"రూబీ మూవీస్ వాళ్లు డ్యాన్స్ ఛాన్స్ వుంది రమ్మంటూ కబురు చేశారు."

సువాసనలు వెదజల్లే పారిజాతం ముందు ఒదిగిపోతున్న గడ్డి పువ్వులా ఫీలవుతోంది సాధన.

"సాధనా! నీ సీనియర్‌గా, నీ వెల్ విషర్‌గా ఒక్క మాట చెప్పనా?" అభిమానంగా సాధన భుజంపై చెయ్యి వేసింది. "సుధాంశ నటిగా నీ భవిష్యత్తుకు బంగారు బాట వేశాడు. అంత చక్కటి దారిని కాదని ఈ అడ్డుదారుల వెంట నడవకు.

సాధన విచిత్రంగా చూసింది వాహిని వైపు.

" 'సాధన' రిలీజవుతోంది కదూ! విష్ యూ బెస్ట్ కరీర్!"

సాధన ఇంకా విభ్రాంతి నుండి తేరుకోక మునుపే వాహిని కారెక్కి కూర్చోడం, కారు కదలిపోవడం జరిగాయి.

సాధన మెల్లగా తేరుకుంది.

ఎక్కడుంది తను, ఏ అద్భుత లోకాలలోనో కాదు కదా, చుట్టూరా చూసుకుంది. ఎక్కడో లేదు. ఎప్పుడూ వచ్చి పోయే స్టూడియో ముందే వుంది.

పోతే అకస్మాత్తుగా ఎదురైన వాహిని ప్రవర్తన తనని అలా అయోమయావస్థలోకి నెట్టిందంతే!

సాధన వాహిని చెప్పిన మాటలన్నీ గుర్తు చేసుకుంది మరోసారి.

'సాధన' విడుదల ఆపడం కోసం 'వాహిని' త్వర త్వరగా ముగించి '[illegible] పోటీగా విడుదల చెయ్యడం కోసం వాహిని ఎంత పట్టుదల ప్రయత్నించి[illegible] లుసు సాధనకి.

మరి ఇప్పుడీ ఆదరణ ఏమిటో, ఈ అభినందన ఏమిటో.. అంతా అర్థం కాకు[illegible] వుంది.

"విష్ యూ బెస్ట్ కెరీర్!"

వాహినీ అనడం గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకుంది.

దురదృష్టవంతుల జీవితంలో అదృష్టం తొంగి చూడ్డానికి అన్సలు ఇష్టపడదు. ఒకవేళ తమ నుదుట రాతలోని ఏ చిన్న గీతో అదృష్టాన్ని జీవన్న ప్రాంగణంలోకి రా, రమ్మంటూ ఆహ్వానించినా.. ఏ మాత్రం ఏమరపాటూ తెలియని దురదృష్టం తరిమి కొడుతుంది దాన్ని.

అలాంటిదే 'సాధన'తో తనకు అవకాశం రావడం, ఒకే రోజున 'సాధన', 'వాహిని' విడుదల కావడం."

సాధన తనకెదురైన స్థితికి భయపడ్డంలేదు. నవ్వు కుంటోంది.

* *

"ఎస్, ఇప్పుడే, అర్జంట్‌గా మీరు రావాలి. అర్జంట్ న్యూస్ ఇవ్వాలి నేను." లలిత్‌కు ఫోన్ చేసింది.

"డైలీలో మీరు చెప్పిన విధంగా ప్రకటన ఇవ్వడం వీలవదేమో వాహినీ! లలిత అనుమానంగా అన్నాడు వాహిని ఇంటికి రాగానే.

"ఎందుకు వీలుకాదు, సినిమా ప్రకటనలు ఎన్ని డైలీలలో రావడం లేదు. అలాంటిదే ఇది.. ఇదో పబ్లిసిటీ న్యూస్ క్రిందికే లెక్కరాదా? మనం ఛార్జెస్ పే చేస్తున్నాం కదా?"

వాహిని, లలిత్ ఇద్దరూ రాత్రి 8 గంటల వేళ బయల్దేరారు. ఇద్దరూ ప్రముఖ తారలే కావడంతో ఎవ్వరూ వారిని అడ్డగించలేదు.

"మీరు చెప్పినట్టుగా న్యూస్ ఇవ్వచ్చు. అందులో అసాధ్యమేమీ కాదు. కానీ రేపే రావాలంటే .. చీఫ్ ఎడిటర్ ఆఫ్ సదరన్ క్రానికల్ అన్నాడు.

"అవునండీ రేపే రావాలి! ప్లీజ్, మీరు ఎలా అరేంజ్ చేసినా, ఎంత ఛార్జ్ చేసినా పర్వాలేదు. కానీ న్యూస్ మాత్రం రేపు ఇంగ్లీష్, తెలుగు దిన పత్రికలన్నింటిలోనూ వుండాలి.."

వాహిని అంతటి సినీ నటి ప్రాధేయపడితే ఎవరు మాత్రం కరిగిపోకుండా వుంటారు.

"ఓ.కె. మీరంతగా అడుగుతున్నారు, కాదనటం నాకూ కష్టమే, ఉండండి అడ్వర్‌టయిజింగ్ మేనేజర్‌ని పిలిపిస్తాను."

ఫోన్లు... ఫోన్లు ...

కారు గిర్రున తిరిగి తిరిగి ఎన్నో పత్రికాఫీసుల ముందు ఆగుతోంది.


సదరన్ క్రానికల్ మాతృభూమి,




ప్రభాత, నేడు,
ఆంధ్ర ఖ్యాతి, ఆంధ్ర దీప్తి ఆంధ్ర ప్రగతి. అందర్నీ కలుస్తున్నారు. అన్ని చోట్లా న్యూస్ ఇస్తున్నారు.
వాహిని అనుభవిస్తున్న టెన్షన్, ఎలాగైనా రేపటికి పత్రికా ప్రకటన ఇవ్వడం కోసం ఆమె పడ్తున్న శ్రమా... లలిత్ ఆశ్చర్యపోతున్నారు.
స్వతహాగా మంచితనం నిండిన మనిషిలో తాత్కాలికంగా ఉద్రేకాలూ, ఆవేశాలూ తలఎత్తుతాయే తప్ప... శాశ్వతంగా మంచితనం నిద్రపోదు.
ఆ సమయంలో లలిత్‌కు గుర్తురాలేదు.
'సాధన' విజయం కోసం వాహిని పడుతున్న శ్రమ ఫలిస్తే... 'వాహిని' చిత్రం ఫెయిలవుతుంది.
'వాహిని'తో వాహిని ఒక్కర్తే కాదు తనూ వున్నాడు.
అన్న మాటే గుర్తుకు రానివాడిలా ఆమె వెంట తిరిగీ తిరిగీ.. అర్థరాత్రి రెండు గంటలు దాటాకా వాహిని ఇల్లు చేరారు.
"థాంక్ యూ లలిత్! రమ్మనగానే వచ్చి నా బాధ్యత సగం పంచుకున్నారు."
లలిత్ వంక కృతజ్ఞతగా చూసింది.
"ఈ శ్రమలో ఆనందం వుంది వాహినీ! ఈ రాత్రి పట్టినంత సుఖ నిద్ర.. ఇంతకు ముందెప్పుడూ అనుభవించి వుండంమనం... మరి నేను వెళ్లిరానా,"
వెళ్లిపోవటానికి బయల్దేరుతున్న అతడి వెనగ్గా నడించింది
"గుడ్ నైట్!"
లలిత్ ఆగి నవ్వాడు.
"డోంట్‌సే గుడ్‌నైట్... ఇటీజ్ గుడ్ మార్నింగ్ అండాల్సో గుడ్ స్టార్టింగ్..."
వాహిని కళ్లు సంతోషంగా మెరిశాయి. లలిత్ చెయ్యందుకుని మెత్తగా పెదవులతో తాకింది.
"థాంక్‌యూ లలిత్! థాంక్‌యూ ఎలాట్." అస్పష్టంగా అంది.

* * *

ప్రియమైన ప్రేక్షకులకు,
వాహిని శుభాభివందనలు!
రేపు సుధాంశగారు దర్శకత్వం వహించిన 'సాధన' చిత్రం విడుదల కాబోతూంది. ఈ చిత్రంలో సుధాంశ దర్శకత్వ ప్రతిభ, సాధన నటనా సామర్థ్యం ఒకదానితో మరొకటి పోటీ పడ్డాయి. చిత్రాలు ఎప్పుడూ వస్తుంటాయి. కానీ మంచి చిత్రాలు ఎప్పుడోగానీ రావు. అలాంటి మంచి చిత్రం 'సాధన.'
అత్యుత్తమ విలువలు గల ప్రతి చిత్రమూ మీ ఆదరాభిమానాలు నోచుకుంటుంది. విజయాన్ని సాధిస్తుంది అన్నది మీరు ఎప్పుడూ ఋజువు చేస్తున్నదే! అలాగే ఈ 'సాధన'నూ ఆదరిస్తారనే నా నమ్మకం.
సాధనలాంటి పాత్రకు అత్యుత్తమంగా పోషించిన సహ నటీమణి సాధనకూ, సాధన వంటి చిత్రాన్ని సృష్టించి మరోసారి తన మేధస్సును ఋజువు చేసుకున్న సుధాంశకూ నా హార్థికాభివందనలు!
'సాధన' మీ ఆశీస్సులు పొందాలని
ఆకాంక్షించే
మీ
వాహిని.
అందమైన డిస్‌ప్లేలో ముందు పేజీలో వెలువడ్డ ప్రకటన. ప్రముఖ ఇంగ్లీషు, తెలుగు దిన పత్రికలన్నింటిలోనూ అదే ప్రకటన.
నిద్రకళ్లతో పేపరు తెరిచిన సుధాంశనూ పలకరించింది. సుధాంశ దిగ్గున లేచి కూర్చున్నాడు.
మళ్లీ చదివాడు. మరోసారి, మరోసారి చదివాడు. వాహిని ఎంత పని చేసింది!
రేపే వాహిని నటించిన 'వాహిని' కూడా విడుదలవుతోంది.
విడుదలకు ముందు రోజు తను నటించిన చిత్రం గురించి కాకుండా ఆదే రోజున విడుదలయ్యే మరో చిత్రం గురించి ఇలా ప్రకటన నివ్వడం------
వాహిని ఓడిపోవాలనీ, 'వాహిని' ఫ్లాప్ కావాలని సుధాంశ ఎన్నడూ అనుకోలేదు. కానీ తన గెలుపు ధారపోసి ఆమె ఓటమిని వరిస్తోంది.
ఎందుకు? ఇంకెందుకు?
తనకోసం, తను గెలవటం కోసం.
సుధాంశ కప్పుకున్న రగ్గు విసిరి కొట్టి వాహినికి రింగ్ చేశాడు.
ఒకటి, రెండు, మూడు....
మరో నాలుగు సార్లు ట్రై చేశాక వాహిని లైన్లోకొచ్చింది.
"హలో! వాహినీ హియర్!"
నిద్రమత్తూ, అలసటా ధ్వనిస్తున్న స్వరం వినగానే అతడి గుండెలోతుల్లో ధ్వనించిన



ప్రకంపనాలు.
'రాత్రి ఎప్పటి వరకూ మెలుకుందో! ఎన్ని ఆఫీసుల చుట్టూ తిరిగిందో!' సుధాంశ వాహిని పడ్డ శ్రమను ఊహించలేకపోడు.
"హలో! హూ ఈజ్ స్పీకింగ్?" విసుగ్గా అంది వాహిని.
సుధాంశ బలవంతంగా గొంతు విప్పాడు.
"పిచ్చీ! ఎందుకు చేశావ్ ఇలా?"
సుధాంశ పలకరింపు ఆమె ఎదురు చూడనిది. అటువైపు నుంచే కమ్ముకున్న నిశ్శబ్దం.
మౌనం ఎన్నెన్ని భావాలను స్పష్టం చెయ్యగలుగుతుందో వినగల మనసున్న వారికే!
"చెప్పు వాహీ! నా కోసమే కదూ? లాలనగా అడిగాడు.
అణచీ, అణచీ బుడగలో కప్పేసి పట్టినగాలి సందు చూసుకుని ఎలా బుస్సుమంటూ బయట పడుతుందో సరిగ్గా అలాగే..
వాహిని వెక్కిళ్ళు అతడికి వినిపిస్తూనే వున్నాయి. అతడు ఓదార్చే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. నిజానికి ఆమెకా సమయంలో కావల్సింది ఓదార్పు కాదు, అతడు తన దుఃఖాన్ని పంచుకోడాన్నే ఆమె కోరుకుంటోంది.
రెండు నిముషాల కాలం వాహిని మనసులోని భారాన్ని దింపి ప్రశాంతంగా మిగిలింది.
"చేసిన తప్పును దిద్దుకుందుకు ఇంతకన్నా మార్గం కనిపించలేదు సుధా! నేను తప్పు చెయ్యలేదు కదూ?"
బేలగా అడుగుతోంది వాహిని.
సుధాంశ గుండె పొరలు తాకుతున్న పలకరింత. ఇంత త్యాగం, ఇంత సహకారం వాహిని నించీ పొందేందుకు తనకు అర్హత వుందా?
ఇందుకు ప్రతిగా తనామెకు ఏమివ్వగలడు?
సుధాంశ మౌనం వాహినిని మరింత బాధపట్టింది.
"సుధా? నావల్ల ఓ నిర్మాత నష్టపోతాడని నువ్వనుకుంటే... వాళ్ల నాకిచ్చిన రెమ్యునరేషన్ వాపస్ చేస్తాను. ప్లీజ్, మాట్లాడవూ?"
మెత్తటి ఆమె స్వరం.. అతడివల్ల ఆమెకున్న మమకారమంతటినీ పోగు చేసుకుని పలుకుతోంది.
సుధాంశ మౌనం సడలిపోయింది.
"వాహీ! నాకోసమై నువ్వు చేసిన త్యాగం... సాహసం..." అతడ్ని మధ్యలో



అడ్డుకుంది.
"నీ కోసం నేనేమీ చెయ్యలేదు. నాకోసం, ఇదంతా నాకోసమే!" వాహిని మాటల్లో ధ్వనించే భావాలు భాషకందవు. "ఒకవేళ నువ్వు ఓడిపోయి, నేను గెలిస్తే... గెలుపును భరించి నేను బతగ్గలనా?"
"ఏమో! నువ్విచ్చిన ప్రకటన మాత్రంతో 'సాధన' హిట్ అవుతుందన్న నమ్మకం ఏమిటి? నీ అంచనా తప్పి నేను ఓడిపోతే..."
"వూహూ..... అలా ఎన్నటికీ జరగదు, వాహిని దృఢంగా అంది. "నా సుధా ఎప్పుడూ ఓడిపోడు."
సుధాంశ నవ్వాడు హాయిగా.
"వాహీ! ఇప్పుడు నాకేమనిపిస్తోందో తెలుసా? ఇప్పుడు, ఇప్పటికిప్పుడు నిన్ను చూడాలని వుంది."
"నిజంగా.." వాహిని నమ్మలేనట్టుగా రెట్టించింది. "నీకు నీ అంతటనీకుగా నన్ను చూడాలనిపించడం, నమ్మమంటావా?"
"న్ని..జ్జం.." ఒత్తి పలికి చెప్పాడు. "కావాలంటే ఒకప్పటి మా ఎదురింటి రాలుగాయి అమ్మాయి నాపైన పెంచుకున్న ప్రేమ మీద ఒట్టేసి చెబుతాను. నమ్ముతావా?"

. . . .

"కానీ ఇప్పుడే రాను, ఈ రాత్రి.. వాహీ! సిద్ధంగా వుండు. మనం కలిసి భోం చేద్దాం. స్వీటూ, హాటూ.. అమరిన విందు భోజనం పెట్టాలి నువ్వు నాకు."
సుధాంశ ఫోన్ పెట్టేశాడు.

(ఇంకా వుంది)

నా బాధ!

"ప్రతి రోజూ నాకు కలల్లో కన్నెపిల్లలు వస్తున్నారండీ" డాక్టర్ తో చెప్పుకొన్నాడు శ్రీను.
"ఏం! అలా రావడం బాధగా ఉందా?" అడిగాడు డాక్టర్.
"కాదండీ. వచ్చిన వాళ్ళు ఉండకుండా వెళుతున్నారన్నదే నా బాధ" విచారంగా చెప్పాడు.

పెడదాం!!

అప్పుడే కొని ఇంటికి తీసుకొచ్చిన అల్సేషియన్ కుక్కపిల్లను మురిపెంగా చూస్తూ అడిగింది భార్య పద్మ.
"దీనికేం పేరు పెడదామండీ?"
"మా బాస్ పేరు పెడదాం" కసిగా బాస్‌ను తల్చుకొంటూ అన్నాడు శ్రీను.


నమ్మకం!


"నాకు దయ్యాలంటే అసలు నమ్మకం లేదు తెలుసా?" గర్వంగా అన్నాడు శ్రీనివాసులు.
"బతికున్న రోజుల్లో నేనూ అలాగే అనుకొనే వాణ్ణి" తాపీగా చెప్పాడు ప్రక్కనున్నతను.

వేస్తుంటూ!

"ఒకవేళ నేను గనుక చనిపోతే నా జ్ఞాపకార్థం ఏం చేస్తారండీ?" భర్తను అడిగింది భార్య.
"అచ్చం నీలాగే వున్న నీ చెల్లెల్ని చేసుకుంటాను" సంబరంగా చెప్పాడు భర్త.

-పద్మశ్రీ (మాచవరం)


కందుకూరి వెంకట మహాలక్ష్మి
బడబాగ్ని


Bharath

గతవారమే చెల్లెలికీ, తమ్ముడికీ పెళ్ళిళ్ళు చేసి తల్లితండ్రులు తన కప్పగించిన బాధ్యత సక్రమంగా నిర్వర్తించుకున్నాడు.

తల్లిబ్రతికున్నన్నాళ్ళు పెళ్లి చేసుకోమని పోరేది. అదిగో, ఇదిగో అంటూ తప్పించుకుంటూ వచ్చాడు. విసిగి విసిగి వేసారి పోయిన తల్లితండ్రులు తన చెల్లెళ్ళిద్దరి పెళ్ళిళ్ళు చేసారు. మిగతా చెల్లెలి, తమ్ముడి బాధ్యత తనమీద పెట్టి కన్నుమూసారు.

తల్లి తరువాత తమ్ముడూ, చెల్లెలూ కూడా పెళ్ళి చేసుకోమని పోరేవారు. " నా కెందుకన్నా నలభైయ్యేళ్ళు వచ్చేసాయి!" అని వాళ్ళ దగ్గిర తప్పించుకునేవాడు.

వాళ్ళిద్దరు వున్నన్నాళ్ళూ టైముకి యింటికెళ్ళేవాడు. ఇప్పుడు యింటికెళ్ళాలంటే భయం. ముఖ్యంగా భయంకరమైన ఒంటరితనం. అందుకేవీలయినంతకాలం లాబ్‌లోనేగ డిపేస్తాడు. తన స్టూడెంట్లకి ,చెయ్యగలిగినంత సహాయం చేస్తూ వారి మధ్య జీవితాన్నిలాగేకొనసాగించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఆలోచిస్తూ లాబ్ బైటకొస్తున్న హారీష్‌కు బూట్ల చప్పుడు వినపడటంతో అక్కడే ఓ క్షణం ఆగి "ఎవరీ రాత్రివేళ వచ్చేది?" అనుకున్నాడు తనలోతనే.

"సార్! సార్! రూపని కారు గుద్దేసిందండీ! చాలా సీరియస్‌గా వుంది. డాక్టర్లు లాభం లేదని చెప్పేసారు సార్!" అంటూ ఆయాస పడుతూ చెప్తున్న తన స్టూడెంట్ గౌతమ్ మాటలు విని శిలలా నిలబడి పోయాడు హారీష్.

రూప హారీష్ దగ్గర రిసెర్చి స్కాలర్‌గా చేరి రెండు నెలలే అయింది. మంచి చురుకైన పిల్ల, తెలివైన పిల్ల అని వచ్చిన కొద్ది రోజుల్లోనే తెల్సుకున్నాడు. అలాంటి రూపకి ఏక్సిడెంటయిందంటే చాలా బాధపడుతున్నాడు.

హారీష్ గౌతమ్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్ళి రూప శవాన్ని మాత్రమే చూడగలిగాడు.

రూప పుట్టిన ఏడాదిలోగా తండ్రిపోయాడని దిక్కులేని తల్లి ఈ బిడ్డని కళ్ళల్లో పెట్టుకుని పెంచి, చదువుచెప్పించి ఆమెమీదే పుట్టెడాశలు పెట్టుకుని బ్రతుకుతుందని తెలియగానే హారీష్ మనసు మరీ బాధతో గిలగిల్లాడింది.

అంత్యక్రియలయ్యాక స్మశానం నుంచి రూప తల్లి దగ్గరికి వెళ్ళాడు హారీష్. గదిలో గోల పెడుతోంది రూప తల్లి. బైట వరండాలోనే అలా కూర్చుండిపోయాడు హారీష్. ఇంతవరకూ ఎన్నడూ రూప తల్లిని చూడలేదు. ఈ విధంగా రావలసి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు డాక్టర్ హారీష్, ఆమెనెలా పలకరించాలో, ఏమని పరిచయం చేసుకోవాలో తెలిటంలేదు. వచ్చిన వాళ్ళొక్కళొక్కళ్ళే వెళ్ళి పోతున్నారు.

నెమ్మదిగాలేచి గదిలో కెళ్ళాడు హారీష్, గోడకి తల కొట్టుకొని ఏడుస్తోందామె. "రూపా! తల్లీ!! నన్నెలా వదిలేసి వెళ్ళిపోయావు తల్లీ! నీ దిక్కుమాలిన తల్లి నీమీదేన్నాశలు పెట్టుకుందో మర్చిపోయావా తల్లీ! నేనెలా బ్రతుకుతాను తల్లీ! ఎవరికోసం యింక బ్రతకాలమ్మా! దేముడా! నన్నైనా తీసుకెళ్ళిపోలేకపోయావా? నన్నునాధని చేసి నాబిడ్డని తీసుకెళ్ళిపోయావా?" అంటూ పిచ్చిదానిలా రోదిస్తున్న ఆ మాతృమూర్తిని చూసి హారీష్ హృదయం ద్రవించి పోయింది.

"మీ ఇల్లు అచ్చం జూలా ఉందోయ్" అన్నాడు రామం ఇంటికొచ్చిన సుందరం.
"అవునవును... అప్పుడప్పుడు క్రొత్త జంతువులు కూడా వచ్చిపోతుంటాయ్".

"మరుపు"
"ఏమయ్యా నా బాకీ సంగతి మరచిపోయావా"
"ఇంకా లేదండీ"
–కె.వి.మధుసూదనరావు.

వయసు ముప్పైఅయిదు దాటి వుంటాయి. "చిన్న వయసులోనే కష్టాల మూటని మోస్తున్నట్లుంది పాపం" అనుకున్నాడు మనసులో.

"చూడండి! అలా ఎంతసేపు బాధపడతారు చెప్పండి ! ఇది ఒకరు తీర్చలేని లోటు. మీకు మీరే ధైర్యం తెచ్చుకోవాలి!" అన్న హారీష్ మాటలకి ఆయన వైపుకి తిరిగింది రూప తల్లి. గది గుమ్మం వద్ద నిలబడ్డ హారీష్, అంత దుంఖంలో వున్న రూప తల్లి ఒకరి నొకరు చూసుకుని "మీరా!" అంటే "నువ్వా?" అనుకున్నారు ఆశ్చర్యంతో.

అవును నేనే హారిని, నీ స్కూల్‌మేట్‌ని, రూప గైడ్‌ని అన్నాడు తమాయించుకుంటూ

* * *

రూపపోయి అప్పుడే నెల దాటింది. ఏదో పోగొట్టుకున్నవాడిలా హారీష్ బాధపడసాగాడు. రోజూ లాబ్‌నుంచి రూప తల్లిదగ్గరకెళ్ళి చూసి వచ్చేవాడు. ఆమె దుఃఖాన్ని చూడలేని హారీష్ "ఎప్పటికైనా ఈమె తేరుకుంటుందా?" అనుకునేవాడు. ఏదో వేదన అతన్నికూడా దహించి వేసేది. ఆఖరికోనిశ్చయానికొచ్చిన వాడిలా బయలు దేర్గాడు రూపతల్లి దగ్గరికి.

"అనూ నన్ను క్షమించమని అడగటానికి యిది సమయం కాదు. అయినా అడుగుతున్నాను. క్షమించవూ?" అంటూ అనూరాధ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు హారీష్.

ఇద్దరి ఆలోచలనూ కొన్నేళ్ళు వెనక్కి ఒక్కసారిగా పరిగెత్తాయి.

అది పట్నం కాదు, పల్లేకాదు. చిన్న టౌను. హరి ఏడవ తరగతి చదువుతున్నాడు. అనూరాధ ఆరవతరగతి చదువుతోంది. పదేళ్ళు నిండని అనూరాధ చందనపు బొమ్మలాగుండేది. స్కూల్లో హరి, అనూరాధలు ఎంతో స్నేహంగా కలిసి, మెలిసి తిరిగి కబుర్లు చెప్పుకునేవారు. హరి, అనూరాధలు చదువులో చాలా చురుకైన వాళ్ళు. హరి తరువాత ముగ్గురు ఆడపిల్లలే కావడంతో హరిని తల్లితండ్రులు ఎంతో అపురూపంగా చూసుకునేవారు. ఆ ముద్దుతో ఇంట్లో అతను ఆడింది ఆట పాడింది పాట అయ్యేది. హరి స్నేహితులి విషయం కనిపెట్టి, అతని చేత ఆ ఇంటి నుంచి తమకి కావలసిన డబ్బు, సామాన్లు తెప్పించుకునేవారు. ఆడబ్బుతో సినిమాలకీ, హొటళ్ళకీ తిరగడం ప్రారంభించారు. అలా ఆ స్నేహితుల సహవాసంలో పడి చదువులో వెనక పడసాగాడు. రానురాను వచ్చిన ప్రతీసినిమా చూసి అందులోలా తనూ పెద్ద హీరో అయి పోవాలని అనుకునేవాడు. చవకబారు సినీమాల మహాత్యం అతని మీద బాగా పని చేయసాగింది. క్లాసులు ఎగ్గొట్టి స్నేహితుల్ని చుట్టూ చేర్చుకుని సినిమాలో హీరోని అనుకరించి వాళ్లు తనని మెచ్చుకుంటూంటే తనో పెద్ద హీరో అయిపోయినట్లు భావించేవాడు. స్నేహితులంతా తనని పొగుడుతుంటే గర్వపడిపోయేవాడు. అది అంతటితో ఆగక ఒకరోజు 'హీరోకి పక్క హీరోయిన్ లేకపోతే ఎలా?' అనుకున్నాడు. వెంటనే అందాల భరిణ అనూరాధ గుర్తొచ్చింది. పన్నెండేళ్ళ హరికి ఆలోచన తక్కువ. మంచి, చెడూ తెలియని వయసు. సినిమాలో హీరో పక్కన హీరోయిన్ ఎలా ఎగిరింది. ఎలా పాట పాడింది మాత్రం గుర్తుంది. తల్లి తండ్రుల ప్రేమ తప్ప ఎరగని పసివయసు. హీరో పక్కన హీరోయిన్ లేకపోతే బాగుండదన్న ఆలోచన రాగానే తను హీరో, అనూరాధ హీరోయిన్ అని తనే నిశ్చయించేసుకున్నాడు. ఆ మర్నాటి నుంచీ స్కూల్లో అందరికీ ఆ విషయం చెప్పేడు. పైగా 'నిన్న నాకో కల వచ్చింది రామూర్తీ! అనూరాధని నేను లవ్ చేస్తున్నట్లుకాలవ గట్టుని కూర్చుని తన వడిలో నాతల పెట్టుకుని పాటపాడుతున్నట్లు అని గర్వంగా చెప్పేవాడు. ఆ మర్నాడు మరో స్నేహితుడి ధగ్గరకెళ్ళి 'ఫలానా సినీమాలోలాగ నేనూ నా హీరోయిన్ అనూని పెళ్ళి చేసుకున్నానురోయ్! కన్నీ!" అని

చెప్పేవాడు. ఆ మర్నాడు మరొకడితో అనూరాధ నాన్న నాకు అనూనిచ్చి పెళ్ళి చెయ్యనన్నాడని నేనూ అనూ ఆత్మహత్య చేసుకున్నట్లు కలొచ్చిందోయ్!" అనేవాడు. ఇలా రోజుకో కలనల్లి స్నేహితులందరితో చెప్పి హీరో పోజు పెట్టేవాడు.

ఈ విషయం తెలిసిన కొందరు పిల్లలు హరిని చూడగానే "అనూరాధ! నీ మొగుడొస్తున్నాడే! నీ హీరోగారే!" అని ఏడిపించేవారు. అతను చెప్పే కలల్ని ఆమెకి చెప్పి ఉడికించేవారు. అంతవరకూ హరితో చనువుగా తిరిగి కబుర్లు చెప్పే అనూరాధ పిల్లల వేళాకోళాలతో అతనితో మాట్లాడటం మానేసింది.

ఈ విషయం అలా వెళ్ళి, వెళ్ళి క్లాసు మేష్టార్ల దగ్గరికి, ఆ తరువాత హెడ్ మేష్టారికి కూడా తెలిసి పోయింది. వెంటనే తనరూంకి రమ్మని హరికి కబురంపారు హెడ్ మాష్టారు.


అమాయకంగా హెడ్ మాష్టారి గదిలోకొచ్చిన హరిని చింత బరికల్లాంటి బెత్తాలతో స్వాగతం పలికారు హెడ్‌మాష్టారు.


"వేలెడంత లేవు వెధవ! వెలగ బెడుతున్నది ఏడోక్లాసు! నీ బతుక్కి ప్రేమ, పెళ్ళి, లొవ్వూ, గివ్వూట్రా రాస్కెల్!" అంటూ చితక బాది, "ఇంకెప్పుడూ ఇలాంటి వెర్రి వేషాలె య్యొద్దని" చెప్పి ఇంటికి పంపారు.

ఆ దెబ్బలకి భయపడిపోయిన హరి వారం పదిరోజులు జ్వరంతో బాధపడి మళ్ళి స్కూలుకొచ్చాడు. కాని అనూరాధ కనపడలేదు. ఎవరినడగాలన్నా భయం. మేష్టారికి తెలిస్తే మళ్ళి కొడతారన్న భీతి. కొన్నాళ్ళకి తెలిసిందేమంటే తోటి విద్యార్థినుల వేళాకోళాలని భరించలేని ఆ పసి హృదయం చదువు మానేసి, ఇంట్లో కూర్చుందని. ఇంట్లో వాళ్ళు ఎంత బ్రతిమాలినా స్కూలుకెళ్ళనంటోందని తెలిసిన హరి మనసు ఆవేదనకి లోనయింది. హరి స్కూల్లో ఎవ్వరితో కలవలేకపోయేవాడు. ఇదివరకటి చురుకుతనం లేదు. ఆసంఘటన తరువాత అతనిలో ఒకరకమైన స్తబ్ధత ఆవరించింది. ఓ మూల బెంచీ మీద కూర్చుని పాఠాలు విని ఇంటికొచ్చేవాడు.

విషయమంతా తెలుకున్న హరి తల్లి తండ్రులు అతన్ని తీసుకెళ్ళి వేరేవూళ్ళో చేర్పించి హాస్టల్‌లో పెట్టి వచ్చారు.

వయసు పెరుగుతోంది. పై క్లాసులకి వెళ్తున్న హరికి మాత్రం ఆనాటి సంఘటన మరుగున పడటంలేదు. హరి మనసు నిత్యం బాధపడేది ఒక్క విషయానికే – చదువులో ఎంతో చురుకైన అనూరాధ తనవంచి చదువు మానేసి వెళ్ళిపోయిందన్నది. ఆ నాడు తనకి ప్రేమంటే ఏమిటో తెలీదు. కానీ చవకబారు సినిమాల ప్రభావం ఎంత దారుణమైన పనికి దారితీసింది!! నిజానికి తను





అనూరాధని ప్రేమించాడా! ప్రేమంటే ఏమిటో తెల్సా? అవన్నీ యిప్పుడు ప్రశ్నించుకుంటే ఎంత తెలివి తక్కువ వాగుడు వాగాడో తెలుస్తోంది. ఎంత అనాలోచితంగా, పిచ్చివాడిలా మాట్లాడాడో యిప్పుడు అర్థమవుతోంది. సినిమాల్లో చూసొచ్చినట్లు చెయ్యాలనుకునేవాడు. అందరూ మెచ్చుకుంటోంటే అందులో డైలాగులు వల్లించేవాడంతే!! కానీ దాని పర్యవసానం ఓ పసి హృదయంమీద దెబ్బతీసి, ఆమె భవిష్యత్ నాశనం చేస్తుందని ఊహించలేదు. ఇప్పుడది ప్రతీక్షణం తన్ని దహించివేస్తోంది. అనూరాధ ఒక్కసారి కనిపిస్తే బాగుండును. ఆనాటి కుర్ర చేష్టలకి క్షమార్పణ అడగాలని వుంది" అనుకునేవాడు. కానీ ఎక్కడుందో?

తను శలవలకి వెళ్ళినపుడు తెలిసిందేమిటంటే ఆ వూరి నుంచే వాళ్ళ కుటుంబం వెళ్ళిపోయిందని .

అనూరాధ తన్నెంత అసహ్యించుకుంటోందో! నావంచి చదువు మానేసింది. ఆ పాపం ఎవరికి? నాకే! నాకే!!

ఆ సంఘటనతోటే హరిలో ఎంతో మార్పు వచ్చేసింది. ఆనాటిలగాయితూ ఏ స్త్రీవైపూ తలెత్తి చూసేవాడు కాదు. ఆడవాళ్ళంటే ఒకరకమైన భీతి. తల్లి, చెల్లెళ్ళతో తప్ప పరాయి స్త్రీలతో మాట్లాడేవాడుకాదు. అనూకి చేసిన అన్యాయానికి అనుభవించవలసిన శిక్షగా తనూ బ్రహ్మచారిగా వుండిపోయాడు. ఒకరకమైన వైరాగ్యం, తనమీద తనకే అసహ్యంతో యిలా శిక్షించుకోసాగాడు. పెళ్ళి చేసుకోమని ఎందరు చెప్పినా తనలో పెళ్ళి చేసుకోవాలన్న కోరిక కలిగేదికాదు. అనూరాధ గుర్తొచ్చి మనసు వికలమై పోయేది. పెళ్ళి చేసుకోకపోవడానికి కారణం ఎవ్వరడిగినా చెప్పలేదింతవరకు, కడుపులో వున్న అగ్ని గుండాన్ని చల్లార్చుకునే మార్గంలేక తనలో తనే కుమిలిపోసాగాడు.

డాక్టరేట్ వచ్చింది. మంచి పదవినలంకరించాడు. ఏలోటూలేదు. అయినా జీవిత మంతా తీరని లోటే-!!

మళ్లీ కొన్నాళ్ళకి ఈ విధంగా విధవగా, ఉన్న ఒక్క కూతుర్ని పోగొట్టుకున్న కడుపుకోతతో రోదిస్తున్న తరుణంలో అనూరాధని కలిసాడు.

జీవితం చాలా చిత్రమైనది. పదకొండేళ్ళ వయసప్పుడు విడిపోయిన స్నేహితులు యిన్నేళ్ళకి, ఈ విధంగా కలియడం విచిత్రమే!

అనూకి జరిగిందంతా చెప్పాడు. రెండు చేతులూ పట్టుకుని క్షమించమని బ్రతిమిలాడాడు. జవాబుగా అనూరాధ తలదించుకుంది.

ఆనాడు స్నేహితులంతా ఏడిపించి వుండకపోయివుంటే రాను, రాను హరియందు తనకి ఆకర్షణ పెరిగి వుండేదేమో! అప్పుడు ఆ స్నేహం

ఎలాగుండేదో!!" అనిపించిందామెకి. "కానీ పైకి అనే ధైర్యం యిప్పుడు లేదు. ఆనాడు స్నేహితులకి భయపడింది. ఈనాడు సమాజానికి భయపడ్డాలి" అనుకుంది.

'అనూ నేను ఏకాకిని, నువ్వూ ఏకాకివి మనిద్దరం ఒకరికొకరున్నాము. ఇప్పుడు ఏ ఒక్కరికీ భయపడను. నా అండ నీకెప్పుడూ వుంటుంది. ఇది సినిమాల్లోలాంటి ప్రేమ, డైలాగులూ కావు. జీవితం విలువ తెలిసి అడుగుతున్న మాటలు. నీ రూపని నీకు తెచ్చివ్వలేను కానీ నీకు తోడుగా వుండి, నీ బాధ్యతని వహిస్తాను. నీకు నేనున్నాను కాదనకు అనూ! కాదనకు!! ఆ రోజులు మర్చిపో - ఆనాడు చేసిన తప్పుకు జీవితాంతం నాకు శిక్ష విధించకు. నా పశ్చాత్తాపానికి విముక్తి కలిగించు అనూ!" అంటు ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు డాక్టర్ హరీష్

* * *

సింహానికి కోపం వచ్చింది



సింహాన్ని జైల్లో పెట్టారు.

ఈ వార్త నన్ను ఆందోళనకు గురి చేసింది.

సింహం అంటే అడవిలో తిరిగేది కాదు. నరసింహాన్ని మేమంతా సింహం అని పిలుస్తాం. ఆ పోలిక అంతవరకే. అంతకుమించి 'సింహం'లో సింహం లక్షణాలు లేవు. అతన్తో నా పరిచయం ఈ నడుమే అయినా మేం మంచి స్నేహితులం అయ్యాం.

ముఖ్యంగా సింహం నా భవిష్యత్ పట్ల ఎంతో ఆశాభావం ప్రకటిస్తాడు. నేను కథలూ, కవిత్వం రాస్తుంటాను. ఇప్పుడిప్పుడే పత్రికల్లో వస్తున్నాయి. మా పరిచయం కూడా వాటి ద్వారానే

సింహానికి డ్రైక్లీనింగ్ షాప్ ఉంది. అది బాగా నడుస్తుందా అంటే సందేహమే. దాని మీద వచ్చే ఆదాయం ఆ కుటుంబానికి బొటాబొటిగా సరిపోతుందనుకుంటాను.

సింహానికి ఎన్నో బాధ్యతలున్నాయి. తనకు ముగ్గురుచెల్లెళ్ళు, ఓ తమ్ముడు ఉన్నారు. వారందరినీ చదివిస్తున్నాడు. ఇంతమందిని భరించటం ఆ షాపువల్లకావటం లేదు. అయినా ఎలానో నెట్టుకొస్తున్నాడు. ఇది అతని జీవితానికి చెందింది..

సింహం మానసిక ప్రపంచం విషయానికొస్తే అదెంతో భిన్నమైంది. అతను చదవని పుస్తకం అంటూలేదు. ఆధునికంగా వచ్చే నవలల నుండి వివిధ తత్వ వేత్తల రచనల వరకూ చదివాడు. చదవటం కాదు వాటిని కొని ఓ లైబ్రరీ తయారు చేశాడు. తనే నాకు ఒక్కో రచయిత రచనలు ఇచ్చి చదివిస్తున్నాడు నా కథల మీద తన అభిప్రాయం చెబుతాడు. అతనే కాదు సింహం చెల్లెళ్ళంతా తమ భావాలు చెబుతారు.

సింహం యువకుడు. ఇంకా పెళ్ళికాలేదు. తన పెళ్ళి గురించి ఎప్పుడూ ఆలోచించడనుకుంటాను. అతనికి పెళ్ళి కావలసిన ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఓ రకంగా సింహం వారందరికీ తండ్రిలాంటివాడు. తను ఆ కుటుంబం కోసం పదో తరగతితో చదువు మానేసి ఈ షాపు తెరిచాడు. అక్కడ కూర్చుని మిత్రుల్తో సంభాషణలు జరుపుతూ, నవ్వుతూ కాలం గడుపుతుంటాడు. అలాంటి సింహం....

ఎవరినో చంపాలని చూశాడనే నేరం మీద జైల్లో ఉన్నాడు!

ఓ సారినేనడిగాను

"సింహం నీకెప్పుడైనా కోపం వస్తుందా?


తిరిగి అదే చిరునవ్వు

"కోపం ప్రతి మనిషికీ వస్తుంది సార్. నేనూ మనిషినే.

అయితే ఎప్పుడూ కోపం తెచ్చుకోవటం అనేది ఓ వ్యసనంలాంటిది. ప్రపంచంలో జరిగే ప్రతి అరాచకం వెనక, పోనీ దారుణం అని దిగ్భ్రాంతి చెందే విషయం వెనకా కోపమే ఉంది. అది జయించగలిగిన నాడు మనం మహాత్ములమౌతాం. అయినా పేదవాడి కోపం పెదవికి చేటు కదా. నేనెవరి మీద కోపం తెచ్చుకోవాలి చెప్పండి. ఇంతమందిని కనేసి పోయిన నాన్నమీదా? మంచంలో పడుకొని మృత్యువు కోసం ఎదురుచూసే అమ్మమీదా? నా గుండెల మీద ఆడుకున్న చెల్లెళ్ళ మీదా? వాళ్ళు నన్ను ఇది కావాలని అడగరు. ఒక్కోసారి మేం చదువులు మానేస్తాం అంటారు. ఏదో పని చేస్తాం అంటారు. నేనున్నది ఎందుకు చెప్పండి? ఈ ఆదాయం చాలటం లేదంటారా, ఎలానో సర్దుకుంటాం. వాళ్ళంతా చదువుకోవాలి. అంతగా అయితే నలుగురు పిల్లలకి ట్యూషన్ చెప్పుకుంటారు. మనం పెళ్ళి చేయలేకపోవచ్చుగానీ బతకడానికి తగ్గ ప్రేరణ ఇవ్వక పోవటం న్యాయం కాదు" అన్నాడు.

అంతేకాదు. తను చదివిన సాహిత్యం నుండి కోపం తెచ్చిన విష ఫలితాల్ని గురించి ఎన్నో విషయాలు . నాకనిపించింది సింహం కోపాన్ని అధిగమిస్తున్నాడు. ఈ వయసులోనే, ఇప్పటికే అతను ఎంతో ఎదిగిపోయాడు. అతనికి అడుగడుగునా బాధలున్నాయి. అయినా ఎప్పుడేనా కృంగిపోయాడా? లేదు. ఎవరెవరో నవ్వుతూనే రకరకాల విసుర్లు విసురుతున్నా అదే చిరునవ్వు.

పి. చంద్రశేఖర్ ఆజాద్



నాకు తెలిసినంత వరకూ దరిద్రం ఆగ్రహం తెప్పిస్తుంది. ఓ రకమైన ప్రశాంతత కనీస జీవిత మున్నప్పుడే సాధ్యమౌతుంది. దరిద్రం అనుభవిస్తూ కూడా ప్రశాంతంగా ఉండగలగటం అరుదైన విషయం.

అందుకే సింహం అరుదైన వ్యక్తి.

సింహాన్ని నిశితంగా పరిశీలించినప్పుడే. అతని ప్రశాంతతకు కారణమేమిటి? అతను చదివే పుస్తకాలేనా? కావచ్చు! పూర్తిగా పుస్తకాలు మాత్రం కాదు. వాటి ప్రభావం ఓ మేరకుంటుంది. అయితేమరేమిటి? సింహం వెనకాల ఎవరైనా అజ్ఞాన యువతి ఉందా అని నా పరిశోధన. అలాంటిదేం లేదు. ఇచ్చితంగా చెప్పాలంటే ఈ విషయంలో తను నాకు ఏ విధమైన క్లూ కూడా ఇవ్వలేదు. అతను డైరీ రాస్తాడని నాకు తెలుసు. కేవలం ఆ డైరీలోనే తన అనుభూతుల గురించి రాసుకోవచ్చు. మరింకేమిటి కారణం?

నేననుకోవటం సింహం చెల్లెళ్ళు!

వాళ్ళు అతన్ని ఎంతగానో ప్రేమిస్తారు. ఈ ప్రపంచంలో వారికి 'అన్న'ను మించింది మరొకటి లేదు. నేను వారితో కూడా కొన్నిసార్లు మాట్లాడాను. నేను చాలామంది అన్నాచెల్లెళ్ళను చూశాను. వారి సంబంధాలు ప్రేమపూర్వకం కాదని నేననను. కానీ వాటిలో నాకు కావలసింది కనపడదు. వారంతా చక్కటి అన్నా చెల్లెళ్ళలా నటిస్తున్నారనిపిస్తుంది. ఏమైనా అలా ఉండటం కూడా గొప్ప విషయమే.

నేను చూసిన మరి కొందరు కేవలం ఆర్థిక పరిధిని మించి ఎదగనివారు. సింహం తన చెల్లెళ్ళకు ఓ మంచి స్నేహితుడు వాళ్ళూ అంతే. వారంతా నాలుగు రోజులు వస్తుండటాన్ని, ఓ వెన్నెల రాత్రిని, పూల తోటల పెంపకాన్ని, ఓ మంచి రచన్ని చదవటాన్ని ఎంత హాయిగా అనుభవించగలరో గమనించాక కొద్దిపాటి అసూయ కూడా కలిగింది. ఏదో రోజు తనను విడిచి వెళ్తారని ఆ అన్నయ్యకు తెలుసు. అసలది ఓ రకంగా తన కర్తవ్యంలో చిట్ట చివరి అంశం కూడా. అయినా వారెవరూ ఈ విషయం గురించి ఆలోచిస్తున్నట్లుండరు.

ఇదీ సింహం కుటుంబ పరిస్థితి. మరి గోవులాంటి సింహం, మనిషికి కోపం ఓ వ్యసనమనే సింహం, పేదవాడి కోపం పెదవికి చేటనే సింహం ఓ వ్యక్తిని చంపాలన్నంతగా ఎందుకు ఉద్రేకపడ్డాడు? మహాత్ముడిలాంటి సింహంలోని దానవత్వాన్ని రెచ్చగొట్టిందెవరు?

నాకు ఈ వివరాలు లభించలేదు. అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. ముందు సింహాన్ని బయటకు తీసుకురావాలి. నేను సింహం మరో మిత్రుడ్ని కలిసాను. అతను చెప్పిన మాటల్నిబట్టి సింహం ఈ నడుమ తన పెద్ద చెల్లి పెళ్ళి విషయంలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడట.

ఓ కుర్రాడు దొరకాడనీ, అతను గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడనీ, ఉద్యోగం ఇప్పించినా, లేదా ఓ పదివేలు కట్నం ఇచ్చినా సింహం చెల్లెల్ని పెళ్ళి చేసుకునే అవకాశాలున్నాయి. ఉద్యోగం ఇప్పించటం అనేది సింహం కలలో కూడా ఊహించని విషయం. ఈ పదివేలు కాక ఖర్చులకి మరో అయిదు వేలు అవసరమౌతాయి కాబట్టి ఎవరి దగ్గరైనా అప్పు చేయాలనుకుంటున్నాడని అతను తెలియ చేశాడు.

ఈలోపు ఇది జరిగిపోయింది.

నేను పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను.

కటకటాల నడుమ యోగిలా ఉన్నాడు సింహం.

నన్ను చూడగానే తిరిగి అదే చిరునవ్వు!

నేను తిరిగి అతని ప్రశాంతతకు ఆశ్చర్యపోయాను.

నిజమేనా? సింహం ఎవరి మీదనైనా దాడి చేయటం నిజమేనా? ఏ నేరమూ ఎరగని ఈ యువకుడ్ని తెచ్చి ఇక్కడ పడేయలేదు కదా!

అక్కడ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్నాక సింహాన్ని మా ఇంటికే తీసుకెళ్ళాను.

నా శ్రీమతి ఇచ్చిన కాఫీ తాగాక మేడ మీదకెళ్ళాం.

సింహంతోపాటు నేనూ సిగరెట్ వెలిగించాను.

"ఇప్పుడు చెప్పు సింహం". అన్నాను

"ఏం చెప్పమంటావ్ బాస్". అన్నాడు నవ్వుతూ.

ఆ కళ్ళలో ఎక్కడో తడి మెరిసింది. నవ్వుతున్నా ఆ వదనంలో ఎక్కడో ఓ విషాద రేఖ ఉన్నట్లే నాకనిపించింది.

"ఎందుకిలా జరిగింది?" అన్నాను.

"నేనూ మనిషినే." అని ఆగాడు..... నవ్వుతూ అన్నాడు వెంటనే

"ఓ సారి నన్నడిగావ్ గుర్తుందా బాస్ నీకు కోపం వస్తుందా అని! చూశారుగా నాకు కోపం వస్తే భైర్వ్యా ఉరికొయ్యలే."

"ఇంతకూ ఎందుకంతగా ఆవేశపడింది?" సింహం కొంచెంసేపు మౌనంగా ఉన్నాడు.

"నీ వ్యక్తిగతమైన విషయమైతే మనం వదిలేద్దాం. మరో విషయం గురించి మాట్లాడుకుందాం." అన్నాను.

"ఇది నా వ్యక్తిగత విషయమే. అయితే మీకు చెప్పటానికి అభ్యంతరకరమైనదికాదు."

"అసలు నువ్వు ఎవరి మీదో తిరగబడ్డావంటే నేను నమ్మటం లేదు." అన్నాను సింహం నిశ్శబ్దంగా నవ్వాడు.

"నిజమే. నేను తిరగబడ్డాను. ఆ క్షణంలో వాడ్ని చంపేద్దామనుకున్నాను. నా దగ్గర ఎలాంటి ఆయుధం లేదు. అందుకే ఈ రెండు చేతుల్తోవాడి తల పుచ్చుకొని గోడకి కొట్టాను. తల పగిలి రక్తం కారుతుంటే వెర్రి కేకలు వేశాడు." సింహంలో తిరిగి



ఉద్రేకం.

"ఏమిటంత ఆవేశపడుతున్నావ్. ఇప్పుడు వెళ్ళి హత్య చేస్తావా ఏమిటి? నీకు నేను బెయిల్ ఇచ్చానయ్యా స్వామి." అన్నాను.

"డోంట్ వర్రీ బాస్.... అదో బలహీనమైన క్షణం. అంతే." అన్నాడు.

"నాకు కొన్ని అనుమానాలున్నాయి సింహం. వాటిని తీర్చాలి నువ్వు." అన్నాను.

"అడుగు బాస్."

"నువ్వు కోపాన్ని జయించావనుకున్నాను. నా అంచనా పొరపాటు కావచ్చు. నీ ఉద్రేకానికి అతను బలయివుంటే నువ్వో హంతకుడివిగా మిగిలేవాడివి కదా."

"సహజంగా."

"నీకు ఉరి శిక్షా, యావజ్జీవమా అనేది కాదు ఇక్కడి సమస్య. నువ్వు లేకపోతే నీ కుటుంబం ఏమైపోయేది? వాడ్ని గోడకేసి బాదుతున్నప్పుడు ఈ ఆలోచన వచ్చిందా?"

"చూడు బాస్. ఉద్రేకం మనిషిని పశువును చేస్తుంది. ఆ క్షణంలో ఏదీ గుర్తుకురాదు. గుర్తువస్తే అలాంటి పని చెయ్యలేం కూడా. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. మా నాన్న జీవితంలో ఓడిపోయినా ఆ బాధ్యత నేను తీసుకున్నాను. నేను లేకపోయినా ఆ కుటుంబంలో ఎవరో ఒకరు తీసుకుంటారు.


అసలిది ఎందుకు జరిగింది..... వాడు నన్ను ప్రతి క్షణం పరిహసించాడు బాస్.... అయినా నవ్వుతూ భరించాను. నా దరిద్రాన్ని, నా బాధల్ని, నా అసహాయతను ఎన్నిరకాలుగా హేళన చేశాడో....అవన్నీ మీకు ఏదో రోజు చెబుతాను. మీరో పెద్ద నవల రాయొచ్చు ఈ జీవితంలో. నేను చంపబోయిన వ్యక్తిలో దుర్గుణం ఏమిటో తెలుసా బాస్... వాడిది నోరు కాదు. దానికి అడ్డూ, అదుపులేదు. నోటి దురద కూడా ఓ వ్యసనమే. ఏ వ్యసనమైనా అది ఆ వ్యక్తినే బలి తీసుకోదు మరి కొందరిని బలి తీసుకొని గాని వదలదు. నేను అంతవరకే చెప్పదలుచుకున్నాను." అని ఆగాడు.

నేను సింహాన్ని ఆ విషయం గురించి వత్తిడి చేయదలుచుకోలేదు.

"నీ సిస్టర్‌కి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నావట కదా?" అన్నాను. సింహం కళ్ళలో ఓ నీటి పొర.

"అవును బాస్. మనిషికి పెళ్ళి కూడా ఓ అవసరమేకదా.... అప్పటికీ తనేమందో తెలుసా..... నా పెళ్ళికోసం బాధపడొద్దు. నాకు పెళ్ళి కాకపోయినా బాధలేదు. నిన్ను గౌరవించే ఏ కూలివాడ్ని చేసుకోమన్నా నా కిష్టమే అంది." సింహం కంఠం బొంగురుపోయింది. ఆ ఉద్వేగం తట్టుకోలేక కర్చీఫ్ ముఖానికడ్డంగా పెట్టుకున్నాడు.

"వాడు మా జీవితాల్ని నాశనం చేశాడు. మమ్మల్ని రోడ్ల మీదకీడ్చాడు. మా



అభిమానాన్ని ప్రతి క్షణం తన మాటల్తో గాయపరిచాడు. అవీ భరించాను. నేను నా గౌరవాన్ని చంపుకొని నా చెల్లి పెళ్ళి కోసం డబ్బును అప్పుగా ఇవ్వమని అడిగితే ఏమన్నాడో తెలుసా బాస్.....

"ఎందుకురా అంత తొందరపడుతున్నావ్? ఏ దాని క్యారెక్టర్ మంచిది కాదా?"

ఆ మాటలే బాస్ వాడన్నది... ఈ ప్రపంచంలో అందరూ అందుకే తమ బిడ్డల పెళ్ళిళ్ళ కోసం ఆరాటపడుతున్నారా? ఈ ప్రపంచంలో నాకుంది వాళ్ళే బాస్. నేను చేసింది మంచా, చెడా అనేది నేను చెప్పలేను. కానీ వాడిలాంటి వారున్నంత కాలం నాలాంటి వారూ ఉంటారు." అన్నాడు.

చాలాసేపు మా ఇద్దరి నడుమా నిశ్శబ్దం. సింహం వెళ్ళేముందు అడిగాను-

"ఇంతకూ ఎవరా వ్యక్తి?"

"మా మేనమామ బాస్." అన్నాడు నిశ్శబ్దంగా నవ్వుతూ!

• • •

"సంబరం"

"ఏంటి? ఇంత సంతోషంగా ఉన్నారు. మీ నెక్లెస్ దొరికిందా?" అడిగింది వర్మ.
"కాదు. ఎదురింటి సావిత్రి నెక్లెస్ కూడా పోయిందని" సంబరంగా చెప్పింది రాణి.

"నొప్పి"

ఇంతకూ మీరిచ్చిన టాబ్లెట్లు తలనొప్పికా? లేక కడుపు నొప్పికా?" అనుమానంగా అడిగాడు శ్రీను.
"ఇవ్వాళేసుకుని ఏ నొప్పి తగ్గిందో నాకొచ్చి చెప్పు" చిరాగ్గా అన్నాడు డాక్టర్ శంకర్రావు.


ఇస్తా!!

"ఆ రమేష్ తనతో ఓ సంవత్సరం తిరిగితే కారు ఇస్తానన్నాడు" శ్రీనుతో అంది వర్మ.
"ఓ... అంతేనా? నాతో ఓ సంవత్సరం తిరుగు. ఓ బుల్లిబాబునిస్తా" గొప్పగా అన్నాడు శ్రీను.

వెతుక్కుతున్నా!

"పారిపోయిన భార్య' అనే నవలను ప్రాసింది మీరేనా?" అడిగాడు ఓ పాఠకుడు.
"అవును" అన్నాడు రచయిత.
"ఇప్పుడేం చేస్తున్నారు మరి?"
"పారిపోయిన నా భార్యను వెతుకుతున్నా" దీనంగా చెప్పాడు.

-వర్మశ్రీ ([illegible])



ఆఖరి దొంగతనం

ప్రతాప రవిశంకర్

రాత్రి ఏడు గంటలు కావస్తున్నప్పుడు అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు దుష్యంతరావు. ట్యూబ్‌లైట్ కాంతి గది నంతటినీ పరచుకున్నది. పైన ఫ్యాన్ గిర్రున తిరుగుతున్న చప్పుడు తప్పించి అంతా నిశ్శబ్దంగా వుంది.

"ఏం చేస్తున్నావ్ డియర్?" అన్నాడు అతను తలదువ్వటం ముగించి వెనక్కు తిరుగుతూ-

అతడి భార్య రాజేశ్వరి బెడ్‌మీద వెల్లకిలా పడుకుని ఏదో వార పత్రికను చదువుతోంది..

"కథ చదువుతున్నాను" అన్నది చదుదుతూనే-

"ఏం కథ?" దగ్గిరగా వస్తూ అడిగాడు.

"దొంగ కథ."

"యూజువల్ ....జాగ్రత్తగా మాట్లాడు."

ఉలిక్కిపడి చేతిలో పత్రికను వదిలేసింది రాజేశ్వరి..

దుష్యంతరావు మొహం ఇది వరకట్లా లేదు. కొంచెం సీరియస్‌గా వుంది..

"ఎందుకలా అరిచారు?" చిన్నగా అడిగింది..

"నా గురించే కదూ నువ్వు-దొంగ కథ-అన్నది." కోపంగా అడిగాడు అతను.

రాజేశ్వరి పెద్దగా నవ్వి "ఉహు..కాదు.." అంటూ పత్రికను తెరిచి అతడికి చూపించింది.

"సారీ రాజేశ్వరి" అన్నాడు దుష్యంతరావు పత్రికలో-దొంగ కథ-పేరు చూసి..

"ఈ కథ మనకథలాగేవుంది" అన్నది ఆమె.

"ఎలా?" భార్య పక్కనే కూర్చుంటూ అడిగాడు.

"ఉద్యోగం దొరక్క మీలాంటి ఓ యువకుడు అవసరానికి ఓ చిన్న దొంగతనం చేస్తాడు. అతడి అవసరం తీరుతుంది. ఆ తర్వాత మళ్లీ చేస్తాడు. మళ్లీ చేస్తాడు అవసరానికి తలవొంచి. చివరికి అదే ఉద్యోగంగా మారిపోతుంది.



అతను దొంగగా మారిపోతాడు. ఐతే అదృష్టం అతన్ని వదలకపోవటం వల్ల అతనెప్పుడూ పోలీసులకు దొరికిపోడు. కొన్నాళ్లకు అతనికి పోలీసు డిపార్టుమెంటులోనే ఉద్యోగం వస్తుంది. వెంటనే అతను ఇక దొంగతనాలు చెయ్యాల్సిన అవసరంలేదని ఆ పని మానేసి ఉద్యోగిగా కొత్త జీవితాన్ని మొదలు పెడతాడు. ఇదీ దొంగ కథ."

పెద్దగా నవ్వాడు దుష్యంతరావు."

"ఎందుకు నవ్వుతున్నారు?"

"దొంగకు పోలీసు డిపార్టుమెంట్‌లో ఉద్యోగం రావటమా?"

"ఎందుకు రాకూడదు? అతను దొంగని ఎవరికీ తెలీదు. చదువుకున్నవాడు, తెలివి వున్నవాడు. అందుకే అతడికి ఉద్యోగం వచ్చింది. నాకేమీ ఆశ్చర్యంగా అనిపించలేదు. కథ చాలా సహజంగా అనిపించింది." అన్నది రాజేశ్వరి.

"ఇంతకీ-దొంగ కథ-మనకథలాగా ఎలా వుంది?"

"ఆ కథలో యువకుడిలాగే మీరు కూడా-" ఆగిపోయింది రాజేశ్వరి.

"అవును రాజేశ్వరి.. నేనుకూడా దొంగనే.. చదువుకున్నవాడిని, ఉద్యోగం దొరక్క దొంగగా తయారయినవాడిని.... నాకూ బాధగానే వుంది." విచారంగా అన్నాడు దుష్యంతరావు..

"ఎన్నాళ్లీ దొంగబతుకు'? అన్నదామె భర్త కళ్లలోకి చూస్తూ.

"త్వరలోనే ఈ జీవితానికి చుక్క పెడదామనుకుంటున్నను. ఇప్పటిదాకా అదృష్టం మనవైపునే వున్నది. అందుకే ఇన్ని దొంగతనాలు చేసినా ఒక్కసారి కూడా ఎక్కడా దొరికిపోలేదు. కాని ఎప్పుడో ఓసారి ఈ అదృష్టం మొహం చాటు చేసినప్పుడు మనిద్దరి బతుకులూ కాలిపోయినట్టే........"

ఒక్క నిముషం రాజేశ్వరి ఏమీ మాట్లాడలేకపోయింది..

పెళ్లికి ముందు దుష్యంతరావు తనో దొంగ అనే నిజాన్ని నిజాయితీగా రాజేశ్వరితో చెప్పాడు. ఐతే ఏ పరిస్థితుల్లో తను దొంగ జీవితాన్ని మొదలు పెట్టాడో ఎంతో వివరంగా చెప్పాడు. కొద్ది రోజుల్లో ఆ జీవితానికి తెర దించబోతున్నట్టు కూడా చెప్పాడు. రాజేశ్వరి అతడి మాటలను నమ్మింది. అతడి మాటల్లోని నిజాయితీని విశ్వసించింది- అతడితో మూడుముళ్లు వేయించుకోటానికి తలవంచింది.

ఆమెకీ ఎవ్వరూలేరు. ఎవరో దూరపు బంధువులింట్లో పనిమనిషి హోదాలో పెరిగింది..

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?" అడిగాడు అతను-ఆమెను.

"మన పెళ్లయి ఏడాదికావ స్తోంది." ఇంకా మీరు దొంగతనాలు మానెయ్యలేదు."

ఆమె మీదకు వొంగి "రాజేశ్వరీ... ఇదే చివరి దొంగతనం... ఇప్పటికి దొంగతనాలు చేసి బాగనే సంపాదించాను. ఆ డబ్బుతో ఏదయిన బిజినెస్ చేస్తాను.. అప్పుడు మనం భయంలేని బతుకును ఆహ్వానించ వచ్చు..." అన్నాడు ఉత్సాహంగా..

"నిజంగా ఇవాళ మీరు చేసుకు వచ్చేది ఆఖరు దొంగతనమా?!" ఆశగా అడిగిందామె-

"అవును..ప్రామిస్" అన్నాడు దుష్యంతరావు.

"ఏమిటి పళ్లపొడా?" అన్నది రాజేశ్వరి నవ్వుతూ

"కాదు.. వాగ్దానం.. ఇవాల్టిదే ఆఖరి దొంగతనం.. నాలుగు రోజుల్నించీ ఇవాల్టి దొంగతనానికి ప్లాన్ చేశాను...

తప్పకుండా విజయలక్ష్మి ఎవరు? ఆమెనేనా మీరు చివరిసారిగా ధొంగతనం చేపి తీసుకువచ్చేది?" కళ్లను పెద్దవి చేస్తూ అడిగిందామె-

"యూ సిల్లీ" అంటూ భార్య బుగ్గ మీద చిటికవేశాడు దుష్యంతరావు.

"భోజనం చేద్దామా ఆకలవుతోంది." అన్నది బెడ్ మీదనించి దిగుతూ...

తలవూపాడతను నిల్చుంటూ...

రాజేశ్వరి వంట గదిలోకి వెళ్లింది-

అతను కిటికీ దగ్గరకు వెళ్లి బయటకు చూస్తూ నిల్చున్నాడు.

దుష్యంతరావును ఎవ్వరూ దొంగ అనుకోరు. అతను ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టుగా అందరినీ నమ్మిస్తున్నాడు. ఆఫీసుకు వెళ్లే ఉద్యోగిలాగే ఉదయం తొమ్మిది గంటలకు ఇంట్లో బయల్దేరుతాడు. సాయంత్రం ఆరున్నర కల్లా ఇంటికి వస్తాడు. సెలవు రోజుల్లో ఇంట్లోనే గడుపుతాడు. అప్పుడప్పుడు బయట నించి వస్తూ లోపల కాయితాల్లేని పైళ్లు ఇంటికి తీసుకు వస్తూవుంటాడు. దుష్యంతరావు గొప్ప నటుడు.


రాజేశ్వరి పిలిచింది.


అతను వెళ్లాడు.

ఇరవై నిముషాల తర్వాత ఇద్దరూ కిచెన్‌లోనించి బయటకు వచ్చారు.

అతను సిగరెట్టు ముట్టించాడు. ఆమె టేబుల్ మీద వున్న పేక అందుకున్నది.. రాత్రి పది గంటలవరకు ఇద్దరూ పేకాడుతూ కూర్చున్నారు.

పదిగంటలకు దుష్యంతరావు లేచి దొంగతనానికి బయల్దేరాడు. అవసరమైన పరికరాలన్నీ జేబుల్లో పెట్టుకుని రాజేశ్వరి





బుగ్గ మీద చిటిక వేసి "ఇదే ఆఖరి దొంగతనం" అన్నాడు.

"జాగ్రత్త" అన్నది..

"నువ్వు కూడా జాగ్రత్త.. ఎలర్టుగా వుండు. రాత్రి ఏ టైములో ఐనా వచ్చి తలుపుకొడతాను. మరీమొద్దు నిద్రపోకు... బై." అని బయటకు వెళ్లిపోయాడు.

గేటుదాటి అతను రోడ్డు మీదకు వెళ్లేవరకు అక్కడే నిలబడింది ఆమె. తర్వాత తలుపులవు మూసి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడింది..

రోడ్డు మీద ఎవ్వరూ తిరగటంలేదు. చలికాలం కావటంతో ఇళ్ల తలుపులు మూసి వున్నాయి. కొంచెం దూరంలో వున్న మెయిన్ రోడ్డుమీద మోటారు వాహనాలు తిరుగుతున్న చప్పుడు వినపడుతోంది..

ఆఖరి దొంగతనంలో ఎవరికీ దొరికి పోకుండా అతను రాగలడా? అదృష్టం ఇంకా తన భర్తను అంటిపెట్టుకునే వుందా?

కిటికీ దగ్గర్నించి కదిలి ఈ వూహాల్ని తట్టుకోలేక లైటార్పి బెడ్‌మీద పడుకుని కళ్లు మూసుకుంది రాజేశ్వరి... ఆమె కళ్ల ముందు ఇద్దరు పోలీసులు దుష్యంతరావును తుపాకులతో వెంటపడుతున్న దృశ్యం కనపడింది.

* * *

"రాజేశ్వరి" తలుపులమీద తట్టాడు దుష్యంతరావు. అప్పుడు రాత్రి రెండున్నర దాటుతోంది.

రాజేశ్వరి పలకలేదు.

అతను మళ్లీ పిలుస్తూ ఇంకొంచెం గట్టిగా తలుపునెట్టాడు.

తెరుచుకుంది...

ఆశ్చర్యంగా లోపలకు వచ్చి లైటు వెలుతుర్లో బెడ్‌మీద పడివున్న రాజేశ్వరిని చూసి మళ్లీ ఆశ్చర్యపోయాడు.

ఆమె కాళ్లు-చేతులు కట్టేసి వున్నాయి.

నోటికి టేప్ అతికించబడివుంది. కళ్లు తెరుచుకుని చూస్తోంది.

"ఏమిటి రాజేశ్వరీ? ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాడు అతను కట్లు వూడతీస్తి- టేపు పీకి.

ఒక్క నిమిషం ఆగి- "గంట క్రితం తలుపు మీద కొట్టిన చప్పుడయ్యింది. మీరే అనుకుని తెరిచాను. కాదు, ఎవరో యువకుడు మీలాగే వున్నాడు. ఎవరని అడిగితే దొంగనని చెప్పాడు. కత్తితో బెదిరించి కాళ్లు చేతులూ కట్టి నగలన్నీ లాక్కున్నాడు. ఇల్లంతా తిరిగాడు. డబ్బు తీసుకున్నాడు."

"నా గురించి చెప్పలేదా? ఇది కూడా ఓ దొంగ ఇల్లనీ దోచుకోవద్దనీ నువ్వు చెప్పలేదా?"

"చెప్పాను. దొంగల్లో నిజాయితీ ఏమిటి? దొరికింది దోచుకోవటమే దొంగ వని... అన్నాడతను... ఆశ్చర్యంమేమిటంటే అతనికి ఇది ఆఖరి దొంగతనం అని చెప్పాడు."

"ఏమిటీ! వాడిక్కూడా ఇది ఆఖరి దొంగతానమన్నాడా?!"

"అవును.. మీరు పెళ్లయిన తర్వాత దొంగతనం మానెయ్యాలనుకున్నారు, కాని అతను పెళ్లికి వుందే దొంగతనాలు మానెయ్యాలనుకున్నాడుట. అతనుకూడా నిరుద్యోగి.. అవసరాల కొద్దీ దొంగతనం మొదలుపెట్టి బాగానే సంపాదించాడట. అతను ఈ మధ్యనే కామేశ్వరి అనే అమ్మాయిని ప్రేమించాడట. దొంగతనాలు మానేస్తే కానీ అతన్ని పెళ్లి చేసుకోనని గట్టిగా చెప్పిందిట ఆ అమ్మాయి. ఇదే ఆఖరి దొంగతనమని ఆ అమ్మాయికి ప్రామిస్ చేసి మనింటికి దొంగతనానికి వచ్చాడుట. వెళుతూ నేను అరిచి ఎవర్నీ పిలవకుండా నోటికి టేపు అంటించి వెళ్లిపోయాడు. ఆశ్చర్యంగావుంది కదూ ఈ దొంగ కథ?" అన్నది రాజేశ్వరి అంతా చెప్పి...

"అవును... ఒక దొంగ ఇంటిని మరో దొంగ దోచుకోవటం గురించి నేనెప్పుడూ విన్లేదు. నిజానికి ఈ విషయాన్ని పేపర్లో వేయించవచ్చు... కానిమనం దొరికిపోతాం..' అంటూ లేచివెళ్లి తలుపులు మూసి బోల్టువేసి గోడవారిగా జార విడిచిన సూట్కేసును తీసుకు వచ్చి బెడ్ మీద పడేశాడు...

"ఇంతకీ మీ ఆఖరి దొంగతనం ఏమయ్యింది?" అడిగిందామె...

"చూడు డియర్ నీకే తెలుస్తుంది." అంటూ సూట్కేసు తెరిచి అందులో వున్న వస్తువులన్నింటినీ పక్క మీదకు వొంచాడు...

వెండి-బంగారు నగలతోపాటు అందంగా వున్న ఓ పర్సు కూడా సూట్కేసులోనించి పడింది..

దాన్ని తీసుకుని తెరిచి అదో రకంగా అరిచింది రాజేశ్వరి...

ఉలిక్కిపడి "ఏమిటి? ఎందుకు అరిచావ్?" అన్నాడు దుష్యంతరావు...

ఆమె-అతడికి ఆ పర్సులో వున్న ఫోటోను చూపిస్తూ "ఇతనే మనింట్లో ఆఖరి దొంగతనం చేసిన యువకుడు" అన్నది.

"మైగాడ్-" అన్నాడు దుష్యంతరావు ఆశ్చర్యంతో..

**   **   **

"గొడవేంది?"
"నేన్నూ, నీభార్య అలా. ప్రతిరోజా గొడవలు
పడేందుకు రాటికి వస్తే బావుంటుంది కదా?"
"నేనూ అదే అంటున్నా"
"మరి మీ ఆవిడ ఒప్పుకోదా"
"అందుకే ప్రతిరోజా ఈ గొడవ"

"అంత దూరమా?"
ఏడుస్తూ భర్తతో అంది కాంతం.
"ప్రతిరోజా అంతదూరం బార్కి వెళ్ళి త్రాగడం
ఆరోగ్యానికి మంచిదనుకుంటున్నారా?"
"నేనూ అదే ఆలోచిస్తున్నా"
"త్రాగుడు మానేస్తున్నారా?"
"అబ్బే రేపటినుండి అంత దూరం వెళ్ళను. ఇంటికే
తెచ్చేసుకుంటాను".
-కె.వి.మధుసూదనరావు.

ఆధునిక జీవితంలోఅతిముఖ్యమైన రోజు. 'ఆదివారం' ఆధారంగా హాస్యం పండించే సంఘటనలు. .... శృంగార మధురిమలు..... జీవిత గమనాన్ని ఛటుక్కున మార్చివేసే సన్నివేశాలు..... ఎన్నయినా సృష్టించవచ్చు. ఒక్కక్షణం ఆలోచించండి.... మెరుపులాంటి ప్లాన్ దొరకవచ్చు... వెంటనే కలం, కాగితం పుచ్చుకోండి... ఇదే మీకు మాఆహ్వానం....

'ఆదివారం కథ' హాస్యప్రధానంగా వుండాలి.

ఆదివారం కథ గులాబీదండ అయితే, గులాబీలను గుచ్చుకుంటూ పోయేదారంలా, శృంగారం అంతర్లీనంగా వుండాలే తప్ప, అదే గులాబీలా బయటపడి పోకూడదు

* ప్లాట్ తెలుగువారి జీవనం, వాతావరణానికి సంబంధించినదై వుండాలి

* 'ఆదివారంకథ' అరఠావు సైజులో, పేజీకి ఒకపక్కనే 10 పేజీలకు మించివుండకూడదు.

* ఇతర షరతులు మామూలే, ఏపత్రిక కథల పోటీ చూసినా సరిపోతుంది. ఎటొచ్చీ "ఈ కథ ఫలానా పత్రికలో చదివినట్టుగుర్తు.." అంటూ పాఠకులు మామీద నిష్ఠూరాలు వేయకుండా చూడండి.,

* మీ 'ఆదివారం కథలు' మాకు ఫిబ్రవరి 28వ తేదీలోగా అందితే పోటీకి, ఆతరువాత అందితే సాధరణ ప్రచురణకూ పరిశీలిస్తాము.

* ఈ పోటీలో కథల ఎంపికకు ప్రఖ్యాత రచయితలతో ఒక బోర్డును ఏర్పాటు చేస్తున్నాము. రచయితలు, రచయిత్రులు పంపించే కథలను ఆయా రచయితల, రచయిత్రుల పేర్లు లేకుండా సెలక్షన్ బోర్డు సభ్యులకు అందచేస్తాము. వారు ఎంపిక చేసిన కథలను 1990 ఏప్రిల్ నుంచి ప్రచురిస్తాము.

ఇక తీసుకోండి...... పెన్నూ, కాగితం.....

ఎంపికయిన ప్రతికథకు 75 రూపాయలు.

* ప్రచురణకు స్వీకరించని కథలను ఏప్రిల్ మాసాంతంలోగా తిప్పిపంపిస్తాము. (స్టాంపులు అతికించిన స్వంత చిరునామాగల కవర్లు జతచేసి పంపితే)
* మీ రచనలు - "ఆదివారం కథలు" పోటీకి, జ్యోతి కార్యాలయం, పోస్టుబాక్స్ నెంబరు 1824, చిక్కడపల్లి, హైదరాబాద్-500 021కు పంపించండి.

విశ్లేషణ

'జ్యోతి' లో ప్రతి మాసం వెలువడే విభిన్న కథలలో పాఠకులకు నచ్చినవి, నచ్చనివి ఏమిటో తెలుసుకోవాలనే ఆకాంక్షతోపాటు, పాఠకుల విమర్శనా స్థాయికి పదును పెట్టే 'విశ్లేషణ' శీర్షికను డిసెంబరు నుంచి ప్రవేశపెట్టిన విషయం పాఠకులకు విదితమే. ఫిబ్రవరి సంచికలో ప్రచురితమైన కథల / శీర్షికల మంచి చెడులను ఆహ్వానిస్తున్నాం.

ఉత్తమమయిన మూడు లేఖలకు రు. 50 /- 30/- 20/- ల వంతున నగదు బహుమతులు అందచేస్తాం.

మీ అభిప్రాయాలు అరఠావుకు మించకుండా స్పష్టంగా రాసి, ఈ దిగువ కూపను జతచేసి ఫిబ్రవరి 20వ తేదీలోగా మాకు అందే విధంగా "విశ్లేషణ" C/o ఎడిటర్, జ్యోతి మంత్లీ, పి.బి నం. 1824, చిక్కడపల్లి, హైదరాబాద్ అనే చిరునామాకు పంపించాలి.

'జ్యోతి' లో మరిన్ని మంచి కథలు ప్రచురించడానికి అవకాశం కల్పించే ఈ శీర్షికను విజయవంతం చేయండి.

ఫిబ్రవరి 'జ్యోతి'లో నాకు నచ్చిన / నచ్చని కథ / శీర్షిక

చిరునామా

ఫీచర్స్... ఫీచర్స్......

- కలకత్తా ఫిలిం ఫెస్టివల్
- 1990 మీ భవిష్యత్తు
- 'తెలుగు భాషకు వన్నె తెచ్చిన ఆస్థాన కవులు
- కంప్యూటర్స్ టుడే ఎడిటర్ JSRతో ఇంటర్వ్యూ
- వేదగిరి రాంబాబు హెల్త్ ఫీచర్
- నందివాడ భీమారావు 'భీమఖండం'

భారతాత్మ



శివుని జటారణ్యమ్మున చిక్కువడిన గగనగంగ
ధరణిపైకి దిగివచ్చి సుధాధారగ పారినపుడు—
ఎవరి చేతి కందక పరుగెత్తిపోవు మహానదుల
తరళాత్మలు నిలిచి క్షీర సరస్సులుగ మారినపుడు—

నాలో స్పందించిన ఆనందతంత్రి ఒకటేకద!
ఆనాటికి నేటికి నా అంతరంగ మొకటేకద!

భూసుత నెత్తుకపోయిన అసురతత్వమ్ము; రఘు కు
లేంద్రుని బాణాగ్నిలోన ఇంధనమైపోయినపుడు—
రణపిపాసతో రగిలిన జనసంఘము మహాబోధి
నీడలోన శారద చంద్రికలను పండించినపుడు—

ఎన్ని ధర్మ పల్లులు చిగురెత్తెనో నా మనసునందు?
ఎన్ని పాలవెల్లులు అలలెత్తెనో నా కనులయందు?



ఎక్కడినుండియో వచ్చిన ఉక్కుకాళ్ళు నా తనువును
తొక్కి తొక్కి నా బిడ్డల రెక్కలనే విరిచినపుడు—
మతోన్మాదమెత్తి ఒక్క మరచిన నాకన్న సుతులె
ఒక్క గుండెకాయ రెండు ముక్కలుగా చీల్చినపుడు—

~~నాలో~~ రగిలిన వేదన ఏ లిపి కందదు నేటికి.
అది బడబానలమువోలె ఆరిపోదు ఏనాటికి.





మంచిరంగి సుద్దను తన చిరునవ్వులతో చెరిపి
నా సంకెలలూడ్చిన గాంధీ సంగతి తలచినపుడు—
సరిహద్దుల కబళించగ విరుచుకపడు ముష్కరుల
పిట్టలవలె కొట్టిన మన జెట్టుల స్మరియించినపుడు—

నా శిరస్సు హిమగిరి శృంగమ్మై నిలిచెనుగాదా!
నా తపస్సు పండిన పుణ్యాకృతి వెలిసెనుగాదా!

విశ్వశాంతి వేదమున నవీన ఋక్కు లందించిన
జవహరుని ఉదాత్త వాణి జాతిని మేల్కొల్పినపుడు—
తనపై దుమ్మును జల్లెడు తమ్మునితో చేయికలిపి
లాల్‌బహదురు తానే కపురమ్మువోలె వెలిగినపుడు—



కన్న తల్లినైన నేను మిమ్ములందు
కొంటినయ్య

కన్నకొడుకులైన మిమ్ము
కనుల నిల్పుకొంటినయ్య.



సి. నారాయణ రెడ్డి

గమనిక :-
అనివార్య కారణాలవలన 'కంప్యూటర్స్ టుడే' ఎడిటర్ శ్రీ JSR ఇంటర్వ్యూ యీ సంచికలో ప్రచురించలేక పోతున్నాం. పాఠకులు గమనించ ప్రార్థన

ఉత్పత్తి ఊహా చిత్రాలు

బుచ్చిబాబు.

గొప్పవాళ్ల చివరి మాటలు

గురజాడ : డామిట్, కథ అడ్డంగా
తిరిగింది.

వీరేశలింగం : అక్కడ విధవలుండరు;
అదొక్కటే దిగులు.

వేమన : మనరవేమా.

ఉన్నవ : అక్కడ 'బ్రాహ్మణ అగ్రహారం'
వ్రాయాలి.

కాళిదాసు : మేఘాల మీదేనా మనం.
వెళ్ళడం?

రామిరెడ్డి : 'చిమ్మ చీకటివాంటి జిక్కు
కొవియుంటి;'

నండూరి : ఆరిపేయవె దీపమూ.

బాపిరాజు : పోవోయి సిన్నవాడా.

కీ ట కా ల చివరి మాటలు.

సీతాకోక చిలుక : (గొంగళిపురుగు దశలో
మీ కంబళ్ళకు నే తగనుగా.
(తరువాత దశలో) చేనేత వస్త్రాల
వారిపై దావా వడెయ్యాలి.

గొల్లభామ : యాదవ భామగా స్మరించండి నన్ను.

నల్లి : నరకలోకంలో బోలెడు రక్తం.

సాలీడు : ఇంద్రుడి కిరీటంలో గూడల్లుతా.

దోమ : నన్ను మీరు చంపలేరు; ఇది ఆత్మహత్య.

మిణుగురు పురుగు : ప్రళయకాల మహోగ్ర భయద
జీమూతోరు గళఘోర గంభీర ఫెళ
ఫెళార్భటులలో మెఱపేలా ?
(నోరు తిరక్క చచ్చి పోతుంది.)

పక్షుల చివరి మాటలు.

నెమలి : (జాతీయ పక్షిగా నిర్ణయం జరిగిన తర్వాత)
అమరజీవి నన్నారు పైగా.

గబ్బిలం : రాడారుగా వాడితే వెనక్కొస్తాను.

గుడ్లగూబ : నన్నెవరూ పెంచుకోరు కావున, పోతాను
నా కళ్ళని మీ కళ్ళజోడుగా పీకేముందు.

కోడి : తెలు కుట్టింది.

చిలుక : వేదం వల్లెవేస్తాను.

కాకి: నా మరణవార్త పత్రికలలో పడదు (కాకికబురు)

మగకాకి : నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాను (కాకిగోల)

పావురం : రంభవక్షంపై మకాం పెడతా.

కొత్త సామెతలు

అనలుపన్ను వూడందే రాబడిపన్ను
రాలుతుందా;

క్యూలో నిలబడ్డవాడికే తెలుసు కూతంత
ఓరిమి.

మాటినీకి సగం రేటు మోక్షానికి అరమెట్టు
ముందున్నదే మనోవ్యాధి.

మంత్రానికి పొనిది పంచదార కంట్రోలు.

ఈనాడు వీరికి అనువైన వృత్తులు.

కాళిదాసు : కృత్రిమ వర్షం కురిపించే
పరిశోధనాలయండైరెక్టరు.

వేమన్న : బట్టల కొట్టు

శ్రీనాధుడు : టూరిస్టు బ్యూరోలో పబ్లిసిటీ ఆఫీసరు.

తెనాలి రాముడు : (ఎలెక్షన్‌లో నెగ్గితే) శాసనసభ స్పీకరు
(ఓడిపోతే) వేలం పాడేవాడు.

కుచేలుడు : కుటుంబ నియంత్రణ శిబిరానికి
సూపరింటెండెంటు.

• • •

ఫస్టుక్లాస్ రైలుపెట్టె అంటే మనుషులు ఎక్కకూడనిది అనుకునేవాణ్ణి చిన్నప్పుడు.

విస్కీ బీచ్-విశేషం

అవును విస్కీ బీచ్ కూడా వుందా లేదా అని మీకు సందేహం కదూ!

1922 సంవత్సరం కెనడా ప్రాంతంలోని అంటారియా మొదలైన చోట్ల అప్పట్లో మద్యపాన నిషేధం అమలులో వుండేది. కాని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు మాత్రం వారు అనుమతించేవారు. అదే సంవత్సరం నవంబర్ 17 తేదీన ఓ పాత ఓడ విస్కీ సీసాలుతో కూడిన పీపాలు నింపుకుని ఈలి సరస్సు గుండా పోతూ తుఫానుకు గురి కాబడింది. తీర ప్రాంతం వారికి తాము ఆపదలో వున్నట్లు తెలిపేందుకు చివరకు గత్యం తరం లేక విస్కీ సీసాలను వాటి కేసులను దూరంగా విసిరారు.

అక్కడే తీరం వద్ద వున్న సంరక్షణ దళాధికారి ఈ సీసాలు రావడం గమనించి దాదాపు 42 విస్కీ సీసాలను ఒడ్డుకు రావడం గమనించి ఇసుకలో పాతేసాడు.

అదే సమయంలో ఈత వచ్చిన వారు ఓడలో నుండి దూకేసి తమ ప్రాణాలు కాపాడుకున్నారు. తర్వాత కొంతసేపటికి ఓడ మునిగిపోవనారంభించింది.

ఓడలోని ఇంజన్లు మునిగిపోయాయి.

దాంతో ఆ ఓడలోని 22 వేల లీటర్ల విస్కీ ఆ బీచ్‌లో వరదలా ప్రవహించింది.

ఇది గమనించిన ఆ తీర ప్రాంత ప్రజలు ఎగబడి తమకు చేతికి దొరికిన సీసాలు చేజిక్కించుకున్నారు.

ఈ వార్త అందగానే పోలీసులు సైతం రంగంలోకి దిగారు. కానీ ఫలితం లేకపోయింది.

ఆ తీర ప్రాంతమంతా విస్కీ బీచ్‌గా ప్రసిద్ధి కెక్కింది.

-ఎల్.ప్రఫుల్ల. చంద్ర

పాఠకులకు, ఏజెంట్లకు . . . . .

మార్చి 10 నుంచి 12 వరకు బెంగుళూరులో జరగనున్న జాతీయ తెలుగు మహాసభల సందర్భంగా వచ్చే సంచికను తెలుగు విశ్వ విద్యాలయ ప్రత్యేక సంచికగాను, ఉగాది ప్రత్యేక సంచికగాను రూపొందిస్తున్నాము. పాఠకులు, ఏజెంట్లు గమనించగోర్తాము.

బిజినెస్ మేనేజరు.

ప్రకృతిపాఠం!

– టి.వి.భాస్కరాచార్య.

నేను
మెరిస్తే వణకు
అరిస్తే – భయం
వానై కురిస్తే – ఉరుకు
ఏరై పారితే – పరుగు
ఎందుకు?
మరపు తొలగాలని
మాపు నిలవాలని – మెరిశా
కర్తవ్యం గుర్తుకు రావాలని – అరిచా
శేలమ్మని ఏరై కురిశా!

అయినా
నీవు కదలక నిల్చుంటే

నా శ్రమ
దున్నపోతు మీద వానైనందుకు
తుఫానై ముందుకు నడిచా
అంతే!

భీమఖండం

నీకుంటే పంచు - లేకుంటే పంచుకో




"జీవితపు ముడుల సంగతి ఎక్కువగా మరింత ఎక్కువగా తెలిసినవారు - జ్ఞానంతో సహా అన్నింటిని తోటివారితో పంచు కోవడం భావ్యమనో, మంచిదనో అనుకుంటారు. పంచుకోగలిగినా పంచుకో లేకున్నా మరికొందరు సాధ్యమైనన్నింటిని, సాధ్యమైన మేరకు మందితో పంచుకుంటారు."

నందివాడ భీమారావు

ఇది శ్రీ కాళీపట్నం రామారావుగారు కథ రాయాలనుకున్న వారికి, కాబోయే రచయితల సాంఘిక స్వభావాన్ని విశ్లేషిస్తూ అన్నమాట (కథాకథనం అనే వ్యాస సంకలనం లో) చాలా అర్థవంతమైన బలమున్న మాటలు. 'NO MAN IS AN ISLAND ENTIRE OF ITSELF' జ్ఞాపకం రావటం లేదూ? నేల మీద పడి కళ్లు తెరిచాక పసిపాపకి జీవితం తన ఆకలి తన ఉనికి తోనే ఆరంభమవుతుంది. చాలా తక్కువ కాలం లోనే అంతర్గతమై ముడిపడిన తల్లితో తన ఆకలీ, తన సుఖమూ, తన జాగ్రత్త ముడిపడి ఉన్నాయని గ్రహింపు కలుగుతుంది. పెరుగుతున్న కొద్దీ ఈ జీవితపు ముడులు తల్లి తర్వాత తండ్రిని, అన్నదమ్ముల్నీ, అక్కచెల్లెళ్ళనీ ఇతర కుటుంబ సభ్యుల్నీ చుట్టుకుని ఉన్నట్టు అవగాహన కలుగుతుంది. తల్లి కళ్లమ్మట నీళ్లెట్టుకుంటే ముఖంలోకి చూసిన పాప బిత్తర పోతుంది. ఏడుస్తుంది. చాలా చిన్న పిల్లలు కూడా ఒకళ్లొకళ్ళ ఉత్సాహాలు, ఉలిక్కిపడ్డాలూ కూడా పంచు కుంటారు. 'మన' అనే భావం కలిగిన ఇంకొక వ్యక్తి ఆనందం మనకీ ఆనందం ఇవ్వడం, దుఃఖం మనకీ ఏడుపు తెప్పించడం, బాధ మనలో సానుభూతి కలిగించడం, సహజ లక్షణాలే. తరువాత మెట్టులో కాళీపట్నం వారు చెప్పిన "పంచుకోడం" ప్రాముఖ్యతలోకొస్తుంది. 'పంచుకొనే వాళ్లంటే' 'పంచి పుచ్చుకునే' వాళ్లుంటారు. పంచుకోడమనే క్రియకి రెండుపక్కలా ఉంటారు. కారాగారు ఒక ప్రక్క "జీవితపు ముడుల సంగతి తెలిసిన వాళ్లనీ" రెండో పక్క "తోటి వాళ్ల"నీ ప్రవేశ పెట్టారు. కుటుంబ పరిధిని దాటి అర్థం అయినంతదాకా వెతుక్కుంటూ వెడితే ఈ ముడులు విశ్వ వ్యాప్తంగా పెరిగి పోతాయి చుట్టలు చుట్టుకుంటూ. అయితే అవగాహన పరిమితులుంటాయి. ఒక్కోప్పుడు కావాలని సంకుచితం చేస్తాం అవగాహనని. ఊరంటాం, రాష్ట్ర మంటాం, దేశమంటాం, జాతంటాం, కులమంటాం, మతమంటాం, భాషంటాం. 'NO MAN IS AN ISLAND' మరున్నానే ఉంటాం "NO COUNTRY, NO RELIGION, NO LANGUAGE IS AN ISLAND" ఒప్పుకో బుద్ధిపడు. మనం పుట్టిన దేశం 'సారే జహాసే అచ్ఛా' మనం మాట్లాడే భాష 'దేశ భాషలందు తెలుగు లెస్స' 'మనం' అనే భావంతో వచ్చే సుఖదుఃఖాల సహజ పరస్పరానుభూతులు అనేక CATEGORISED చూపుల వల్ల LIMIT అవుతాయి. కొందరు మట్టుకు సరియైన సాంఘిక అవగాహన వల్లగాని, వ్యక్తిత్వంలో ఉండే సహజ ఔదార్య గుణం ఏ పరిమితులకీ లొబడక పోవడంవల్ల గానీ 'మన' అనే భావానికి మహత్తరమైన మహాపరివ్యాప్తమైన అర్థం ఉన్నట్టు వ్యవహరిస్తారు. అలాంటి లోకోత్తరులు, కారా మేష్టారి లాగ 'తోటివాళ్ల'ని కూడా 'తోటి వాళ్ల' లాగే అనుకుంటారు. ఆనందాన్నీ, అనురాగాన్నీ, జ్ఞానాన్నీ, స్పందనల్నీ పంచుకుంటారు. అంటే ఈ 'మన' 'మనం' అనే పదాలు మన్నా లెవెల్లో పూర్తిగా 'నేను' గా కుంచించుకుపోతే Infinity level లో విశ్వమంతా ఇముడ్చు కుంటాయి. అయితే మధ్య లెవెల్సులో కొన్ని సత్పరిణామాలకి అనువైన లిమిటెడ్ 'మనం' అనే భావం అవసరమౌతుంది. స్వాతంత్ర్యం కోసం పోరాడేటప్పుడు మనం మనదేశం అనుకోక పోతే పోరాటం దెబ్బతింటుంది. వర్గపోరాటం తప్పని సరైతే లేని వాళ్ల 'మనం' 'వాళ్లు' అనే కచ్ఛితమైన అవగాహన తోనే Exploitation నీ అణచివేతనీ ఎదుర్కోగలుగుతారు. అన్యాయాలెదురైనే అన్ని సమయాల్లోనూ న్యాయపక్షం వాళ్లందరూ 'మనందరం ఒకటి' అనుకోక తప్పదు. సుఖాలు దుఃఖాలు, ఆనందాలు, దారులూ, రహదారులూ పంచుకోకాతప్పదు. విశ్వాన్నంతటినీ సందిట తీసుకునే ప్రేమ కుంచించుకు పోవడం కాదు. అలాంటి ప్రేమకి కల అడ్డు జాగ్రత్తగా గమనించుకుని అవసరమైనంత మట్టుకి తొలగించుకోవడమే ఔతుంది. జ్ఞానంతో సహా అన్నిటినీ ఆ 'తోటి వాళ్ల'తో పంచుకుంటారు. పంచుకోడానికి వ్యతిరేకించే వాళ్లతో అవసరం మేరకు తలపడి 'పంచుకుంటారు'.

ఒక్క విషయం చెప్పుకోడం అవసరమనిపిస్తోంది. చాలాకాలంగా ఒక అభిప్రాయం బలంగా ఉంటూ వచ్చింది. ధనంగానీ, సంపదగానీ, జ్ఞానంగానీ, నైపుణ్యంగానీ

ఇచ్చి పుచ్చుకోడాలున్నప్పుడు ఇచ్చేవారు పైన పుచ్చుకున్నవారు క్రింద అవి. ఇవ్వడం గొప్పతనానికి, ఔదార్యానికి సంపత్తుకీ సంకేతం. పుచ్చుకోవడం తక్కువతనానికి, లేమికీ అజ్ఞానానికీ రెండో పేరే. బలి చక్రవర్తి శ్రీ మహావిష్ణువు చెయ్యి కింద్రై తన చెయ్యి మీదవడంకంటె అభిలషణీయమేముంది. వెధవ రాజ్యం పోతే పోనీ అంటాడు. జ్ఞానం, విద్య విషయాల్లో కూడా ఏళ్లతరబడీ ఇచ్చే గురువుకు శుశ్రూష చెయ్యాలి. అనుగ్రహం పొందాలి. కచుడి కథ చూడండి. నేననేది నేర్చుకునే శిష్యుడికి నమ్రత గురువుల మీద గౌరవం ఉండ కూడదని కాదు. అందులోనూ చిన్నతనంలో పెద్దల దగ్గిర నేర్చుకునేటప్పుడు జ్ఞానం మనలో పంచుకునేవాడు మనకి మంచి చేస్తున్నాడు అనే నమ్రత గ్రహించేవాడి కుండాల్సిందే. కాని జ్ఞానం పంచిచ్చే వాడికి మటుకు నేను పై మెట్టు మీదున్నాను అవతలి వాడికేదో మెహర్బానీ చేస్తున్నాను అని అనుకోడం ఆత్మహత్యతో సమానం. ప్రతివాడూ ప్రతివాడి దగ్గిరా నేర్చుకుంటూనే ఉండాలి. Information explosion యొక్క లక్షణమది. మన పిల్లల ద్వారానే మన మెన్ని విషయాలు గ్రహిస్తున్నాం. ఏమీ చదూకోని స్త్రీల దగ్గిరా, పల్లె జనాల్నించీ, ఎన్ని విషయాలు మనం కాస్త అహంకారంపాలు తగ్గించుకుంటే తెలుసుకోగలం. ప్రజల దగ్గిరకి వెళ్లాలంటే ప్రజలదగ్గిర్నించి నేర్చుకోడం రాని శాల్తేం వెళ్ల గలరు? వాళ్లు డాక్టరు గానీ, ప్రభుత్వాధికారులుగానీ, సంఘ సేవకులు గానీ, విప్లవకారులు గానీ, ప్రజా సైంటిస్టులు గానీ, ప్రజా కళాకారులు గానీ - ప్రజల నర్థం చేసుకుంటూ వాళ్ల పరిస్థితులు పరిమితులు గమనిస్తూ వాళ్ల తెలివినీ నైపుణ్యం గ్రహిస్తూ వెళ్లే వాళ్లకీ - పై తరహా తెలివినీ, అధికారాన్నీ, అహంకారాన్నీ అభివృద్ధి పేరుతో, కళల పేరుతో రుద్దే వాళ్లకీ ఎంత తేడా ! ప్రజలు హంసలు. ఏరి పారేస్తారు పై మెరుగుల వాళ్లని.




మేషం


వృషభం


మిధునం



కర్కాటకం


సింహం


కన్య


తుల


వృశ్చికం


ధనస్సు


మకరం


కుంభం


మీనం

1990 లో మీ భవిష్యత్తు

:మేషం:

లగ్న, అష్టమాధిపతి కుజుడు 21 అక్టోబరు వరకు ఋజుగతిలో సంచరించటం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. కోర్టు కేసులు మామూలు తరహాలో నడుస్తుంటాయి. నవంబరు, డిసెంబరు మాసాల్లో ఆరోగ్యరీత్యా జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు వాయిదాలు పడటమే కాకుండా ప్రతికూలంగా నడుస్తాయి. కుజసంచారం మూలంగా జనవరి, ఫిబ్రవరి, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఖర్చులు అధికంగా ఉంటాయి. ధనాధిపతికి ఫిబ్రవరి రెండువరకు వక్రగతి ఉన్నందున అనుకొన్న డబ్బు అనుకున్న విధంగా చేతికి అందిరాదు. కళత్ర ఆరోగ్యము కూడా ఫిబ్రవరి వరకు బాగుండదు. ఫిబ్రవరి 9 వరకు వ్యాపార భాగస్వాములతోనూ, మీ పై అధికారితోనూ వ్యవహరించేటప్పుడు అత్యంత జాగ్రత్త వహించటం మంచిది. జనవరి 20వ తేదీ వరకు, 23-4-89 నుంచి 17-5-90 వరకు; 26-8-90 నుంచి 18-9-90 వరకు, 15-12-90 నుంచి చివరి వరకూ కంట్రాక్టర్లకు ఉపయోగించదు. ఆ రోజుల్లో సహోదరులతో మెలిగేటప్పుడు జాగ్రత్త అవసరం. అదేసమయంలో హోల్ సేల్, ఏజెన్సీ వ్యాపారాదుల్లో వెనకడుగ్గా ఉంటుంది. అయితే మార్చినుండి జూలై వరకు సినిమా పంపిణీ దార్లకు, హోల్ సేల్, ఏజన్సీ వ్యాపారస్థులకు, కంట్రాక్టర్లకు చాలా బాగుంటుంది. తమ తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోటానికి ఇది మంచి సమయం. బుధుడు వక్రించిన రోజుల్లో మీకు అప్పులు దొరకవు. ఓవర్ డ్రాఫ్ట్ దొరకదు. మార్చినుంచి జూలై జనవరి లోపల ఇతర దేశాలకు, పుణ్య క్షేత్రాలకు తిరిగే యోగం ఉంటుంది. జూలై చివర్లో గురువు కర్కాటకంలోకి ప్రవేశించిన తరువాత నుంచి నవంబరు చివరి వరకూ విద్యారంగంలోని వారికి ఎంతో బాగుంటుంది. మేషలగ్నంలో జన్మించి పాఠశాలలు, కాలేజీలు పెట్టుకొని వ్యాపారంగా డబ్బు గడించేవారు ఈ సంవత్సరం అభివృద్ధిని బాగా సాధించగల్గుతారు. గృహనిర్మాణానికి మంచి కాలం కూడా. పెద్ద పెద్ద ఇళ్ళు కట్టుకో గల్గుతారు. ఫ్లాట్ల వ్యాపారం చేసేవాళ్ళు తమ రంగంలో ఎంతో ప్రగతిని సాధించగల్గుతారు. ఉద్యోగస్థులకు ఈ సంవత్సరం పై హోదాల్లోకి వెళ్ళగల్గుతారు. ఉన్నత విద్యాభ్యాసం రంగంలోనూ, పరిశోధనా రంగంలోనూ కృషి చేస్తున్న వారికి ఈ సంవత్సరం పెద్దగా అభివృద్ధి కనిపించదు. మే నుంచి అక్టోబరు వరకు ఉద్యోగస్థులు ఎక్కువగా పని చేయాల్సి

ఉంటుంది. ఎక్కువైన ఏ పనికి ప్రత్యేకంగా హెచ్చు పారితోషికాలు లభించవు. పదవ భాగంలో రాహు గ్రహ సంచారం వల్ల ఉద్యోగరీత్యా హైదరాబాదు, వరంగల్లు ప్రాంతాలలోకి బదిలీలు జరుగుతాయి. నాలుగో ఇంట్లో కేతువు సంచారం వల్ల కొందరు తమ తమ స్థిరాస్తుల మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. కొందరు వీటిని అమ్ముకోవాల్సి వస్తుంది. మేషలగ్నంలో పుట్టిన విద్యార్థులకు ఈ సంవత్సరం అంత అనుకూలంగా కనిపించదు. తల్లి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. హఠాత్తుగా తండ్రి గారికి ఆరోగ్యం చెడిపోతుంది. కాబట్టి తల్లిదండ్రులిరువురి ఆరోగ్య విషయాల్లో మెలకువగా ఉండటం మంచిది. మార్చి నుంచి జూన్ వరకు గృహనిర్మాణ కార్యక్రమాలు కొంత నత్తనడక నడుస్తాయి.జూలై నుంచి వేగం పుంజుకుంటాయి. విద్యార్థులకు చికాకులుంటాయి. విద్యార్థులు ఈ సంవత్సరం చికాకుల్నుంచి తప్పించుకోటానికి కార్తికేయ స్తోత్ర పారాయణ చేయటం మంచిది. వ్యాపారస్థులు తమ వ్యాపారాదుల అభివృద్ధి కోసం ఆదిత్య హృదయం పారాయణతోపాటు లక్ష్మి సహస్రనామ స్తోత్ర పారాయణ నిత్యము చేయటం వల్ల ఎంతో అభివృద్ధిని సాధించగల్గుతారు. ఉద్యోగస్థులు విశ్వేశ్వరుని శివుణ్ణి ఆరాధించటం మూలంగా లాభం పొంద గల్గుతారు. ఈలగ్న జాతకులు రత్నాలు ధరించటం మూలంగా ధన సంపాదన పెంచుకోగల్గుతారు. పగడాలు ధరించవద్దు. హోల్ సేల్, ఏజెన్సీ, ఫిలిమ్, డిస్ట్రిబ్యూటర్లు విష్ణు సహస్రనామ పారాయణ చేయటం మూలంగా ఆయా రంగాల్లో అభివృద్ధిని సాధించుకో గల్గుతారు. ఆది, శని, శుక్ర వారాలు లాభకరంగా ఉంటాయి. మంగళ వారం నాడు నూతనమైన కార్యక్రమాలు తలపెట్టకుండా ఉండటం మంచిది. ఓవర్ డ్రాఫ్ట్ కావాలనుకొన్న వాళ్ళు పచ్చ (EMERALD) ధరించి తమ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోగల్గుతారు. బుధవారం నాడు ఈ పని చేయటం మంచిది. ఫిబ్రవరి 25 వరకు కొన్ని అనుకొన్న ప్రయాణాలు వాయిదా పడ్తాయి. నవంబరు 30 నుంచి సంవత్సరాంతము వరకు గృహనిర్మాణ కార్యక్రమాలు కొంత కుంటుబడ్తాయి. ఫిబ్రవరి రెండవ తేదీ వరకు డబ్బు చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కళత్ర ఆరోగ్యం బాగుండదు. మే నెల నుంచి అక్టోబరు వరకు ఉద్యోగస్థులు అధిక శ్రమను ఎదుర్కోవల్సి వస్తుంది. శ్రమకు తగిన ప్రతిఫలం ఉండదు. పేరు ప్రతిష్ఠలు కొంత దెబ్బ తింటాయి. జూలై నుంచి పేరు ప్రతిష్ఠలు మళ్ళీ పెంచుకోగల్గుతారు. కొన్ని ప్రమోషన్లు వాయిదా పడటం, మీ కంటె తక్కువ సర్వీసు ఉన్నవాళ్ళకు ప్రమోషన్లు రావటం జరుగుతుంది. అయితే సంవత్సరాంతం లోపల ఉద్యోగ రీత్యా ఎంతో ప్రగతిని సాధిస్తారు. పుష్యరాగం ధరించటం వల్ల పెట్టుబడులు పెంచుకోగల్గుతారు. ప్రయాణాలు లాభకరంగా ఉంటాయి.

6, 8 , 5 మంచి సంఖ్యలు. '9' వద్దు.

వృషభం

లగ్నాధిపతి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వక్రగతిలో సంచరిస్తూండటం మూలంగా ఆరోగ్యం బాగుండదు. చేపట్టిన పనులు సక్రమంగా నడవవు. ఇతరుల నుండి రావలసిన డబ్బు రావటంలో జాప్యం జరుగుతుంది. ఫిబ్రవరి వరకు మీకు ఓవర్ డ్రాఫ్ట్ దొరకదు. ద్వితీయ పంచమాధిపతి బుధునకు వక్రం ఉన్న కాలాల్లో ధనసంబంధమైన ఇబ్బందులుంటాయి. అనగా జనవరి, మే, సెప్టెంబరు, డిసెంబరు చివర్లో మీకు చేతికి అందాల్సిన డబ్బు చేతికి అందిరాదు. పిల్లల ఆరోగ్యం సక్రమంగా ఉండదు. వ్యాపారస్థులకు కొంత ఉత్సాహం తగ్గుతుంది. కుటుంబ విషయాల్లో కూడా చిన్నచిన్న చికాకులు ఏర్పడతాయి. మార్చి నుంచి రాబడి బాగా పెరుగుతుంది. కుటుంబంలోని వ్యక్తులు ప్రగతిపథంలో నడుస్తారు. కుటుంబాభివృద్ధి జరుగుతుంది. జూలై చివరి లోపల అప్పుడప్పుడు డబ్బుకు ఇబ్బంది కలిగినా ఆదాయం ఎంతో మెరుగు పడుతుంది. ఈ సంవత్సరం అంతా ఎక్కువగా ప్రయాణాలు చేస్తారు. పుణ్యక్షేత్రాల్ని సందర్శించటం, పుణ్యనదుల్లో స్నానం చేయటం జరుగుతాయి. హోల్ సేల్ వ్యాపారస్థులకు, కంట్రాక్టర్లకు చికాకు ఎక్కువగా ఉంటుంది.

జూలై నుంచి వీరిక కొంత మెరుగ్గా ఉంటుంది. వారివారి వ్యాపారాలు పెంచుకోగల్గుతారు. స్పెక్యులేషన్ అంతగా లాభించదు. వృత్తి, ఉద్యోగాదులకు సంబంధించిన విషయాలు మార్చి నుంచి బాగా మెరుగు పడతాయి. ఈ సంవత్సరం మీ సోదరుల మూలంగానూ, మీ క్రింద పని చేసే వాళ్ళ మూలంగానూ మనస్తాపము తప్పదు. ఒక ఏడాదిన్నర నుంచి గృహ నిర్మాణానికి సంబంధించిన, స్థిరాస్తికి సంబంధించిన తలనొప్పుల నుంచి బయటపడతారు. నవంబరు. డిసెంబరు మాసాల్లో జీవిత భాగస్వామి ఆరోగ్యం బాగుండదు. వ్యాపార భాగస్వాములతో వ్యవహరించేటప్పుడు జాగ్రత్త అవసరం. నవంబరు, డిసెంబరు నెలల్లో ఉద్యోగస్థులు తమపై అధికార్లతో వ్యవహరించేటప్పుడు ఎంతో జాగ్రత్త అవసరం. జూలై నుంచి డిసెంబరు లోపల ఉద్యోగస్థులకు పై హోదాలు లభిస్తాయి. ఆ మాసాల్లో మీ సోదరులు తమతమ రంగాల్లో అభివృద్ధిని సాధించటం మీరు గమనించగల్గుతారు. ఈ సంవత్సరం కుటుంబాని సంబంధించిన కోర్టు కేసులు ఎదుర్కొంటారు. నవంబరు చివర నుంచి కోర్టు కేసులు సవ్యంగా నడవవు. ఈ సంవత్సరం మొత్తం మీకు అందాల్సిన వార్తలు సకాలానికి అందక చికాకు పెడతాయి. ప్రయాణాల్లో చికాకులు ఎదుర్కొంటారు. విద్యార్థులకు గడిచిన సంవత్సరం కంటే బాగుంటుంది. రెండున్నర సంవత్సరాల నుంచి నత్తనడక నడుస్తున్న వ్యాపారస్తులకు మార్చి నుంచి ఊపిరి పీల్చుకోగల్గుతారు. ఉన్నత విద్యాభ్యాసకులకు మే నుంచి ప్రోత్సాహకరంగా ఉంటుంది. సెప్టెంబరు చివరి నుంచి మరీ బాగుంటుంది. మే నుంచి సెప్టెంబరు వరకు మీమీ విదేశీ ప్రయాణాలు వాయిదా పడతాయి. ఆయా నెలల్లో మీ తండ్రిగారి ఆరోగ్యం జాగ్రత్త. ఆ అయిదు నెలల్లో వృత్తి

ఉద్యోగ, వ్యాపారస్థులకు శ్రమ ఎక్కువగా ఉంటుంది. శ్రమకు తగిన ఎక్కువ ప్రతిఫలం దక్కదు. వృత్తికి సంబంధించిన చికాకులు అక్టోబరు నుంచి సర్దుకోటం మొదలుపెడతాయి. కొందరు ఉద్యోగస్థులు వాలంటరీగా రిటైర్ అవుతారు.

డబ్బు ఇబ్బందుల నుంచి గట్టెక్కటానికి, ధనాదాయం పెరగటానికి విష్ణు సహస్ర నామ పారాయణ ఎంతో ఉపయోగపడుతుంది. 'పచ్చ' ధరించటం మూలంగా వ్యాపార, ఆదాయాలు అభివృద్ధి చెందుతాయి. వృషభ లగ్న జాతకులు మంగళవారాల్లో ఏ విధమైన నూతన కార్యక్రమాలు చేపట్టవద్దు. మిగిలిన రోజుల్లో శనివారం కూడా మినహాయించి పనులు చేసుకోవటం మంచిది. ఉంగరంలో 'వజ్రం' (DIAMOND) ధరించి ఇతరులపై ఆధిపత్యాన్ని పొందవచ్చు. మీ మాటను అప్పుడు ఎవ్వరూ తీసివేయలేరు. పుష్యరాగం ధరించి కోర్టు కేసుల్లో విజయం పొందగల్గుతారు. పగడాన్ని ధరించకండి. మామూలుగా వృషభ లగ్న జాతకులు ఎక్కువ ఖర్చు చేస్తూంటారు. పగడం అనవసరమైన ఖర్చుల్ని పెంచుతుంది. గృహ నిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్తి పెంపుదలల కోసం కెంపులు ధరించండి. రచయితలు, కంట్రాక్టర్లు, ఏజెన్సీ వ్యాపారస్థులు తమ ఉంగరాల్లో ముత్యాలు ధరించటంవల్ల మీమీ రంగాల్లో మీరు ఎదుర్కొంటున్న చికాకులు కొంత వరకు తగ్గిపోతాయి.

మే నుంచి పరువు ప్రతిష్ఠ గౌరవాలకు కొంత లోటు జరుగుతుంది. అయితే జూలై నుంచి సంఘంలో మీ పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. ఉద్యోగరంగంలోని వ్యక్తులు 'దుర్గ'ను ప్రార్థించి తమతమ ఇబ్బందుల్నుంచి బయట పడగల్గుతారు. నిరుద్యోగులకు మార్చి నుంచి మంచి కాలం ప్రారంభం అవుతుంది.

జీవిత భాగస్వామి ద్వారా, వ్యాపార భాగస్వామి ద్వారా మీరు ఆశిస్తున్న ధనం మే, జూలైల మధ్య హఠాత్తుగా వస్తుంది. జూలై తరువాత నుంచి నవంబరు చివరి వరకు మీరు తలపెట్టిన కార్యక్రమాల్లో ఎవరో అజ్ఞాతంగా మీకు సహాయం చేస్తున్న అనుభూతిని పొందుతారు. సరైన సమయంలో సహాయం అనుకోకుండా అందుతుంది. దీన్ని PROVIDENTIAL HELP' అంటారు.

6,3,5, అంకెలు మీకు పనికి వస్తాయి. '9' అంకె జోలికి వెళ్ళకండి. 1989 సంవత్సరం కంటే ఈ సంవత్సరం మొత్తం మీద అన్ని విధాలా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

మిథునం

ఈ సంవత్సరం లగ్న చతుర్థాధిపతి బుధునకు నాలుగువార్లు వక్రగతి వస్తోంది. జనవరి, మే, సెప్టెంబరు, డిసెంబరు చివర వారం ఆరోగ్యరీత్యా బాగుండదు. చేపట్టిన పనులు వెనకడుగులో ఉంటాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు పై నెలల్లో సవ్యంగా సాగవు. అసలు స్థిరాస్థికి సంబంధించిన కోర్టుకేసులతో చుట్టుముట్టిన వారికి మార్చి చివర నుంచి కొంత ప్రశాంతి దొరుకుతుంది. సుమారు రెండు సంవత్సరాలనుంచి ఇంటికి సంబంధించిన నిర్మాణ కార్యక్రమాలు అంచెలంచెలుగా సాగి, సాగక ఉన్న పరిస్థితి ఏప్రిల్ నుంచి కొంత మెరుగు పడుతుంది. లగ్నంలో గురుసంబంధం వల్ల బాగుండాల్సిందే కానీ లగ్నాన్ని శని చూస్తూండటం వల్ల రెండు సంవత్సరాలనుంచి అన్ని విధాలా బాగాలేదు. ఈ పరిస్థితి ఏప్రిల్, మే, జూన్ లలో కొంత బాగా ఉన్న 1990 చివరి వరకూ మీ కష్టాలు గట్టెక్కవు. కోర్టు కేసులతో మనస్సంతా చికాగ్గా ఉంటుంది. ఉద్యోగుల

స్థితిగతులు ఏమాత్రం బాగుండవు. ఫిబ్రవరి చివరి వరకూ ఏమీ బాగా లేదు. ఆరోగ్యరీత్యా ఉద్యోగరీత్యా అన్నీ వ్యతిరేకంగా ఉంటాయి. జూలై నుంచి ఆర్థికంగా బాగుంటుంది. అయితే మీకు ఏడాదిన్నరపాటు ఆర్థిక చికాకులు తప్పవు. కుటుంబంలోని వ్యక్తుల మూలంగా మనశ్శాంతి లోపిస్తుంది. ప్రతి విషయానికి వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. జీవిత, వ్యాపార భాగస్వామి మూలంగానూ, మీ పై అధికారి మూలంగానూ కష్టాలు డిసెంబరు వరకూ తప్పవు. మార్చి వరకు కళత్ర ఆరోగ్యం బాగుండదు. కోర్టుకేసులు వాయిదాలు పడ్తూంటాయి. అవి ప్రోత్సాహకరంగా సాగవు. ఉన్నత విద్యనభ్యసించేవారికి చదువులో కుంటుపడ్తూ ఉంటుంది. దూర ప్రయాణాలు సాగవు. ప్రయాణాల్లో ప్రమాదాలు పొంచి ఉంటాయి. జాగ్రత్త వహించగలరు. డిసెంబరు చివరి వరకూ అనుకొన్న పని అనుకొన్న విధంగా సాగదు. ఫిబ్రవరి మొదటివారం వరకు పిల్లల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించండి. వాళ్ళు ఆ కాలంలో సక్రమంగా బడికి, కాలేజికి వెళ్తున్నారో లేదో గమనిస్తూండాల్సిన అవసరం వుంది. వ్యాపారాదుల్లో జనవరి నెల నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు బాగుండదు. ఆ కాలంలో స్పెక్యులేషన్ జోలికి వెళ్ళకండి. ఫిబ్రవరి చివరి వరకు వృత్తి, ఉద్యోగ, వ్యాపారాదులందు శ్రమ అధికంగా ఉంటుంది. ఆ కృషికి తగిన విధంగా హెచ్చులాభాలు కనిపించవు. అయితే గురువు లగ్నంలో సంచరించటం వల్ల చిన్న చిన్నవిగా కనిపించే మేలు జరిగినా సంతృప్తి ఉండదు. ఏదో తెలీని లోటు వెంటాడు తుంటుంది. కొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేయటం జరుగుతుంది. మరో ఉద్యోగం దొరకటానికి కొంతకాలం పడ్తుంది. నిరుద్యోగులకు ఈ సంవత్సరం కూడా నిరాశ తప్పదు. ఉద్యోగంలో ఉన్న వాళ్ళకు 'సస్పెన్షన్లు' 'ఛార్జిషీట్లు' ఎదురవుతుంటాయి.

ఫిబ్రవరి రెండవ వారం వరకు వ్యాపారాదుల్లో పెట్టుబడి పెంచకండి. వ్యాపారాభివృద్ధి కోసం పథకాలు వేస్తూంటారు కానీ అవి ఆచరణలోకి రావటంలో ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యార్థులకు కలిసిరాదు. విద్యార్థులు 'కార్తికేయ స్తోత్ర పారాయణ' చేయటం ఎంతో అవసరం. ఎంత చదివినా పరీక్షలో సరైన సమాధానం గుర్తుకురాక ఇబ్బంది పడ్తారు. ఆ ఇబ్బంది నుంచి కొంత తప్పించుకోటానికి సుబ్రహ్మణ్యస్వామి ప్రార్థన పనిచేస్తుంది. పగడం ధరించండి. పగడంలో చెక్కిన గణపతిని ధరించటం ఇంకా మంచిది. అక్టోబరు 21వ తేదీ నుంచి చేతికి రావాల్సిన లాభం వెనక్కు పోతుంది. నవంబరులో, డిసెంబరు నెల్లో ఓవర్‌డ్రాఫ్ట్ దొరకటం కష్టం. సంవత్సరం చివర్లో ఆరోగ్యం జాగ్రత్త.

శనివారాల్లో ఏ పనీ తలపెట్టకండి. మంగళవారాలు మీకు బాగా సహాయపడ్తాయి. గురువారాలు ఉద్యోగ విషయాల్లో మలుపులు త్రిప్పుతాయి. జులై నుంచి ఉద్యోగులకు కొంత ప్రోత్సాహకరంగా ఉన్నట్లనిపిస్తుంది.

విష్ణు సహస్ర నామ పారాయణ ద్వారా కొంత మనశ్శాంతిని పొందగల్గుతారు.

ఈ సంవత్సరం అంతా ఎలాంటి చిక్కులు వచ్చినా ధైర్యంగా మొండిగా ఎదుర్కోవాల్సి వస్తుంది.

హోల్‌సేల్, ఏజెన్సీ వ్యాపారస్థులు, రచయితలు కెంపులు ధరించటం వల్ల తమ తమ రంగాల్లో కార్యకలాపాల్ని కొంత మెరుగ్గా నిర్వహించగల్గుతారు. సోదరుల మూలంగా చిక్కులు ఎక్కువవుతాయి. తండ్రి మూలంగానూ, భార్య మూలంగానే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీటన్నిటి నుంచి బయటపడి మీ మాట

నెగ్గటంకోసం పగడం ధరించండి. 'పచ్చ' ధరించటం వల్ల స్థిరాస్తి చిక్కుల్నుంచి గట్టెక్కుతారు. DIAMONDS ధరించవద్దు. పుష్యరాగం PROVIDENTIAL HELP తెచ్చిపెడ్తుంది. మాట్లాడిన మాటల మూలంగా కొన్ని చిక్కులు కొని తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల ఇతరులతో ఏ వ్యవహారంలోనైనా సరే ఎంతో మెలకువగా ఉండటం అవసరం. పేరు ప్రతిష్ఠ గౌరవాలకు కూడా ఇబ్బంది కలుగుతుంది. ఏ రీత్యా చూచుకున్న 1990 మిధునలగ్న జాతకులకు అంతగా ఉపయోగించే కాలం కాదు. కష్టాల కన్నీళ్ళల్లో ఈదులాడాల్సిందే. (1991 శుభకరంగా ఉండాలని కోరుకుందాం). మీ ఆలోచనా శక్తి కూడా శని దృష్టిమూలంగా సన్నగిల్లుతుంది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శనిలాగా 1990 గడుస్తోంది.

కర్కాటకము

లగ్నంలో కేతువు యొక్క సంచారం మూలంగా ఏ విషయంలోనూ మీరు నిలకడగా ఆలోచనలు చేయ లేకపోతారు. అవసరమైన మనస్థాపానికీ, తీవ్రతకూ గురి అవుతారు. ఏదో తెలీని టెన్షన్ మిమ్మల్ని వెంటాడుతుంటుంది. ఏప్రిల్ నుంచి లగ్నంలో కేతు సంచారంతో పాటు ఏడవ ఇంట్లో శని ప్రవేశం మూలంగా అనేక రకములైన ఇబ్బందులు చుట్టుముడ్తాయి. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసర పడ్తుంది. భార్య లేదా వ్యాపార భాగస్వామి మూలంగా చిక్కులు ఏర్పడ్తాయి. మీరు ఏ విషయంలో ఏ ప్రత్యర్థిని సంప్రదించినా ఏదో తెలీని చిక్కులుంటాయి. మీపై అధికారి మీకొక పెద్ద తలనొప్పిగా తయారవుతాడు. చేపట్టిన పనులన్నీ నత్తనడక నడుస్తూంటాయి. దాంతో మరీ ఎక్కువ అవుతుంది. అయితే ఆగష్టునించి లగ్నంలో గురుసంచారం మూలంగా ఎన్నోరకాల తలనొప్పుల నుంచి బయటపడి విజయం సాధించగల్గుతారు. వ్యాపారాదుల్లో ఉన్న వ్యక్తులు మార్చి నుంచి మాత్రమే తమ తమ పెట్టుబడుల్ని పెంచగల్గుతారు. ఫిబ్రవరి చివరి వరకూ అనుకొన్న ప్రయాణాలు ముఖ్యంగా దూరప్రయాణాలు వాయిదా పడ్తుంటాయి. కుటుంబంలో శుభకార్యాల కోసం (మార్చి నుంచి ఆగష్టు లోపల) ఖర్చు పెడ్తారు. ఈ సంవత్సరం జనవరి, మే, ఆగష్టు నెల్లో చిన్న చిన్న ప్రయాణాలు వాయిదా పడ్తాయి. ఆ నెల్లో ఏజెన్సీలు, హోల్‌సేల్ వ్యాపారస్థులకు అంత ప్రోత్సాహకరంగా ఉండదు. సోదరులతో భేదాభిప్రాయాలొస్తాయి. నౌకర్లతోను, మీక్రింద పనిచేసే ఉద్యోగస్థులతోనూ జనవరి, మే, ఆగష్టు, డిసెంబరు చివర్లో జాగ్రత్తగా ఉండండి. సుమారు ఒక ఏడాది క్రిందట నుంచి ధన విషయంలో ఇబ్బంది పడ్తున్న మీకు ఈ సంవత్సరం చాలా బాగుంటుంది. 9-2-90 వరకు తల్లిగారి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. 25-2-90 వరకు తండ్రిగారి ఆరోగ్యవిషయంలో ఎంతో శ్రద్ధ చూపించటం అవసరం. 6-5-90 నుంచి 24-9-90 వరకు కళత్ర ఆరోగ్యం జాగ్రత్త. ఆసమయంలో మీకు ఇతరుల నుంచి కావాలనుకున్న పనులు కావు. ఆయా నెల్లో ఎవరిని నమ్మవద్దు.

ఫిబ్రవరి మొదటివారం వరకు గృహనిర్మాణ కార్యక్రమాలు, భవనాలు కొనటం, వాహనాలు కొనటం వంటివి వాయిదా వెయ్యటం మంచిది. జనవరి, ఫిబ్రవరి 9 వరకు మిత్రులతో వ్యవహరించేటప్పుడు జాగ్రత్త వహించటం మంచిది. జనవరి మాసంలో మీ చేతికి అందాల్సిన లాభాలు అందవు. మే నుంచి ఆగస్టు వరకు కోర్టు వ్యవహారాలు చురుకుగా నడవవు. మీకు అనుకూలంగా కూడా సాగవు. నవంబరు, డిసెంబరు మాసాల్లో మీ వ్యాపారాదుల్లో కొంత వెనుకంజ కనిపిస్తుంది. ఆసమయంలో స్పెక్యులేషన్ జోలికి వెళ్ళకండి. ఆగస్టు నుంచి వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలు నవంబరు వరకు కొనసాగించగల్గుతారు. మీ పిల్లలలో ఎంతో ప్రగతిని సాధించగల్గుతారు. డిసెంబరు నెలలో మీ ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ఉద్యోగస్థులకు ఆగస్టు తరువాత మంచి అభివృద్ధి కల్గుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలుదొరుకుతాయి. నవంబరు, డిసెంబరునెలల్లో వృత్తి, ఉద్యోగ వ్యాపారాదులందు పని ఎక్కువై రాబడి తగ్గుతుంది. లగ్నంలో కేతు సంచారం మూలంగా, ఆగస్టు నుంచి గురు సంచారం వల్ల ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతారు. విద్యార్థులకు ముఖ్యంగా ఉన్నత విద్యనభ్యసిస్తున్నవాళ్ళకు ఈ సంవత్సరం ఎంతో బాగుంటుంది. పరిశోధనా రంగంలోని వ్యక్తులు రాణింపుకు వస్తారు. విదేశీయానాల్లో కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చినా సాధించగల్గుతారు. బ్యాంకుల్లో, విద్యాసంస్థల్లో పనిచేసే వ్యక్తులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

పగడం ధరించటం మీకు వృత్తిరీత్యా మేలు చేస్తుంది. వజ్రములతో చయించిన ఉంగరం అన్ని విధాలా మేలు చేస్తుంది. అన్ని రంగాల్లో విజయం తెచ్చి పెడ్తుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ నీలం ధరించవద్దు. శుక్రవారాలు మీకు విజయాన్ని తెచ్చిపెడ్తాయి. శనివారాల్లో ఏపనీ తలపెట్టకండి. ఆదివారాలు, సోమవారాలు బాగుంటాయి. మంగళవారము వృత్తిలో మంచి మార్పుల్ని తెచ్చిపెడ్తాయి. నిత్యము లక్ష్మి సహస్రనామ స్తోత్ర పారాయణం అన్ని రంగాల్లో మేలు చేస్తుంది. ఈ పారాయణ మూలంగా స్థిరాస్తి కార్యక్రమాలు మెరుగవుతాయి. వాహనాభివృద్ధికి దోహదం చేస్తుంది. శని బాగాలేడు, శని దానం చేయండి. శనికి తైలాభిషేకం చేయించండి. అని చెప్తారు కొంతమంది. అయితే వాటినేం తలపెట్టకండి. శనిబాగా లేనప్పుడు శనిపూజ చేయించటం వల్ల శని మీకు మేలు చేయకపోగా చేసే కీడు పెరుగుతుంది. మీరు తలపెట్టిన కార్యక్రమాల్లో విఘ్నాలు ఎదురైనప్పుడు మీరు 'పగడం' తో చేసిన గణపతిని ప్రార్థించండి. పగడాన్ని ఉంగరంలో ధరించండి, కుడి చేతికి మాత్రమే ధరించండి. సుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థించండి.

గురువారాల్లో – ముఖ్యంగా మార్చినుంచి నవంబరు వరకు వచ్చే గురువారాల్లో బ్యాంకుల్లో ఓవర్‌డ్రాఫ్ట్ కోసం, అప్పుకోసం ప్రయత్నాలు చేయండి. మీ ప్రయత్నాలు నెరవేర్తాయి. వ్యాపారరంగంలోని వాళ్ళు ఫిబ్రవరి నుంచి జూలై లోపల పెట్టుబడుల్ని పెంచే ప్రయత్నం చేయటం వల్ల అభివృద్ధి కలుగుతుంది. జూలైనుంచి మీమీ పెట్టుబడులకు సరైన లాభాలు ఆర్జించగల్గుతారు. వ్యాపారాభివృద్ధి బాగా జరుగుతుంది. జూన్ 1991 వరకు ఈ లగ్నం వాళ్ళు నూతన వ్యాపారాదుల్లోకి దిగగల్గుతారు. అలా చేయటంకూడా మంచిది. ఉత్పత్తి చేసి దాని మూలంగా ఆదాయం పెంపుదల సాధించదల్చుకున్న వారికి ఎంతో మేలు జరుగుతుంది. 1990 జనవరి నుంచి మీకు

ఎదుర్కోబోయే తీవ్రమనస్తాపాన్ని, ఉద్రిక్తతనూ తగ్గించుకోడం కోసం మీ మనస్సును ఆధ్యాత్మికచింతన వైపు మరలించటం వల్ల మీకెంతో మేలు జరుగుతుంది. 6,1,2,4,7, మేలు చేస్తాయి. '8' అంకెను మీరు జీవితాంతం మరచి పొండి. మీకు మేలు జరుగుతుంది.

సింహం

ఈలగ్న జాతకులకు గురు సంచారం మూలంగా ఈ సంవత్సరం నుంచి మరో మూడు సంవత్సరాలు అన్ని రంగాల్లో ప్రోత్సాహ కరంగా ఉంటుంది. 1990కి ముందే 1989 సెప్టెంబరు నెలలో జరిపిన గ్రహంమార్పు మూలంగా టెన్షన్ నుంచి బయట పడటం ప్రారంభం అయింది. మానసికంగా తీవ్రత తక్కువవటంలోనూ లాభంలో సంచరిస్తున్న గురువు కారణంగానూ మీరు పట్టిందల్లా బంగారం అయ్యేకాలం ఇది. 1-1-90 నుంచి 20-1-90 వరకు, 23-4-90 నుంచి 17-6-90 వరకు, 26-8-90 నుంచి 18-9-90 వరకు, 15-12-90 నుంచి సంవత్సరం చివరి వరకూ ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉండదు. మార్చిలో శని మకరంలోకి ప్రవేశించినప్పు అనగా 20-3-90 వరకు మీకు రకరకాల మార్గాల్లో అందాల్సిన డబ్బు అనుకున్నంత అనుకున్న విధంగా చేతికి అందదు. జూలై నుంచి డిసెంబరు వరకు కూడా ఆర్థికంగా నత్తనడక నడుస్తూంటుంది. 1991 నుంచి మీ ఆర్థిక పరిస్థితులు మెరుగు పడ్తాయి. ఈ సంవత్సరం కుటుంబంలో చిన్నచిన్న కలతలు మనస్పర్థలు ఏర్పడ్తాయి. ఈ విషయంలో జాగ్రత్త వహించగలరు. జనవరి నుంచి 9-2-90 వరకు చిన్న చిన్న ప్రయాణాలు వాయిదాలు పడ్తాయి. ఉద్యోగ, వృత్తి, వ్యాపారాదులకు పనిభారం ఎక్కువవుతుంది. పెరిగి ' చాకిరీకి సరిపోయేవిధంగా ఆర్థికంగా పెంపుదల కనిపించదు. ఏప్రిల్, మే, జూన్, నెలల్లో మీ వ్యాపారము కొంత అభివృద్ధిని సాధిస్తాయి. జనవరి నుండి ఫిబ్రవరి చివరి వరకు మీ పిల్లల ఆరోగ్యం బాగుండదు. వారు మీకు కొన్ని ఇబ్బందులు తెచ్చి పెడ్తుంటారు. అయితే జూలై వరకు మీ పిల్లలు ప్రగతి పథంలో నడుస్తూంటారు. వారి మూలంంగా అభిప్రాయ భావాలు వస్తాయి. స్పెక్యులేషన్ కొంత మెరుగ్గా ఉంటుంది. కోర్టు కేసులు మీకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. జీవిత లేక వ్యాపార భాగస్వామి పురోభివృద్ధిని సాధిస్తారు. మిత్రుల మూలంగా కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్తయి. వాటి నుంచి తట్టుకిని బయటపడ్తారు. లాభంలో సంచరిస్తున్న గురువు కారణంగా చివరి నిమిషంలో ఏదో విధంగా మీకు సహాయం అంది ఇబ్బందుల్నుంచి బయటపడ్తూంటారు. 6-5-90 నుంచి సెప్టెంబరు చివరి వరకూ మీకు బ్యాంకుల ద్వారా కానీ, అప్పుల ద్వారా కానీ డబ్బు రావటం జరగదు. ఆ నెలల్లో మీ మేనమామకు ఆరోగ్యం బాగుండదు. ఆ నెలల్లో మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం బాగుండదు. మీరు చేస్తున్న వ్యాపారం కూడా సజావుగా నడవదు. జూలై నుంచి కోర్టు కేసులకు ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. జూలై వరకు పెట్టుబడుల్ని పెంచటానికి మీరు ఎంతో ఇబ్బందిపడ్తారు. జూలైనుంచి ఇబ్బందులు పడ్తూ వాటిని విపరీతంగా పెంచగల్గుతారు. విద్యార్థులకు జూలై నుంచి అభివృద్ధికరంగా ఉంటుంది. గృహనిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్తి పెంపుదలలకు జూలై నుంచి నవంబరు చివరి వరకు మంచి కాలం. 21-10-90 నుండి 2-1-91 వరకు మీ తండ్రిగారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ఉన్నత విద్యాభ్యాసకులకు ఆ రెండు నెలల్లో అభివృద్ధి కుంటుబడుతుంది. విదేశీయానము వాయిదా పడ్తాయి. పరిశోధనా రంగంలోని వ్యక్తులకు ఆ రెండు నెలలు బాగుండదు. జూలై నుంచి మీ పిల్లలు బాగా అభివృద్ధిలోకి

వస్తారు. వాళ్ళు దూర ప్రదేశాల్లో ఉంటూ చదువుకోవటం మూలంగా వారి కోసం బాగా ఖర్చుచేయాల్సివస్తుంది. పిల్లలతో ఎడబాటు జూలై 1991 వరకు కొనసాగుతుంది అయితే వాళ్ళు అన్ని విధాలుగా అభివృద్ధిలోకి రాగల్గుతారు.

పూజలు, పునస్కారాలు పెంచుకొంటున్న కొద్దీ మీకు తలనొప్పులు పెరుగుతుంటాయి. అయితే ఈ సంవత్సరం ఆధ్యాత్మికంగా మీరు ఎంతో అభివృద్ధిని సాధించగల్గుతారు. విష్ణు సహస్రనామ స్తోత్రపారాయణ నిత్యము కొనసాగించటం మూలంగా మీకు మేలు జరుగుతుంది. శివస్తుతి మూలంగా అప్పులపాలవుతారు. అందువల్ల మీకు జీవితాంతం విష్ణు సహస్రనామ పారాయణ కవచంలా పనిచేస్తుంది. సహజంగా మీకు స్పెక్యులేషన్ మీద ఆసక్తి ఉండదు. మీకు స్పెక్యులేషన్ అంతగా లాభించదు.

జూలైనుంచి తీర్థయాత్రలు చేయగల్గుతారు. అంతవరకూ ఆ విషయంలో తలపెట్టిన ప్రయాణాలు సాగక TENSION ఏర్పడుతుంది. నవంబరు, డిసెంబరు నెలల్లో విద్యార్థులకు విద్య విషయంలో బాగుండటం కోసం కార్తికేయ స్తోత్ర పారాయణ చేయటం ఎంతో అవసరం. బుధవారం మీకు అన్ని విధాలా కలిసి వస్తుంది. మీరు పచ్చ (EMERALD) ధరించటంవల్ల ఎంతో విజయాన్ని సాధించగల్గుతారు. 29-12-89 నుంచి 9-2-90 వరకు శుక్ర వక్రం కోణంగా వృత్తి, ఉద్యోగాదులకు పరిభారం ఎక్కువవుతుంది. మీ నౌకర్లు మీరు చెప్పినట్లు వినరు. హోల్‌సేల్, ఏజెన్సీ వ్యాపారస్థులు 9-2-90 వరకు జాగ్రత్త వహించటం మంచిది.

ఉంగరంలో DIAMOND(వజ్రం) ధరించటం వల్ల మీమీ ఉద్యోగాల్లో రాణింపు పెరుగుతుంది. ముఖ్యంగా కాంట్రాక్టులు చేసేవాళ్ళు ధరించటం మరీ మంచిది. '6' మీకు అదృష్ట సంఖ్య. '3' ఇబ్బందులు కొనితెస్తుంది. '9"6' మంచి చేస్తాయి.

మీరు ఆకుపచ్చరంగునుఎక్కువగా వాడటం వల్ల ధన సంబంధమైన విషయాలు కొంత ముందంజ వేస్తాయి. నస్సువు పచ్చ జోలికి వెళ్ళకండి. నీలం రంగును మీ జీవిత భాగస్వామితో అభిప్రాయభేదాలకు దారితీస్తుంది. ఎరుపు రంగు, పగడం విద్యారంగంలోని వాళ్ళకు మేలు చేస్తుంది. అయితే అది అనవసరమైన ఖర్చులకు కూడా దారితీస్తుంది. 6-5-90 నుండి 24-9-90 వరకు మీ జీవిత లేక వ్యాపార భాగస్వామితోనూ, మీపై అధికారితోనూ వ్యవహరించేటప్పుడు మెలకువగా ఉండండి. మీ హోదాకు, మీ అంచనాకు వాళ్ళు బాగా దిగువలో ఉండటంతో అభిప్రాయభేదాలు వస్తాయి. తస్మాత్ జాగ్రత్త.

కన్య

ఈ సంవత్సరము లగ్నము మీద శని దృష్టి మూలంగా అనుకొన్న ప్రతి పనిలోనూ అడ్డంకులు ఎదురవుతూంటాయి. 20-3-90 నుంచి 22-6-90 వరకు శని మకరంలో సంచరించటం మూలంగా అన్ని పనులు ముందడుగు వేస్తాయి. ఆపైన సంవత్సరం చివరి వరకూ తలపెట్టిన పనులన్నిటిలోనూ ఆలస్యం ఎదురవుతుంది. ఈ సంవత్సరం అంతా దాదాపు మీ ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. అసలే కొంచెం జబ్బు చేస్తేనే ఇంత అయిపోయిందనే మీ తత్వం వాళ్ళు డాక్టరు సలహాను పాటించటం అవసరం. జనవరి 20వ తేదీ వరకు, 23-4-న89 నుంచి 5 మే వరకు, సెప్టెంబరు నెల, డిసెంబరు చివర వారాల్లో మీరు తలపెట్టిన పనులన్నీ వెనకంజలో ఉంటాయి. పై మాసాల్లో వృత్తిరీత్యా పని ఎక్కువ అవుతుంది. పెరిగిన పనికి తగిన విధంగా పారితోషికాలు లభించవు. సరవ

ఇంట్లో సంచరిస్తున్న గురువు ఫిబ్రవరి చివరి వరకూ వక్రంలో సంచరించటం మూలంగా ఉద్యోగస్థులకు శ్రమ అధికంగా ఉంటుంది. అయితే ఉద్యోగ రీత్యా మార్చినుంచి జూలై చివరి వరకు మీ హోదాల్లో అభివృద్ధి వస్తుంది. ప్రమోషన్లు లభించటంతో పాటు సంఘంలో పేరు, ప్రతిష్టలు పెరుగుతాయి. సన్మానాలు లభించటం వంటివి జరుగుతాయి. జూలైనుంచి లాభస్థానంలో గురువు సంచరించటంవల్ల అన్ని విషయాల్లో విజయాన్ని సిద్ధించగల్గుతారు. వ్యాపార లేదా జీవిత భాగస్వామి అన్ని రంగాల్లో విపరీతమైన అభివృద్ధిని సాధించగల్గుతారు. మీ పిల్లలు అభివృద్ధి పథంలో సంచరిస్తారు. మే నుంచి అక్టోబరు వరకు మీ పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సామాన్యంగా మీరూ, మీ పిల్లలకే గల అభిప్రాయభేదాలు పై నెలల మధ్య ఎక్కువగా ఉంటాయి. 9-2-90 వరకు మీరు అనుకున్న ధనం చేతికి అందిరాదు. దూర ప్రయాణాలు వాయిదావడ్తాయి. మీ తండ్రిగారి ఆరోగ్యం ఫిబ్రవరి వరకూ బాగుండదు. ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారికి ఫిబ్రవరి నుంచి బాగుంటుంది. జూలై నుంచి సంవత్సరాంతం విద్యార్థులకు కొంత ప్రోత్సాహకరంగా ఉంటుంది. 21-10-90 నుంచి 2-1-90వరకు మీకోర్టు కేసులు సవ్యంగా సాగవు. ఫిబ్రవరి చివరి వరకూ మీ తల్లిగారి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబంలో మనస్పర్థలు వస్తాయి. గృహ నిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్థి వ్యవహారాలు 1991 వరకూ వాయిదాపడ్తాయి. జనవరి నుండి ఫిబ్రవరి చివరి వరకూ మీ జీవిత భాగస్వామి లేదా వ్యాపార భాగస్వామి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. మార్చి వరకు మీపై అధికారి మూలంగా ఏర్పడే బాధలు ఎక్కువవుతాయి. మే నుంచి అక్టోబరు వరకు ఓవర్ డ్రాఫ్ట్ మీకు దొరకదు. అప్పులు కూడా దొరకటం కష్టం అవుతుంది. 30-11-90 నుంచి 31-3-91 వరకు మీ మిత్రులతోనూ, మీ పెద్దఅన్నగారితోనూ సంబంధించిన వ్యవహారాల్లో జాగ్రత్త అవసరం. ఈ సంవత్సరం వ్యాపార రంగంలోని వాళ్ళకు, కొత్తగా వ్యాపారం తలబెట్టబోతున్న వాళ్ళకు ఎంతో బాగుంటుంది.జూలై నుంచి వ్యాపారాభివృద్ధి జరుగుతుంది. స్పెక్యులేషన్ బాగుంటుంది.

అక్టోబరు చివరి నుంచి మీ ఇరుగు పొరుగువారితో వ్యవహరించేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. హోల్‌సేల్, ఏజెన్సీ వ్యాపారాలు చేసేవాళ్ళు కూడా నవంబరు, డిసెంబర్లలో అప్రయత్నంగా ఉండటం అవసరం. ఈ ఏడాది మిత్రుల మూలంగా కొన్ని చికాకులు ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యార్థులకు విద్య అనుకొన్న విధంగా సాగదు. వ్యాపారాల్లో పెట్టుబడులు అభివృద్ధి చేసుకోటానికి ఈ ఏడాది ఎంతో ఉపయోగపడ్తుంది. దోహదం మీకు చేస్తుంది. గడిచిన రెండు సంవత్సరాల్లో మీ పెట్టుబడుల్ని పెంచే ఆలోచనను ఏ మాత్రం కొనసాగించలేకపోయారు. ఆ లోటు ఈ ఏడు తీరుతుంది. జూలై నుంచి కొంత ప్రోత్సాహకరంగా నడిచి 1991 నుంచి చాలా బాగుంటుంది.

విష్ణు సహస్రనామ పారాయణ మీ ఉద్యోగాభివృద్ధినిస్తుంది. పచ్చ ధరించటం మూలంగా ఉద్యోగ విషయాలు కొంత సాఫీగా నడుస్తాయి. మీ జీవితంలో పగడం ధరించకండి. నీలం జోలికి పోకండి. నీలం ధరించటం మూలంగా మీ సంతానంలో అభిప్రాయభేదాలు ఎక్కువవుతాయి. మీకు పుష్యరాగం సరికి వస్తుంది. ముఖ్యంగా జూలై నుంచి పుష్యరాగం ధరించటం మూలంగా ఎన్నోరకాలుగా జీవితంలో విజయాల్ని చవి చూడగల్గుతారు. ఐదవ ఇంట్లో రాహువు సంచారం కూడా ఈ ఏడు బాగుంటుంది. వ్యాపారాదుల్లో కలిసివస్తుంది. నల్ల ధనాన్ని కూర్చుకోగల్గుతారు. అయితే నూతన దంపతుల్లో భార్య లగ్నం కన్య అయితే ఆ కన్యా లగ్న జాతకురాలు డాక్టరును సంప్రదించటం ఎంతో

అవసరం, ముఖ్యంగా కనబోయే పిల్లల విషయంలో

మంగళ వారాల్లో ఏ పనులూ చేపట్టకండి. సోమవారాలు మీకు ఎంతో లాభాల్నిస్తాయి. ఆది వారాల్లో మీ పెట్టుబడుల్ని పెంచండి. శుక్రవారాల్లో మీ ధనం అభివృద్ధి చెందుతుంది. గురు వారాల్లో కొంత వ్యతిరేకత (Opposition) చవిచూసిన విజయం లభిస్తుంది.

ఫిబ్రవరి నెలలో చిన్న చిన్న ప్రయాణాలు ఏర్పడే సూచనలున్నాయి. వాహనాల్లో సంచరించేటప్పుడు జాగ్రత్త అవసరం మార్చి నెల చివరి వరకూ స్థిరాస్తికి సంబంధించిన కోర్టు చిక్కులు ఏర్పడ్తాయి. ఏప్రిల్ నెలలో మీ పిల్లల మూలంగా ఇబ్బందులు ఏర్పడ్తాయి. జూన్ నెలలో మీ వ్యాపార భాగస్వామితో జాగ్రత్త అవసరం. పెళ్ళికాని ఆడపిల్లలకు 1991 ఆశాజనంగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు దొరుకుతాయి. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో విదేశీయానాలు, దూర ప్రయాణాలు తలపెట్టకండి. వెంటనే ఒక బుధవారం నాడు విష్ణు సహస్రనామ పారాయణ మొదలు పెట్టటం మూలంగా మీకు ఎంతో మనశ్శాంతి దొరుకుతుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. మొత్తం మీద 1990-1991 సంవత్సరాలు అభివృద్ధిని తెచ్చిపెడ్తాయి.

తుల

ఈ సంవత్సరము జనవరి నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు లగ్నాధిపతి వక్రంలో సంచరించటం మూలంగా ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. కోర్టుకు సంబంధించిన వ్యవహారాలు సవ్యంగా సాగవు. చేపట్టిన పనులు ఏవీ సాగవు. మీమీ ఆలోచనలు సక్రమంగా సాగవు. ఈ సంవత్సరం మీ ధనాదాయం అక్టోబరు వరకు బాగుంటుంది. నవంబరు, డిసెంబరు నెలల్లో చేతిలో డబ్బు ఆడక ఇబ్బందిగా ఉంటుంది. ఆ రెండు నెలలు కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్యం బాగుండదు. ముఖ్యంగా మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం గురించిన శ్రద్ధ ఎంతో అవసరం. ఆ రెండు నెలల్లో మీ పై అధికారితో వ్యవహరించేటప్పుడు జాగ్రత్త వహించండి. తృతీయ షష్ఠమాధిపతి గురువు జూలై వరకు మిధునంలో సంచరించటం మూలంగా కాంట్రాక్టులు, హోల్ సేల్, ఏజెన్సీ వ్యాపారస్థులకు మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలు పోత్సాహకంగా ఉంటాయి. ఈ సంవత్సరం మీ సోదరులు మంచి అభివృద్ధిని సాధిస్తారు. అయితే మార్చి వరకు మీరు అనుకున్న ప్రయాణాలు ఏవీ సాగవు. 25-2-90 వరకు ఓవర్ డ్రాఫ్ట్ దొరకటం, బయటవ్యక్తుల ద్వారా అప్పులు దొరకటం సాగవు. మే నుంచి అక్టోబరు వరకు గృహ నిర్మాణాలు, స్థిరాస్తి వ్యవహారాలు చురుకుగా సాగవు. ఆ నెలల్లో వ్యాపారాదుల్లో కొంత వెనకడుగ్గా ఉంటుంది.

మీ పిల్లల ఆరోగ్యం జాగ్రత్త. స్పెక్యులేషన్ జోలికి ఆ నెలల్లో వెళ్ళకండి. ఆ ఆరు నెలలో మీకు ఆధ్యాత్మికంగా ప్రగతికి అవరోధాలు ఏర్పరుస్తాయి. పోటీ పరీక్షలకు హాజరయిన విద్యర్థులు మరోసారి ప్రయత్నించాల్సి వస్తుంది. నాలుగో ఇంట్లో రాహువు సంచారం వల్ల దొంగల మూలంగా బాధను ఎక్కువగా ఎదుర్కోవాల్సివస్తుంది. రహస్యంగా కొంత ఆస్తిని ఏర్పరచుకోగల్గుతారు. విద్యార్థులు ఈ సంవత్సరం బాగా కృషి చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. తొమ్మిది, పన్నెండు ఇంటివాడయిన బుధుడు వక్రగతిలో సంచరిస్తున్న రోజుల్లో అనగా జనవరి 1, నుంచి 20 వరకు, ఏప్రిల్ 23 నుంచి మే 17 వరకు, అగస్టు26 నుంచి సెప్టెంబరు 18 వరకు, డిసెంబరు చివరి రెండవ వారాల్లో మీ తండ్రిగారి

ఆరోగ్యంలో శ్రద్ధ కనబరచండి. మీరు తలపెట్టిన విదేశీయానాలు చురుగ్గా సాగవు. ఉన్నత విద్యాభ్యాసకులకు ఏ నెలల్లో అంత ప్రోత్సాహకరంగా ఉండదు. వ్యాపారాదుల్లో పెట్టుబడులు పెట్టలేకపోతారు. జూలై వరకు వృత్తిరీత్యా ఉద్యోగరీత్యా ఎంతో చికాకులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దాంతో చాలామంది తమ పాత ఉద్యోగులకు స్వస్తి చెప్పి జూలై తర్వాత నుంచి కొత్త ఉద్యోగాల్లోకి చేరిపోవటం జరుగుతుంది.ఓర్పు చాలా తక్కువగా ఉన్న ఈ లగ్న జాతకులు ఉద్యోగరీత్య tension ఎదుర్కోలేక, భేదాభిప్రాయాల కారణంగా ఉద్యోగాలకు రాజీనామాలు ఇవ్వాల్సి వస్తుంది. అగస్టు నుంచి ఉద్యోగరీత్యా కొంత మెరుగుదలతోపాటు ప్రమోషన్లు కూడా లభిస్తాయి. సంఘంలో పేరు, ప్రతిష్టగౌరవాలు నిలబెట్టుకోగల్గుతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. 6-5-90 నుంచి24-8-90 వరకు మీ తల్లిగారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. హృద్యోగ నిపుణునికి అందుబాటులో ఉండటం ఎంతో అవసరం. పరిశోధనా రంగంలో కృషి చేస్తున్న వ్యక్తులకు ఈ సంవత్సరం ఎంతో మేలు చేస్తుంది. ఈ సంవత్సరం మే నెలలో అభివృద్ధిని అన్ని రంగాల్లోని వ్యక్తులు సాధించగల్గుతారు. ఆధ్యాత్మికంగా కూడా మీరు అడుగు ముందుకు వేయగల్గుతారు. 30-1-90 నుంచి 31-3-91 వరకు వృత్తి, ఉద్యోగాల్లో పనిభారం, ఒత్తడి ఎక్కువగా ఉంటుంది. పెరిగిన పనిభారానికి చేసిన కృషికి మంచి పేరు లభిస్తుంది కానీ రాబడి పెరగటం ఆ రోజుల్లో కొంత కష్టం అవుతుంది. ఉద్యోగ రీత్య చికాకులు తప్పవు. అయితే గురువు కర్కాటకంలోకి ప్రవేశించినప్పటి నుంచీ స్థిరాస్తి వ్యవహారాలు సాగుతాయి. ఉద్యోగస్థులకు కొంత మనశ్శాంతి చేకూరుతుంది. విద్యాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది జూలై నుంచి.

ఆదివారాలు మీకు మేలును తెచ్చిపెడ్తాయి. సోమవారాలు కీర్తిని పెంచుతాయి. శుక్రవారాల్లో స్వయంకృత అపరాధాలకు గురి కాబడ్తారు. శని వారాలు స్థిరాస్తి వ్యాపారాలకు ఎంతో దోహదం చేస్తాయి. ఓవర్ డ్రాఫ్ట్ కోసం గురువారాల్లో ప్రయత్నించండి. మంగళవారాలు ధనాన్ని తెచ్చిపెట్టినా ఖర్చును కూడా పెంచుతాయి. మార్చి నెలలో స్థిరాస్తికి సంబంధించిన కోర్టు కేసులు ఏర్పడ్తాయి. ఏప్రిల్ లో వ్యాపారంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జూన్, జూలై మాసాల నుంచి ఇంట్లో శుభకార్యాల కోసం ఖర్చు చేయాల్సివస్తుంది.

ఈ ఏడాది వ్యాపారాభివృద్ధిని సాధించగల్గుతారు. మీ ఇంటి ప్రక్కనున్న వాళ్ళు, మీ సోదరులు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటారు. వ్యాపారస్థులు పెట్టుబడుల్ని 1990లో కాకుండా 1991 పెంచుకొంటే ఎంతో మంచిది.

విద్యారంగాలలోని కొందరు వ్యక్తులకు మంచి సన్మానాలు జరుగుతాయి.

మీమీ ఉంగరాల్లో కెంపులు ధరించటంవల్ల లాభకరంగా ఉంటుంది. నీలం స్థిరాస్తిని, చదువునీ పెంపొందిస్తుంది. అయితే నీలం ధరించడం వల్ల వేగం తగ్గుతుందని గమనించగలరు. అందువల్ల విద్యార్థులకు ముఖ్యకారకుడైయిన గురువును సూచించే పుష్యరాగం గల ఉంగరం మేలు చేస్తుంది. విద్యాభివృద్ధిని యిస్తుంది. వజ్రాలు(DIAMOND) స్వయంకృతాపరాధాల్ని తెచ్చిపెడ్తుంది.

3,1,4,2,7,9 వరుసగా అదృష్ట సంఖ్యలు. '6' లగ్నాధిపతిని సూచించినా అష్టమాధిపతిని కూడా సూచించటం వల్ల '6' మీకు అంతగా బాగుండదు. '5' అంకె కుడా బాగుండదు. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కోసం సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణ ,ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణ మేలును చేస్తుంది. లలితా సహస్ర నామాలు నిత్యము పారాయణ చేయడం వల్ల మీ ఉద్యోగాల్లో రాణింపు పెరుగుతుంది.

వృశ్చికం

ఈ సంవత్సరము లగ్నాధిపతికి అక్టోబరు వరకు వక్రగతి లేనందున ఆరోగ్యము బాగా ఉంటుంది. నవంబరు, డిసెంబరు నెలల్లో మీరు తలపెట్టిన పనులు సాగక అలసట చెందాల్సి వస్తుంది. సుమారు ఒకటిన్నర సంవత్సరాల నుంచి ధన సంబంధమైన చికాకులు ఎదుర్కొంటున్న మీకు ఏప్రిల్, మే, జూన్ నెలలు కొంత వెసులుబాటును యిచ్చి మీకు రావల్సిన డబ్బు చాలాభాగం మీ చేతికి అందేట్లు మీ స్నేహితుల్లాగా ఆదుకొంటాయి. ఆ మూడు నెలలు ధన సంబంధంగా అభివృద్ధిని కూడా సాధిస్తారు. కుటుంబంలో అశాంతి వాతావరణం ఎదుర్కొంటున్న వారికి కొంత మనశ్శాంతి చిక్కుతుంది. ఏల్నాటి శని బాధ నుంచి మూడు నెలల విశ్రాంతి దొరుకుతుంది. 1990 చివర నుంచి ఏల్నాటి శని బాధ నుంచి విముక్తి పొందుతారు. కంట్రాక్టర్లకు, ఏజెన్సీలు, హోల్‌సేల్ వ్యాపారస్థులకు సమయానికి అందాల్సిన డబ్బు అనుకున్న విధంగా చేతికి అందిరాదు. చివరి నిమిషం దాకా tension ఉంటుంది. అయితే గురు దృష్టి కారణంగా డబ్బు కోసం ఏ పనులూ ఆగకుండా ముందుకు నడుస్తాయి. గృహ నిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్థి వ్యవహారాలు నత్తనడకలా సాగుతూంటాయి. విద్యార్థులకు చదువు సక్రమంగా సాగదు. ఈ విషయంలో 'కార్తికేయ స్తోత్ర పారాయణ' ఎంతో మేలు చేస్తుంది. అష్టమంలో గురు సంచారం మూలంగా ధనానికి కొంతగా ఇబ్బందిపడినట్లు అనిపిస్తుంది. పిల్లలు కొన్ని ఇబ్బందులు తెచ్చి మీ నెత్తి మీద పెడ్తారు. వ్యాపారాదుల్లో కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జూలై నుంచి వ్యాపారాభివృద్ధి జరుగుతుంది. 25-2-90 వరకూ కుటుంబంలో అశాంతి ఎక్కువగా ఉంటుంది. కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్యం బాగుండదు. మార్చి వరకు మీ పిల్లల ఆరోగ్య విషయంలో కూడా శ్రద్ధ అవసరం. మే నుంచి అక్టోబరు వరకు మీ క్రింద పని చేసే వాళ్ళతో జాగ్రత్తగా ఉండండి. మీ ఇంటి ప్రక్కన నివసిస్తున్న వాళ్ళు కూడా మీతో సవ్యంగా వ్యవహరించరు. ఏజెన్సీలు చేసే వాళ్ళు ఈ సంవత్సరం ఎలాంటి అభివృద్ధిని సాధించలేరు. ముఖ్యంగా మే నుంచి అక్టోబరు లోపల. జనవరి, ఫిబ్రవరి నెలలో మొదటి వారం వరకు మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం జాగ్రత్త. మీ పై అధికారితో మెలిగేటప్పుడు కొంత జాగ్రత్త అవసరం. వ్యాపారస్థులు ఫిబ్రవరి నెలకు వారం తర్వాతనే మీ పెట్టుబడులను పెంచే ప్రయత్నాలు చేయటం మంచిది. గురువు జూలై తరువాత నుండి కర్కాటకంలో సంచరిస్తున్నప్పటి నుండి మీరు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగల్గుతారు.

మీ పిల్లలు, మీ వ్యాపారం మొదలైనవి ప్రగతిపథంలో. నడవటం శుభారంభం అవుతుంది. రకరకాల పుణ్యక్షేత్ర సందర్శన చేస్తారు. వ్యాపార రీత్య ఇతర దేశాలు దర్శించగల్గుతారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి ప్రోత్సాహకంగా నడుస్తుంది. బుధుడు వక్ర మార్గంలో సంచరించటం ఈ సంవత్సరం నాలుగు సార్లు జరుగుతుంది. ఆయా తేదీల మధ్య మీకు సంబంధించిన కోర్టు కేసులు వక్ర మార్గంలో నడుస్తాయి. మీ చేతికి అందాల్సిన లాభాలు అందటంలో కూడా బాగా ఆలస్యం జరుగుతుంది. 1990 వరకు కోర్టులో తెలాల్సిన మీ కేసులు తేలవు. వాయిదాల మీద వాయిదాలు పడ్తుంటాయి. జూలైనెలలో వృత్తిరీత్య కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. కొందరు రాజీనామా చేస్తారు. తండ్రిగారి ఆరోగ్యం గురించిన ఆందోళన ఈ సంవత్సరం అంతా కొనసాగుతుంది. మీ సోదరులు కొందరు అపసవ్యమార్గంలో నడవటం ప్రారంభిస్తారు. 30-11-90 నుంచి తప్పకుండా

మీ తండ్రిగారి ఆరోగ్య విషయంలో ఎంతో జాగ్రత్త అవసరం, 31-3-91 వరకు. ఉద్యోగస్థులకు జూలై తర్వాత పై వారాలకు మార్పులతో పాటు ఊరు మార్పు కూడా జరుగుతుంది. జూలై నుంచి డిసెంబరు వరకు మీరు తలపెట్టే ప్రయాణాలు బాగా జరుగుతాయి. అయితే ప్రయాణాల్లో సొమ్ము పోగొట్టుకోవాల్సిన యోగం కనిపిస్తోంది. ఈ విషయంలో కూడా జాగ్రత్త అవసరం. జూలై నుంచి మీ సోదరులు కూడా మంచి అభివృద్ధిని సాధించగల్గుతారు.

మీకు పుష్యరాగం గల ఉంగరం ధరించటం మూలంగా ధన సంబంధమైన, కుటుంబ సంబంధమైన విషయాలు కొంత మెరుగుపడ్తాయి. వ్యాపారాభివృద్ధి చేయగలుగుతారు. కెంపు మీ ఉద్యోగంలో రాణింపు తెస్తుంది. ముత్యం మీ ఉన్నత విద్యకు మంచి త్రోవను వేస్తుంది. ఈ లగ్న జాతకులు పుష్యరాగం, ముత్యం కలిపిన ఉంగరం ధరించటం వల్ల ఉన్నత విద్యాభ్యాసంలో ఎంతో రాణింపుకురాగల్గుతారు. DIAMONDS ఇహలోక సుఖాలకు ఖర్చులను ఎక్కువచేస్తాయి. పెళ్ళి కావలసిన ఈ లగ్న జాతకులు DIAMONDS పెట్టుకోవడం మేలు చేస్తుంది. పుష్యరాగం కూడా కుటుంబాభివృద్ధిని ఇస్తుంది.

పసుపు పచ్చరంగు వాడటం మంచిది. ఆకుపచ్చ కొన్ని ఇబ్బందుల్ని తెచ్చినా చివరకు ఆ ఇబ్బంది అనుకూలంగా లాభం తెచ్చిపెడ్తుంది. విష్ణు సహస్ర నామం కూడా మేలు చేస్తుంది. సుబ్రహ్మణ్యస్వామిని సేవించటం మూలంగా ప్రత్యర్థుల మీద అన్ని రంగాల్లో మీకు విజయం సాధించగల్గుతారు. ఆదిత్య పారాయణ మీ ఉద్యోగంలో అభివృద్ధినిస్తుంది. ఈ లగ్న జాతకులయిన నిరుద్యోగులు అనునిత్యము ఆదిత్య పారాయణ చేయటం మంచిది.

గురువారాలు బాగుంటాయి. బుధ వారాలు ఇబ్బందులతో కూడిన లాభాల్ని తెచ్చిపెడ్తాయి. సోమవారం పుణ్యతీర్థ సందర్శన చేయిస్తుంది. మంగళవారం మీకు మంచిదే. ఆదివారం సంఘంలో మీ గౌరవాన్ని పెంచుతుంది. శుక్రవారం విలాసాల కోసం ఖర్చులు తెచ్చిపెడ్తుంది.

9,3,1,4, శుభ సంఖ్యలు.

ధనుస్సు

ఈ లగ్న జాతకులకు ఫిబ్రవరి చివరి వరకు లగ్నాధిపతి వక్రంలో ఉండటం మూలంగా ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. లగ్నంలో శని చరిస్తూండటంవల్ల తిరగలిగే అన్ని అవకాశాలున్నా ఏదో రకంగా సమయానికి తిండి తినలేక పోవడంవల్ల ఏ పని తలపెట్టిన సాగక పోవటం, అడ్డంకులు ఎదురవటం మూలాన నిరాశ ఏర్పడ్తుంది. అయితే చివరి క్షణాన ఎవరో భగవంతునిలాగా వచ్చి ఆదుకోవడంతో పనులు గట్టెక్కుతుంటాయి. ఈ ఇబ్బందులు కొంత మే, జూన్, జూలై నెలలో గట్టెక్కినా 1990 డిసెంబరు వరకూ తప్పవు. ఏల్నాటి శనిలో మూడొంతుల్లో రెండు వంతులు ముగిసాయి.1990 జూలై నుంచి మరికొంత మెరుగ్గా ఉంటుంది. మీ తల్లిగారి ఆరోగ్య విషయంలో కూడా గట్టి శ్రద్ధ అవసరం. వృత్తికి సంబంధించిన విషయాలు వేగంగా సాగవు. నిరుద్యోగులు ఏడాది ఓపిక పట్టాల్సిందే. ఉద్యోగం చేస్తున్న వాళ్ళ ప్రమోషన్ కొరకు ఎదురు చూచి ఎదురు చూచి విసుగు చెందుతుంటారు. మీకంటే తక్కువ

హోదాలో ఉన్న వాళ్ళు మీకంటే ముందుగా పై అధికారంలోకి మారుతుండటం మీరు గమనిస్తుంటారు. ఈ లగ్న జాతకులయిన ఆడపిల్లలు ముఖ్యంగా పెళ్ళికాని వాళ్ళు విష్ణు సహస్ర నామ పారాయణ చేయటం వల్ల త్వరగా పెళ్ళి ఏర్పాట్లు జరిపించుకొన్న వాళ్ళు అవుతారు. 1990 కంటే 1991 తర్వాత మీకు బాగుంటుంది. కంట్రాక్టులు, ఏజెన్సీలు చేసే వాళ్ళకు కొంత ప్రతిబంధకంగా నడుస్తూంటుంది. మే నుంచి అక్టోబరు వరకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయి. ఆతర్వాత గుప్తధనం బాగా సంపాదించగల్గుతారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో వ్యాపారస్థులు తమ వ్యాపారాల్లో పెట్టుబడులు పెంచలేకపోతారు. వ్యాపారం ఆ నెల్లో వెనుకడుగ్గా ఉంటుంది. జనవరి 90లో అప్పులు దొరకడం కష్టం. మీకు అందాల్సిన లాభాలు మీకు ఏమాత్రం అందుబాటులోకి రావు. బ్యాంకుల్లో ఓవర్‌డ్రాఫ్ట్ దొరకదు. 25-2-90 వరకు విద్యార్థులకు సరిగ్గా చదువు సాగదు. ఆతర్వాత 30-11-89 నుంచి 31-3-91 వరకు విద్యార్థులు విద్యావిషయంలో శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉంటుంది. గృహనిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్తి వ్యవహారాలు పైరోజుల్లో సవ్యంగా సాగవు. 1-1-90 నుంచి 21-1-90 వరకు, 23-4-90 నుంచి 17-5-90 వరకు, 26-8-90 నుంచి 18-9-90 వరకు 15-12-90 నుంచి 4-1-91 విశ్రాంతి లేకుండా ఉద్యోగరీత్యా పని చేయాల్సివస్తుంది. ఆ చేసిన పనికి హెచ్చు పారితోషికాలు లభించవు. ఈలగ్న జాతకులయిన రచయితలకు ఈ సంవత్సరం అంత ప్రోత్సాహకరంగా ఉండదు. ఈ సంవత్సరం మీరు ఇంతకు ముందు సంపాదించుకున్న పేరు ప్రతిష్ఠలకు కొంత భంగం వాటిల్లుతుంది. జూలై 1990 నుంచి అనుకోని విధంగా కొన్ని కోర్టు కేసులు ఎదురవుతాయి. స్వయంగా మీరు తలపెట్టిన అనేక కార్యక్రమాల్లో విజయవరం వరలు లభిస్తాయి. అయితే ఎంతో శ్రమపడాల్సి ఉంటుంది మీరు. ఎన్నో చిక్కులు, ఇబ్బందులు చుట్టు ముడ్తాయి. కొన్ని పనుల మూలంగా మీకు మీరే ఇబ్బందుల్లో ఇరుక్కుపోతారు. అయితే చివరి నిమిషంలో బయట పడగల్గుతారు. గురువు జూలై నుంచి కర్కాటకంలో సంచరిస్తూ కేతువుతో కలిసి ఉండటం వల్ల లేనిపోని మానసిక తీవ్రతకు, ఉద్రిక్తతకు గురికావల్సి వస్తుంది. ఈ సంవత్సరం ఆధ్యాత్మికంగా ఎంతో ముందడుగు వేయగల్గుతారు. మార్చి 90 వరకు మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం జాగ్రత్త. వ్యాపార భాగస్వామితో సంచరించేటప్పుడు జాగ్రత్త అవసరం. మీ పై అధికారితో సంచరించేటప్పుడు కూడా ఎంతో మెలకువ అవసరం. ఆయన మిమ్మల్ని అపార్థం చేసుకొన్నా మీరు కోటలో పాగా వేయగల్గుతారు. డిసెంబరు 90 నెలలో కూడా చాలా శ్రమ పడాల్సి వస్తుంది.

నిరుద్యోగులకు విష్ణు సహస్రనామ పారాయణ ఎంతో మేలు చేస్తుంది. ఉద్యోగంతో పాటు పేరు ప్రతిష్ఠలు పొందుతాయి ఆపారాయణ మూలంగా. ఆదిత్య హృదయం పారాయణ చేయటం మూలంగా మీ ఉన్నత విద్యలో అభివృద్ధిని సాధిస్తారు. విదేశీయానాలు చేయగల్గుతారు. మంగళవారాలు ఖర్చులు పెంచుతాయి. గురువారాలు స్థిరాస్తిని పెంచుతాయి. శుక్రవారాలు లాభకరంగా ఉంటాయి. బుధవారాలు ఉద్యోగరీత్యా అనుకూల వాతావరణాన్నిస్తాయి.

ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నవాళ్ళు 'పచ్చ'ను తమ ఉంగరాల్లో ధరించటం మూలంగా విజయం సాధించుకోగల్గుతారు. పుష్యరాగం మీకు అన్ని రకాలుగా ఉపయోగపడ్తుంది. 'వజ్రాలు' మీకు బాగా సరిపోతాయి, ఆరోగ్యరీత్యా తప్ప. 'ముత్యాలు' ధరించకండి. అవి మీకు ఇబ్బందుల్ని కొని తెస్తాయి. కెంపులుకూడా మీకు

పనికి వస్తాయి. 'నీలం' ధరించటం కన్నా గోమేధికం ప్రస్తుతం మీకు గుప్తధనాన్ని తెచ్చిపెట్టగల్గుతుంది. 'నీలం' ధనస్థానాన్ని సూచిస్తున్నా డబ్బు మీకు చేరటానికి ఆలస్యాన్ని పెంచుతుంది. ద్వితీయంలో రాహువు సంచరిస్తున్నాడు కాబట్టి గోమేధికం ప్రస్తుతం మీకు మంచిది.

వాహనము కొనుక్కోదల్చుకొన్న వాళ్ళకు జూలై 1990 నుంచి చాలా అనుకూలంగా ఉంటుంది.

3,6,5, వరుసగా అదృష్ట సంఖ్యలు. '9' ఖర్చులు పెంచుతుంది. 2,7 అంకెలు ఇబ్బందుల్ని తెచ్చిపెడ్తాయి. '8' అంకె ధనాన్ని తెచ్చి పెడ్తుంది. '5' మీకు గౌరవాన్ని, సంఘంలో పేరు, ప్రతిష్ఠల్ని పటిష్ఠం చేస్తుంది. 1,4 అంకెలు మీ ఉన్నత విద్యను అభివృద్ధి చేయటంతో పాటు దూరప్రయాణాలకు దోహదం చేస్తాయి.

మకరం

లగ్న, ధనాధిపతి శని వ్యయభావంలో సంచరిస్తూండటం మూలంగా మీకు సంబంధించిన అన్ని విషయాల్లో అసంతృప్తి నెలకొని ఉంటుంది. సుమారు రెండు సంవత్సరాల నుంచి మీకు ధన సంబంధమైన విషయాల్లో ప్రోత్సాహం లేదు. కుటుంబానికి సంబంధించిన విషయాల్లో ప్రశాంతత లోపించి ఉంది. దీనికి తోడు పల్నాటి శని ప్రారంభం కూడా అయింది. వ్యాపారాదుల్లో పెట్టుబడులు మార్చి చివరి వరకూ పెంచే ప్రయత్నం చేయకండి. ఏప్రిల్ నుంచి జూలైలోపల మీ పెట్టుబడులు బాగా పెరుగుతాయి. మీ ఆరోగ్య విషయంలో కూడా ఈ ఏడాది శ్రద్ధ అవసరం. 6-5-90 నుంచి 24-9-90 వరకు శని వక్రగతి కారణంగా అప్పుడు మీరు తలపెట్టిన ఏ పనీ సాగదు. డబ్బుకు సంబంధించిన ఇబ్బందులు ఎదురవుతాయి. కుటుంబంలోని వ్యక్తుల నడతలో మార్పులు మీరు గమనిస్తారు. 21-10-90 నుంచి 2-1-91 వరకు మీ తల్లిగారి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. మీ మిత్రులతో సంచరించేటప్పుడు జాగ్రత్త కూడా అవసరం మీ చేతికి అంది వచ్చే లాభాలు అక్టోబరు నెలలోపల వరకే పరిమితం అయి ఉంటాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో ఎలాంటి గృహ నిర్మాణ కార్యక్రమాలు పెట్టుకోకండి. పొలాలు, ప్లాట్లు కొనే ప్రయత్నాలు వాయిదా పడ్తాయి. మార్చి వరకు మీ సహోదరులకు ఆరోగ్యం బాగుండదు. మీరు తలపెట్టిన ప్రయాణాలు వాయిదాపడ్తూంటాయి. ప్రయాణాలు చికాగ్గా సాగుతాయి. కంట్రాక్టర్లకు, ఏజెన్సీ వ్యాపారస్థులకు బాగా సాగదు. మీకు చేరాల్సిన వార్తలు కూడా సవ్యంగా చేరక ఇబ్బందిని కలుగచేస్తాయి. అయితే జూలై నుంచి గురు సంచారం బాగుండటం వల్ల మీరు, మీ పై అధికారికి మీ వ్యాపార భాగస్వామి, మీ జీవిత భాగస్వాములు ఎంతో మంచి అభివృద్ధిని సాధించగల్గుతారు. మీ పెట్టుబడులు పెరుగుతాయి. విద్యారంగంలో కృషి చేస్తున్న వారికి ఎంతో మేలు జరుగుతుంది. కుటుంబ విషయాల్లోనే కాకుండా మీకు సంబంధించిన ఎన్నో విషయాల్లో విశ్రాంతి, మనశ్శాంతి దొరుకుతుంది. అష్టంలో రాహు సంచారం మూలంగా చోరభయం ఉంది. జాగ్రత్త వహించండి. జూలై వరకు మీ వ్యాపారభాగస్వామి మీకు తలనొప్పిలాగా తయారవుతారు. కొందరు వ్యాపారస్థులు తమతమ వ్యాపారభాగస్వాముల్ని మార్చుకోవాల్సి వస్తుంది. జనవరి, ఫిబ్రవరి మొదటివారం వరకు ఉద్యోగస్థులకు పనిభారం ఎక్కువగా ఉంటుంది. వ్యాపార రంగంలోని వాళ్ళకు కొంత వెనకడుగ్గా ఉంటుంది. పిల్లల ఆరోగ్య విషయాల్లో జాగ్రత్త అవసరం. స్పెక్యులేషన్ జోలికి వెళ్ళకండి. సినీ రంగంలోని వ్యక్తులకు కూడా ఫిబ్రవరి 9 వరకు మంచి కాలం

కాదు. ఈ సంవత్సరం మీరు తలపెట్టిన దూర ప్రయాణాలు వాయిదాలు పడ్తాంటాయి. ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న వాళ్ళు మెలకువగా ఉండాలి. విద్యార్జనకు ఎన్నో అడ్డంకులు వస్తాయి. మీ తండ్రిగారి ఆరోగ్య విషయంలో ఈ సంవత్సరం అంతా ఎంతో శ్రద్ధ అవసరం. 30-11-90 నుంచి 31-3-91 వరకు మీ జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. జూలై నుంచి జీవితంలో విజయాలు వరించటం మీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఏప్రిల్ నెల మీకు లాభాకరంగా గడుస్తోంది. మే నెల మీ ఆధ్యాత్మికతను బాగా పెంచుతుంది. జూలై తర్వాత ఈ లగ్న జాతకుల్లో నాస్తికులున్న వాళ్ళు ఆస్తికులుగా మారిపోవటం ఖాయం. ఏడవ భాగం కేతువు సంచారం మూలంగా మీరుఎవరితోనైన సంబంధాలు పెంచుకోవటం వల్ల చికాకు ఏర్పడుతుంది. మీమీ ప్రత్యర్థుల మూలంగా tension తప్పదు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు మనశ్శాంతి లేకుండ చేస్తారు మీ ప్రత్యర్థులు. ఆగస్టు నెల మీ స్థిరాస్తి అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తోంది. మే నెలలో స్థిరాస్తికి సంబంధించి కోర్టు కేసులు, ఇబ్బందులు వస్తాయి. ఆగస్టు నెల మాత్రం ప్రత్యర్థుల విషయంలో జాగ్రత్త అవసరం. మనశ్శాంతి లేకుండా చేస్తారు.

ఈ లగ్న జాతకులు 'పగడం' ధరించడం వల్ల ప్రత్యర్థుల మీద విజయాలు సాధించగల్గుతారు. వారి తెచ్చిపెట్టే చికాకుల నుంచి విముక్తి పొందగల్గుతారు. 'పగడం' స్థిరాస్తిని పెంచగల్గుతుంది. ఉద్యోగాభివృద్ధి కోసం, సంఘంలో పేరు ప్రతిష్ఠల కోసం మీరు 'వజ్రాల్ని' మీ ఉంగరాల్లో ఉంచి ధరించండి. మీ వ్యాపారాభివృద్ధికి 'వజ్రం' బాగా పనికి వస్తుంది. 'పచ్చ' కొంత ఆరోగ్య భంగం కలిగించినా భాగ్యాన్ని తెచ్చిపెడ్తుంది. మకర లగ్న జాతకులు ఎప్పుడూ కెంపుల్ని ధరించకండి. అవి లేనిపోని ఇబ్బందుల్ని తెస్తాయి. ముత్యాలు అపోజిషన్‌ను పెంచుతాయి. అందువల్ల వజ్రాలు(DIAMONDS) పగడాలు(CORALS) మీకు బాగా సరిపడ్తాయి. పుష్యరాగం ఈ సంవత్సరం జూలై నుంచి 1991 జూలై వరకు ధరించండి. మేలు జరుగుతుంది.

మంగళవారాలు, మీకు మేలు చేస్తాయి. ఆదివారాల్లో ఏ పనీ పెట్టుకోకండి. సోమవారాలు కూడా అవసరమైతే కొత్త వ్యవహారాలు పెట్టుకోండి. బుధవారాల్లో మీ ప్రత్యర్థులపై మీరు విజయం సాధించగల్గుతారు. గురువారాలు అన్నీ రకాల ప్రయాణాలకు మంచిది.

మీకు 'సుబ్రహ్మణ్య స్వామి సహస్రనామ పారాయణ' కవచంలా పనిచేస్తుంది. 'లక్ష్మి సహస్ర నామం' కూడా అభివృద్ధినిస్తుంది. పెళ్ళికాని యువకులు,యువతులు మీరు ఏడాది వరకు అలాంటి ప్రయత్నాన్ని వాయిదా వేస్తే మంచిది. లేకపోతే కనీసం జూలై 90 వరకు అయిన ఆగటం మంచిది.

'9' మీకు అదృష్ట సంఖ్య '8' ధనాన్ని తెస్తుంది. '3' ప్రయోగాల్నిస్తుంది. '6' వ్యాపారాభివృద్ధిని, సంఘంలో గౌరవాల్నియిస్తుంది. 1,4 అంకెల జోలికి వెళ్ళకండి. '5' కూడా మేలు చేస్తుంది. ఇతరుల ద్వారా మీకు పనులు కావాల్సి వచ్చినప్పుడు బుధవారాలు, '5' అంకె ఉపయోగించండి.

2,7 అంకెలు అపోజిషన్ తెచ్చిపెడ్తాయి. అందుకని వాటిని వదిలేయండి.

కుంభం

ఈ లగ్న జాతకులకు లగ్న వ్యయాధిపతి శని లాభంలో సంచరించటం మూలంగానూ

లగ్నాన్ని గురువు చూస్తుండటం మూలంగానూ చేపట్టిన పనులు కొంత మెల్లగా నడుస్తున్నట్లనిపించినా విజయవంతంగా నడుస్తాయి. పన్నెండో భాగంలో రాహువు సంచారం మూలంగా రహస్యంగా పెట్టుబడుల్ని పెంచగల్గుతారు. అయితే ప్రయాణాల్లో దొంగలవల్ల మీకు ఇబ్బంది కలుగుతుంది. జాగ్రత్తగా వ్యవహరించండి. జనవరి, ఫిబ్రవరి నెలలు అన్ని రకాలుగా ఆనందదాయకంగా గడిచిపోతాయి. 20-3-90 నుంచి మీరు తలపెట్టిన ప్రయాణాలు వాయిదా పడ్తాయి. పెట్టుబడుల్ని పెంచే ప్రయత్నాలు సాగవు. మే నుంచి అక్టోబరు వరకు మీ ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆ కాలంలో చేపట్టిన పనులు సక్రమంగా సాగవు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ పనులన్నీ బాగా సాగుతాయి. 25-2-90 వరకు ద్వితీయ లాభాధిపతి గురువు వక్రంలో సంచరిస్తూండటం మూలంగా అనుకొన్న సమయానికి డబ్బు చేతికి అందదు. సహాయం చేస్తానని ముందుకొస్తున్న వాళ్ళు కూడా వెనకడుగు వేస్తారు. కుటుంబంలో చిన్న చిన్న కలతలు ఏర్పడ్తాయి. కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్యం బాగుండదు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో వ్యాపారాభివృద్ధి కొంత కుంటుబడుతుంది. ఫిబ్రవరి నుంచి జూలై వరకు ధనాభివృద్ధితో పాటు వ్యాపారాభివృద్ధిని సాధిస్తారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు విజయవంతంగా ఉంటాయి. మీ పిల్లలు అభివృద్ధిని బాగా సాధించగల్గుతారు. స్పెక్యులేషన్, షేర్ల వ్యాపారం బాగుంటాయి. ఆగస్టు నుంచి పెద్ద ఎత్తున అప్పులు చేసి పెట్టుబడుల్ని పెంచగల్గుతారు. డబ్బు రాబడి బాగా పెరుగుతుంది. నవంబరు డిసెంబరు నెలల్లో మీ చిన్న చిన్న ప్రయాణాలు వాయిదా పడ్తాయి. కంట్రాక్టర్లకు, రచయితలకు ఆ రెండు నెలల్లోఅంత బాగా ఉండదు. ఉద్యోగస్థులకు పనిభారం ఎక్కువగా ఉంటుంది. జూలై నుంచి ఉద్యోగ రంగంలోని వ్యక్తులకు ప్రమోషన్లు లభిస్తాయి. చాలా భాగం వ్యక్తులకు ట్రాన్స్‌ఫర్లతో కూడిన ప్రమోషన్లు లభిస్తాయి. ఫిబ్రవరి రెండో వారం నుంచి గృహ నిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్తి వ్యవహారాలు బాగా సాగుతాయి. 9-2-90 వరకు మీ తల్లిగారి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. విద్యార్థులకు జనవరిలో విద్య సాగదు. ఫిబ్రవరి రెండో వారం నుంచి విద్యార్థులకు ప్రోత్సాహకరంగా సాగుతుంది. జనవరి, ఏప్రిల్, ఆగస్టు నెలల్లో మీ వ్యాపారం ఒక పదిహేను రోజులు (ఒక్కొక్క నెలలో) కుంటుబడుతుంది. మీకు సంబంధించిన కోర్టు కేసులు వాయిదాలు పడ్తాయి. ఈ సంవత్సరం మీ ఆధ్యాత్మిక చింతన బాగా పెరుగుతుంది. జనవరి నెలలో ఉన్నత విద్యాభ్యాసకులకు కూడా అంత ప్రోత్సాహకరంగా విద్యార్జన సాగదు. విదేశీయానాలు వాయిదాపడ్తాయి. మీ తండ్రిగారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ఫిబ్రవరిలో పరిశోధనా రంగంలో కృషి చేస్తున్న వ్యక్తులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. జనవరిలో జరిగిన లోటు ఫిబ్రవరి నెల పూడ్చగల్గుతుంది. మార్చి నెల ఆధ్యాత్మికంగా మీ అభివృద్ధికి బాగా దోహదం చేస్తుంది. ఏప్రిల్ లో ఇతరుల నుంచి, ప్రభుత్వం నుంచి మీకు రావాల్సిన ధనం అందుతుంది. ఆరో ఇంట్లో కేతువు సంచారం మూలంగా మీ ఆరోగ్య విషయంలో ఆందోళన ఉంటుంది. మీ మేనమామ ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం, జూలై నెల మీకు వాహనాల్ని చేకూర్చిపెడ్తుంది. సెప్టెంబరు, అక్టోబరు నెలలు మీకు భూమి వగైరాలను ఏర్పాటు చేస్తాయి. డిసెంబరు 90 మాత్రం మీ రాబడికి ఇబ్బంది తెచ్చిపెడ్తుంది. పరిశ్రమలకు సంబంధించిన కాగితాలన్నిటినీ జూలై నుంచి నవంబరు లోపల పూర్తి చేసుకోవటం, అప్పులు బ్యాంకుల్నించి డ్రా చేయటం చేయటానికి చాలా మంచి కాలం. డిసెంబరు నుంచి శని పన్నెండో ఇంట్లో ప్రవేశించటంతో 1990 ముగుస్తుంది. 1990 మిమ్మల్ని 'ఏల్నాటి శని'లో పడేసి విశ్రమిస్తుంది.

మీకు అన్ని విధాల కనక పుష్యరాగం కానీ పుష్యరాగంకానీ వుంగరాల్లో ధరించటానికి అనువైనది. నీలం ధరించకండి. రచయితలకు, కంట్రాక్టర్లకు పగడం బాగుంటుంది. షేర్ల వ్యాపారాలు చేసేవాళ్ళకు, విద్యారంగంలోని వ్యక్తులకు వజ్రాలు పొదిగిన ఉంగరం మంచిది. పచ్చ, ముత్యం ధరించకండి. ఒకటి ఇబ్బందుల్ని తెస్తుంది. రెండోది ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. కెంపులు మీకు అపజయాన్నిస్తాయి. వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది. ధన సంబంధమైన విషయాలు మెరుగుపడటమే కాకుండా ప్రతి విషయంలోనూ విజయం వరించేట్లు చేసేయగల్గుతుంది పుష్యరాగం. అది ధరించటం అన్ని విధాల ఉత్తమం.

గురువారాలు, మంగళ వారాలు, శుక్రవారాలు చాలా అనుకూలంగా ఉంటాయి. శని వారాలు ఏ పనీ తలపెట్టకండి. ఆదివారాలు కూడా వద్దు. సోమవారాలు ప్రత్యర్థులపై విజయాన్నిస్తాయి. బుధవారాలు ఇబ్బందుల్ని సృష్టిస్తాయి.

3,6,9 మీకు అదృష్ట సంఖ్యలు. '8' ఏ విధంగానూ పనిచేయదు. '5' కూడా వదిలేయండి.

సుబ్రహ్మణ్య స్వామి ప్రార్థన, లక్ష్మీ సహస్ర నామ పారాయణ మీకు ఎంతో మేలు చేస్తాయి. ఈ రెండింటి మూలంగా విద్యాభివృద్ధితో పాటు, స్థిరాస్తి అభివృద్ధి, సంఘంలో గౌరవము పెరగటం జరుగుతాయి. ఈ లగ్న జాతకులు విష్ణువును ప్రార్థించటం మూలంగా ఇబ్బందులు పెరుగుతాయి. సామాన్యంగా కుంభ లగ్న జాతకులకు అష్టమాధిపతి, పంచమాధిపతి ఒకరే అవటం కారణంగా పూజాపునస్కారాలు ఎక్కువగా చేయటం వల్ల చిన్న చిన్న ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. అందువల్ల ఈ విషయంలో కొంత జాగ్రత్త వహించటం మంచిది.

1991 కంటే 1992 మీకు మళ్ళీ 1990 సంవత్సరంలాగా ఎంతో అభివృద్ధిని ఇస్తుంది.

మీనం

ఈ లగ్న జాతకులకు 1990 ప్రారంభంనకు ముందే లగ్న, దశమాధిపతి అయిన గురువుకు వక్రగతి వచ్చినందువల్ల శ్రమ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో ఫిబ్రవరి చివరి వరకూ శ్రద్ధ అవసరం. మార్చి వరకు గృహనిర్మాణ కార్యక్రమాలు, స్థిరాస్తి వ్యవహారాలు తలపెట్టకండి. అవన్నీ సవ్యంగా సాగవు. విద్యార్థులకు కూడా ఏప్రిల్ నుంచి మాత్రమే బాగుంటుంది. అంతవరకు 'కార్తికేయ స్తోత్ర పారాయణ' చేయటంవల్ల బాగా మేలు జరుగుతుంది. నిరుద్యోగులయిన లగ్న జాతకులకు ఈ సంవత్సరం మార్చి నుంచి జూన్ వరకు ఉద్యోగాలు లభిస్తాయి. ఆ తర్వాత 1991 వరకు ఈ విషయంలో వేచి ఉండాల్సి వస్తుంది. మీకు సంబంధించి ఇతరులు తలపెట్టిన గౌరవ పురస్కార కార్యక్రమాలు వాయిదా పడ్తుంటాయి. అక్కడక్కడ కొంత మీ పేరుప్రతిష్ఠలకు భంగం వాటిల్లినా సర్దుకోగల్గుతారు. ఈ సంవత్సరం అక్టోబరు చివరి వరకు ధన సంబంధమైన విషయాలు బాగా నడుస్తాయి. ఖర్చులు చాగా పెరిగినా దాంతో పాటు మీ రాబడి పెరుగుతుంది. 21-10-90 నుంచి మీ తండ్రిగారి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబ జీవితంలో చిన్న చిన్న కలతలు, అశాంతి తలఎత్తుతాయి. ఉన్నత విద్యారంగంలో విద్యార్జన చేస్తున్న వారికి ప్రోత్సాహకరంగా ఉండదు. నవంబరు, డిసెంబరు నెలల్లో దూర ప్రయాణాలు సాగవు. జనవరి నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు మీ కంట్రాక్టులు సాగవు. మీ సోదరులు మీకు ఇబ్బందులు కొని తెస్తారు ప్రయాణాలు సాగవు. చతుర్థ, సప్తమాధిపతికి 20-1-90 వరకు, 23-4-90 నుంచి 17-5-90 వరకు, 26-8-90 నుంచి 18-9-90 వరకు, 15-12-90 నుంచి 4-1-91 వరకు వక్రగతి మూలంగా మీ తల్లిగారి ఆరోగ్యం బాగుండదు. పై తేదీల్లో మీ పై అధికారితో వ్యవహరించేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.వ్యాపారభాగస్వామితో మీకు అభిప్రాయ భేదాలు వస్తాయి. విద్యార్థులకు విద్య సక్రమంగా సాగదు. ఏప్రిల్ నుంచి శని లాభస్థానంలో సంచరించటం మూలంగా మీ స్థిరాస్తి కార్యక్రమాలు కొంత కదుల్తాయి. వాహనాలు కొనగల్గుతారు. 6-5-90 నుంచి 24-9-90 వరకు శని వక్రం మూలంగా జూన్ వరకు చేపట్టిన పనులు చాలా మెల్లగా సాగుతాయి. ఆతర్వాత వృత్తిరీత్య శ్రమ ఎక్కువ.ఫలితం తక్కువగా ఉంటుంది. లాభంలో రాహువు సంచరించటం మూలంగా అనేకరకాలుగా గుప్తధనం ఏర్పరచుకోగల్గుతారు. అయితే ఐదో ఇంట్లో కేతువు సంచారం మూలంగా వ్యాపారాదుల్లో tension బాగా ఉంటుంది. కొందరు తరువాత వ్యాపారాలకు స్వస్తి చెప్పాల్సి వస్తుంది. జులై తరువాత నుంచి వ్యాపారంలో తలనొప్పులు పెరిగినా వ్యాపారాభివృద్ధి సాధించటం ప్రారంభం అవుతుంది. జులై వరకు మీ పిల్లలు మీకు

పెద్ద తలనొప్పిగా తయారవుతారు. వారి మూలంగా మనశ్శాంతి లేకుండా పోతుంది.జులై నుంచి ఈ విషయంలో ఉద్రిక్తత కొంత తగ్గుతుంది. ఈ సంవత్సరం మీ వ్యాపారాభివృద్ధికి, ఉద్యోగాభివృద్ధికి దోహదం చేస్తాయి. అధ్యాత్మికంగా ఎంతో ముందుకు వెళ్ళటానికి ఈ సంవత్సరం బాగా దోహదం చేయగల్గుతుంది. 1991 జూన్ లోపల ఉద్యోగరీత్య కొన్ని కొత్త ఇబ్బందులు, బాధలు చుట్టుముడ్తాయి. అయినా మీరు అన్ని విధాల విజయం సాధించగల్గుతారు. లగ్నాధిపతి ఉచ్ఛస్థితిలో సంచరించటం మూలంగా మీరు జులై తర్వాత చేపట్టిన అన్ని రకాల కార్యక్రమాల్లో విజయం సాధించగల్గుతారు. సంఘంలో మీ ప్రతిష్ఠ పెరుగుతుంది. మీ పిల్లలు ప్రగతి పథంలో సంచరించటం ప్రారంభిస్తారు.

ఈ సంవత్సరం మీరు గోమేధికం గల ఉంగరం ధరించి సత్ఫలితాలు పొందవచ్చు. మామూలుగా 'పుష్యరాగం' మీకు మంచి లాభాల్నిస్తుంది. నీలం ధరించటం కంటే గోమేధికం అధికంగా ప్రయోజనాల్నిస్తుంది ప్రస్తుతం. ముత్యాలు ధరించి మీ అధ్యాత్మిక చింతనను పెంచగల్గుతారు. కెంపులు వజ్రాలు వద్దు. పచ్చలు వ్యతిరేకతను కొనితెస్తాయి. పగడాలు ఖర్చుల్ని విపరీతంగా పెంచుతాయి.

గురు, శని వారాలు విజయవంతంగా ఉంటాయి. శుక్రవారాలు ఎలాంటి నూతన కార్యక్రమాలు పెట్టుకోకండి. మంగళవారాలు రాబడినిస్తాయి. ఆదివారాలు ప్రత్యర్థుల మీద విజయాన్నిస్తుంది. బుధవారాలు కొంత వ్యతిరేకతను తెస్తాయి. సోమవారాలు అధ్యాత్మికంగా మీ అనుష్ఠానాది కార్యక్రమాలను బాగా ముందుకు తీసుకెళ్తాయి.

'దుర్గను ప్రార్థించటంవల్ల ఈ సంవత్సరం మీకు బాగా మేలు కల్గుతుంది. లలిత సహస్ర నామ పారాయణ స్థిరాస్తిని పెంచుతుంది. వ్యాపార భాగస్వాముల్ని జోడించి కూడపెడ్తుంది. ఆదిత్య హృదయం పారాయణ ఇతరుల మీద మీ గెలుపుకు దోహదం చేస్తుంది.

3,9 మీ అదృష్ట సంఖ్యలు. '8' లాభాన్నిచ్చినా పెద్దగా కలిసొచ్చేది కాదు. '6' సంఖ్య జోలికి వెళ్ళకండి. ఇబ్బందుల పాలుకాకండి. 2,7 సంఖ్యలు వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్తాయి. అయితే మీకు అన్ని విధాల '3' మంచి అంకె.

పొదిల శ్రీరామమూర్తి

'జ్యోతి' విశ్లేషణ

డిసెంబరు సంచికలో ప్రారంభించిన 'విశ్లేషణ' శీర్షికకు గతంలోకంటే ఎక్కువగా మొత్తం 30 మంది పాఠకులు తమ విమర్శనా వ్యాసాలను పంపారు. వాటిలో ఉత్తమంగా భావించిన మూడింటిని ప్రచురిస్తున్నాం. 'నవ్వకండి విషాదం' విశ్లేషణలు రెండింటికి ప్రథమ, తృతీయ, 'కరెంట్ షాక్' విశ్లేషణకు ద్వితీయ ఉత్తమ బహుమతులను అందచేస్తున్నాము

నాకు నచ్చిన కథ "నవ్వకండి ఇది విషాదం"

నచ్చని కథలు చాలా చదువుతుంటాం! అవి గుర్తుంచుకోము కూడా! జనవరి 90 జ్యోతిలో పులిపాక శ్రీరామచంద్రమూర్తిగారి కథ చదివితే మనస్సులోని పొరలను సున్నితంగా స్పృశించింది. కట్నం, లాంఛనాలంటూ ముందు కాళ్ళు దించి, నడుం, గొంతు వరకూ దిగిపోయే మధ్య తరగతి మనుషులకు ప్రతిబింబమై నది ఈ కథ! పెళ్ళి పందిట్లో ప్రతిదానికీ గొడవౌతుందనీ, ఒకదానిలో ఒకటి పోల్చి చూసుకుంటూ పదులుకున్న సంబంధాలే మంచివని వాపోవటమూ మిథ్యావిలువలకు సంకేతాలుగా ప్రతి పెళ్ళిలో చూస్తున్న భావాలే!

మైనస్‌లుగా ఆడపిల్లల్ని, ప్లస్‌లుగా మగపిల్లలను పోల్చి చేసుకున్న పెంపకాలు, పెళ్ళి మాపులకు వచ్చిన ప్రతి పిల్లవాడు బలవంతంగా నచ్చేట్లు చేసుకోవే ఆడపిల్లల తల్లిదండ్రులూ, పేచీపెడితే పోలీసులకు చెప్పాలనుకున్న లేదా పెళ్ళి అయినాక శోభనానికి స్కూటరు అడిగితే అప్పుతెచ్చి స్కూటర్ ఇచ్చే తండ్రీ, తండ్రి ఇబ్బంది గ్రహించీ మనస్సులో రాజీపడి భర్తతో శోభనం గదిలో తెల్లగా నవ్వే పెళ్ళికూతురి మనస్సులో ఎంత విషాదమో అనుభవించిన ప్రతి ఆడపిల్లకూ అర్థమవుతుంది. తన పెళ్ళి తల్లిదండ్రులను బజార్న పడేయరాదనీ, వారి ఆర్థిక పరిస్థితికి గొడ్డలిపెట్టు కారాదని భావించే ప్రతి ఆడపిల్లా శోభనం గదిలో భర్తతో మనసు విప్పి చెప్పుకోలేక నవ్వే విరిగిన పాల నవ్వు. ఇది అందుకే నా మనసును కదిలించింది.

-చిల్లర భవానీదేవి,
హైదరాబాద్.

నవ్వకండి ఇది విషాదం కథను చాల చక్కగా రాశారు శ్రీ పులిపాక శ్రీరామ చంద్రమూర్తి.

ఈ దేశంలో ఆడపిల్ల పెళ్ళి ఒక సాహసోపేత కార్యం అయితే అందుకు అగ్నిపరీక్షలు వియ్యంకుల కోరికలు. మగపెళ్ళి వారి కోరికలు ఎలా ఉంటాయి, వియ్యపురాళ్ళ సూటిపోటి మాటలు ఎలా ఉంటాయి అవన్నీ ఓపిగ్గా భరించి విబ్బరంగా ఇంత కట్నం యిచ్చి ఆడపిల్లను బయటకు పంపే తల్లిదండ్రులు అందరికీ తలొగ్గి ఎంత బాధను అనుభవిస్తారో చక్కగా వివరించారు శ్రీ పులిపాక.

అన్ని కోరికలు తీర్చుకున్న అల్లుడిగార్కి నవ్వులే మరి! దాని వెనుక యింత అప్పును అనుభవించే మామగార్కి విషాదం గాక మరేంటి?

అందుకే ఆ కొత్త దంపతుల నవ్వులను చూసి 'నవ్వకండి ఇది విషాదం' అంటున్నారు శ్రీ పులిపాక శ్రీరామ చంద్రమూర్తి.

-కంచర్ల భూషణం,
రాంబొట్లపాలెం.

నాకు నచ్చిన కథ 'కరెంటు షాక్'

ఒక జోక్‌ని తీసుకుని నవల రాసేసే రోజులివి. మంచి కథలు కరువైపోయాయనే చెప్పాలి. ఎందుకంటే మంచి కథలు వ్రాయాలన్న సాహిత్యాభిలాషుల కంటే ఏదో విధంగా ఓ నవల గీకేసి కమర్షియల్‌గా ఎదిగిపోవాలన్న దృక్పథమే ఎక్కువగా కన్పిస్తున్న రోజులు.

అలాంటి యీ రోజుల్లో అతి పెద్దదైన నేటి సామాజిక సమస్యను క్లుప్తంగా చిన్న కథగా అందించారు రచయిత "కరెంట్ షాక్" కథగా.

యాంత్రిక యుగం మనిషిని జెట్ వేగంతో ఎంతఎత్తుకి తీసుకుపోతుందో... ఒక్కోసారి దాంట్లోని చిన్న లోపం పూడ్చుకోలేని నష్టాలు కూడా తెచ్చిపెడుతుంది. ఇది నచ్చి నిజం. ఈ పరిస్థితికి అద్దం పట్టినట్టున్న కథ యిది.

కథ మొదలెట్టినప్పుడు.. ఆ.. యిది మూఢ నమ్మకాల మీద కథ. ఇలాంటివి కొన్ని వేలు వచ్చాయ్ అని ఉదాసీన భావంతో చదవడం ప్రారంభించినా ముగింపు చదివినపుడు కరెంట్ షాక్ తగిలినట్టే ఫీలయ్యాను.

మంచి కథనందించిన జ్యోతికీ, రచయిత సామవేదుల వెంకటరామ శాస్త్రిగారికీ ధన్యవాదాలు.

-తొత్తడి గణపతిరావు,
విశాఖపట్టణం.

"బాకీ - పూలు"

"ఓ అర్థరూపాయి పూవులు ఇవ్వవయ్యా".
"అబ్బాయిగారు పెండ్లాని చేసుకున్నారేమిటండీ"
సంబరంగా అడిగాడు కొట్టువాడు.
"అబ్బే... ఓ బాకీ తీర్చాలి, పువ్వుల్లో పెట్టి ఇస్తానన్నానులే".

"అలవాటు"

"ఇది నీ నాలుగో యాక్సిడెంట్. ఇలా ప్రతిసారి యాక్సిడెంట్లు కళ్ళుమూసుకు పోయి చేస్తున్నావా" డ్రైవర్‌పై కేకలేశాడు యజమాని.
"అతడు పూర్వం గవర్నమెంటు ఉద్యోగం చేసేవాడు.. ఆ అలవాటువల్ల డ్రైవింగ్ చేసేటప్పుడు కూడా నిద్రపోతున్నాడు" చెప్పాడు క్లీనర్.

"సిగ్గు?"

"రోడ్డుపై నిలబడి అడుక్కోవడానికి సిగ్గుగా లేదూ" ఓ బిక్షగాడిని వెక్కిసాడు సుబ్రావ్.
"నిజమేనండీ సిగ్గుగానే ఉంది. కాని ఓ షాపు తెరిచి అడుక్కోవాలంటే బోలెడు పెట్టుబడి కావాలి."
-కె.వి.మధుసూదనరావు.

"అమ్మో... టీవీయా!"

"మొన్న టీవీలో బ్రాంధీ త్రాగడం వల్ల వచ్చే నష్టాలు చూపించా. అప్పటినుంచి మానేసాను".
"ఆహా... బుద్ధిమంతుడివైపోయావన్న మాట"
"అదేంకాదోయ్.. టీవీ చూడటం మానేశాను".
-కె.వి.మధుసూదనరావు.

తెలుగు భాషకు వన్నె తెచ్చిన ఆస్థాన కవులు

అవి 1949 నాటి రోజులు– అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు, తమిళ, కన్నడ, మళయాల భాషలను పోషించి, గౌరవించడానికి "ఆస్థాన కవి" పదవిని ఏర్పాటు చేశారు, ఈ పదవిలో కవులను, పండితులను నియమించసాగారు.

రాజులు సంస్థానాధీశులు అంతరించిపోయిన తరువాత అంటే మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కళలను, సాహిత్యాన్ని పోషించే బాధ్యత ప్రజా ప్రభుత్వం మీద పడిందని భావించ వలసి ఉంటుంది. ఈ బాధ్యతతోనే ప్రభుత్వం ఆస్థాన కవి పదవిని ఏర్పాటు చేసింది.

అయితే అప్పటి మద్రాసు రాష్ట్ర మంత్రివర్గానికి పూసపాటి సూర్యకుమారస్వామి రాజా ప్రధాన మంత్రి. డా.బెజవాడ గోపాలరెడ్డి ఆర్థిక శాఖా మంత్రి.

మొదటి ఆస్థాన కవి శ్రీ చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి

తిరుపతి వెంకటకవులలో ఒకరైన శ్రీ చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిని మొదటిసారిగా తెలుగు భాషకు ఆస్థాన కవిగా నియమించింది అప్పటి ప్రభుత్వం. తిరుపతి వెంకట కవుల పేర్లు తెలియని ఆంధ్రుడు లేడనడంలో అతిశయోక్తిలేదు. పాండవోద్యోగ విజయాలలోని పద్యాలను వింటూ ఉంటే తిరుపతి వెంకట కవులు మన ముందు మెదులుతారు. వీరు సంస్కృతాంధ్ర భాషల్లో అసమాన ప్రతిభావంతులు. శతావధానులు, ఆశు కవితావిశారదులు.

తిరుపతి శాస్త్రి, వెంకట శాస్త్రిగారలు, బ్రహ్మయ్య శాస్త్రిగారి దగ్గర సహాధ్యాయులై జంటగా కవిత్వం అల్లసాగారు. అలా వారు "తిరుపతి వెంకట కవుల"య్యారు. జంట కవులుగా వీరు అష్టావధానాలు చేస్తూ, సంస్కృతాంధ్ర భాషల్లో కవిత్వం చెప్పుతూ ఆంధ్ర దేశంలో ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారు

వెంకటశాస్త్రిగారు కామేశ్వరీ శతకము, ఆరోగ్య కామేశ్వరి, ఆరోగ్య భాస్కరస్తవము, మృత్యుంజయ స్తవము, సౌభాగ్య కామేశ్వరీ స్తవము మొదలైన గ్రంధాలెన్నో రచించారు.

వెంకటశాస్త్రిగారు తన జీవితాన్ని "జాతకచర్య" అనే గ్రంథం పేరిట జీవిత

చరిత్రను రాసుకున్నారు. ఇది తెలుగులో పద్యరూపంలో రాయబడ్డ మొదటి స్వీయ చరిత్ర.

ఈయన 1870లో జన్మించారు.

1904 నుండి 1918 వరకు మచిలీపట్నంలోని ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా పనిచేశారు. అప్పుడే ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, వేటూరి ప్రభాకర శాస్త్రిలాంటి ప్రకాండ కవి పండితులు శిష్యులుగా వుండేవారు.

వీరి వ్యాసాలనీ "కథలు-గాథలు" పేరిట ప్రచురించబడ్డాయి. వీరు మొదట్లో శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిగారి వద్ద శిష్యరికం చేశారు. వీరు ఆస్థాన కవిగా నియమించబడే నాటికి శ్రీ పాదవారు జీవించే ఉన్నారు.

ఆస్థాన కవిగా నియమించబడ్డ తరువాత వెంకట శాస్త్రిగారు ఎన్నో సన్మానాలను పొందారు.

ఇక 1950లో ఫిబ్రవరి 15వ తేదీన మహా శివరాత్రి పర్వదినం రోజున పవిత్ర కృష్ణానదీ తీరాన వెలసిన విజయవాడలో శివసాయుజ్యం పొందారు.

శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి

వెంకట శాస్త్రిగారు చనిపోయిన తరువాత శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి గారిని అప్పటి అవిభక్త మద్రాసు రాష్ట్రంలో తెలుగు భాషకు ఆస్థాన కవిగా నియమించారు.

శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిగారు 1866లో జన్మించారు. శాస్త్రిగారు శతాధిక గ్రంధకర్త. ప్రాచీన మార్గాన్ని అనుసరించి కవిత్వం రాసిన వారిలో అగ్రజులని చెప్పుకోవచ్చును. భారత, భాగవత, రామాయణాలను స్వతంత్ర కావ్యాలుగా రచించిన ఉద్దండులు. వీరి అభిమాన కవి శ్రీనాథుడు. శ్రీనాథుని లాగే వీరు కూడా కవిసార్వభౌములయ్యారు. కనకాభిషేకం పొందారు. గండపెండేరం పొందారు. గజారోహణ గౌరవాన్ని కూడా పొందగలిగారు.

శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిగారు వేద శాస్త్ర విశారదులు. గొప్ప దేశభక్తుడు కూడాను. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జీవిత విశేషాలను వర్ణిస్తూ "తిలక్ మహారాజు" అనే రాజకీయ రూపకాన్ని రాశారు. దీనిలో లోకమాన్యుడు జన్మించింది మొదలు మరణించే వరకూ గల ఆయన జీవిత గాథను ఎంతో రమ్యంగా వర్ణించారు. ఇందులో తిలక్ కోరిన 1908 నాటి స్వపరిపాలన, 1917 నాటి సహాయ నిరాకరణోద్యమం చోటుచేసుకున్నాయి. చివరలో మరణ శయ్యపై వున్న తిలక్ తన తేజస్సునంతా గాంధీజీకి సంక్రమించేటట్లు వర్ణించబడింది.

అయితే శాస్త్రిగారు, ఆయన శిష్యుడు వెంకట శాస్త్రిగారు 15,16 సంవత్సరాలుగా భాషా విషయమైన వైరుధ్యంలో మునిగిపోయారు. ఒకరినొకరు నిందించుకుంటూ కోర్టులకు కూడా ఎక్కారు.

శాస్త్రిగారు ఆస్థాన కవి పదవిలో పది సంవత్సరాలు కొనసాగారు. ఈ పదవిలో ఉండి వీరు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్నీ, విశాలాంధ్ర స్థాపననూ చూశారు.

1961లో వీరు మరణించారు.

శ్రీ శ్రీ కృష్ణమాచార్యులు

కృష్ణమూర్తి శాస్త్రిగారి తరువాత కాశీ కృష్ణాచార్యులుగారు ఆస్థాన కవి నియమించబడ్డారు. ఆచార్యులుగారు సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప పండితులు, కవులు. విశేషించి వీరు సంస్కృతంలో గొప్ప పండితులు.

ఆచార్యులుగారు కన్నడ భాషలో కూడా విశేషమైన కృషిచేశారు. ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత వేదాంతాల్లో పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించారు. సంస్కృతాంధ్ర భాషను సులభంగా నేర్చుకోడానికి వీలుగా సరళ సంస్కృత గ్రంధాన్ని రచించారు. ఈ గ్రంధం విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఎంతగానో తోడ్పడింది.

కృష్ణాచార్యులుగారు విజయనగరంలో తాతా సుబ్బారాయ శాస్త్రిగారి దగ్గర శిష్యరికం చేశారు. వ్యాకరణ, తర్క శాస్త్రాల్లో సంపూర్ణ ప్రజ్ఞను సాధించారు.

వీరు మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ బిరుదులను పొందారు. కాగా వీరు గుంటూరులోని టౌన్ హైస్కూలులో ఎంతో కాలం పండిత పదవిని చేపట్టారు. ఆ విద్యాలయమే ఇప్పుడు హిందూ కాలేజీగా రూపు రేఖల్ని దిద్దుకుంది. శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి, ఆయన సోదరుడూ ఈ కాలేజీలోనే విద్యాభ్యాసం చేశారు.

తిరుపతి వెంకట కవులలో తిరుపతి శాస్త్రిగారు చనిపోయిన తరువాత వెంకట శాస్త్రిగారు, కృష్ణాచార్యులుగారు కలిసి రెండుసార్లు అవధాన కార్యక్రమాన్ని కావించారు.

కృష్ణాచార్యులగారు చనిపోయిన తరువాత ఆస్థాన కవి పదవి కొంత కాలం ఖాళీగా ఉంది. 1971 అక్టోబర్‌లో విశ్వనాధ సత్యనారాయణ గారిచే ఆస్థానం భర్తీ చేయబడింది.

కవి సామ్రాట్ శ్రీ విశ్వనాధ సత్యనారాయణ

కవి సామ్రాట్‌గా పేరుగాంచిన శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు 1895 సెప్టెంబర్‌లో జన్మించారు. కళాప్రపూర్ణ, కవిసామ్రాట్, పద్మ భూషణ్ విశ్వనాధ సత్యనారాయణగారు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. వారు కావ్యాలను కూర్చారు. ప్రబంధాలను ప్రచురించారు. ఖండ కావ్యాలను, గేయాలను రచించారు. విమర్శలు రాశారు. ఆధునికాంధ్ర కవితా సామ్రాజ్యాన్ని సర్వజన మనోరంజకంగా పాలించిన కవి సామ్రాట్ వీరే.

విశ్వనాధవారు చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిగారి శిష్యులు. అసలు విశ్వనాధ సత్యనారాయణగారి పేరు ఎత్తగానే వారి నవల "వేయి పడగలు" మన ముందు మెదులుతుంది. ఆంధ్ర సాహిత్యంలో "వేయి పడగలు" నవల అద్భుత సృష్టి. ఇంత పెద్ద నవలను 28 రోజులలో రాసిన ఘనత వీరికే దక్కుతుంది. ఈ నవలకు ఆంధ్ర విశ్వ విద్యాలయంవారి బహుమతి లభించింది. ఈ నవలే వీరికి కవి[illegible]ట్ బిరుదును తెచ్చి పెట్టింది. "వేయి పడగలు" నవలను శ్రీ పి.వి. నరసింహా రావుగారు హిందీలోకి అనువదించారు. వీరి రచనలెన్నో ఇతర భాషల్లోకి అనువది[illegible]యి.

1921లో అంటే దేశంలో సహాయనిరాకరణోద్యమం జరుగుతున్నప్పుడు

బి.ఎ. చదువుకు స్వస్తి చెప్పారు.

ఆ తరువాత బందరు జాతీయ కళాశాలలో ఉపన్యాసకులుగా చేరారు. 1933లో సంస్కృతంలో ఎం.ఎ. పట్టంపొంది గుంటూరు క్రైస్తవ కళాశాలలో ఉపన్యాసకులుగా చేరారు. 1938 నుండి 1955 వరకు విజయవాడలోని యస్.ఆర్.అండ్ సి.వి.ఆర్. కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్ష పదవి పొందారు. కాగా 1959 నుండి 1961 వరకు కరీంనగర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా చేశారు.

1927లో వీరు "జయంతి" అనే ఓ పత్రికను కూడా నడిపారు–

వీరు రాసిన "విశ్వనాధ మధ్యాక్కరలు"కు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. అకాడమీ విశిష్ట సభ్యత్వం కూడా లభించింది. వీరికి కళాప్రపూర్ణ, డాక్టరేట్ బిరుదులు లభించాయి.

1970లో వీరికి పద్మ భూషణ్ బిరుదు కూడా లభించింది. 1971లో వీరి "రామాయణ కల్ప వృక్ష కావ్యా"నికి "జ్ఞానపీఠ్" బహుమతి లభించింది.

వీరి రచనలపై ఇపుడు పరిశోధనల్ను కూడా జరుగుతున్నాయి.

వీరు 1976 అక్టోబర్‌లో మరణించారు.

వీరు మరణించిన తరువాత 1977 ఆగస్టు 15న, ప్రభుత్వం డాక్టర్ దాశరధిగారిని ఆస్థానకవిగా నియమించింది.

డా. దాశరధి

నిజాం నిరంకుశ పాలనలో నరకయాతననుభవించిన తెలంగాణా ప్రజలు తిరుగబడి జరిపిన స్వాతంత్ర్య పోరాటంలో త్రివిక్రముడై పరాక్రమించిన మహాయోధుడు, మహా కవి డా. దాశరధి.

ఆధునికాంధ్ర సాహిత్య క్షేత్రంలో భావ చైతన్య స్రవంతి మూడుపాయలుగా చీలి ప్రవహిస్తోంది. ఒకటి, సంప్రదాయ చైతన్య ధార–దీనికి నాయకుడు కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ. రెండు, సాయుధ విప్లవ చైతన్య ధార. దీనికి నాయకుడు మహాకవి. శ్రీ శ్రీ మూడు, శాంతి విప్లవ చైతన్యధార– దీనికి నాయకుడు మహాకవి దాశరధి.

డా. దాశరధి వీటిని సమన్వయిస్తూ అభ్యుదయాన్ని వరించే మధ్యే మార్గాన్ని అనుసరించాడు. ఈయన మధ్యే మార్గపు మార్గసూచికలు"తిమిరంతో సమరం", "ఆలోచనాలోచనాలు"– ఈ అభిప్రాయాన్ని డా. జి.వి. సుబ్రహ్మణ్యంగారు కూడా వెలిబుచ్చారు. ఇది ఎంతేని నిజం.

డా. దాశరధి వరంగల్‌కు సమీపంలోనిచిన్న గూడూరు గ్రామంలో 1925లో జన్మించారు. ఆంగ్ల సాహిత్యం ప్రధానాంశంగా ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పట్టాపుచ్చుకున్నారు.

1975లో ఆంధ్ర విశ్వ విద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదునిచ్చి సత్కరించింది. 1976లో ఆగ్రా విశ్వ విద్యాలయం, 1981లో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లెటర్స్ బిరుదునిచి సత్కరించాయి.

డా. దాశరధి రుద్రవీణ, తిమిరంతో సమరం, పునర్నవం, గాలిబ్ గీతాలు,

అమృతాభిషేకం, ఆలోచనాలోచనాలు, కవితా పుష్పకం, నవమంజరి, దాశరధి శతకం, నవమి, మహాబోధిలాంటి కావ్యాలను అందించారు.

డా.దాశరధికి తెలుగుభాష అంటే ఎంతో అభిమానం, గౌరవం- అయితే వీరు పలుభాషలను పలవరించి, పలకరించి తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటినీ స్పృశించారు చారిత్రక, హేతువాద దృక్పధావగాహనతో ఆధునిక కవితకు ఊపిరిపోశారు.

వీరు మారుతూన్న కాలంతోపాటు ఎంతో స్థాయికి ఎదిగారు. అభ్యుదయ కవిగా మారి నరహంతకుల పీర అనలాన్ని కురిపించారు. శాంతిని కాంక్షిస్తూ శాంతి కపోతాన్ని ఎగురవేశారు.

కాగా వీరు అంతర్జాతీయ అవగాహనను ఎంతో పెంచుకున్నారు. వీరు యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, మలేషియా, సింగపూర్ వంటి విదేశాల్లో పర్యటనలు చేశారు.

వీరికి 1965లోనూ, 1967లోనూ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులు లభించాయి. 1974లో "తిమిరంతో సమరం" కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.

డా. దాశరధి సినీగేయ కవిగా ఎంతో పేరుతెచ్చుకున్నారు. రెండువేలకుపైగా సినీ గీతాలు రాశారు.


1972లో స్వాతంత్ర్య సమరయోధులకు వచ్చే "తామ్ర పత్రాన్ని" బహుమతిగా పొందారు.

వీరు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ సభ్యులుగా కూడా ఉన్నారు.

1977లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరిని ఆస్థాన కవిగా నియమించింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం పరిపాలన రావడంతో అన్ని అకాడమీలూ రద్దయిపోయాయి. అలా ఆస్థాన పదవి కూడా రద్దయిపోయింది. అప్పటికే కొంచెం అనారోగ్యంతో బాధపడుతున్న డా. దాశరధిని ఈ చర్య ఎంతో కృంగదీసింది.

అనారోగ్యంతో బాధపడుతూనే డా. దాశరధి 1988 నవంబర్‌మాసంలో మరణించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ "ఆస్థాన కవి" పదవిని కొనసాగిస్తుందని అంతా ఆశిస్తున్నారు.

-ఎ. పండరినాథ్



ఆరోగ్యం గురించి మాట్లాడుకుందాం

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం

'కళ్లు లేకపోతే కలియుగమే లేదు' అంటుంటారు. అది నిజమే ! కళ్లు లేకపోతే మన చుట్టూ వున్న పరిస్థితుల్ని గమనించలేం .... పరిసర అవగాహన లేకపోతే ఇబ్బందులెన్నో ....! !

ప్రపంచ వ్యాప్తంగా చూస్తే అంధుల సంఖ్య దాదాపు 4 కోట్ల 20 లక్షలు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆ సంఖ్య 2000 వ సంవత్సరం నాటికి రెట్టింపు అయ్యే ప్రమాదముంది. అందుకని కంటి గురించి, చూపు గురించి, వాటి లోపాలు - అవి ఎలా ఎందుకు వస్తున్నాయి? రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి? మొదలైన వివరాలన్నీ అందరూ తెలుసుకుని, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ దృష్టి లోపాల్ని కొంత వరకూ అరికట్టవచ్చు. అందుకని ఈ ఆర్టికల్ ద్వారా కళ్ళ ఆరోగ్యం గురించి ముచ్చటించుకుందాం.

మన దేశంలో పూర్తిగా కళ్ళు కనిపించనివాళ్ళు 90 లక్షల మంది వుంటే వాళ్ళకోట్ల యాభై లక్షలమందికి దృష్టి లోపం వుంది. అంధులలో 30 శాతం మందికి 20 ఏళ్ళలోపే దృష్టిని కోల్పోతున్నారు. 4 లక్షల మంది ఏడేళ్ళ లోపు అంధులవుతున్నారు. ఇందుకు కారణాలు ట్రకోమా ఇనఫెక్షన్స్, పోషకాహారలోపాలు, మేనరిక వివాహాలు, కేటరాక్ట్, గ్లకుమ, డాయాబెటిస్, అధిక రక్తపోటు, నరాల బలహీనత, ప్రమాదాలు, గాయాలు, వీటన్నింటి గురించి ప్రముఖ నేత్ర వైద్యులు, డా॥ ఎ. సాయిబాబాగౌడ్ గార్ని అడిగి తెలుసుకుందాం.



డా॥ ఎ. సాయిబాబాగౌడ్.

"కంటికి వచ్చే అనారోగ్యాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలైనవి చెప్పే ముందు అసలు, మనం ఎలా చూడగలుగుతున్నాం? కంటి నిర్మాణం ఎలా వుంది? మొదలైన విషయాం గురించి ముచ్చటించుకుందాం. కన్ను మూడు పొరల్తో కప్పబడి వుంది. పైది పేచు పొర, మధ్యది నాళవు పొర, లోపలిది నరవు పొర. పైకి కనిపించే పేచుపొర తెల్లగా వుండి, పేచు లాంటి పదార్థంతో ఏర్పడి దృఢంగా వుంటుంది. ఈ పొర మీద పన్నటి రక్తనాళాంతో కూడిన 'కంజెక్టివ్' అనే పొర వుంటుంది. అందుకే తెల్ల గుడ్డు మీద అక్కడక్కడా ఎర్ర ఎర్రగా వుంటుంది. ఈ పొర గుడ్డు లో 5/6 వ వంతు మాత్రమే వుండి మిగతా 1/6 వ వంతు కంటి మధ్యలో నల్లగా పారదర్శక పొరగా వుంటుంది. దీన్ని 'కార్నియా' అంటారు. ఈ కార్నియా ద్వారానే వెలుగు లోపలికి వెళ్తుంది. పారదర్శకపు పొరలోనే భాగమైనా, తెల్లపొర మీద వున్నట్లు ఈ నల్ల పొరమీద రక్త నాళాలుండవు. ఈ భాగం దగ్గరలోని నాళాల నుంచి, కన్నీట నుంచి, వెనుకనున్న యాక్వియస్ ద్రవం నుంచి, ఆహారాన్ని తీసుకుంటుంది. ఈ పేచు పొర మొత్తం కంటికి కవచంలా వుండటమే కాకుండా, కంటికి ఒక ఆకారాన్ని ఇస్తుంది. మనకి కంటిలో కనిపించే భాగం ఇదే. దీనిని కప్పి కాపాడటానికి రెప్పలున్నాయి. వాటికి చివరలో సన్నని వెంట్రుకలున్నాయి. మనం చూస్తున్నప్పుడు రెప్పలు కప్పి వుండవు కదా.... ఏదైనా ప్రమాదం వస్తోందనే ఆలోచన రాగానే చటుక్కున ఈ రెప్పలు మూసుకు పోయి కంటికి రక్షణ నిస్తాయి. మనం చూస్తున్నప్పుడు వాతావరణంలోని దుమ్ము, ధూళి, సూక్ష్మ జీవులు కంటి పైపొరని తాకవచ్చు. అందుకని వీటన్నింటిని కడిగి, వాటి బారి నుంచి కంటిని కాపాడటానికి పైన కన్నీరు కదుల్తుంటుంది. ఈ కన్నీటిని వుత్పత్తి చేయడానికి కన్నీటి గ్రంథి నుంచి కన్నీరు గుడ్డు పైకి వచ్చి కొంత ఆవిరి కాగా, మిగిలినది ముక్కు పై వున్న కంటి చివరన వున్న సన్నని రంధ్రం ద్వారా ముక్కు, గొంతులోకి పోతుంది."

అప్పుడే పుట్టిన పిల్లలు ఏడుస్తుంటే కన్నీళ్ళు రావు కదండీ ?"

"అప్పుడే పుట్టిన బిడ్డ ఏడుస్తుంటే కన్నీరు రాకూడదు. ఎందుకనంటే లాక్రియల్ గ్లాండ్ నుంచి కన్నీరు వుత్పత్తి ప్రారంభమవడానికి ఆరువారాలు పడుతుంది. అంటే పుట్టిన ఆరువారాల వరకూ ఏడిస్తే

కళ్ళ వెంట నీరు రాదు. దీన్ని అఘాయిత్యపు ఏడుపు అని మనం అపార్థం చేసుకోకూడదు. ఆరు వారాల లోపు పిల్లలు ఏడుస్తున్నప్పుడు కంటి వెంట నీరు వస్తే వెంటనే కంటి డాక్టరుకు చూపించాలి. ఎందుకనంటే ఆ నీరు వచ్చేది కేవలం కంటికి ఏ ఇన్ఫెక్షన్ వస్తేనో! కంట నీరు కొన్ని సందర్భాలలోనే వస్తుంది కాని తెల్ల గుడ్డు మీద వుండే కంజెక్టివా, తులలోవున్న కొన్ని గ్రంథుల ద్వారా వుత్పత్తి అయ్యే రసాలతో ఎప్పుడూ తడిగా వుంటుంది. ఈ నీళ్లలో వుండే లైసోజైమ్ అనే ఎంజైమ్ సూక్ష్మ జీవుల్ని నిరోధించి కంటికి జబ్బులు రాకుండా కాపాడుతుంది. కన్నీరు ప్రవహించే మార్గంలో ఏదైనా అవరోధం ఏర్పడితే కన్నీరు ముక్కు ద్వారా బయటకు వెళ్లక కళ్ల వెంట కారతాయి. డాక్రోసిస్టోరినోస్టమి అనే ఆపరేషన్ తో కంటి నీరు ముక్కు ద్వారా బయటకు వెళ్ళేట్లు చెయ్యవచ్చు."

"పేచు పొర వెనుక ఏమి వుంటుందండీ?"

"కార్నియా అంటే నల్లగుడ్డు వెనుక యాక్వియస్ అనే ద్రవం వుంటుంది. ఈ ద్రవం కూడా పారదర్శకం. అందుకని కార్నియా ద్వారా ఈ ద్రవం లోకి, అక్కడ నుంచి రెండు నెరిస్‌ల మధ్య ఖాళీ గుండా అంటే కంటి పొర ద్వారా కటకం మీద పడతాయి మనం చూసే దృశ్యం తాలూకు కిరణాలు. ఆ కటకం కూడా పారదర్శకంగా వుంటుంది. అందుకని దాని ద్వారా అవతలకి వెళ్ళి అక్కడున్న విట్రియస్ ద్రవం ద్వారా ప్రవహించి రెటినా మీద ఫోవియా అనే చోట చూస్తున్న దృశ్యం తల క్రిందులుగా పడుతుంది. అది నరాల ద్వారా మెదడుకి చేరేసరికి ఆ తల క్రిందుల బింబం సరిగా అయి కనిపిస్తుంది. అంటే ఈ కిరణాలు ప్రవహించే కార్నియా, యాక్వియస్ ద్రవం, కటకం, విట్రియస్ ద్రవం పారదర్శకంగా వుంటేనే చూస్తున్న దృశ్యం తాలూకు బింబం రెటినా మీద కేంద్రీకరించబడుతుంది. అలాగే ఆ బింబాన్ని మెదడుకి చేర్చేనరాలు, కంటిలోపలి నరాలు కూడా సరిగ్గా వుండాలి. వాటిలో ఏ లోపం వచ్చినా, కంటిలో కటకానికి అటు ఇటువున్న కండరాలు దెబ్బతిన్నా కూడా దృష్టి లోపాలు రావచ్చు. మనం దృష్టిని దూరపు వస్తువుల నుంచి దగ్గర వస్తువులకు మార్చినప్పుడు కంటిలోపల కంటి పాప వెనుక వుండే కుంభాకార కటకంలో సహజంగా వచ్చే మార్పుల వల్ల చూడడానికి వీలవుతుంది. అంటే కటకానికి పైన, క్రింద వుండే సిలియరీ కండరాలు ఇందుకు తోడ్పడుతున్నాయి. అంటే ఈ కండరాలు అవసరమైన విధంగా కటకాన్ని మారుస్తున్నాయి. ఈ కండరాల సామర్థ్యం తగ్గితే దగ్గిర వస్తువులు సరిగ్గా కనిపించవు" అంటున్నారు డాక్టర్ ఎ. సాయిబాబాగౌడ్.

"చత్వారం అంటే ఇదే కదండి...."

"అవునండి. సాధారణంగా 40 సం॥ లు దాటిన తర్వాత వస్తుంది. ఒక్కోప్పుడు కాంతి కిరణాలు కటకం ద్వారా ప్రవహించి రెటినా మీద కేంద్రీకరించ బడవు. రెటినాకి ముందు కేంద్రీకరించబడతాయి. దీన్ని 'మయోపియా' అంటారు. దగ్గరున్న వస్తువులు సరిగ్గా కనిపించవు. పుటాకార కటకాన్ని వుపయోగించి ఈ లోపాన్ని సరిదిద్దవచ్చు. ఒక్కోసారి ప్రతిబింబం రెటినా వెనుక పడుతుంటుంది. అప్పుడు కుంభాకార కటకాన్ని వుపయోగించి ఈ దృష్టి లోపాన్ని సరిచేయవచ్చు."

"ఈ దృష్టి లోపాల్ని పసికట్టడం ఎలాగండీ?"

"దృష్టి లోపాలుంటే తలనొప్పి వస్తుంది, కన్ను స్ట్రెయిన్ అయినట్లు అనిపిస్తుంది, ఇన్ఫెక్షన్స్ తరచూ కలగ వచ్చు, వస్తువులు రెండుగా కనిపిస్తుంటుంది, మెల్ల రావచ్చు. ఒక కంటిలోనే లోపంవుంటే ఏదైనా సందర్భంలో రెండో కంటిని మూసి ఆ కంటితో చూసినప్పుడే గుర్తించగలము. కళ్ళలోంచి నీరు కారడం, కళ్ళు ఎర్రబడినట్లు వుండటం, కళ్ళు లాగినట్లుండటం, తల నొప్పి చిన్న చిన్న దృష్టి లోపాలున్న వాళ్ళలో కనిపించే లక్షణాలు. రక్తహీనత వున్న వాళ్ళకి తలనొప్పి వస్తుంది. రక్త హీనత తొలగిస్తే ఆ తలనొప్పి తగ్గుతుంది. 'మైగ్రేన్' వస్తే తలనొప్పి తో పాటు వాంతి వస్తుంది.. ఆస్టిగ్మాటిజమ్ అనే మరో దృష్టిలోపం వస్తే అడ్డంగావచ్చే కాంతి కిరణాలు రెటినా మీద ఒకచోట,

నిలువుగా వచ్చే కాంతి కిరణాలు మరోచోట కేంద్రీకరించబడతాయి. తరచు కంటికురుపులు రావడం, రెప్పలు వాయడం, కళ్ళు లాగటంలాంటి లక్షణాలు కనిపిస్తాయి. కుంభాకార లేకపుటాకార సిలండ్రికాల్ లెన్స్‌లు వాడి ఈ లోపాన్ని సవరించవచ్చు. రెండు కళ్ళలో వేరు వేరు లోపాలుంటే 'అనైసోమెట్రోపియా' అంటారు. రెండు కళ్ళలో తేడా ఎక్కువగా వున్నప్పుడు లోపాన్ని కాంటాక్ట్ లెన్స్‌ల ద్వారా సరి చేయాలి."

"కాంట్రాక్ట్ లెన్స్‌లంటే ఏమిటండి?"

"పాలిమిథైన్ మిథాక్రిలేట్ అనే ప్లాస్టిక్ మెటీరియల్‌తో తయారు చేస్తారు ఈ కాంట్రాక్ట్ లెన్స్‌ల్ని. ఒకసారి యుద్ధంలో ప్లాస్టిక్ ముక్కల తాలూకు చిన్న చిన్న పీసెస్ పైలెట్ల కంట్లో పడ్డా ఏమీ కాలేదు. అది చూసి ఆ మెటీరియల్‌తో కాంట్రాక్ట్ లెన్స్‌లను చేసి కంట్లో పడితే ఏమీ కాదనే వుద్దేశంతో కాంట్రాక్ట్ లెన్స్‌లను తయారు చేశారు. ఈ లెన్స్‌ని నల్ల గుడ్డు మీద అమరుస్తారు. దగ్గర నుంచి చూసినా కూడా అమర్చిన లెన్స్‌గా గుర్తించలేము. ఏ వయసు వారైనా కాంటాక్ట్ లెన్స్‌లను పెట్టుకోవచ్చు. రెండు కళ్ళలో దృష్టి లోపము వేరు వేరుగా వుంటే అద్దాల కన్నా కాంటాక్ట్ లెన్స్‌లే ఖచ్చితంగా వుపయోగపడతాయి. ఇవి పెట్టుకోవడం వల్ల ఎటువంటి ప్రమాదం వుండదు. ఈ కాంటాక్ట్ లెన్స్‌లలో కూడా రకాలున్నాయి. తరచుగా పరీక్ష చేయించుకోవలసిన అవసరం లేదు. రోజూ ఎవరికి వారే తీసుకుని శుభ్ర పరచుకుని కంటికి అమర్చుకోవచ్చు. ఒక్కోసారి పవరు తగ్గవచ్చు. పవరు పెరగడం మాత్రం వుండదు. ఆటలు ఆడేవారు, డాన్స్ చేసేవారు టెలివిజన్ అనౌన్సర్లు కళ్ల జోళ్లని వుపయోగించడం కన్నా ఈ కాంటాక్ట్ లెన్స్‌లని వాడితే వీలుగా వుంటుంది.



విటమిన్ 'ఎ' లోపం

"రేచీకటి అంటే ఏమిటండి? "

"చీకటి పడేకొద్దీ సరిగ్గా కనిపించకపోవడం..... రెటీనాలో రాడ్స్, కోన్స్ అని వుంటాయి. రాడ్స్ రాత్రి పూట చూపుకు తోడ్పడితే - కోన్స్ పగటి పూట చూపుకు తోడ్పడుతుంది. ఈ రాడ్స్‌లో డిఫెక్ట్ వుంటే రాత్రి పూట సరిగ్గా కనిపించదు. దగ్గర బంధువులలో పెళ్ళిళ్ళు చేసుకోవడం వల్ల ఈ డిఫెక్ట్ వస్తుంటుంది. విటమిన్ - ఎ లోపం వల్ల ఎక్కువగా రావచ్చు. విటమిన్ 'ఎ' లోపం వల్ల తెల్లగుడ్డు పొడిగా తయారై, దానిమీద బూడిద రంగు మచ్చలు రావచ్చు. వీటని బైటాట్ స్పాట్స్ అంటారు. చికిత్స చేయించక పోతే నల్లగుడ్డు దెబ్బతిని అంధత్వం రావచ్చు".

"పొగ త్రాగడం వల్ల కంటి జబ్బులు రావచ్చాంటారా?"


"పొగ ఎక్కువగా త్రాగడం వల్ల ప్రేగులలోని మ్యూకస్ పొర దెబ్బతిని, అమ్లాన్ని సరిగ్గా ఉత్పత్తి చేయదు ! దీని వల్ల ఆహార పదార్థాలలో వున్న విటమిన్ బి - 12 ను గ్రహించే శక్తి ప్రేగులకు లేకుండా పోతుంది. దీనితో పాటు సైనేడ్ విషపదార్థం రక్తంలో చేరి విటమిన్ బి -12 సాంద్రతను నరాలలో, కండరాలలో తగ్గిస్తుంది. ఈ కారణం వల్ల దృష్టి మందగించే ప్రమాదముంది. పొగ త్రాగటం కళ్ళకు మంచిది కాదు. ఏదైనా ఒక వస్తువుని చూసినప్పుడు దాని మధ్య భాగం మాత్రం కనబడకుండా చుట్టూవున్న క్షేత్రం కనిపిస్తుంటే ఈ దృష్టిమాంద్యం పొగత్రాగటం వల్ల కలిగినదే ! ఎక్కువగా పొగత్రాగడం వల్ల రంగుల విలువలు ముఖ్యంగా ఎరుపు,ఆకుపచ్చ లాంటి రంగుల్లోని భిన్నత్వాన్ని గుర్తించే శక్తిని కోల్పోతారు. పొగత్రాగేవారు ఈ విషయాన్ని గమనించలేరు. పరీక్ష చేసినప్పుడే ఈ విషయం తెలుస్తుంది.... పొగత్రాగడం మాని బి-12 ఇంజక్షన్ల రూపంలో గాని, మందుల రూపంలో గాని తీసుకుంటూ రక్తనాళాల్ని విశాలం చేసే మందులు వాడాలి. ... విటమిన్ 'బి' లోపిస్తే కనురెప్పలు, కను మూలలు ఎర్రబడతాయి. బి -12 లోపంవల్ల కంటినరం బయట భాగం బలహీనమై తెల్లబడుతుంది."

"కనురెప్పలు ఎందుకు వాస్తుంటాయండి?"

"దృష్టిలోపాలవల్ల, సమతుల ఆహారం తీసుకోక పోవడం వల్ల, తలపైన వచ్చే చుండ్రు లాంటి ఇతర వ్యాధులలోని సూక్ష్మజీవుల వల్ల కను రెప్పల వ్యాధి వచ్చి - రెప్పలువాచి పక్కులు కడతాయి. రెప్పల వెంట్రుకలు వూడవచ్చు. కనురెప్పల మీద క్రిమినాశక మందుల్ని వాడడంవల్ల ఈ వ్యాధిని నివారించవచ్చు. గోరు వెచ్చని నీటిలో గుడ్డని తడిపి కాపడం పెట్టించాలి రెప్పల మీద వాపు తగ్గడానికి ".

"కళ్ళ కలక అంటే ఏమిటండి?"

"దీన్నే కంజెక్టివైటిస్ అని కూడా అంటారు. కనుగుడ్డు పై భాగంలో కంజెక్టయివా అనే పొరవుంటుందనుకున్నాంగా . దీనిలో చాలా రక్తనాళాలు వుంటాయి. వాతావరణ కాలుష్య ప్రభావం వల్ల ఈ పొరకు అంటు వ్యాధి సోకి కళ్ళ కలకలు లేక కంజెక్టివైటిస్ వస్తుంది. కళ్ళ కలక వస్తే కళ్ళు ఎర్రబడడమే కాకుండా కళ్లల్లో ఇసుక పడినట్లు గరగరమంటుంది. ఎక్కువ వెల్తుర్ని చూడటం ఇబ్బంది అవుతుంది. వైరస్ పుణ్యమాని ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి తేలికగా వ్యాపిస్తుంది. అందుకని ఈ వ్యాధి వచ్చిన వాళ్ళు స్కూళ్ళకు , కాలేజీలకు, ఆఫీసులకు తగ్గేవరకూ వెళ్ళకుండా వుంటే మంచిది. మురికి నీరు వుపయోగించడం వల్ల కలుషిత వాతావరణంలో తిరగడం వల్ల , బాక్టీరియా - వైరస్ వల్లనే కాకుండా కొన్ని రసాయనిక పదార్థాలు మలిన పదార్థాలు, ధూళి మొదలైన వాటివల్లా ఈ జబ్బురావచ్చు. కళ్ళకలక వస్తే నీళ్లనెన్ని ఎక్కువసార్లు కంటిని చన్నీటితో కడుగుతుండాలి. జేబురుమాళ్ళతో, చేతితో కంటిని తుడుస్తుండకూడదు. క్లోరోమ్ పెనికాల్ ఐడ్రాప్స్ లేక గెంటామైసెస్ ఐడ్రాప్స్‌ని జబ్బు తీవ్రతని బట్టి ఎక్కువ సార్లు వాడడం మంచిది. పూర్తిగా తగ్గేంతవరకూ ఈ మందును వాడాలి. ఈ జబ్బుకి పూర్తిగా చికిత్స చేయించుకోని పక్షంలో కంట నల్లగుడ్డుపై పుళ్ళు ఏర్పడి చూపు పోయే ప్రమాదముంది."



ల్యూకోమా

"క్షయ, సిఫిలిస్, డయాబెటిస్ మొదలైన వ్యాధుల వల్ల దృష్టి మందగిస్తుందంటారా?"

"చిన్నప్పుడు బి.సి.జి. టీకాలు వేయించకపోవడం వల్ల క్షయ రావచ్చు. సరైన ఆహార పద్ధతులు పాటించకపోవడం వల్ల, జన సాంద్రత ఎక్కువగా వున్న ప్రాంతాలలో నివసించడం కూడా ఈ వ్యాధి రావడానికి కారణాలు. ఊపిరితిత్తుల క్షయ క్రమంగా కంటికి సోకే ప్రమాదముంది. క్షయవ్యాధి మెదడుకి వస్తే నరముల బలహీనత ఏర్పడి మెల్లకన్ను, ఒకవస్తువుని చూసినప్పుడు రెండుగా కనపడడం జరుగుతుంది. కంటి నరానికి క్షయ తగిలితే కంటి చూపు తగ్గిపోయే ప్రమాదముంది. ఊపిరితిత్తుల క్షయను ప్రారంభదశలో ఒక్కొసారి వ్యాధిగ్రస్తులు గ్రహించలేరు. చికిత్స అశ్రద్ధ చేసిన సందర్భంలో 'ఈల్స్ జబ్బు' వస్తుంది. ఈల్స్ జబ్బు ముఖ్యంగా యువకులకు వస్తుంది. కంటిలో దోమలు తిరుగుతున్నట్లు వుంటుంది. వ్యాధి ముదిరితే కంటిలోని రక్తం గడ్డ కడుతుంది. చూపు మందగించి, క్రమేణ అంధత్వానికి దారితీస్తుంది. తల్లిదండ్రులు సిఫిలిస్‌తో బాధపడితే, దాని ప్రభావం వల్ల పిల్లలు బొద్దుగా కనిపించినా ఏ వస్తువునూ చూడలేరు. కంటి నరాలు మృతప్రాయమై వెల్తుర్ని గుర్తుపట్టలేరు. వారసత్వంగా కనిపించే సిఫిలిస్ లక్షణాలు కనిపిస్తాయి. ఈ సుఖవ్యాధి సోకడానికి బాక్టీరియానే కారణం. రక్తం ద్వారా తల్లి నుంచి శిశువుకి వస్తుంది. ఇలా పుట్టుకతో వచ్చే జబ్బు వల్ల కనుగుడ్డు లేక పోవచ్చు. శుక్లపటలం తెల్లబడవచ్చు. శుక్లంగాని తత్సంబంధిత నరాలుగాని చచ్చిపోయి వుండవచ్చు. సిఫిలిస్ వ్యాధిగ్రస్తమైన స్థలంగాన్ని చేతితో తాకి, ఆ చేతిని మళ్ళీ కంటికి తగిలించినప్పుడు కూడా కంటికి ఆ వ్యాధిసోకే ప్రమా[illegible]వారికి సిఫిలిస్ మూడుదశల్లో వస్తుంది. మొదటి దశలో కంటి మీద కురుపులు [illegible] పొరసై పుండు ఏర్పడుతుంది. తగిన చికిత్స చేయించుకోక పోతే రెండవ ద[illegible] మందగించటం జరుగుతుంది. వెలుతురు చూడలేరు. మూడవదశ చేరడానికి [illegible]డుతుంది. ఈ దశలో గడ్డలాంటిది పెరిగి కండరాలు, నరాలు కూడా దెబ్బతింటా[illegible] పెన్సిలిన్ ఇంజక్షన్ వాడాలి. యాంటిబయాటిక్ మందులూ వాడాలి. రెండవ దశలో కార్టిసోన్ చుక్కల మందు, అట్రోపిన్ ఆయింట్‌మెంట్ వాడాలి ... రక్త పోటు వల్ల దృష్టి దెబ్బతినవచ్చు. డయాబెటిస్ వల్ల కంటి చూపు దెబ్బ తింటుంది.

"గ్లకుమా అంటే నీటి కాసుల జబ్బు గురించి చెప్పండి?"

"కంట్లోని టెన్షన్‌ని యాక్వియస్ హ్యూమర్ అనే ద్రవం మెయిన్‌టేన్ చేస్తూంటుంది. ఆ ద్రవం ఎక్కువైనా, తక్కువైనా వచ్చే జబ్బుని గ్లకుమా లేక నీటికాసుల జబ్బు అంటారు. గ్లకుమా వస్తే చూపు తగ్గడంతో పాటు ఇంద్ర ధనస్సు లాంటి రంగులూ కనబడతాయి. కంటి చుట్టూకొద్దిగా నొప్పిగా కూడా వుంటుంది. ప్రక్కల్ని సరిగ్గా కనిపించదు. తరచుగా కళ్ళ అద్దాలను మార్చాల్సి వస్తుంది. వంశ పారంపర్యంగా కూడా ఈ జబ్బు రావచ్చు. ఒక్కొసారి మందులతో - మరోసారి చిన్న శస్త్ర చికిత్స చేసి దీనికి చికిత్స చేయించవచ్చు.

"మెల్ల అదృష్టమేనంటారా?"

"ఎంత మాత్రం కాదు. ఇదీ ఒక విధమైన జబ్బే! వంశపారం పర్యంగా మెల్ల రావచ్చు. లేకపోతే కంటిని పట్టి వుండే కండరాల లోపం వల్ల రావచ్చు. తల్లి దండ్రులు గాని టీచర్లు గాని పిల్లల్లో మెల్లని గమనిస్తే వెంటనే కళ్ళ డాక్టరుకి చూపించి తగిన చికిత్స చేయించటం అవసరం. లేకపోతే ముందుముందు దృష్టి లోపం వచ్చే ప్రమాదముంది. అద్దాలతోను మందులతోను, కొన్ని ఎక్సర్‌సైజెస్ తోను మెల్లని సరిదిద్దవచ్చు. స్కూల్లో ఉపాధ్యాయులు పిల్లలు బోర్డు మీద అక్షరాల్ని ఎక్కించుకోకుండా ప్రక్కవాడి పుస్తకాలలో చూసి రాస్తుంటే కోప్పడ కూడదు. దూరపు అక్షరాలు కనిపించడం లేదేమో తెలుసుకోవాలి. అలాగే కొన్ని రంగుల్ని గుర్తించి చెప్పలేక పోతే దండించకుండా ఆ రంగుల్ని అతడు చూడలేకపోతున్నాడేమో, కలర్ బ్లైండ్‌నెస్ వుందేమో గమనించాలి. ఇలా ఉపాధ్యాయులు జాగ్రత్తగా గమనిస్తే వెంటనే చికిత్స చేయించవచ్చు. అలాగే పిల్లలు కొన్ని రకాల ఆటల జోలికి పోకుండా చూస్తే యాక్సిడెంట్‌లో తగిలే కంటి దెబ్బల్ని చాలా వరకు అరికట్టవచ్చు."

"కేటరాక్ట్ గురించి చెప్పండి?"

"కేటరాక్ట్‌నే శుక్లాలు అంటారు. సాధారణంగా యాభై సంవత్సరాలకి పైబడ్డ వాళ్ళకి వస్తుంది. కంటి కటకాలు ట్రాన్స్‌పరెంట్‌గా వుంటుందనుకున్నాంగా. ఆ ట్రాన్స్‌పరెన్సీ తగ్గి కటకం తెల్లబడటం వల్ల కాంతి కిరణాలు రెటీనా మీద పడవు. దాంతో తాత్కాలిక అంధత్వం వస్తుంది. ఈ తాత్కాలిక అంధత్వాన్నే కేటరాక్ట్ లేక శుక్లాలు అంటారు. సాధారణంగా శుక్లాలు ముదిరిన తర్వాత ఆపరేషన్ చేస్తుంటారు. ఈ మధ్య పూర్తిగా ముదరక పోయినా తీస్తున్నారు. ఒక్కొసారి కొన్ని గాయాలవల్ల కేటరాక్ట్ రావచ్చు. అందుకని పరీక్షించిన తర్వాతే ఏవిధమైన వైద్యాన్ని చేయాల్సింది వైద్యుడు నిర్ణయిస్తాడు. ఆపరేషన్ ఆలస్యమైతే సరిగ్గా చూపు రావడానికి రెండు సార్లు ఆపరేషన్ అవసరం కావచ్చు. కాంతికిరణాలు ప్రవహించే మార్గమంతా ట్రాన్స్‌పరెంట్‌గానే వుండాలి. లేకపోతే చూపు దెబ్బతింటుంది. అంటే కటకమే కాదు ఒక్కొసారి ఇన్‌ఫెక్షన్ వచ్చి యాక్వియస్ హ్యూమర్ లేక విట్రియస్ హ్యూమర్ ట్రాన్స్‌పరెన్సీని కోల్పోయినా చూపు దెబ్బతింటుంది. పైపొరలోని నల్లగుడ్డు దెబ్బతిని తెల్లగా మారినా చూపు కనిపించదు."

"అటువంటి వాళ్ళకి వేరొకరి కంటిలోని నల్లగుడ్డును శస్త్ర చికిత్స ద్వారా అమర్చవచ్చు కదండీ?"

"అమర్చవచ్చండి. చనిపోయిన తర్వాత కాయంతో పాటు కళ్ళని నాశనం కానివ్వకూడదు. దానం చేస్తే మరో వ్యక్తికి కంటి చూపుని ప్రసాదించిన వాళ్ళవుతారు. అందుకనే అందరూ కంటి దానం చేయటం అవసరం. దానం చేసే వాళ్ళకన్నా దానంకోసం ఎదురు చూసే వాళ్ళ సంఖ్య కొన్ని రెట్లు."

"కళ్ళని దానం చేసే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి ఒకే వయసు వాళ్ళు కావాలా?"

"అక్కర్లేదు. ఏ వయసు వాళ్ళ కళ్ళనైనా మరే వయసు వాళ్ళకైనా అమర్చవచ్చు. కాకపోతే కళ్ళు ఆరోగ్యంగా వుండాలి

"ఆరోగ్యం గా అంటే . . . . . .?"

"కాన్సర్, డయాబెటిస్, జాండిస్, క్షయ కుష్ఠు మొదలైన వ్యాధులతో మరణించిన వాళ్ళ కళ్ళని వేరే వాళ్ళకి అమర్చము. ఎందుకనంటే అవతలి వాళ్ళకి కూడా ఈ సూక్ష్మ క్రిములు ప్రమాదం కలిగించే అవకాశముంది."

"ఆడవాళ్ళ కళ్ళని ఆడవాళ్ళకీ, మగవాళ్ళ కళ్లనీ మగవాళ్ళకే అమర్చాలనే నియమమేమైనా వుందా?"

"అలాంటిదేమీ లేదు. ఆడవాళ్ళ కళ్ళను మగవాళ్ళకి అమర్చ వచ్చు. మగవాళ్ళ కళ్ళను ఆడవాళ్ళకు అమర్చవచ్చు. దానం చెయ్య దల్చుకున్న వ్యక్తి చనిపోగానే అతని తాలూకు వాళ్ళు హాస్పిటల్‌కి ఫోన్ చేసి చెప్తే వెంటనే వచ్చి కళ్ళను వాళ్ళు తీసుకుంటారు."



నేత్రదానం ఆపరేషన్ తర్వాత

"గుడ్డు మొత్తాన్ని మారుస్తారా?"

"ఆపరేషన్ చేసినప్పుడు నల్ల గుడ్డుని మాత్రమే మారుస్తారు. చనిపోయిన ఆరుగంటలలోపే ఆ వ్యక్తి నుంచి కళ్ళను వేరు చేయాలి. ఇరువై నాల్గు గంటలలోపు వేరే వ్యక్తికి అమర్చాలి. మేము సంవత్సరానికి వంద నుంచి నూట యాభై దాకా కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాము. వాటిలో తొంభై శాతం విజయవంతమవుతున్నాయి. మిగతా పదిశాతం శరీరతత్వాన్ని బట్టి రిజెక్ట్ అవుతున్నాయి. . . . . . ఆపరేషన్ చేసిన తర్వాత మూడు వారాలు మేము హాస్పిటల్ లోనే వుంచి అబ్జర్వ్ చేస్తాము. కొత్త నల్లగుడ్డు పడకపోతే క్రమంగా అది తెల్లగా మారుతుంది. రిజెక్ట్ అయితే మళ్ళీ ఆపరేషన్ చేసి నల్లగుడ్డుని అమర్చాల్సి వస్తుంది. ప్రపంచ మొత్తంలో కోటి మంది అంధులుంటే వాళ్ళల్లో 1/3 వ వంతు మనదేశంలోనే వున్నారు. వీళ్ళలో 70 % మందికి చిన్న ఆపరేషన్లతో దృష్టి నివ్వవచ్చు. మిగిలిన వాళ్ళల్లో 15% మంది కార్నియా చెడిపోయి అంధత్వంతో బాధపడుతున్నారు. వాళ్ళకి చనిపోయి వాళ్ళ కనుగుడ్లలోని నల్లగుడ్డుని తీసి, అమర్చడం ద్వారా దృష్టిని ప్రసాదించవచ్చు." అంటున్నారు డా॥ ఎ.సాయిబాబాగౌడ్.

గర్భిణి స్త్రీలు ఆకు కూరలు, దొరికిన పళ్ళు, పాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలకి దృష్టి దోషం రాదు. పిల్లలు పుట్టగానే వచ్చే పాలని 'ముర్రుపాలు' అంటారు. ఈ పాలని కొందరు పిల్లలకు పట్టకుండా పిండి పారబోస్తారు. అది తప్పు. ఈ పాలలో విటమిన్-ఎ ఎక్కువగా వుంటుంది. అందుకని ముర్రు పాలని పిల్లలచే తప్పక తాగించాలి. ఆరు నెలల వయసు వచ్చినప్పటి నుంచి పిల్లలకు తల్లి పాలతో పాటు మరేదైనా ఆహారాన్నివ్వాలి. సంవత్సరం నుంచి అయిదు సంవత్సరాల వయసు పిల్లలకు విటమిన్-ఎ డ్రాప్స్ ఇప్పించాలి. రక్త సంబంధం వున్న వాళ్ళ మధ్య పెళ్ళిళ్ళను నిరోధించాలి. దెబ్బలు తగిలే ఆటలు ఆడకుండా పిల్లల్ని మందలిస్తూ వుండాలి. అప్పుడు మరికొన్ని దృష్టి లోపాల్ని తప్పక అరికట్టగల్గుతాం.

వేదగిరి రాంబాబు

కంటి గురించి ఏమైనా అనుమానాలుంటే సంప్రదించవల్సిన చిరునామా - డాక్టర్ ఎ. సాయిబాబాగౌడ్. M.S. Ph.D.,
నేత్ర వైద్యులు,
వై డబ్ల్యూ. సి. ఎ . దగ్గర,
వెస్టు మారేడు పల్లి,
సికింద్రాబాదు.
Phone : 63495.

"టెన్షన్"

తరువాత రోజు సినిమా రిలీజయ్యే నిర్మాత దర్శకుడితో అన్నాడు.
"మన పిక్చర్ కనీసం ఓ నాలుగు వారాలు ఆడేంతవరకు మనకు చాలా టెన్షన్ ఉంటుంది కదా?"
'నాలుగు వారాలెందుకండి, రేపు మార్నింగ్ షోతో మీ టెన్షనంతా పోతుంది' చెప్పాడు దర్శకుడు తేలిగ్గా.
-కె.వి.మధుసూదనరావు.

"చర్య"

"మీ బ్రహ్మచారి సంఘంలో ఎవరైనా తప్పులు చేస్తే మీరు ఏ చర్య తీసుకుంటారు".
"ఏం చేయం.. అందరం కలిసి బలవంతంగా వాడికి వివాహం జరిపించేస్తాం".
-కె.వి.మధుసూదనరావు.

గోర్నమెంటా? ప్రవేటా?

"ఒక పనిని పదుగురు పదిరోజులలో పూర్తిచేస్తే, ఎనిమిదిమంది ఎన్నిరోజులలో పూర్తిచేయగలరు" అడిగాడు టీచర్.
"అది గవర్నమెంట్ పనా, ప్రయివేట్ పనో ఖచ్చితంగా తెలిస్తే గాని చెప్పడం కష్టం సార్".
కె.వి.మధుసూదనరావు.

కలకత్తా ఫిల్మ్ ఫెస్టివెల్



ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న శ్రీ సత్యజిత్ రాయ్, కేంద్రమంత్రి శ్రీ ఉపేంద్ర

క్రిక్కిరిసిన ఆహూతుల సమక్షంలో అందాల తార దేబశ్రీరామ్ ఒకప్రక్క ప్రముఖ నృత్య దర్శకురాలు అమలి శంకర్ మరోప్రక్క నడవగా తళుక్కున మెరిసే ఫ్లాష్‌ల మధ్య ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు సత్యజిత్‌రాయ్ కలకత్తాలోని రవీంద్ర ఓపెన్ ఎయిర్ థియోటర్ సభాస్థలిలో జ్యోతిని వెలిగించడంతో 21వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల సంరంభం ప్రారంభమైంది. దేశ, విదేశాల నుండి వచ్చిన చలన చిత్ర ప్రముఖులు సినిమా ప్రియుల నుద్దేశించి సత్యజిత్‌రాయ్ చేసిన ప్రసంగం అందరిని ఆకర్షించింది. ప్రారంభ చిత్రంగా గ్రీకుకు చెందిన " లాండ్‌స్కేప్ ఇన్ ది మిస్ట్" రవీంద్ర సరోవర్‌లో ఓపెన్ థియేటర్‌లో ప్రదర్శించారు.

నందన్ ఫిల్మ్ కాంప్లెక్స్

భారత దేశంలో మరెక్కడాలేని ఫిల్మ్‌కాంప్లెక్స్ కలకత్తాలో ఉంది. దీని పేరు "నందన్ ఫిల్మ్‌కాంప్లెక్స్". ఇక్కడే పదకొండు రోజుల ఫిల్మోత్సవ ప్రదర్శనలు జరిగాయి. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం అయిదు థియేటర్లు ఉన్నాయి. ఇవి

నందన్-I,
నందన్-II,
నందన్-III,
రవీంద్రసదన్,
శిశిరమంచ్.

నందన్-ఎ, రవీంద్రసదన్ ఈ రెండు ఆధునికమైన థియేటర్లని చెప్ప వచ్చు. సామాన్యంగా నందన్-IIIలో పత్రికా సమావేశాలు నిర్వహిస్తారు. ప్రెస్ కోసం ఇక్కడ సినిమా ప్రదర్శన కూడ ఉంటుంది. శిశిర మంచ్, నందన్-IIలు ఒక మోస్తరుగా ఉంటాయి.

దేశ విదేశాల నుండి మొత్తం 222 చిత్రాలను ప్రదర్శించారు. ఇందులో 169 విదేశీ చిత్రాలు కాగా 53 చిత్రాలు మనదేశానివి. 44 దేశాలచిత్ర ప్రముఖులు తమ తమ ఫిల్మ్ బాక్స్‌లతో కలకత్తాకు విచ్చేశారు. అర్జెంటినా, ఫ్రాన్స్, అమెరిక చిత్రాల వైపు ప్రేక్షకులు ఎక్కువగా మొగ్గు చూపారు. ఇవిగాక క్యూబా, చెకోస్లోవేకియ, బ్రెజిల్, కొలంబియ, ఇంగ్లాండ్, ఇరాన్, జపాన్, సౌత్‌కొరియా, స్పెయిన్, నెదర్లండ్, న్యూజిలాండ్, రష్యా, యుగోస్లోవియ, పెరు, ఫిలిప్పైన్స్, పోలాండ్, పోర్చుగల్, టర్కి, ఇండోనేషియ. ఈజిప్టు, డెన్మార్క్, ఆస్ట్రేలియ, అల్జీరియ, హాంగ్‌కాంగ్, గ్రీస్, కెనడా, చైనా, బీహార్, ఇటలీ, ఉభయ జర్మనులు, శ్రీలంక, స్వైన్, స్విట్జర్లాండ్, మొదలగు దేశాలనుండి ఈ ఫిల్మోత్సవంలో పాల్గొన్నారు. ప్రముఖ విదేశ దర్శకులు గాడ్‌ఫ్రెరెగి, జులాస్కి, కాక్స్, మొదలైన వారితో మహిళా దర్శకులు కూడ ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

ఇక ఇండియన్ పెనోరమలో దాదాపు 53 చిత్రాలు ప్రదర్శించ బడ్డాయి ఇందులో, తెలుగు నుండి దాసి, శివ, బెంగాల్ నుండి సతి, చాంద్‌నీర్, మలయాళం నుండి పిరివి ఇవిగాక గుజరాత్, మరాఠి, అస్సాం, కన్నడ భాషల నుండి చిత్రాలు వచ్చాయి. 'ఏకదిన్ అచానక్' మృణాల్‌సేన్ చిత్రం కూడ ప్రదర్శించ బడింది. దాదాపు 11 నాన్ ఫిచర్ ఫిల్ము కూడ ప్రదర్శించారు. రెట్రాస్పెక్టలో అశోక్‌కుమార్ చిత్రాలు ప్రత్యేకంగా ప్రదర్శించారు.

191 మంది విదేశీ ప్రతినిధులు, ఇందులో 26 నటీనటులు, 8 మంది నిర్మాతలు, 15 మంది డైరక్టర్స్, 28 మంది జర్నలిస్టులు. మిగత వారు డెలిగెటర్స్‌గా పాల్గొన్నారు. భారతీయ చిత్ర పరిశ్రమ నుండి మొత్తం 1600

మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసారి N.F.D.C కూడ అత్యంత ఉత్సాహంగా ఈ చిత్రోత్సవంలో పాల్గొంది. పాత్రికేయులతో సహా మీడియ నుండి 350 మంది పాల్గొన్నారు.

దాదాపు 150 చిత్రాలను ప్రెస్, డెలిగెట్‌లకు చూపించడం జరిగింది 40 ప్రెస్ మీటింగ్‌లు జరిగాయి. దాదాపు 15వేల ఫోటోస్ ఎప్పటికప్పుడు ప్రతినిధులకు అందించడంతో ఫోటో డిస్క్ రిస్క్ తీసుకుందనే చెప్పుకోవాలి.

ఫిలిం మార్కెట్ లేదు

ఇక ఫిల్మ్ మార్కెటు ఈసారి పెద్దగా లేదనే చెప్పాలి. విదేశాల నుండి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్లు తక్కువ సంఖ్యలో హాజరైయినారు. ఎన్.ఎఫ్.డి.సి, ఎ.పి.యఫ్.డి.సి. కొరియా, ప. బెంగాల్ ఎఫ్.డి.సి జర్మని స్విడన్‌తో పాటు ఈసారి దూరదర్శన్ కూడ తన స్టాల్‌ను ఫిల్మ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసింది. ప.బెంగాల్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా ఒక ఫిల్మ్ ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

సిలియా

ఇది పిల్లల కథాచిత్రం. స్నేహం పట్ల పిల్లల అవగాహనకు అద్దం పట్టే ట్లుగా చూపించడం జరిగింది. తొమ్మిది సంవత్సరాల సిలియా పాత్ర దావిడ 1957 నాటి ఆస్ట్రేలియా లోని మేలోబర్న్ సాగర్ పిల్లల మనస్థత్వాన్ని, ప్రవర్తనను చూడడానికీ చిత్రం కొంతవరకు దోహదం చేస్తుంది.

సిలియాకు స్నేహితులతో గడపడం చాలఇష్టం. ఎండాకాలం సెలవుల్లో సరదాగా గడపాలని కోరుకుంటుంది. ఈ సరదా ప్రపంచంలో శత్రువులను కూడ ఏర్పర్చుకుంటుంది. స్నేహం విడిపోకుండ ప్రమాదాలు చేయడం కథల పుస్తకాలు చదవడం అంటే ఇష్టపడ్తుంది సిలియా. ఉన్నతవర్గాల తోకూడ ఎంజాయి చేయడం అంటే సిలియాకు భలే సరదా. ఈ అమాయకత్వం సినిమా మెత్తం కన్పిస్తుంది. సిలియ ప్రాణ స్నేహితురాలు గ్రాన్ని తన కుందేలు అంటే సిలియా పంచప్రాణాలు. ఒకరోజు గ్రాన్ని చనిపోతుంది. అర్ధరాత్రి తన బొమ్మలను కిటికి నుండి బయటకు విసిరివేస్తుంది. దీనివల్ల ప్రక్క ఇంటి వాళ్ళకు మూల్యం చెల్లించు కుంటాడు సిలియా తండ్రి. ఇక్కడ నుండి సిలియా జీవితంలో మార్పు చోటు చేసుకుంటుంది.

అక్కడ నగర ప్రభుత్వం చేసిన చట్టప్రకారం సిలియా కుందేలును దొంగతనంగా కుందేలు గృహానికి తరలిస్తారు. సిలియా ఇంటిప్రక్క ఉన్న ప్రభుత్వాధికారి అక్కడ సిలియా కుందేలు చనిపోతుంది. అతనిపై సిలియా పెంచుకున్న ద్వేషం, కుందేలు చనిపోయిందనే బాధను, సిలియా పడే ఆవేదన, ఉద్రేకాన్ని అణుచు కుంటు సిలియా పడేపాట్లు మనల్ని ఉత్కం ఠంలో ముంచెత్తుంది. క్లైమాక్స్ చాల చక్కగా తీసింది దర్శకురాలు. అన్నాటర్నర్ సిలియా మొదటి సిన్మా అయినప్పటికి అంతకుముందు కెమెరా

వుమెన్‌గా మంచి అనుభవం సంపాదించింది. చిన్న పిల్లల మనస్థత్వాన్ని అద్దం పట్టేవిధంగా ఈ చిత్రాన్ని తేల్చి దిద్దగల్గింది అన్నాటర్నర్. రెబల్ స్మార్ట్ సిలియాగా నిజంగా స్మార్ట్‌గా నటించింది. దీనికి సంగీతం క్రిస్‌నేల్.

మై నైట్స్ ఆర్ మోర్ బ్యూటిఫూల్ ధెన్ యువర్ డేస్

తల్లి దండ్రుల ప్రభావం పిల్లలపై ఎలా వుంటుందనే దానికి ఈ చిత్రం ఒక నిదర్శనం, ప్రాన్స్ సమాజంలో క్రమశిక్షణ రాహిత్యం, ఫ్రీసెక్స్ పెరిగే పిల్లలపై ఎలావుంటుంది, చెప్పడానికి ఆండ్రజ్ జులాస్కి కష్టపడ్డాడనే చెప్పుకోవాలి. ఇందులో బ్లాంచ్, లూకస్ ఇద్దరు ప్రేమలో ఓడిపోయిన వాళ్ళే. తల్లి దండ్రుల ప్రేమకు నోచుకోనివాళ్ళు. చిన్నప్పుడు తల్లి దండ్రులు గొడవపడి వీరిని పట్టించు కోకుండ ఉండడం వల్ల వీరిద్దరు బయంకరమైన ఒంటరి తనంతో పెరుగుతారు. ఒకసారి ఒక హోటల్లో ఇద్దరూ శరీరకంగా కలుస్తారు. అలా మూడు పగళ్ళు, మూడు రాత్రులు కలుస్తారు. ఒకర్నొకరు ప్రేమించుకుంటారు. వారు తమగతాన్ని ఒకర్నొకరు చెప్పుకుంటారు. లూకస్ చనిపోవడానికి నిర్ణయించు కుంటుంది. అలా నిర్ణయించుకొని అంతులేని సముద్రం ఒడ్డుకు చేరుకుంటుంది. సముద్రం తరంగాల లాగ ఉవ్వెత్తే తనగతం ఆమెను విపరీతంగా బాధిస్తుంది. అంతర్గతంగా చెలరేగే మానసిక వ్యధను భరించ లేక పోతుంది లూకస్. సముద్రంలో కలువడానికి బయలు దేరు తుంది బ్లాంచ్ వచ్చి చేయి కలుపుతాడు లూకస్‌తో.

మానసిక ఘర్షణలో లూకస్‌గా నటించన జాకస్ డుట్రాన్ నటన అద్భుతం, బ్లాంచ్‌గా సోఫియా మార్క్సు తన నటనకు న్యాయం చేకుర్చాడు. కధవిధానం నడపడంలో చిత్రాన్ని ప్రేక్షకుల హృదయాల్లో హత్తుకున్నే విధంగా దర్శకుడు ఆన్ద్రోజ్ జూలాస్కి తీయగలిగాడు. మూడుపగళ్ళు వదిలేసిన మూడు రాత్రుల శృంగారం మనకు ఒంట బట్టక పోవచ్చు. మధ్యమధ్యలో సున్నితమైన హాస్యాన్ని అందించడాని ప్రయత్నించిన జులాస్కి పూర్తిగా న్యాయం చేకుర్చలేక పోయాడు. లారెన్స్ స్క్రిన్ ప్లే బాగుంది. కాకుంటే ఇది పిల్లల కోసం తీసిన చిత్రము అనే అనుమానం కూడ మనకు రాకపోదు పిల్లల్లో ఏర్పడే మానసిక ఘర్షణ జులాస్కి చక్కగా చూపించ గలిగాడు. శృంగారం మోతాదు మించి చూపించినప్పటికి కధనుసారంగా సెక్స్‌ను మలిచాడు. ఇది మనకు పచ్చి శృంగార చిత్రము అవుతుంది.

స్టేరింగ్ హెవన్

మారియన్ మిడ్స్ నవల ఆధారంగా రూపొందించిన చిత్రమే ఈ స్టేరింగ్ హెవన్ 12వ శతాబ్దం నాటి ప్యారిస్ కథ ఇది. బిషప్ మతాధిపతుల అధిపత్యంలో నలిగిన ఒక ప్రేమజంట కధే ఇతివృత్తం. క్లయిల్ డొనార్ దీనికి దర్శకుడు. బిషప్ కూతురు అయిన అందాల హెలియిస్ ప్యాటర్ ఎబ్‌లార్డ్‌ను

ప్రేమిస్తుంది. ఇతను ఒక కార్డినల్ స్కూల్‌లో బోధిస్తుంటాడు. ఎచలార్డ్ శిష్యులు యూరప్ అంతా ఉంటారు. బిషప్ వారి పెళ్ళిని వ్యతిరేకిస్తాడు. కూతుర్ని బంధిస్తాడు. ఇతనికి దేశ బహిష్కరణ విధిస్తాడు. హెలియిస్ మామ అయిన ఫుల్‌బర్ట్ వీరికి సహాయం చేస్తాడు. ఇద్దరు అక్కడి నుండి పారిపోతారు. అక్కడ హెలియస్ ఒక కొడుకుని కంటుంది. తిరిగి తండ్రి దగ్గరకు వస్తుంది. ఎచలార్డ్ మతం మార్చుకొని హెలియిస్ దగ్గరే ఉండిపోవాలి అనే నిబంధన పెట్టాడు బిషప్. దీనికి ఎచలార్డ్ ఒప్పుకోడు. అతనిపై శిక్ష అమలు చేయడానికి బిషప్ నాయకత్వంలోని మతాధిపతులు తీర్పునివ్వడం జరుగుతుంది. శిక్షను తగ్గించమని హెలియిస్ తండ్రిని కోరుతుంది. తండ్రి నిరాకరిస్తాడు. శిక్ష అమలు దగ్గరకు వస్తుంది చివరకు హెలియస్ ప్రేమకోసం ఆ మతంలో పనిచేయడానికి ఎచలార్డ్ నిశ్చయించు కుంటాడు. ప్రేమ ఘర్షణ డైలాగ్స్ బాగుంటాయి.

ఎ షార్ట్ ఫిల్మ్ ఎబౌట్ లవ్

ఇది పోలాండ్ భాషా చిత్రం. ప్రేమకు సరిహద్దులు, భాష, భేదం, వర్ణం, ప్రాంతం, కులమతమేకాదు వయస్సుతో కూడ సంబంధంలేదు అంటారు దర్శకుడు కిస్లొవస్కి. జూలియా బాయి ఫ్రెండ్స్ వుంటారు. జూలియా ఉదయం వెళ్ళి రాత్రి ఇంటికి చేరుకుంటుంది. జూలియా అపార్ట్‌మెంట్ ఎదురుగా టొమక్ నివసిస్తుంటాడు. టొమక్ ఉద్యోగం పోస్టాఫీసులో. ముదు(స)లి తల్లితో జీవిస్తుంటాడు. టొమక్ జూలియాను ప్రేమిస్తుంటాడు. జూలియా పోస్టాఫీసుకు వచ్చినప్పుడల్లా ఆవిడతో పరిచయం పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు టొమక్, తన ఇంటి కిటికీ లోంచి టెలిస్కోప్ ద్వారా జూలియాను గమనిస్తుంటాడు. టొమక్ వయస్సు కన్న జూలియ వయస్సు ఎక్కువ. జూలియా మీద ప్రేమతో బాయి ఫ్రెండ్‌తో గడిపే ఆమె రాత్రులను చెడగొడుతుంటాడు, డబ్బు పంపిస్తుంటాడు. ఒకరోజు జూలియాతో తన ప్రేమను వ్యక్త పరుస్తాడు. ఒక సంవత్సరంగా టెలిస్కోప్ నుండి గమనిస్తున్నట్లు డబ్బుతానే పంపిస్తున్నట్లు జూలియాకు చెబుతాడు. జూలియా ఇతని ప్రేమని నిరాకరిస్తుంది. అతను గమనిస్తున్న విషయాన్ని తన బాయి ఫ్రెండ్‌కు చెబుతుంది. ఆ బాయిఫ్రెండ్ ఇతన్ని కొడతాడు. జూలియాను కలువడానికి పోస్టాఫీస్ ఉద్యోగం వదిలేసి పాల సీసాలు అందించే వాడి ఉద్యోగంలో చేరి జూలియాను కలుస్తాడు. ఆవిడతో తన ప్రేమ గురించి మళ్ళీ వత్తిడి చేస్తాడు. వయస్సులో నాకన్న చిన్నవాడివి నేను ఒప్పుకోను అని చెబుతుంది. అయినా తన ప్రయత్నాన్ని మానుకోడు. ఒకసారి హోటల్లో కల్సినప్పుడు ఆవిడ గురించి తాను పడ్డ కష్టాలు. ఆవిడను ఎందుకు ఇష్టపడుతున్నాడో వివరిస్తాడు. నా నుంచి నీకేమి కావాలి? జూలియా అడుగుతుంది.

"నా శరీరం కావాలా?" జూలియా.

"వద్దు" టొమక్ సమాధానం.

"మరి డబ్బుకావాలా?"

"వద్దు నీ నుంచి నేనేమి ఆశించడంలేదు. నీ ప్రేమ కావాలి. నీతో కల్సి జీవించాలి."

జూలియా ఆశ్చర్యపోతుంది ప్రేమ అంటే ఏమిటో తెలియని వయస్సులో ప్రేమ గురించి తపించే టొమక్‌కు రాత్రి అనుభవాలను చూపించడానికి తన ఇంటికి తీసుకెళ్తుంది జూలియా. కాని ఆ ప్రయత్నంలో జూలియా ఓడిపోతుంది నేను ప్రేమిస్తుంది నీ శరీరం కోసం కాదు అని వెళ్ళిపోతాడు టొమాక్.

చెంప చెళ్లుమన్నట్లుగా అవుతుంది జూలియాకు. తాను పోగొట్టుకుందేమిటో అర్ధమవుతుంది. తన ఒంటరి తనం జ్ఞాపకం వస్తుంది. జీవితం తోడు కోరుకుంటుంది అతనికోసం తన పాత జీవితానికి స్వస్తి పలుకుతుంది. అతని ప్రేమకోసం పరితపిస్తు టొమక్ ఇంటికి వస్తుంది. టొమక్ గాయాలతో హస్పటల్‌లో చేరినట్టు తెలుసుకొని బాధపడ్తుంది. టొమక్‌ను ఈ పరిస్థితుల్లో కలువ కూడదు అని టొమక్ తల్లి జూలియాకు చెబుతుంది. అతని కోసం నిరీక్షిస్తుంది టొమక్ ప్రేమను అర్ధం చేసుకున్న జూలియా చివరకు టొమక్ కోసం పడే ఆర్తి జూలియా పాత్రధారి చాల బాగా చేసింది. కథ నడిపిన విధానం ప్రేక్షకులను ఉత్కంఠతో ఉంచుతాడు డైరక్టర్. కిస్లొవస్కి డైలాగ్స్ చాల తక్కువగా ఉండి సినిమాను గజిబిజిగా నడవకుండ చిత్రాన్ని తీసిన విధానం ప్రేక్షకులను కదలకుండ చేయడమే కాదు. హాలంత దద్దరిల్లేటట్టుగా ప్రేక్షకుల చప్పట్లతో ఈ సినిమాపై అభిమాన వర్షం కురిసింది. కెమరా సువర్చ్ లైటింగ్ చాల బాగుంది. ఇది విదేశి రెట్రాస్పెక్టలో రవీంద్రసదన్‌లో ప్రదర్శించడం జరిగింది.

ఛార్లిన్ ఛాప్లిన్ ఫెస్టవెల్

ఛార్లిన్ ఛాప్లిన్ పుట్టిన తేది జనవరి పది. 21వ అంతర్జాతీయ ఫిల్మోత్సవం ప్రారంభమైంది కూడ జనవరి పది చార్లిన్ ఛాప్లిన్ ఫెస్టవెల్ లాగా ప్రేక్షకులు ఫీలయ్యారు. అందుకని ప్రత్యేకంగా ఛాప్లిన్ సినిమాలు షార్ట్ ఫిల్మ్స్ ధియేటర్లలో మధ్యమధ్య ప్రదర్శించారు. చార్లిన్ ఛాప్లిన్ అంటే ప్రపంచంలో తెలియని కళాప్రియులు లేరు. ఛాప్లిన్ సిన్మాలన్ని స్వేచ్ఛ, ఆర్ధికస్వాతంత్రం. రాజకీయ స్వేచ్ఛను ఏదో విధంగా మనకు చూపిస్తాయి. అందుకని ఛాప్లిన్ చిత్రాలన్ని స్టాలిన్ కమ్యూనిస్టు దేశాలలో నిషేధించాడు. కాని మొన్నటి రుమేనియా నియంత సిసెస్కొ మాత్రం ఛార్లిన్ ఛాప్లిన్ చిత్రాలను మరి ఇష్టంగా చూసేవాడు. ఆ చిత్రాలను రుమేనియాలో ప్రదర్శించడానికి అనుమతి ఇచ్చాడు. సిసెస్కొ తన నివాసంలో ప్రత్యేకంగా ధియేటర్లలో వేయించుకొని మరి చూసేవాడు.

ఘనత వహించిన గణశత్రు

సత్యజిత్‌రాయ్ గణశత్రు సిన్మాతీయడానికి ముందు నుంచే మంచిపేరు సంపాదించింది. 21వ ఫిల్మ్ ఫెస్టివెల్‌లో కొంత వివాదాన్ని కూడ చోటు చేసుకుంది. బయట థియోటర్లు విడుదల చేయకు ముందు నందన కాంప్లెక్స్‌లో ప్రదర్శించడానికి. డిస్ట్రిబ్యూటర్లు ఒప్పుకోలేదు పిక్చర్ దెబ్బ తింటుందని వారి భయమట. అందుకని 19 నాడు ప్రదర్శించ వల్సిన గణశత్రు చిత్రాన్ని 20 జనవరికి మార్చారు 20 జనవరి నాడే బెంగాల్ అంతట గణశత్రు రిలీజ్ అవుతుంది. ఇది కొంతవరకు పత్రికవాళ్లను, డెలికేటర్సను నిరాశ పరిచింది. ఈ సిన్మాకు ముందు నటీనటులను ప్రతినిధులకు సత్యజిత్‌రాయ్ పరిచయం చేసాడు.

ఈ 21వ ఫిల్మోత్సవం అనుకున్నంత బాగా లేదని వచ్చిన ప్రతినిధులు అభిప్రాయపడినారు. 1982లో సత్యజిత్‌రాయ్ అందరితో కల్సి తిరిగితే ఈ సారి మృణాల్‌సేన్ అందరి మధ్యావున్నను సత్యజిత్‌రాయ్ రాకపోవడం అందరిని నిరాశ పరిచింది. అపర్ణాసేన్ తనకు పట్టనట్టుగా ఉండడం కూడ కొందరి విమర్శకు గురయినట్లుగా చెప్పవచ్చు.

ఇండియన్ పెనొరమ

ఈ సారి ఇండియన్ పెనొరమలో చెప్పుకో దగిన సంఖ్యలో చిత్రాలు రాలేదు. వచ్చిన వాటిలో బి.నరసింగరావు చిత్రం 'దాసి' అపర్ణసేన్ చిత్రం 'సతి' మృణాల్‌సేన్ చిత్రం 'ఎక్‌దిన్ అచానక్' మెర్వాంజి గుజరాతి చిత్రం 'పెర్సి' చిత్రాలు ప్రేక్షకుల నుండి, సిన్మా, పత్రిక ప్రతినిధులనుండి ప్రశంసలను అందుకున్నాయి. ప్రేమకరంట్ సిన్మా "నక్కల రాజకుమారి" కన్నడ పిల్లల చిత్రం కూడ పత్రికా ప్రతినిధులకు చూపించడం జర్గింది. గిరిష్‌కర్నాడ్ ఈ ఫిల్మోత్సవంలో చాల ఉత్సాహంగా పాల్గొనడమే గాకుండ తాను దర్శకత్వం వహించిన "కనక పురందర" సిన్మా ఇండియన్ పెనొరమలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు.

శిరువోలు రాధాకృష్ణ.

ఫ్లాష్


సత్యజిత్‌రాయ్ జ్యోతిని వెలిగించ డానికి అందాల నటి ధబశ్రీరాయ్ సహాయం తీసుకున్నప్పటికి జ్యోతిని మూడుసార్లు వెలిగించాడు. జ్యోతి వెలుగలేదని కాదు ప్రెస్ ఫొటోగ్రాఫర్లు కోరికపై మూడుసార్లు వెలిగించాడు. దాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా గమనించారు. మెల్లగా నవ్వుకున్నారు.

అనుబంధ నవలిక

మధ్యతరగతి మందహాసం

రచన: ముద్దంశెట్టి హనుమంతరావు.





అప్పుడే చీకటి పడింది.

ముకుందం, యింట్లో లైటు వెలిగించి వచ్చి, బైట వరండాలో వాలుకుర్చీలో జేరబడ్డాడు.

అతని మెదడులో యేవో ఆలోచనలు స్వైర్య విహారం చేస్తూండటం వల్ల, అస్థిమితంగా అగుపిస్తున్నాడతను.

ముకుందం అంతగా ఆలోచించడానికి, కారణం లేకపోలేదు. స్నేహితుడు సీతారామయ్య, ఉత్తర భారతదేశంలోని పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి వెళ్తున్నాడు. అటువంటి సంకల్పం, ముకుందానికీ చాలా రోజుల్నించి మనసులో తారాడుతోంది. అంచేత, తానూ సీతారామయ్యతో వెళ్ళాలన్న తలంపు వచ్చిందతనికి. తలంపైతే

వచ్చిందిగాని? అవసరమయ్యే పైకం యెలా వస్తుంది? ఇప్పుడతనిలో ఆలోచనల్ని రేకెత్తించిన సమస్య అదే.

అలా ఆలోచిస్తోన్న ముకుందంకి, తన యౌవనపు రోజులు స్మృతి పథంలో మెదిలినయ్... ఆరోజుల్లో, తనకి డబ్బు గురించిన ఆలోచనలే వుండేవిగావు. పూర్వులు గడించి పెట్టిన ఆస్తిపాస్తులుండటం వల్ల, పుష్కలంగా ఖర్చు బెట్టేవాడు. నిజం చెప్పుకోవాలంటే, ఆరోజుల్లో తానే పిల్ల జమిందారులా వుండేవాడు. మేలురకం గ్లాస్కో పంచెగట్టి, మల్లెపూవులాంటి సిల్కులాల్చీ వేసుకుని, సెంటువాసనల ఘుమఘుమలతో ర్యాలీ సైకిలు మీద తిరుగుతూ వుంటే, తనని చూసి చాలామంది అసూయపడేవారు. అయితేనేం –

ఆ అంతస్తూ, ఆ సరదాలూ, యెంతో కాలం నిలవలేదు. అసూయతో కళ్ళుకుట్టుకున్న దాయాదులు, ఆస్తికోసం కోర్టులో కేసు వెయ్యడంతో, క్రమంగా ఆ ఆస్తంతా, హారతి కర్పూరంలా హరించుకుపోయింది. తాను రిటైరయ్యేసరికి, కేవలం తన పెన్షను మీదే ఆధారపడాల్సిన పరిస్థితి యేర్పడింది. సరిగ్గా అదే సమయంలో, కనకరాజుకి వుద్యోగం దొరకడం, నిజంగా తమ కుటుంబ అదృష్టమే మరి! ఇప్పటికీ తనకి అనిపిస్తుంది అసమయంలో అబ్బాయికే గనక వుద్యోగం దొరికి వుండకపోతే, తమ కుటుంబ పరిస్థితి యెంత హీనస్థితికి దిగజారి వుండేదోనని! అట్లాంటి జీవితం గడిపిన తాను యిప్పుడు డబ్బుకోసం ఆలోచించక తప్పడం లేదు .... యిలా సాగుతున్నయ్ ముకుందం ఆలోచనలు.

కనకరాజు, అప్పుడే ఆఫీసునుండి వచ్చాడు. తండ్రి నిరుత్సాహపు ధోరణిని గుర్తించాడు. "ఏంనాన్నా అలా వున్నారు. ఒంట్లో బావుండటం లేదా?" అంటూనే లోపలికి నడిచాడు.

కొడుకుని అనుసరిస్తూనే, లోపలికి వెళ్ళాడు ముకుందం.

తాను యేమిటాలోచిస్తున్నాడో, తన సమస్య యేమిటో కొడుకుతో చెప్పేయాలనుకున్నాడు కాని, మొహమాటం అడ్డొచ్చింది. అందుకే, కృత్రిమమైన ఓ చిరునవ్వు పెదాలపై చిందించాడు.

"అబ్బే! అదేం లేదురా! ఒంట్లో బాగానే వుంది. ఔనూ, మాకోడలు దగ్గర్నించి వుత్తరం యేమీ రాలేదా?" అడిగాడు, మామూలు ధోరణిలో.

"ఇవ్వాళే వుత్తరం వచ్చిందినాన్నా.." అని యింకేదో చెప్పబోయాడు కనకరాజు. కాని, ముకుందం మధ్యలో అందుకున్నాడు.

"అయితే, యెప్పుడొస్తున్నట్టు రాసిందేవ్రా?" ఆసక్తిగా అడిగాడు.

"త్వరలో వస్తున్నట్టు రాసిందేగాని ఫలానా తేదికి వస్తానంటూ వివరంగా రాయలేదు నాన్నా, ఆడాళ్ళతో యిదే వచ్చిన చిక్కు. కన్నారింటికి వెడితే చాలు... అక్కణ్ణించి తొందరగా రావడానికి మనసొప్పదు వాళ్ళకి." సన్నగా నవ్వుతూనే అన్నాడు కనకరాజు.

కోడలు, త్వరగా వచ్చే అవకాశాలు తక్కువగా వున్నాయని అర్థం చేసుకున్న ముకుందం అంతరంగంలో నిరాశ చోటు చేసుకుంది. అతని మొహంలో, నిరుత్సాహపు ఛాయలు తారాడినాయ్.

"ఎప్పుడూ లేనిది, యీ పర్యాయం లక్ష్మి, వాళ్ళింట్లో చాలా రోజు తిష్టవేసిందిరా అబ్బాయ్. అందుక్కారణం యేమన్నా రాసిందా?" అడిగాడు, ముకుందం.

" రాసింది నాన్నా! వాళ్ళ ఆఖరి చెల్లెలికి సంబంధాలొస్తున్నాయట. బహుశా, యేదో ఒకటి నిశ్చయించేస్తారట కూడాను. అంతవరకూ రాదట".

"అంటే పెళ్ళి జరిగాక వస్తుందా యేవ్రా?" నిరాశతో అడిగాడు.

"అట్లా రాయలేదనుకోండి. నిశ్చయమైన వరకూ వుంటుందేమో."

ముకుందం, బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

'కోడలు యెప్పుడొస్తుందా అని, వేయి కళ్ళతో నేనెదురు చూస్తుంటే, ఆమెరావడం వాయిదా పడిందన్నమాట. నిజానికి, నా జాతకమే అట్లాంటిది. అనుకున్నదేది సవ్యంగా జరిగి చావదు. ఎప్పుడూ యేదో నిస్పృహ వెన్నంటుతూనే వుంటుంది." నీరసంగా అన్నాడు, ముకుందం.

తండ్రి అలా నిరుత్సాహంగా మాట్లాడ్డం, కనకరాజుకి కాస్తంత బాధ కలిగించింది. తండ్రి మాటల్లోని భావాన్ని, వేరుగా తీసుకున్నాడు. బహుశా, అప్పుడప్పుడూ వంట చెయ్యడానికే, తండ్రి అలా బాధపడుతున్నారేమోనని భావించాడు.

"మీరేవీ బాధపడకండి నాన్నా ఇంతవరకూ వంట చెయ్యడంలో అప్పుడప్పుడూ మీరు తీసుకుంటున్న శ్రమ, యింక మీకు వుండదులెండి. అంతా

నాకు వదిలెయ్యండి. మీరయినా, యీ వయస్సులో యెన్నాళ్ళని చెయ్యికాల్చుకోగలరని?"

నిజానికి, ముకుందం అభిప్రాయం అది కానేకాదు. అప్పుడప్పుడూ వంట చెయ్యడం, పెద్ద సమస్య కాదు. ప్రస్తుత సమస్య, తన తీర్థ యాత్రలకు అవసరమైన డబ్బు. ఆ డబ్బును గురించిన ఆలోచనలే, తనలో అనిశ్చిత పరిస్థితిని కల్పించాయి. అందుకే, వున్నది వున్నట్టు చెప్పేయాలని నిర్ణయించుకున్నాడు, ముకుందం.

"ఒరేయ్ అబ్బాయ్, నువ్వు భావిస్తున్నట్టు, వంట గురించి నేనేం బాధపడ్డం లేదురా. నిజం చెప్పాలంటే, వంట చెయ్యడం, నాకేం శ్రమకాదు అడుతూ, పాడుతూ, చేసెయ్యగల్ను. కాని, నా నిరుత్సాహానికి కారణం అది కాదురా." సందేహిస్తూ ఆగిపోయాడు, ముకుందం.

నివ్వెర పోయాడు, కనకరాజు.. తండ్రి అలా సందేహిస్తూ మాట్లాడ్డం, అదే ప్రథమం "మరి, కారణం యేమిటో, చెప్పండి నాన్నా!" ఆసక్తితో అడిగాడు.

"మరేం కాదురా! మన సీతారామయ్య లేడూ, అతడూ మరో యిద్దరు కలిసి ఉత్తర భారతదేశంలోని పుణ్యక్షేత్రాలన్ని సందర్శించడానికి వెళ్తున్నారు. నాకూ అటువంటి అభిలాష వుంది గనక, మళ్ళీ యిట్లాంటి అవకాశం రాదు గనక, వాళ్ళతో పాటు నేనూ బైలు దేరాలనుకుంటున్నాను. కోడలు యింట్లో లేనపుడు, యెలా వెళ్ళడమా అన్నది ఒక సమస్య... వెళ్ళడానికి అవసరమయ్యే పైకం మరో సమస్య..." యెలాగో విషయాన్ని బైటికి వెళ్ళగక్కాడు, ముకుందం.

కనకరాజు మొహంలో. రంగు మారింది. తాను యెదుర్కోబోతోన్న సమస్య యేమిటో, అతనికి అవగతమయ్యింది. ప్రస్తుతానికి, ఆర్థికంగా తన పరిస్థితి యెలా వుందో, అతనికే తెలుసునుగాని, యితర్లకి అర్థంకాదు.

"మీరు మరేం అనుకోకపోతే, యిప్పట్లో మీ ప్రయాణాన్ని వాయిదా వేసుకోండి నాన్నా.." ముక్తసరిగ చెప్పాడు, కనకరాజు.

ముకుందం మొహం కాస్తంత వాడింది. అతను అంత సులువుగా వదిలిపెట్టే మనిషికాదు. ఏదేనా నిర్ణయాన్ని తీసుకున్నాడూ అంటే, అది అమల్లో పెట్టేవరకూ విశ్రమించడు అంత పట్టుదల గలమనిషి.

"ఇటువంటి సదవకాశం మళ్ళీ యీ జన్మలో రాదురా అబ్బాయ్ సీతారామయ్యతో వెళ్తే, స్వంత మనిషి నాతోపాటు వున్నట్టే వుంటుంది కదా. అదే. నా తాపత్రయమంతాను. మనం అందరం కలిసి ఆ పుణ్యక్షేత్రాలు దర్శించడానికి వెళ్దామనుకోవడం, వూహాకందని విషయం. అయినా, నేను వెళ్ళొచ్చిన యీ కొద్ది రోజులూ నువ్వూ శ్రీనివాస్, ఆమాత్రం వంట చేసుకోలేరా యేమిటి?"

"అది, పెద్ద సమస్య కాదు నాన్నా. వంట చేసుకోలేకపోతే, హోటల్లో భోంచేస్తాం. కానీ..." అని కనకరాజు యేదో చెప్పబోతూ వుంటే ముకుందం చప్పున అందుకున్నాడు.

" అదీ, అలా అన్నావు బావుందిరా అబ్బాయ్. నన్నడిగితే, హోటల్ భోజనమే అద్భుతంగా వుంటుందనుకో ఏ వయసులో నేను, మీ అమ్మ వాళ్ళ కన్నారింటికి వెళ్తే, నేనెక్కడాడూ చెయ్యికాల్చుకోలేదు తెలుసా? రోజుకో హోటల్లో భోజనం రుచిచూసి, వెరయిటీ అనుభవించేవాణ్ణి. అదో మధురానుభూతి అనుకో." గతాన్నోసారి గుర్తుకు తెచ్చుకుని, మురిసిపోతూ చెప్పాడు, ముకుందం.

తండ్రి మాటలు వింటుంటే, కనకరాజుకి నవ్వాలనిపిస్తోంది, కాని, నవ్వలేక పోయాడు. తండ్రికి, వయస్సుతో పాటు, యింగితం పెరగలేదనుకున్నాడు.

"ఆ రోజులు వేరు నాన్నా. అప్పటి మీ అంతస్తు వేరు. మీ ఆర్థికస్థితి వేరు. ఇప్పుడు మన అంతస్థులో మార్పు వచ్చింది. ఆర్థికస్థితి కూడా అంతంత మాత్రమే, వెరైటీని చవిచూసే స్తోమత లేదు మనకి. ఏదో కాస్తంత కడుపు నింపుకుంటే, చాలనిపించేరోజులు. కాలం మార్పుతో పాటు, మనలోనూ మార్పు రావాలి కదా? అంచేత హోటలు ప్రశ్నేరాదు." బాధ్యత తెలిసిన వ్యక్తిలా చెప్పుకు పోయాడు, కనకరాజు.

ముకుందరావు, చిన్న బుచ్చుకున్నాడు. "సరేలేరా, అవన్నీ యిప్పుడు నెమరు వేసుకుంటే, నాకే బాధనిపిస్తోంది. ఆ విషయం వదిలేయ్. లక్ష్మి వచ్చేవరకూ వంట విషయంలో యెలాగో సర్దుబాటు చేసుకోండి. నేను వెళ్ళేలోపున లక్ష్మి వచ్చెస్తే, గొడవే లేదనుకో, పోతే, నన్ను మాత్రం సీతారామయ్యతో వెళ్ళనివ్వు. ఇటువంటి అవకాశం, యీ జన్మలో నాకు మళ్ళీ అందుబాటుకి రాదు. పెద్ద ఖర్చేమీ వుండదు. ఓ అయిదొందలు యిస్తే యెలాగో సరిపెట్టుకుంటాను. ఈ ఒక్క కోరిక తీరిపోతే, నా జీవితానికో అర్థం, పరమార్థం వుంటుందిరా అబ్బాయ్" అసలు విషయాన్ని బైట పెట్టాడు, ముకుందం.

డబ్బు ప్రసక్తి యెట్లాగో వస్తుందని కనకరాజుకి తెలుసు. అయితే పైకం మొత్తం వినేసరికి, అతనికి 'షాక్' తగిలినట్లయ్యింది. అయిదు వందలిస్తేయెలాగో సరిపెట్టుకుంటానని యెంత తేలిగ్గా అనేశాడాయన. ఇంటిపరిస్థితులు ఆయనకి తెలివా? తెలిసి కూడా ఆయన యీ ప్రయాణానికి వుద్యుక్తులవ్వడంలో అర్థం యేమిటి.... అనుకున్నాడు మనసులో కనకరాజు. బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"అయిదు వందలిస్తే చాలని, యెంత తేలిగ్గా చెప్పారునాన్నా. అంత మొత్తాన్ని, నేను అకస్మాత్తుగ యెక్కణ్ణించి తెచ్చి రాగల్ను చెప్పండి. మా మరదలు పెళ్ళి నిశ్చయం కాబోతున్నదని తెలుసుకుని, ఆ ఖర్చుని యెలా తట్టుకోవాడమా అన్న ఆలోచనల్లో పడిన నాకు, మీ ప్రయాణ సమస్య యెదురయ్యింది. ఏం చెయ్యడమో, నాకేమీ పాలుపోవడం లేదు". విసుగ్గా అన్నాడు, కనకరాజు.

ముకుందం మనస్సు, చివుక్కుమంది. అప్రయత్నంగా, ఆవేశం అతని మనసులో చోటుచేసుకుని, మొహాన్ని రాగరంజితం చేసింది. అయితే, తన ఆవేశాన్ని, అసహనాన్ని, బాహ్యంగా వ్యక్తీకరించలేక, బలవంతంగా

దిగమింగుకున్నాడు.

"నేను పుణ్యక్షేత్రాలు సందర్శించి రావాలనుకోవటం, నీకో సమస్యగా పరిణమిస్తే, అసలు నేను వెళ్ళడమే మానుకుంటాన్రా అబ్బాయ్. కాని, ఒక్క విషయం యేమిటంటే, నేనెప్పుడూ మానాన్నగారి అభిప్రాయాల్ని, అభిలాషల్ని, అణచి వేయడానికి ప్రయత్నించలేదు. ఆయన కోరికల్ని తీర్చడానికే ప్రయత్నించాను. అయినా, నిన్ను అని యేం లాభం, కాలం మారిపోతోంది, కాలంతోపాటు, భక్తి గౌరవాలూ దిగజారిపోతున్నాయ్." అంతర్గతంగా యెంతో బాధపడుతున్నట్టు, నిస్పృహతో అన్నాడు.

తండ్రి, అంత పరుషంగా మాట్లాడుతాడని గాని, మానసికంగా అంతగా బాధపడతాడని గాని, కనకరాజు వూహించలేకపోయాడు. తన అశక్తిని, తెలియజేస్తే, అది ఆయన్ని అగౌరవపరచినట్టు యెలా అవుతుందో, కనకరాజు వూహకి తట్టలేదు. తండ్రి, తనని తప్పుగా అర్థం చేసుకున్నారనిపించింది.

"మీరిలా బాధపడ్డంలో అర్థం లేదునాన్నా. ప్రస్తుత పరిస్థితిని వివరించానంతే. కాలం మారింది గనకనే, అనుకోవల్సి వస్తోంది. మీనాన్నగారి అభిప్రాయాలకి, అభిలాషలకి మీరేనాడు అవరోధ పర్చలేదూ అంటే, అప్పటి పరిస్థితులు మీకు సానుకూలంగా వుండేవి. అప్పటి మీ ఆర్థికస్థితి యెంతో మెరుగ్గా వుండేది. పెద్దలు గడించిపెట్టిన ఆస్తి, మీచేత విచ్చలవిడిగా ఖర్చు బెట్టించింది. మీలో ఆర్థికపరమైన ఆలోచనలకు, యిబ్బందులకు, తావులేకుండా చేసింది. కాని, యిప్పటి మన పరిస్థితులు వేరు, ఆ ఆస్తి లేదు, ఆ అవకాశమూ లేదు. ఈ నిజాన్ని, యింకా విడమర్చి మీకు నేను చెప్పనవసరం లేదనుకుంటాను." తన మాటలు, తండ్రికి కష్టం కలిగించినా, నిజం చెప్పక తప్పదనుకుని చెప్పాడు, కనకరాజు.

అసలే నిస్పృహతో వున్న ముకుందం, కొడుకు మాటలకు మానసికంగా మరింత దెబ్బ తిన్నాడు. అతని మొహం, హఠాత్తుగా, కాస్తంత అరుణిమను పుంజుక్కుంది. కనుబొమలు ముడిపడ్డాయి. చూపులో తీక్షణత చోటుచేసుకుంది.

"అంటే, పూర్వులు గడించిపెట్టిన ఆస్తిని, నేనే తగల బెట్టానంటావు? అంతేనా, నీ అభిప్రాయం?" విసురుగా అన్నాడు.

కనకరాజు, నివ్వెఱపోయాడు.

తాను అలా అని, తొందరపడ్డాడేమో! పశ్చాత్తాపంతో, అతని హృదయం ముడుచుకు పోయింది.

"క్షమించండి నాన్నా. సందర్భం వచ్చింది గాబట్టి అలా అన్నానేగాని, మిమ్మల్ని నిందించాలనిగాని, నొప్పించాలనిగాని, నా

అభిమతంకాదు." పశ్చాత్తప్తుడై అన్నాడు, కనకరాజు.

ముకుందం, బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

"సరేలేరా అబ్బాయ్, అవన్నీ యిప్పుడెందుగ్గాని, పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి నన్ను వెళ్ళమంటావా, లేదో, ఒక్క ముక్కతో సూటిగా చెప్పు." గంభీరవదనంతో అడిగాడు, ముకుందం.

ఏం చెప్పాలో, కనకరాజుకి అర్థంకాలేదు. కాని, యేదో ఒకటి చెప్పాలి. మౌనంగా వూరుకుంటే, ఒప్పుకోరాయన... అనుకున్నాడు.

"వెళ్ళొద్దని చెప్పడానికి నాకు నోరు రావడం లేదు నాన్నా, అట్లాగని, మీరడిగిన పైకం యివ్వగలిగే శక్తి కూడా నాకు యిప్పట్లో లేదు. నిర్ణయాన్ని మీకే వదిలేస్తున్నాను. పరిస్థితుల్ని అర్థం చేసుకోండి..." మెల్లగా అన్నాడు. కనకరాజు.

ముకుందం మొహం, యెర్రబారింది. "శక్తి లేదనకురా! పైకం యివ్వాలన్న అభిప్రాయమే వుంటే, అప్పు చేసి అయినా యివ్వొచ్చు. నోరు విడిచి, యెన్నడు అడగనివాణ్ణి నేను అడిగాను. మనస్సుంటూ వుండాలేగాని, మార్గాలు లేకుండా పోవు. ఏంచేస్తాం? నాదురదృష్టాన్ని తిట్టుకోవాల్సిందే. ఈ జన్మకి, భగవంతుడు నాకు యింతే రాసి పెట్టాడనుకోవల్సిందే.." అనుకుని విసురుగా బైటికి నడిచాడు, ముకుందం.

కనకరాజు, అప్రతిభుడయ్యాడు. అసహనంగా అలా వెళ్ళిపోతున్న తండ్రికేసి చూస్తూ క్షణం' వుండిపోయాడు. నిస్సహాయస్థితిలో నిట్టూరుస్తూ, కుర్చీలో కూలబడిపోయాడు.

ఆలోచనలతో, అతని మస్తిష్కం వేడెక్కిపోయింది. ప్రస్తుతం తనెదుట వున్నవన్నీ ఆర్థికపరమైన సమస్యలే. ఈ సమస్యల్ని పరిష్కరించడమెలా? ఆర్థికస్తోమత లేని వ్యక్తి, యెన్ని యిక్కట్లు యెదుర్కోవాలో, యెంతటి మనోవేదనకు గురికావాలో, స్వానుభవంతో యిప్పుడు తెలుసుకుంటున్నాడు కనకరాజు కాని, యేంచెయ్యగలడు?

ఆరోజుల్లో, తాను యింకాపై చదువులు చదివివుంటే, వుద్యోగరీత్యా, మరో మెట్టు పైనే వుండేవాడేమో. అలా జరిగివుంటే, యిప్పటి ఆర్థిక సమస్యలు వుండకపోనేమో? కాని... కాని... అప్పట్లో తన చదువుకి అంతరాయం కలిగింది. అది, తన దురదృష్టం గాకపోతే యింకేవిటి? ... . యిలా ఆలోచిస్తున్న కనకరాజుకి, గతం గుర్తుకొచ్చింది.

* * *

కనకరాజుకి, చిన్నప్పట్నుంచీ బలమైన ఓ కోరిక వుండేది. తనుబాగా చదువుకుని, అందరూ మెచ్చేవిధంగా, యేదేనా వున్నతోద్యోగంలో చేరాలని, ఆ అభిప్రాయంతోనే, యెంతో శ్రమించి, చదువు సాగించాడు. ప్రతిక్లాసులోనూ, 'సెభాష్' అనిపించుకునేవాడు. ఇంటరు పాసయ్యేసరికి, తండ్రి రిటైరవ్వడం,

వున్న ఆస్తి కాస్తా కరిగిపోవడం కారణంగా, చదువుకి అక్కడితో స్వస్తి చెప్పేసి, ఒకనాటి అతని ఆకాంక్షని, అభిలాషని, బలవంతంగా చంపుకున్నాడు.

కొందరు శ్రేయోభిలాషులు, ముకుందం దగ్గరికి వచ్చి, కనకరాజు పై చదువులకోసం సిఫార్సు చేశారు కూడాను.

"మీ అబ్బాయ్ చాలా తెలివైనవాడు, అటువంటివాణ్ణి, పై చదువులు చదివించకుండా, మాన్పించేయడం, విజ్ఞత అనిపించుకోదండీ, పునరాలోచించండి." అని.

అలా సలహా యిచ్చిన వాళ్ళకేసి, ముకుందం కళ్ళెర్రజేసి చూశాడు- వీళ్ళా నాకు సలహా లిచ్చేది? అన్న అహంభావంతో,

"మా అబ్బాయి భవిష్యత్తు మహోజ్వలంగా వుండాలని, నాకు మాత్రం కోరిక వుండదటండీ. అటువంటి కోరిక, యే తండ్రి కోరుకోడు చెప్పండి? కాని, ప్రస్తుతం మా యింటి పరిస్థితులు, అనుకూలంగా లేవు. ఏంజేస్తాం! మావాడిపట్ల మీకు గల అభిమానాదరాలకు ధన్యవాదాలు.." అని చెప్పాడు ముకుందం, విసురుగానే.

తమ కుటుంబ పరిస్థితులు, అలా దిగజారడానికి, కొంత వరకూ తనే కారకుడన్నబాధ, అతని మనసులో లేకపోలేదు. అయితే, ఆ బాధని బహిర్గతం చెయ్యలేదు, ముకుందం.

ఆ విధంగా, తన చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టినందుకు, కనకరాజు బాధపడని క్షణం లేదు. కాని, యేం చెయ్యగలడు? పరిస్థితుల ప్రవాహానికి యెదురీద లేకపోయాడు. తన దురదృష్ట జాతకాన్ని తిట్టుకున్నాడు, మనసులోనే.

ఆరోజుల్లో, నిరుద్యోగ సమస్య అంత ప్రబలంగా వుండేదికాదుగనక, తండ్రి పరపతి ఆధారంగా, వెంటనే వుద్యోగం దొరికింది, కనకరాజుకి. అదీ గుమాస్తాగిరియే, ఏదో ఒక వుద్యోగం దొరికిందన్న తృప్తి, తాత్కాలికంగా, మనిషి పెంచుకున్న ఆశలకీ, నిజంగా జరిగిన దానికీ, యెక్కడా పొత్తు వుండదేమోనని పించిందప్పట్లో కనకరాజుకి. ఆ నిరాశా నిస్పృహలు, అతణ్ణి చాలా రోజులు అంటిపెట్టుకుని వుండేవి. క్రమంగా వాటినుంచి విముక్తిపొంది, జీవితంతో రాజీ పడిపోయాడు.

అయితే, కనకరాజుకి ఒక కోరిక మిగిలిపోయింది. తానుపై చదువులు చదవలేకపోయినా తన కొడుకు లయినా కనీసం గ్రాడ్యుయేట్ చెయ్యాలన్నా కృత నిశ్చయానికొచ్చాడు. అయితే, తన ఆకాంక్ష సక్రమంగా నెరవేరుతుందో, లేదోనన్న సందేహం పట్టుకుంది. అందుకనే తన అభిలాషని ఓ రోజు కొడుక్కి తెలియజేశాడు, కనకరాజు.

"ఒరేయ్ శ్రీనూ! బాగా చదువుకుని, మంచి వుద్యోగం సంపాదించాలన్న ఆకాంక్ష నాకు వుండేది ఆరోజుల్లో. కాని, నేను తెలివైన స్టూడెంటునే అయినప్పటికీ, అప్పటి ఆర్థిక పరిస్థితుల వల్ల, యింటరు తర్వాత చదువుని సాగించలేక పోయాను. కనీసం నిన్నయినా గ్రాడ్యుయేట్ చెయ్యాలని నా సంకల్పం. నువ్వు

కష్టపడి చదవాలి. గ్రాడ్యుయేట్‌వి కావాలి. అదయినా, ఫస్టుక్లాసులో పాసవ్వాలి. ఏదేనా బ్యాంకులో వుద్యోగం సంపాదించాలి."

"శ్రద్ధగానే చదువుతున్నాను కదా నాన్నా" ముక్తసరిగ అన్నాడు, శ్రీనివాస్.

కొడుకు జవాబులో, గట్టిపట్టుదల ధ్యోతకమవ్వలేదు కనకరాజుకి. అయినా, ఆశల్ని చంపుకోలేదు. అతనికో విషయం విచిత్రంగా తోస్తోంది. పిల్లల్ని బాగా చదివించి, వారిని ప్రయోజకుల్ని చెయ్యాలన్న కొందరు తల్లిదండ్రులు ఆశలకు, ఆకాంక్షలకు భిన్నంగా, వారి పిల్లలు శ్రద్ధలేని చదువులు సాగిస్తూ వుంటే, చదువుకోవాలన్న ఆసక్తితో, పట్టుదలతో వున్న పిల్లల్ని చదివించలేని అశక్తికి లోనవుతున్నారు కొందరు తల్లిదండ్రులు... అనుకున్నాడు మనసులో.

ఒకవేపు కొడుకు సమస్య యిలా వుంటే, మరోవేపు తండ్రి, గతవైభవాన్ని విస్మరించలేక, ప్రస్తుత పరిస్థితులతో రాజీపడలేక, యెప్పటికప్పుడే యేదో సమస్య తెచ్చిపెడుతున్నారు. కాని, తాను యేం చెయ్యగలడు. మానసికంగా మధనపడ్డం మినహా... . అనుకున్నాడు, లోలోన కనకరాజు.

* * *

ఓ రోజు వుదయం తొమ్మిది కావస్తోంది. వంట కార్యక్రమంలో హడావిడిగా వున్నాడు, కనకరాజు.

వీధిలో, ఆటో ఆగిన చప్పుడు వినిపించగానే, వడిగా బైటికొచ్చాడు, కనకరాజు.

భార్యలక్ష్మి, కూతురు వసంత, ఆటో దిగుతూ అగుపించారు. కనకరాజు మనస్సు కుదుటబడింది, యిక వంటచేసుకోవాల్సిన బాధ తప్పుతుందని, సామాన్లతో వాళ్ళిద్దరూ లోపలికి వస్తుంటే అన్నాడు.

"ఓ వుత్తరం ముక్కయినా రాయకుండా, యింత హఠాత్తుగ వచ్చేసారేవిటి లక్ష్మీ?" అని.

లక్ష్మి, సన్నగా నవ్వింది.

"వ్యవధి లేకపోయిందండీ." అంటూ లోపలికి వచ్చి చేతిలో వున్న సూట్‌కేసుని బల్లమీద పెట్టింది, లక్ష్మి. ఆమె వెంట వసంత, కనకరాజు వచ్చారు.

"అన్నట్టు, మా చెల్లాయి పెళ్ళి నిశ్చయమయ్యిందండీ. అబ్బాయి బ్యాంకులో పన్జేస్తున్నాడు. తేదీ కూడా నిశ్చయమయ్యింది. పట్టుమని మరో పాతికరోజులే వ్యవధి వుంది. మళ్ళీ నేను, కాస్త ముందుగా వెళ్ళాలికదా! అందుకనే, యింక జాప్యం చెయ్యకుండా, బైలుదేరి వచ్చేశాను" అంది లక్ష్మి.

"అలాగా"

"మీరేం చేస్తున్నారిప్పుడు" ప్రశ్నించింది, లక్ష్మి.

"ఇంకేముంటుంది. ఏదో, యింత వండుకుని తినాలికదా?"

"మావయ్యగారేరీ?"

"బజారుకి వెళ్ళారు. ఈ వృద్ధాప్యంలో, ఆయనకెందుకు శ్రమ కలిగించడమని, అప్పుడుప్పుడూ నేనే వంటగదిని పాలిస్తున్నాను." సన్నగా నవ్వుతూ అన్నాడు. కనకరాజు.

లక్ష్మి మనసు చివుక్కుమంది: భర్తకి శ్రమ అధికమయ్యిందని, ఆమె బాధపడిపోతోంది పాపం.

"అందుకనే, అమ్మాయిని వదిలి వెళ్తానంటే, దాన్ని తీసుకెళ్ళమని మీరే బలవంతం చేశారు. అది వుంటే, మీకీ శ్రమ తప్పేదిగా?"

"పోనీలే లక్ష్మి అమ్మాయి మాత్రం యెక్కడికి వెళ్ళాలి గనక, అందుకే, తీసుకెళ్ళ మన్నాను. సరేగాని, మీవాళ్ళంతా కులాసాయే గదా!"

"ఆ, బాగానే వున్నారండీ, మానాన్నగారు మీకు పుత్తరం రాస్తామన్నారు. వీలుంటే, స్వయంగా వచ్చి చెబుతామన్నారు. వారంరోజులు ముందుగానే మనల్నందర్నీ పెళ్ళికి రమ్మని చెప్పమన్నారు మీతో.."

"ఇంతకీ, మీ చెల్లెలి పెళ్ళి యెప్పుడు నిశ్చయించారు?".

"వచ్చేనెల మూడో తేదీన, రాత్రి యెనిమిదిన్నరకి.."

"అబ్బాయి యేం చేస్తున్నాడు?"

"చెప్పాను కదండీ, బ్యాంకులో వుద్యోగమని.."

"ఔనుకదూ! మర్చిపోయాను. మీచెల్లాయి అదృష్టవంతురాలే."

"నిజమేనండీ! కాని, మానాన్నగారికి మాత్రం బాగా వదుల్తోంది."

"వదుల్తుంది మరి, బ్యాంకు వుద్యోగులకు డిమాండు అలా వుందిప్పుడు.." నవ్వుతూ అన్నాడు, కనకరాజు.

"సరేగాని, మనం అందరమూ వెళ్ళాలండోయ్ పెళ్ళికి.."

"అందరమూ వెళ్ళాలంటే, యెలా కుదురుతుంది లక్ష్మి? రైలు టిక్కెట్లకి తక్కువ డబ్బు అవుతుందనుకుంటున్నావా! మానాన్నగారు, అబ్బాయి, వుండిపోతారులే."

"మావయ్యగారు వుండిపోయినా ఫరవాలేదండీ, అబ్బాయిని రానివ్వండి. వాడు మాత్రం యింక్కెడికి వెళ్తాడని?"

కనకరాజు సాలోచనగా ఓ నిశ్వాసం వదిలాడు.

"మన సమస్యలు, రోజురోజుకీ పెరుగుతూనే వున్నాయ్ లక్ష్మి. మీ చెల్లెలి వివాహానికి, మనం వెళ్ళక తప్పదు. వెళ్తే, మొత్తం ఖర్చు యెంతవుతుందో, ఓసారి ఆలోచించు."

భర్త చెప్పిందాన్ని లక్ష్మి, అంతగా పట్టించుకున్నట్టు లేదు. ఆమె ధోరణి ఆమెది.

"మా చెల్లి ముందుగానే చెప్పిందండోయ్.. దానికి హెచ్చెమ్టీ వాచీ కొనివ్వాలట. నోరు తెరిచి అడిగింది. ఇవ్వకపోతే బావుండదు. ఖరీదు యెక్కువే అనుకోండి. కాని, ఏం చేస్తాం? మళ్ళీ యివ్వబోతామా యేవిటి? ఆ డబ్బు మనకి బట్టల రూపంలో తిరిగి వచ్చేస్తుంది కూడాను."

కనకరాజు, భార్యకేసి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడేగాని, చప్పున యేవీ సమాధానం చెప్పలేక పోయాడు. ప్రస్తుత పరిస్థితుల్లో, అంత పైకం యెలా పేస్తుందా, అన్న ఆలోచన లేకుండా, లక్ష్మి యెంత తేలిగ్గా చెప్పేసింది?,, అనుకున్నాడు, మనసులో.

"ఏవిటండీ అలా చూస్తున్నారు?"

"మనకి అదనంగా అవసరమయ్యే యీ పైకాన్ని, యెక్కణ్ణించి తీసుకురావడమా అని, ఆలోచిస్తున్నాను లక్ష్మి. దీనికి తోడుగా, మా నాన్నగారేమో ఉత్తర భారతంలో తీర్థయాత్రలు జరపడానికి బయల్దేరుతానంటున్నారు. ఆయనకి ఓ అయిదువందలిస్తే చాలంటున్నారు. ఈ పరిస్థితుల్లో యేం చెయ్యడమా అని, ఆలోచిస్తున్నాను. నాకేవీ పాలుపోవడం లేదు." అన్నాడు కనకరాజు.

బాధ్యత గల ఓ యింటి యజమానిగా, అతని బుర్రనిండా ఆలోచనలే.

"మావయ్యగారు మరోసారి యెప్పుడో తీర్థయాత్రలకి వెళ్తారు లెండి. ఆయనతో నేను మాట్లాడుతాను కదా!"

"నువ్వు మాట్లాడుతావు, కానీ, ఆయన అర్థం చేసుకుంటేకదా! అప్పుచేసిఅయినా సరే, కొడుకుగా నా కర్తవ్యాన్ని, బాధ్యతని నిర్వర్తించాలన్న ధోరణిలో ఆయన మాట్లాడుతున్నారు. ఇంకేం చెప్పను?" నిరుత్సాహంగా అన్నాడు, కనకరాజు.

"సరేలెండి, ఇవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. వంట యెందాకా వచ్చింది?" అంటూ వంటగదికేసి దారి తీసింది, లక్ష్మి.

కనకరాజు, వుస్సురనుకుంటూ, కుర్చీలో కూలబడిపోయాడు. అతని మెదడులోని ఆలోచనల్ని అరికట్ట లేకపోయాడు.

వసంత, సామాన్లు సర్దడంలో నిమగ్నమయ్యింది.

* * *

ఆ రోజు ఆదివారం.

కనకరాజు, ఆఫీసుపని చేస్తూ కూచున్నాడు. ఎప్పుడయినా. ఆఫీసు పనిలో ఒత్తిడి అధికంగా వుంటే, అలా యింటికి తెచ్చి కేసులు క్లియర్ చెయ్యడం అలవాటు రాజుకి. అది, తన కర్తవ్యంగా భావిస్తాడు. అంతేకాదు- అధికారుల చేత మాటపడ్డం, అతనికి యిష్టం వుండదు.

శ్రీనివాస్ వీధిలోంచి వచ్చాడు. శ్రీనివాస్‌కి, పందొమ్మిదేళ్ళు మొన్ననే దాటినయ్. గుండ్రని మొహం, కోటేరు వేసిన ముక్కు, పెద్దకళ్ళు.. అబ్బాయ్ అందంగానే అగుపిస్తాడు. కాని, అసహనం పాళ్ళు అతడిలో కాస్త అధికం.

టేబిలు ముందు నుంచున్న శ్రీనివాస్‌ని చూశాడు. కనకరాజు.

"ఏవిట్రా అబ్బాయ్" అన్నాడు మెల్లగా కనకరాజు తనపని తాను చేస్తూనే.

"అసలు నాలాంటివాడు, కాలేజీ చదువులకి వెళ్ళకండా వుండాల్సింది

నాన్న." అసహనంగా అన్నాడు, శ్రీనివాస్.

మేఘాలు లేకుండా, పురిమినట్టినిపించింది, కనకరాజుకి. కొడుకు ప్రవర్తనకి విస్తుపోయాడు. వాడిలో యింత అసహనం, ఆవేశం, యెట్లా పుంజుకున్నాయో, అర్థం కాలేదతనికి. లోలోన బాధపడ్డాడు. రాస్తోన్న కలం మూసేసి, కొడుక్కేసి చూశాడు.

"ఏమయ్యిందిరా యిప్పుడు?" నెమ్మదిగా అడిగాడు.

"అజంతా, ఎల్లోరా గుహలు చూడ్డానికి విద్యార్థులంతా కలిసి వెళ్తున్నామని చెప్పాను కదా నాన్నా! దీనికిగాను ప్రతీ విద్యార్థీ రెండొందల రూపాయలివ్వాలి. అందరూ యిచ్చేశారు గాని, నేనింకా యివ్వలేదు." అన్నాడు శ్రీనివాస్.

కనకరాజు, బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు. కొడుక్కి, చదువుపట్ల లేని శ్రద్ధాసక్తులు ప్రదేశాలు చూడ్డానికి వున్నందుకు, నవ్వొచ్చిందతనికి. అయితే, నవ్వలేకపోయాడు. తండ్రిగా తన బాధ్యత నిర్వర్తించక తప్పదనుకున్నాడు.

"చెప్పాను కద్రా శ్రీనూ, మరో వారం రోజుల్లో యేర్పాటు చేస్తానని వాళ్ళతో చెప్పు" అన్నాడు, కనకరాజు.

తండ్రి అసహాయతని అర్థం చేసుకో లేకపోయాడు శ్రీనివాస్.

"మనకోసమని వాళ్ళ కార్యక్రమం ఆగిపోదునాన్నా, టిక్కెట్లు కొని, రిజర్వేషన్లు యేర్పాటు చేసుకోవాలా మరి? నిజం చెప్పాలంటే, ప్రతిసారీ యేదో ఒక సాకుచెప్తుండటానికి, నాకే సిగ్గుగా వుంది. మొహం చెల్లడం లేదు కూడాను." బాధపడుతున్నట్టుగా అన్నాడు, శ్రీనివాస్.

కొడుకు మొహంలోకి సూటిగా చూశాడు, కనకరాజు.

"సిగ్గెందుకురా? అవాంఛనీయమైన పనులేమైనా చేస్తే సిగ్గుపడాలిగాని, నిస్సహాయతని తెలుపు కుందుకు సిగ్గెందుకు చెప్పు. కాలేజీలో చదువుతున్న వాళ్ళందరూ యిటువంటి యెక్స్‌కర్షన్లకి వెళ్తున్నారంటావా? పుష్కలంగా డబ్బున్న వాళ్ళే, కాలేజీలో చదువుతున్నారంటావా?"

"డబ్బు లేనపుడు, కాలేజీ చదువులకోసం యెగబాకడం యెందుకునాన్నా? అందని పళ్ళకోసం అర్రులు చాచినట్టే కదా? హాయిగా, యేదో చిన్న వుద్యోగంలో చేరిపోతే పోలే?"

కొడుకు అభిప్రాయానికి, చిన్నగా నవ్వుకున్నాడు, కనకరాజు. వాడిలో బాగా నిస్పృహ చోటు చేసుకుందనుకున్నాడు.

"అక్కడే నువ్వు పొరబడుతున్నావురా శ్రీనూ! కాలేజి చదువులు, కేవలం సరదాలు తీర్చుకోవడానికి మాత్రమే కాదని,గుర్తుంచుకో. జీవితానికో స్థాయిని కల్పించుకోడానికి, ఈ రోజుల్లో, వుద్యోగాలు దొరకడం కూడా అంత సులువుకాదు. పెద్దపెద్ద చదువులు చదువుకున్న వాళ్ళెంతో మంది, నిరుద్యోగులుగా, నిస్పృహతో తిరుగుతున్నారు. తప్పని పరిస్థితుల్లో కొందరు అతి చిన్న వుద్యోగాల్లో చేరి, తృప్తిపడుతున్నారు. అయినా సరే- భవిష్యత్తుని తీర్చి దిద్దడానికి, జీవితానికో బంగారు బాట యేర్పర్చుకోవడానికి, తగిన అవకాశాన్ని, యోగ్యతల్ని,

సంపాదించుకోడానికే, కాలేజీ చదువులు. నువ్విప్పుడు, అజంతా, ఎల్లోరా గుహలు చూడకపోతే, నీకు పుణ్యాల భవిష్యత్తు వుండదనుకోకు. వాటికంటే చదువుపట్ల దృష్టికి పెంపొందించుకోవటం, యెంతో అవసరం. ముఖ్యంగా, మనలాంటి మధ్యతరగతి జీవులకి..." అంటూ చిన్న వుపోద్ఘాతంలా చెప్పాడు, కనకరాజు.

కొడుకు కాస్తంతయినా, పరిస్థితుల్ని అర్థం చేసుకుంటాడన్న తాపత్రయంతో చెప్పాడుగాని, శ్రీనివాస్ ఆ ధ్యానలోనే లేడు.

"అయితే, మన లేమి స్థితిని, వాళ్ళందరి ముందు. బైటపెట్టుకోమంటారన్నమాట?"

"తప్పేముంది? వాస్తవాన్ని వ్యక్తం చేసుకోవడానికి భయమెందుకురా? అబద్ధం చెప్పడానికి భయపడాలికాని. ఉదాహరణకి, నా విషయమే తీసుకుందాం. ఇప్పుడు నేను వెలిగిస్తోన్న యీ గుమాస్తాగిరీని చూసుకుని మురిసిపోయి, అర్హతలేని అంతస్తు కోసం, మాటువేసుకుని తిరిగితే, యెవరు హర్షిస్తారు చెప్పు. నా పరోక్షంలో,నలుగురూ న[illegible]తారు."

"హర్షించరని, చి[illegible] బట్టలో, లేక అతుకువేసినవి బట్టలో వేసుకుని తిరగడం బావుంటుందంటారా నాన్నా?" యెదురు ప్రశ్న వేశాడు, శ్రీనివాస్.

"అదీ మంచిది కాదనుకో! మనకి వున్నంతలో, మనం సాగదగినంతలో, అవసరమైన మేరకే మన ఖర్చులుండాలంటాను. మన తాహతుకి మించిన ఖర్చులకి పోతే, యెవ్వటికైనా విచారించాల్సింది మనమేనంటే, ఒప్పుకుంటావుకదా?" సౌమ్యంగా అన్నాడు.

శ్రీనివాస్‌కి, తండ్రి వుపన్యాసాలు విసుగు పుట్టించాయి. అతడి మనస్తత్వ రీత్యా, తండ్రి చెప్పినవి వుపన్యాసాలే అనిపించాయి తప్పించి, వాటి విలువను తెలుసుకో లేక పోయాడు.

"అనవసరంగా వాదోపవాదాలు యెందుకు లెండి నాన్నా, ఇంతకీ యేమంటారు? ఇవ్వాళ, ఆ డబ్బుయిస్తారా, లేక, నన్ను కాలేజీ మానేయమంటారా?" విసురుగా అన్నాడు.

కనకరాజు, స్తబ్దుడయ్యాడు, అతని మొహంలో రంగు మారింది. ఆరోజు వరకూ, శ్రీనివాస్ అంత విసురుగా, ధైర్యంగా మాట్లాడిన సందర్భం, మరేదీ అతనికి గుర్తురాలేదు. వాడిలో, యిటువంటి పరిణామం యెందుకు, యెలా వస్తున్నదోనని, కలవరపడ్డాడు. వాడిలో యీ మార్పు వాడికేకాదు- కుటుంబానికే అనర్థం... అనుకున్నాడు. వాడికి యిప్పుడెలా నచ్చచెప్పాలో, అర్థంకాలేదు. ఏదో చెప్పాలి. వాడి ఆవేశాన్ని, అనాలోచితాన్ని,తగ్గించాలి.... అనుకున్నాడు, కనకరాజు.

"నీకు యెలా నచ్చచెప్పడమో, నాకు తోచడం లేదురా అబ్బాయ్. డబ్బు అడగ్గానే తెచ్చి పడేయడానికి, మనకేం డబ్బు బ్యాంకుల్లో మూలగడం లేదు. నీకు మాత్రం తెలీదా యేమిటి. మనం యెలా రోజులు నెట్టుకొస్తున్నామో?

సంపాదిస్తున్నవాణ్ణి, నేనొక్కణ్ణి. నా ఒక్కడి సంపాదన మీదే మన సంసారమంతా సాగాలి. దీనికి తోడు, ప్రతినెలా యేవో అదనపు ఖర్చులు వెన్ను తడుతూనే వున్నాయ్. ఏదీ తప్పించుకోలేం. పోనీ, కొందరిలా మనకి అదనపు ఆదాయం యేదన్నా వుందా అంటే, అదీ లేదు..'' అని చెప్పుకుపోతున్న కనకరాజు వాగ్ధోరణికి అసహనంగా అడ్డొచ్చాడు, శ్రీనివాస్.

"ఈ సోదంతా నాకు అనవసరం నాన్నా, కాలేజీ చదువు సాగించే ఆర్థికస్తోమత మనకి లేనపుడు, నేనింక ఆ చదువులు సాగించడం అర్థం లేదు. తోటి విద్యార్థుల సమక్షంలో న్యూనత పొందడం కంటె, యేకంగా చదువుకి స్వస్తి చెప్పడమే సమంజసంగా తోస్తోంది...'' అంటూ అక్కణ్ణించి తన గదిలోకి వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

కనకరాజు, అయోమయస్థితిలో పడ్డాడు. "ఒరేయ్ అబ్బాయ్.. యిటుగో మాట..'' అని పిలుస్తున్నా, వినిపించుకోలేదు, శ్రీనివాసు.

కనకరాజుకి, మరోషాక్ తగిలినట్టయ్యింది. బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు. అబ్బాయి అలా ప్రవర్తించాడన్న విషయం గురించి బాధపడలేదతను. కాని, వాడలా యెందుకు మారిపోతున్నాడా, అన్న బాధే అతనిలో కలవరాన్ని సృష్టిస్తోంది. అతని హృదయంతరాళంలో, అవ్యక్తమైన అలజడి ప్రారంభమయ్యింది. ఇంక, ఆఫీసు పని మీద ధ్యాసపోలేదు. టేబిలు మీద వున్న ఆఫీసు కాగితాల్ని తీసి, ఫైల్లో కట్టేసి లేచాడు. తనిప్పుడు డబ్బుకోసం ప్రయత్నించాలి.. తప్పదు.. అనుకుంటూ బైలుదేరాడు.

వంటగదిలోంచి వస్తూ, లక్ష్మి యెదురయ్యింది.

"ఇప్పుడెక్కడికి బయల్దేరారు?'' అంది.

"అలా వెళ్ళొస్తాను లక్ష్మీ'' అన్నాడు.

"అదే – యిప్పుడెక్కడికీ అని అడుగుతున్నాను. భోజనానికి వేళ కూడా అవుతోంది..'' అంది లక్ష్మి.

"అర్జంటు పని మీద వెళ్తున్నాను. మరేం ప్రశ్నలు వెయ్యకు. ఇప్పుడే వచ్చేస్తాలే..'' అంటూ చకచకా ముందుకు సాగి పోయాడు, కనకరాజు.

లక్ష్మి, నిర్ఘాంత పోయింది. ఆమెకి యేవీ అర్థం కాలేదు. అంత అర్జంటుగా వెళ్ళాల్సిన పనేమిటో, ఆమె వూహకి అందలేదు. అలాగా ఆలోచిస్తూ, క్షణం వుండిపోయింది.

* * *

కనకరాజు, నేరుగా స్నేహితుడు గుర్నాధం యింటికి వెళ్ళాడు.

గుర్నాధం, అప్పుడే భోజనం ముగించినట్టున్నాడు, యీజీ ఛైర్‌లో చేరబడి, విలాసంగా సిగరెట్ కాల్చుకుంటున్నాడు.

కనకరాజుని చూడగానే లేచి ముందుకొచ్చి, ఆప్యాయంగా ఆహ్వానించాడు, గుర్నాధం.

"రావోయ్ రాజా, ఏవిటిలా వచ్చావు? కూర్చో..'' అంటూ ఆసనం

చూపించి, తనూ కూచున్నాడు.

కనకరాజు, గుర్నాధంకి అభిముఖంగా కూచున్నాడు.

"చెప్పు రాజా, యేవిటి సంగతి?'' అడిగాడు, గుర్నాధం.

"గుర్నాధం, చాలా అవసరంగా డబ్బు కావాలోయ్. ఈ తరుణంలో ఆదుకోగల స్తోమత వున్నవాడివి, నువ్వొక్కడివే. అందుకే యిలా వచ్చాను.'' అన్నాడు, కనకరాజు.

గుర్నాధం, స్వతహాగా మంచివాడే, డబ్బున్నవాడే, అప్పుడప్పుడూ స్నేహితుల్ని ఆదుకోవడంలో, అతనికతనే సాటి. అయితే, యిటీవల యిల్లు కట్టించడంలో, అనుకున్న దానికంటే అధిక మొత్తం వ్యయం చెయ్యడం వల్ల, అతనికి ఆర్థిక దిగ్బంధం యేర్పడింది. కాని, యీ నిజాన్ని చెప్పినా యెవరూ నమ్మరు.

"ఇంతకీ, యే మాత్రం కావాలేవిటి?'' చిన్న మొత్తమైతే, సర్దుబాటు చెయ్యాలన్న అభిప్రాయంతోనే అన్నాడు.

"ప్రస్తుతానికి, ఓ అయిదువందలుంటే, అవసరాలు తీరుతాయి. వూరికనే యివ్వమని అడగను. తక్కువ వడ్డీ యివ్వడానికి నేను సంసిద్ధమే.'' తన అత్రుత కొద్దీ అనేశాడు, కనకరాజు.

గుర్నాధంకి, కనకరాజుపై జాలేసింది. కనకరాజు, చాలా జాగ్రత్తగల వ్యక్తి. ఆడంబరాలకు పోయే వ్యక్తికాదు. వృధాగా ఖర్చు చెయ్యడు. అతనెప్పుడూ తన దగ్గర డబ్బు తీసుకెళ్ళలేదు. ఇన్నేళ్ళ పరిచయంలో, మొట్టమొదటి సారిగా యీరోజే అడుగుతున్నాడు అంటే, అతని అవసరం అటువంటిది అయ్యుంటుందనుకున్నాడు. కానీ.. కాని..తన దగ్గర అంత డబ్బు లేదే. ఆవిషయం చెబితే, రాజు నమ్మడేమో! ఏం చెయ్యాలో పాలుపోలేదు గుర్నాధంకి. మానసికంగా యెంతగానో బాధపడ్డాడు. కనకరాజులాంటి మంచి మనిషికి సహాయం చెయ్యలేక పోతున్నందుకు.

"సారీ కనకరాజూ! ఇంత డబ్బు ప్రస్తుతానికి నా వద్దలేదని చెప్పడానికి చింతిస్తున్నానోయ్. నువ్వు యెన్నడూ నన్నడగలేదు. ఈ రోజు అడిగిన నిన్ను, యీ విధంగా నిరుత్సాహపరుస్తున్నందుకు, నాకెంతో సిగ్గుగా వుంది. నా దగ్గర డబ్బు లేదంటే, యెవరికీ నమ్మకం కుదరదు. కాని, యిది అక్షరాలా నిజం. ప్రస్తుతానికి లేదు. గృహనిర్మాణం చేబట్టి, వూబిలోకి దిగిపోయాను. ఎవరితోనూ చెప్పుకోలేని పరిస్థితి. ఎస్టిమేట్ చేసిన దానికంటె రెండింతలు ఖర్చువుతోంది. ఇప్పుడనిపిస్తోంది రాజా, నేరక యీ రొంపిలోకి దిగానని; ఇల్లు కట్టిస్తున్న వాణ్ణి చూసి, చాలా మంది అసూయపడతారు, అతని అదృష్టానికి. అతని తెలివితేటలకి, చాకచక్యానికి, అతణ్ణి యెంతగానో అభినందిస్తారు. కాని, ఆ వ్యక్తి, గృహనిర్మాణ కాలంలో, ఆ తర్వాత పడే అవస్థలు, అనుభవించే మనోవేదన, ఆరాటం, యితరులకి అర్థంకాదు. అతనొక్కడే అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. ఇప్పటి నా పరిస్థితి అదేరాజూ. నువ్వు మరేవీ అనుకోవద్దు. ఏదో, వందా, యాభై

కనకరాజు మొహం, నిరుత్సాహంతో నల్లబడిపోయింది. ఎంతో ఆశతో గుర్నాథం దగ్గరికొచ్చాడు. ఇంతవరకూ తన కొలీగ్స్‌ని యెవర్నీ అడగకపోయినా తప్పని సరి పరిస్థితుల్లో నోరువిడిచి, గుర్నాథంని అడిగాడు కాని, నిరాశే యెదురైనందుకు, మరింతగా బాధపడిపోయాడు. మనిషి జీవితంలో, డబ్బుకి యెంత ప్రాధాన్యత వుందో, ఆ క్షణంలో సూటిగా అవగాహనయ్యింది, కనకరాజుకి.

మనిషికి విజ్ఞాన సంపద వుండొచ్చు సంఘంలో యెనలేని పరపతి వుండొచ్చు, అధికారుల ఆదరణ వుండొచ్చు. కాని, ఆర్థిక సంపద లేకపోతే, పైవేవీ రాణించవేమోననిపించింది, కనకరాజుకి. స్వానుభవ పూర్వకంగా, అతను తెలుసుకున్న నిజమిది.

"ఎంతో ఆశతో వచ్చానోయ్ గుర్నాథం! కాని, యేం చేస్తాంలే. సమయానికి నీ దగ్గర డబ్బు లేకపోవడం. నా దురదృష్టానికి మరో తార్కాణం. మరి, వెళ్ళొస్తాను." అంటూ లేచాడు, కనకరాజు.

ఆ క్షణంలో కనకరాజు మొహం చూస్తుంటే, అంతులేని జాలి వేసింది, గుర్నాథంకి, జాలితో పాటు, బాధకూడా కలిగింది. ఎవర్నో ఒకర్ని, డబ్బు అప్పుగా అడిగి తీసుకోవడం, కొందరికి అలవాటు. అది, వారికి అపామాషీలాంటి వ్యవహారం. వాళ్ళ యిష్టమొచ్చినపుడు తీర్చ వచ్చుననే ధీమా! అది వారి నైజగుణం. అయితే, మరి కొందరికి, యితరుల్ని డబ్బు అప్పుగా అడగడమంటే, స్వాభిమానం కుంటుపడినట్టే వుంటుంది. అది, వారికి, ఆత్మహత్యా సదృశం. రెండోకోవకి చెందినవాడు కనకరాజని, గుర్నాథంకి బాగా తెలుసు. అందుకే, కనకరాజులో అంతర్లీనంగా వున్న బాధని గ్రహించగలిగాడు.

"కాస్త మజ్జిగ తీసుకుని వెళ్ళవోయ్.." అన్నాడు, గుర్నాథం.

"ఇప్పుడు మజ్జిగ తీసుకోవడం యేమిటోయ్! భోజనం వేళ కదా! ఇంటికి వెళ్ళి భోంచేస్తాను. మరోసారి వస్తాలే.." నిర్లిప్తంగా అన్నాడు, రాజు.

గుర్నాథం మనస్సు చివుక్కుమంది. అదీ నిజమే! భోజనాల వేళప్పుడొచ్చాడు, కనకరాజు. ఎంతో అవసరం లేకపోతే, ఆ సమయంలో రాడు కూడా.. అన్న ఆలోచన స్ఫురించింది, గుర్నాథంకి.

గుర్నాథం హృదయం, ద్రవించిపోయింది. అడిగినంత పైకం కాకపోయినాకొంతయినా సహాయం చేయ్యాలని పించిందతనికి. తన అవసరానికి, మరోచోట తెచ్చుకోవచ్చునని నిర్ణయించుకున్నాడు.

"కూర్చో కనకరాజూ! నిన్ను వట్టిచేతుల్తో పంపాలంటే, నాకే బాధగా వుంది, వస్తానుండు," అంటూ బలవంతంగా కనకరాజుని కూచోబెట్టి, లోపలికి వెళ్ళాడు, గుర్నాథం.

రెండునిమిషాల్లో తిరిగొచ్చాడు, గుర్నాథం అతని చేతిలో రెండు వందరూపాయలు నోట్లున్నాయి. "రాజూ, వున్నంతలో నీకు సహాయం చెయ్యాలనిపించిందోయ్. ఎప్పుడూ అడగని వాడివి అడిగావు గాబట్టి, వట్టిచేతుల్తో నిన్ను పంపించడానికి మనస్కరించలేదు. నువ్వు కోరినంతా సహాయం చెయ్యలేకపోయినందుకు, మరేమీ అనుకోకు." అంటూ ఆ రెండు నోట్లూ కనకరాజు చేతిలో పెట్టాడు.

"థాంక్స్ గుర్నాథం! ప్రస్తుతానికి అవసరం తీరుతుందిలే మిగిలిన పైకం కోసం యేదో తంటాలు పడతాను. ఈ పైకం వీలున్నంత త్వరలో తిరిగి యిచ్చేస్తాను." అన్నాడు కనకరాజు. అతని మొహం కాస్తంత విప్పారిందిప్పుడు.

"అలాగేలే రాజూ! నీ దగ్గరున్నపుడే యివ్వు. వడ్డీకని యివ్వడం లేదు సుమా.. గుర్తుంచుకో!! నవ్వుతూ అన్నాడు, గుర్నాథం.

"అలాగే గుర్నాథం వస్తా మరి.." అంటూ ఆ డబ్బు జేబులో పెట్టుకుని, యింటి ముఖం పట్టాడు, కనకరాజు.

గుర్నాథం, తృప్తిగా నిట్టూర్పు విడిచాడు. ఒక మంచిపని చేశాననే 'తృప్తి' అతనిలో చోటు చేసుకుంది. కుర్చీలో చేరబడి, మరో సిగరెట్ వెలిగించాడు.

• • •

కనకరాజు యిల్లు చేరుకునే సరికి, అప్పుడే ముకుందం, శ్రీనివాస్, భోజనాలు ముగించుకుని చేతులు తుడుచుకుంటూ లేస్తున్నారు.

"శ్రీనూ.." మెల్లగా పిల్చాడు, కనకరాజు.

"ఏంటి నాన్నా?" అంటూ తండ్రి దగ్గరికి వచ్చాడు, శ్రీనివాస్.

"ఇదిగోరా, నువ్వడిగిన రెండొందలూ." అంటూ జేబులోంచి ఆ పైకం తీసి కొడుక్కి అందిస్తూ

"ఈ డబ్బు వాళ్ళకి యిచ్చేసి రారా! కేవలం యీ డబ్బు యివ్వలేదని, నువ్వుచదువు మానేయనక్కర్లేదు. ఒక్క విషయం గుర్తుంచుకో. ఆవేశం తగ్గించి, ఆలోచించి ప్రవర్తించడం నేర్చుకో." అన్నాడు.

శ్రీనివా్ సరేం మాట్లాడలేదు. డబ్బు జేబులో పెట్టుకుని, అక్కణ్ణించి తప్పుకున్నాడు. తండ్రి మాటలు, అతడి చెవుల్లో గింగురు పెడుతూనే వున్నాయి.

ముకుందం, ఆశగా చూశాడు కొడుక్కేసి. తన ప్రయాణానికి డబ్బు యిస్తాడేమోనని, అతని ఆసక్తి. అయితే, శ్రీనివాస్‌కిచ్చిన పైకం, కొడుకు యెలా తెచ్చాడో, అతనికి తెలీదు. కొందరికి వయస్సు మీదబడినా, వారి ఆలోచనలు పరిపక్వత చెందవు. అది, వారి నైజమే మరి. అటువంటి సూచనలేవీ లేకపోయేసరికి, అక్కణ్ణించి నిష్క్రమించాడు ముకుందం, బరువుగుండెతో.

లక్ష్మి మౌనంగా భర్తకేసి చూసింది. "ఎక్కణ్ణించి తీసుకొచ్చారండీ ఆడబ్బు?" అంది.

"గుర్నాథంని అడిగి తీసుకొచ్చాను లక్ష్మీ! లేకుంటే, మన సుపుత్రుడు చదువే మానేస్తానంటున్నాడు.." బాధగా నవ్వేడు, కనకరాజు.

"చిన్నవాడు లెద్దురూ, ఆనాలోచితంగా యేదో తొందరపడ్డాడు. ఆ మాటల్ని మీరు పట్టించుకోకండి..మీరుబట్టలు మార్చుకుని రండి, భోజనం చేద్దురుగాని.." అంది, లక్ష్మి.

సన్నగా ఓ నిట్టూర్పు విడిచి, బట్టలు మార్చుకుందుకు తన గదికేసి వెళ్ళిపోయాడు, కనకరాజు.

దుస్తులు మార్చుకున్నాక, కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చి, భోజనానికి కూచున్నాడు, కనకరాజు. లక్ష్మి వడ్డిస్తోంది.

"మన ప్రయాణం గురించి ఆలోచిస్తున్నారా?" అంది లక్ష్మి.

"ఒక్క మన ప్రయాణం గురించే కాదు లక్ష్మి! అటువంటి సమస్యలెన్నింటి గురించో ఆలోచిస్తున్నాను. ఇంటి యజమానిగా, బాధ్యతగల ఓ వ్యక్తిగా, సమస్యల్ని పరిష్కరించడం, నా కర్తవ్యంగా భావిస్తున్నాను. కృత్రిమమైన యీనాటి జీవనసరళిలో, మనిషి బాధ్యతలు అర్థరహితంగా పెరిగిపోతున్నాయి. వాటిని అరికట్టే ప్రయత్నం చెయ్యడం, ప్రవాహానికి యెదురీదినట్టే అవుతుంది. దానివల్ల, ప్రయోజనం యేమీ వుండదు. జీవితం, యిలా సాగాల్సిందే." నిస్తేజంగా అన్నాడు, కనకరాజు.

భర్త మాటల్లోని నిస్పృహని, అర్థం చేసుకో గలిగింది, లక్ష్మి. అందుకే, మళ్ళీ యేమీ ప్రశ్నించలేదు. అటువంటి యింగితం, యీ రోజుల్లో యెంత మంది గృహిణిలకు వుంటుంది?

"అన్నం వేసుకోండి.." అంది లక్ష్మి.

"వద్దు లక్ష్మి.." అంటూ చేయి కడుక్కొని లేచి పోయాడు, కనకరాజు.

కనకరాజు నేరుగా తన గదిలోకి వెళ్ళిపోయి, మంచంమీద చేరబడ్డాడు. పైన ఫేను తిరుగుతోంది. అతని మస్తిష్కంలోని ఆలోచనలు, అంతకంటె వేగంగా విహారం చేస్తున్నాయి.

*　　*　　*

సంసార రథాన్ని నడపడంలో, యింటి యజమానిగా భర్తకి యెంత బాధ్యత వుందో, గృహిణిగా, అతని సహధర్మచారిణిగా, భార్యకి అంతే బాధ్యత వుంది.

ఈ సత్యాన్ని బాగా ఆకళింపు చేసుకున్న లక్ష్మి, భర్త అనుభవిస్తోన్న మానసికాందోళనని, అర్థం చేసుకుంది. కొడుకు అలా సమాధానం చెప్పి వుండక పోవల్సిందని, యిప్పుడనుకుంది. అనుకున్నదే తడవుగా, కొడుకు చదువుకొంటున్న గదిలోకి అడుగుపెట్టింది.

"శ్రీనూ.." మెల్లగా అంది.

"ఏవిటమ్మా?" తల్లికేసి తిరిగాడు, శ్రీనివాస్

"నువ్వు ఎక్స్‌కర్షన్‌కి యెప్పుడు వెళ్తున్నావురా?"

"మరో పదిరోజుల తర్వాత నమ్మా.."

"డబ్బు యిచ్చేశావా?"

"లేదమ్మా! రేపు యిస్తాను."

"మీ నాన్నగారు డబ్బు యేర్పాటు చెయ్యలేక పోయారనుకో.. అప్పుడు చదువు మానేస్తానన్నావట, నిజమేనా?"

"ఔనమ్మా.. అన్నాను. అందరూ వెళ్తుంటే, నేనొక్కణ్ణీ వేల మొహం వేసి, వ్యవధి కోరడం, చిన్నతనం కాదా అమ్మా?"

లక్ష్మి భారంగా ఓ నిట్టూర్పు వదిలింది. "మీనాన్నగారు యెవర్నో అప్పు అడిగి తెచ్చారా పైకం. అప్పు అడగడం, ఆయనకి చిన్నతనం కాదా! ఇటువంటి భావాల్ని పెంచుకోకురా శ్రీనూ! మనకోసం మీనాన్నాగారు యెంత శ్రమపడుతున్నరో, ఓసారి ఆలోచించు. అలాగని, నిన్ను వెళ్ళొద్దని చెప్పడం లేదు. కాని, మాట్లాడే ముందు, కాస్త ఆలోచించి మాట్లాడు. నువ్వు చదువు మానేస్తే, నష్టం యెవరికనుకున్నావు? మాకు కాదు. నీకే!" అంటూ మెల్లగా మందలించింది.

శ్రీనివాస్, సమాధానం చెప్పకుండా, మొహం దించుకున్నాడు. తల్లి చెప్పినట్టు, తాను తొందర పడ్డాడేమో ననిపించింది.

శ్రీనివాస్ మౌనాన్ని గమనించి, మరేం అనకుండా వెళ్లిపోయింది, లక్ష్మి.

*　　*　　*

ముకుందంకి, తన ప్రయాణం విషయంలో ఆతృత అధికమయ్యింది. తాను అడిగిన డబ్బు విషయంలో కొడుకు యింకా యేమీ చెప్పకపోవడం, అతనిలో అశాంతికి దారితీసింది. ఇంక మౌనంగా వుండలేకపోయాడు.

కొడుకు దగ్గరికి వెళ్ళి అడిగాడారోజు "ఒరేయ్ అబ్బాయ్, ఆ సీతారామయ్య, నా ప్రయాణం గురించి అడిగాడ్రా! రిజర్వేషన్లవీ చేయించుకోవాలికదా! నువ్వేమో, యింతవరకూ యేమీ తేల్చడం లేదు."

న్యూస్ పేపర్ చదువుతోన్న కనకరాజు, పేపరు మడత పెట్టి తలెత్తాడు.

"నేనూ ఆ ప్రయత్నంలోనే వున్నాను నాన్నా! ఎక్కడా అప్పు పుట్టడం లేదు. అబ్బాయి ఫీజు కట్టమంటున్నాడు, వాడికి రెండొందలు అప్పుగా తెచ్చి యివ్వడమే గగనమయ్యింది. మరో స్నేహితుణ్ణి అడిగాను.. ప్రయత్నిస్తానన్నాడు.. కాస్త ఓపిక పట్టాలి మరి.." అన్నాడు, కనకరాజు.

ముకుందం మొహం వాడిపోయింది. "నీ ప్రయత్నాలు ఫలించేసరికి, ఆ కాస్తా పుణ్యకాలం దాటిపోతుందిరా అబ్బాయ్. సీతారామయ్య వెళ్ళిపోతే, నాకు తోడెవరూ వుండరు. ఒంటరిగా వెళ్ళలేనాయె!" నిరుత్సాహంగా అన్నాడు, ముకుందం.

సరిగ్గా అదే సమయంలో, బైట్నుంచి ఈశ్వర్ వచ్చాడు. అతని చేతిలో చిన్న సూట్‌కేసుంది.

ఈశ్వర్ లక్ష్మి తమ్ముడు. పాతికేళ్ళకు దగ్గర్లో వుంటాడు. అప్పుడే రైలుదిగి వచ్చాడు. కనకరాజుని చూడగానే

"నమస్కారం బావగారూ! బైట, ఆ ముష్టి వెధవలు యెంత పొమ్మని చెప్పినా, పోకుండా వున్నారేవిటి? వీళ్లతో గొప్ప చిక్కు. నిజం చెప్పాలంటే, యీ యాచకవృత్తి సుఖప్రదమైందనిగామోసు– వీళ్ళ జనాభా రోజు రోజుకి పెరిగిపోతోంది." అన్నాడు. అంటూనే అక్కడే వున్న ముకుందం వేపుచూసి "ఓ మావయ్యగారూ! ఇవే నా హృదయపూర్వక వందనాలు" నాటక ఫక్కీలోఅన్నాడు.

"ష్..." తీక్షణంగా ఈశ్వర్ కేసి చూశారు, ముకుందం.

"అరె! అంత సీరియస్‌గా మొహం పెట్టారేమిటి? మీరంత దిగులుగా వుండటం, యింతవరకూ నేనెప్పుడూ చూళ్ళేదు మామయ్యగారూ.." ఆశ్చర్యంగా చూస్తూ, అన్నాడు ఈశ్వర్.

ఆ మాటలు, అగ్ని మీద ఆజ్యం పోసినట్టయ్యింది, ముకుందంకి.

"అది నా ఖర్మ నాయనా! ఎవర్నని యేం లాభం? ఎప్పుడు యేది అనుభవించాలో, యెవరు చెప్పగలరు?" దిగాలుగా అన్నారు, ముకుందం.

"ఇది మాత్రం అక్షరాలా నిజం మామయ్యగారూ! ఎవరు యేమౌనో యెవరు చెప్పగలరు.." అని చివరి వాక్యం తత్వంలా పాడుతున్న ఈశ్వర్ వేపు యెర్రగా చూశారు, కనకరాజు. "స్టాపిట్ ఈశ్వర్... సమయం, సందర్భం లేకుండా యేమిటా జోకులు.." కోపంగా అన్నారు, కనకరాజు.

నిర్విణ్ణుడయ్యాడు, ఈశ్వర్. బావగారు కూడా ఆరోజు సీరియస్‌గా వుండటం, అతణ్ణి మరింతగా ఆశ్చర్యపర్చింది.

"చచ్చాం! నువ్వూ సీరియస్‌గానే వున్నావా బావా? ఇవ్వాళ, యీ యింట్లో యేం జరిగింది? కిలకిల నవ్వుల్తో కళకళలాడుతూవుండే యీ యింట్లో, యీ రోజు విసుర్లూ, విసుగులూ కనిపిస్తున్నా యేమిటి?" విస్తుపోతున్నట్లు, కళ్ళింతలు చేసుకుని మరీ అన్నారు, ఈశ్వర్.

"ఆరాలు తియ్యడానికి ప్రయత్నించడం మానేసి, కాస్సేపు నోరుమూసుక్కూచోవోయ్" వారించాడు, కనకరాజు.

"ఆల్‌రైట్! నోరుమూసుకుంటాన్లే బావా" అంటూ మాటకేసు క్రిందపెట్టి, దగ్గర్లోవున్న కుర్చీ లాక్కుని కూచున్నారు, ఈశ్వర్.

"ఇదేనా రావడం?" మామూలు ధోరణిలో అడిగారు, కనకరాజు.

"ఇది మరీ బావుంది బావా లేకపోతే...? ఎప్పుడోవచ్చి యెక్కడో వుండి, యిప్పుడే యిక్కడికి వచ్చాననుకుంటున్నావా? ఎంత చదువుకున్నా యీ పాత చింతకాయ ప్రశ్నలు మాత్రం వదిలారు కాదు మనవాళ్ళు." ముసిముసి నవ్వుతూ అన్నారు, ఈశ్వర్.

ముకుందంకి, విసుగు, కోపం, యినుమడించినయ్. ఈశ్వర్ కేసి తీక్షణంగా చూస్తూ "అబ్బబ్బ! ఇదో తలనొప్పి." అన్నారు.

"ఏమిటి మామయ్యగారూ, తలనొప్పా! అనాసిన్ టాబ్లెట్‌యిస్తానుండండి." అంటూ తియ్యబోయాడు, ఈశ్వర్.

ముకుందం మొహం, కోపంతో యెర్రబారింది.

"నువ్వే వేసుకో.." కోపంగా అనేసి, విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయారు, ముకుందం.

కనకరాజు మొహం, కందగడ్డలా మారింది. తన తండ్రిని, ఈశ్వర్ అలా ఆటపట్టించడం, సహించలేకపోయాడు.

"ఈశ్వర్, పెద్దవాళ్ళ పట్ల గౌరవం లేకుండా నువ్విలా ప్రవర్తించడం, యేం బావుండలేదు. ఓ సమయం, సందర్భం వుంటుంది. అవేవీ నువ్వు పాటించడం లేదు. నీ అతివాగుడుని తగ్గించుకో.. అది నీకే శ్రేయస్కరం." గంభీరంగా అన్నాడు, కనకరాజు.

ఈశ్వర్, ఆ గంభీరతని అర్థం చేసుకున్నాడు.

"సారీ బావా! ఏదో సరదాగా వాగేశాను. నన్ను క్షమించు". మెల్లగా అన్నాడు, ఈశ్వర్.

కనకరాజు, భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఈశ్వర్, నీకు సరదాగా వుండొచ్చు. కాని, సమస్యంతో నేను సతమతమవ్వాలి, తెలుసా?"

ఈశ్వర్, కాస్తంత విస్తు పోయాడు. "ఏమిటి బావా నువ్వంటున్నది? నీకు సమస్యలా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు, కనకరాజుని.

"ఏం నేను అందరిలాంటి మనిషిని కానా? నాకు సమస్యలుండవా? లేకపోతే, నేనేం ఆకాశం నించి వూడిపడి వచ్చాననుకుంటున్నావా?"

"అదికాదు బావా నిత్యం నవ్వుతూ, నవ్విస్తూ, నిశ్చింతగా బ్రతుకునీడుస్తోన్న మా బావగారికి సమస్యలుంటాయంటే, యెలా నమ్మడం?"

కనకరాజు, భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"అదేనోయ్ విశేషం, మనలాంటి మధ్యతరగతి కుటుంబాల్లో యిదో ప్రత్యేకత. తమలో నిబిడీకృతమై వున్న ఆవేదనని, బాధని, బాధ్యతల్ని ఒకరితో చెప్పుకోలేం. మనం, సంతోషంగా, సుఖంగా, యేచీకూ చింతా లేకుండా వున్నామని నలుగురూ అనుకునేలా, నవ్వుతూ బ్రతకడం, మనకి దేవుడిచ్చిన వరం." అన్నాడు.

"అందూ అంతేనంటావా బావా!"

"అందరి విషయం, నేను జనరలైజ్ చేసి చెప్పలేనుగాని, చాలామంది విషయంలో, నా అంచనా తప్పుకాదు. కొన్ని యెక్సెప్షన్స్ వుంటాయనుకో. అయితే, అందరూ చాలా బాహ్యంగా చెప్పుకోరు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల్లో యిదో గొప్ప బలహీనత అంటాన్నేను."

"ఏమిటో బావా, నీ థియరీ నాకు అర్థం కావడం లేదు." నిరుత్సాహంగా అన్నాడు, ఈశ్వర్.

"థియరీ కాదు ఈశ్వర్. ఇది స్వానుభవం. నేను స్వయంగా అనుభూతిని పొందుతున్నాను గాబట్టే చెప్పగలుగుతున్నాను. నేనేం చెప్పినా, వూహించి చెప్పను."

సూక్తులు, సుద్దులూ, బావ చెప్పడం మొదలు పెట్టాడంటే, యింక ఆ వాగ్ధాటికి అవరోధం వుండదని, ఈశ్వర్‌కి తెలుసు. అందుకే, ఆ ప్రస్తావనకి

ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్నాడు, ఈశ్వర్.

"సరేగాని బావా, నేనిప్పుడు రావడానికి కారణం యేవిటో వూహించావా?" టాపిక్ మార్చేస్తూ అన్నాడు, ఈశ్వర్.

"ఇంకేముంటుంది? మీ చెల్లెలి వివాహమే అయ్యుంటురంది?" చప్పున చెప్పారు, కనకరాజు.

"కరెక్ట్! బాగా పసిగట్టావు.."

"ఇందులో గొప్పదనం యేముందని? మీ అక్కయ్య చెప్పగా ముందే తెలిసిందనుకో?"

"మీకు చెప్పడానికి, మిమ్మల్ని వివాహానికి ఆహ్వానించడానికి, నాన్నగారు స్వయంగా రావాలనే అనుకున్నారు బావా, కాని పెళ్ళి పనుల ఒత్తిడి వల్ల, రాలేకపోయారు. అందుకని, నన్ను పంపించారు మిమ్మల్ని ఆహ్వానించడానికి. మిమ్మల్నందర్నీ, కాస్త ముందుగానే రమ్మని కోరారు. ఇదిగో, ఆహ్వాన పత్రిక.." అంటూ సూట్‌కేస్ తెరిచి అందులోంచి శుభలేఖ తీసి బావకి అందించాడు, ఈశ్వర్.

కనకరాజు శుభలేక తీసి చదువుకున్నాడు. "శుభలేఖ అందంగా కొట్టించారోయ్. చాలా బావుంది. ఔనూ, దీనికోసం నువ్వు స్వయంగా రావాలంటోయ్? పోస్టులో పంపించేస్తే సరిపోయేదిగా;" అన్నాడు.

ఈశ్వర్ గతుక్కుమని, బావకేసి అదోలా చూశాడు.

"ఏం, నేను రావటం నీకు యిష్టం లేదా బావా?" సూటిగా ప్రశ్నించాడు.

కనకరాజు, షాక్ తిన్నాడు. తాను అలా అనకుండా వుండాల్సింది. అనుకుని, చప్పున తమాయించుకుని, మందహాసం చేశాడు.

"నీ ఆకతాయితనం పోయింది కాదోయ్ ఈశ్వర్. నా వుద్దేశం యేవిటో నువ్వు గ్రహించలేకపోయావు. మీ అక్కయ్య, మొన్ననేగా అక్కణ్ణించి వచ్చింది. ఆమెద్వారా యెలాగు కబురు పంపారు. అనవసరంగా నీకి శ్రమ యెందుకు చెప్పు? మీనాన్నగారు, అక్కడ ఒక్కరై పోతారు. పెళ్ళిపనులన్నీ ఒక్కరూ చూసుకోవడం యెంతకష్టమని? అందుకే అన్నాను. గాని, నువ్వు మరోలా అర్థం చేసుకున్నావు." అన్నాడు, కనకరాజు, మెల్లగా మందహాసం చేస్తూ.

ఈశ్వర్, సీరియస్ మూడ్ నుంచి బైట పడ్డాడు.

"ఆ విషయంలో చింత లేదు బావా! నాన్నగారి ఆఫీసు బలగం వుందిలే, వాళ్ళే యేర్పాట్లన్నీ చూసుకుంటారు. అయినా, మేం యెవరమైనా స్వయంగా వచ్చి ఆహ్వానించకపోతే, నువ్వు బాధపడతావని, నాన్నగారి అభిప్రాయం, ఇంటి అల్లుడివి కదా?" ముసిముసి నవ్వుతూ అన్నాడు, ఈశ్వర్.

"ఏవిటో, అన్నీ ఛాందసాలే మీనాన్నవి.. లక్ష్మీ.. లక్ష్మీ.." అంటూ కేక వేశాడు, కనకరాజు.

"పిలవడ మెందుకులే బావా! నేనే లోపలికి వెళ్తాను" అంటూ సూట్‌కేసు పట్టుకుని, లోపలికి నడిచాడు, ఈశ్వర్.

కనకరాజు, బరువుగా ఓ నిశ్వాసం వదుల్తూ కుర్చీలో వెనక్కి

జేరబడిపోయారు.

* *

కనకరాజు, అదనంగా యెలా ధనార్జన చెయ్యడమా, అన్న ఆలోచనలో పడ్డాడు. అలాగని, అన్యాయార్జితం, అతనికి యిష్టం లేదు.

అతనికి అందుబాటులో వున్న అవకాశం ఒక్కటే దృష్టిలో మెదిలింది. ఎక్కడయినా, పార్ట్‌టైమ్ జాబ్ చెయ్యడం.

కనకరాజుకి, యిన్‌కంటాక్స్, సేల్సుటాక్స్ లెక్కలు రాయడంలో ప్రత్యేకనిపుణత వుంది. చాలా రోజులక్రితం వీటికి సంబంధించిన ఓ లాయరు దగ్గర పార్ట్‌టైమ్ జాబ్ చేసి, వాటిలో గల మెళకువలు క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. కొంత కాలం తర్వాత, ఆ లాయర్‌కి, అతనికి భేదాభిప్రాయాలొచ్చి, మానేశాడు. నిజానికి ఆ లెక్కలు రాయడం, అందరికీ చేతనవదు. దానికెంతో నేర్పు వుండాలి. ఎంతో అనుభవం కావాలి. ఆ నేర్పూ, అనుభవం, రెండూ కనకరాజుకి వున్నయ్.

ఆర్నెళ్ళ క్రితం, భీమరాజు అనే ఓ పారిశ్రామిక వేత్తని కలియడం జరిగింది, కనకరాజు. ఇన్‌కమ్‌టాక్స్, సేల్సుటాక్స్ కన్సల్టెంటు లాయరు దగ్గర పార్టుటైము జాబ్ చేస్తున్న రోజుల్లో భీమరాజు యిన్‌కమ్‌టాక్స్ అండ్ సేల్సుటాక్స్ లెక్కలే రాసేవాడు, కనకరాజు. అప్పట్లో మానేశాడు.

"కనకరాజుగారూ, మా లెక్కలు మళ్ళీ మీరే చేపట్టకూడదటండీ, ఇప్పుడు రాస్తున్న వ్యక్తితో మేం కొన్ని సమస్యల్ని యెదుర్కోవాల్సి వస్తోం..." అని భీమరాజే అడిగాడు.

అయితే, యెప్పుడో రాయడం మానేసిన ఆ లెక్కల్ని, మళ్ళీ ప్రారంభించడం, బుర్ర పాడు చేసుకోవడం, యిష్టం లేకపోయింది, కనకరాజుకి. అప్పట్లో, అతనికి జీవితం యే ఒడుదుడుకుల్లేకుండా సాఫీగానే సాగిపోతోంది. ధనార్జన ఆవశ్యకం లేకపోయిందప్పట్లో. అదిగాక, అటువంటి దొంగ లెక్కల్ని రాయడం, ధనవంతుల్ని మరింత పెంచడమేనని, ప్రభుత్వం కళ్ళు గప్పడమేననిపించిదప్పట్లో.

"క్షమించండి భీమరాజుగారూ" నాకిప్పుడు బొత్తిగా తీరిక లేకుండా వుందండీ ఆఫీసుపనితో." అన్జెప్పి తప్పించుకున్నాడప్పట్లో.

భీమరాజు, సన్నగా నవ్వేశాడు. అతను తల్చుకుంటే, కొండమీది కోతి కూడా దిగొస్తుంది. కనకరాజుని బలవంతం చెయ్యలేదు.

"సరే! మీయిష్టం.." అనేసి వెళ్ళిపోయాడాయన.

కనకరాజుకి, యిప్పుడా సంఘటన గుర్తుకొచ్చింది. మనసులో యెంతో బాధపడ్డాడు. కాళ్ళదగ్గరికొచ్చిన అవకాశాన్ని, చేజేతులా జారవిడుచుకున్నందుకు పశ్చాత్తాప పడ్డాడు. అయితే, అవసరాలు ముందుగా అల్టిమేటమ్ యివ్వవు కదా?. . . అనుకున్నాడు.

ఇప్పుడు స్వయంగా వెళ్ళి, భీమరాజుని అడిగితే, ప్రయోజనం వుండొచ్చునేమోనన్న ఆశ, అతని మస్తిష్కంలో మెదిలింది. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా భీమరాజు దగ్గరికి ప్రయాణమయ్యారు, కనకరాజు.

కనకరాజుని చూడగానే, ఆప్యాయంగా ఆహ్వానించారు, భీమరాజు. ఎందుకోమరి, అతనికి కనకరాజు పట్ల ప్రత్యేకమైన అభిమానముంది.

"రండి.. రండి, కనకరాజుగారూ! మీరిలా దయచేయడం, మా అదృష్టమే కూచోండి." అన్నారు, భీమరాజు.

కనకరాజు కుర్చీలో ఆశీనులయ్యారు. "మీ అభిమానానికి థాంక్స్ భీమరాజుగారూ" నమ్రతగా అన్నారు.

"మనం మొహాలు చూసుకున్న వేళావిశేషం యేమిటోగాని, మీరంటే, నాకు ప్రత్యేకాభిమానం వుంది కనకరాజుగారూ. ఎందరో విద్యార్థులు, వుద్యోగులు, అదనంగా సంపాదించాలని, యేదో పార్ట్‌టైము జాబ్‌కోసం నా దగ్గరికి వచ్చిన వాళ్ళున్నారు. అయినా, నేను వాళ్ళని పెట్టుకోడానికి అంగీకరించలేదు. మీరు నాదగ్గరుంటే, నాకెందుకో కొండంత బలం వుంటుందని, అప్పట్లో మిమ్మల్ని కోరాను. కాని, మీరు అంగీకరించారు కారు. అందుకు కారణం యేదయినా అప్పుడే నేననుకున్నాను, ధనార్జన పట్ల మీకు తాపత్రయం లేదని! అన్నారు భీమరాజు సన్నని మందహాసంతో.

భీమరాజు మందహాసం మరుగున యెంతో దర్పం వుంది. ఆ దర్పంలో 'అహం' వుందో, లేదో గ్రహించుకోలేక పోయారు, కనకరాజు. ఏమైతేనేం– తనంటే అతనికి అభిమానమున్న మాట వాస్తవమనుకున్నారు. అది, ఒకందుకు మంచిదేననుకున్నారు.

"మీకు నాపట్లగల సదభిప్రాయానికి, మరోసారి ధన్యవాదాలు చెప్పుకుంటున్నానండీ" అన్నారు, కనకరాజు.

"దానికేం లెండి.. చెప్పండి, యేమిటిలా దయచేశారు?" అడిగారు, భీమరాజు.

"భీమరాజుగారూ, మేం అతి సామాన్యులం. మేం అనుకున్నది ఒకటయితే, జరిగేది వేరుగా వుంటుంది. అటువంటి జాతకాలు మావి. ఆరోజు, మీ అంతట మీరే కోరినా మీ లెక్కలు రాయడానికి, నేను నిరాకరించాను. కాని యిప్పుడు నా అంతటనేనే మిమ్మల్ని అర్థించడానికి వచ్చాను.." అన్నారు కనకరాజు.

భీమరాజు, ఆశ్చర్యంగా కనకరాజుకేసి చూశారు. వున్నది వున్నట్టు చెప్పిన కనకరాజు నిజాయితీని మనసులో హర్షించారు.

"అంటే?" పూర్తిగా అర్థంగానట్టే అడిగారు.

"మీరుకోరినట్టే, మీ శాలుకు యిన్‌కంటాక్సు, సేల్సుటాక్సు లెక్కలు రాస్తాను. అయితే, నాకో సహాయం చేసి పెట్టాలి."

"హఠాత్తుగా మీలో మార్పు వచ్చేసిందన్న మాట! మంచిదే నేను

చేయవల్సిన సహాయం యేమిటో చెప్పండి.

"నాకు ఓ వెయ్యిరూపాయలు కావాలండీ! అది కేవలం అడ్వాన్సు రూపంలోనే నెలకి మీరు నాకు యెంత యివ్వదల్చుకుంటే, ఆ మొత్తం అందులో కొట్టేసుకోండి. ఇది నా అభ్యర్థన."

భీమరాజు, సన్నగా మందహాసం చేశారు.

"మీ మనస్తత్వాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నానండీ కనకరాజుగారూ. నేను మిమ్మల్ని కోరి అడిగినపుడు, కాదన్నారు. ఇప్పుడు మీ అంతట మీరే వచ్చి అర్థిస్తున్నారు.."

"ముందుగానే చెప్పాను కదండీ భీమరాజుగారూ! మాలాంటి జాతకులకు, ఆలోచించిన దానికి భిన్నంగానే యెప్పుడూ జరుగుతూ వుంటుంది. అనుకోని కొన్ని ఖర్చులు అర్థాంతరంగా వచ్చి పడినయ్యండీ! పైకం సంపాదించాలని నేను చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయండీ. అప్పుడు మీరు గుర్తుకొచ్చారు. వెంటనే వచ్చేశానండీ" వున్నది వున్నట్టు చెప్పేశారు, కనకరాజు.

భీమరాజు, అతని అవసరాన్ని అవగతం చేసుకున్నారు.

"అర్థం చేసుకున్నాన్లెండి, రాజుగారూ. నాపై యి[illegible] పెంచుకుని వచ్చినపుడు, మిమ్మల్ని నిరాశకు గురిచెయ్యనండీ మీరు కోరినట్టే వెయ్యి రూపాయలు తీసుకెళ్ళండి. రోజూ సాయంత్రం ఓ గంట మీరొచ్చి యిక్కడి పనులు చూసుకుంటే చాలు. నెలకి రెండొందల యాభై యిస్తాను సమ్మతమేనా!" అన్నారు, భీమరాజు.

కనకరాజు మొహం విప్పారింది. అతనికి అంతకంటె కావాల్సిందేముంది.

"నాకేం అభ్యంతరం లేదు భీమరాజుగారూ! నిజంగా మీరు యెంతో మంచివాళ్ళండీ!" వుత్సాహంగా చెప్పారు, కనకరాజు.

భీమరాజు మెల్లగా నవ్వేరు. "నన్ను మరీ పొగడకండీ కనకరాజుగారూ, ఇదిగోండి మీరు కోరిన వెయ్యిరూపాయలు" అంటూ కేష్‌బాక్స్ నుండి వెయ్యిరూపాయలు కట్ట తీసి అందించారు.

కనకరాజు కళ్ళు, మెరిసినయ్ డబ్బు చూసికాదు. తన సమస్యలు పరిష్కారమౌతున్నాయన్న సంతోషంతో. ఆ పైకాన్ని జేబులో పెట్టుకున్నారు.

"థాంక్సండీ భీమరాజుగారూ! సమయానికి మీరందించిన యీ సహాయాన్ని మర్చిపోలేను. రేపట్నుంచి సాయంత్రం పూట వస్తుంటానండీ! మరి సెలవు తీసుకుంటాను." అంటూ లేచారు కనకరాజు.

"అప్పుడే వెళ్ళిపోతే యెలా? కాఫీ తీసుకుని మరీ వెళ్ళండి." అంటూ కనకరాజుని కూచోబెట్టి నౌకరుచేత కాఫీ తెప్పించి, యిచ్చారు.

కాఫీ తీసుకున్నాక, తృప్తిగా ఓ చిర్నవ్వు నవ్వుతూ వెళ్ళి పోయారు, కనకరాజు.

భీమరాజు, సన్నగా నవ్వుకున్నారు. ఆ నవ్వులో గర్వం లేశమాత్రమైనా

లేదు. కనకరాజులాంటి వ్యక్తికి, అవసర సమయంలో సహాయం చేశాననే తృప్తి మాత్రమే వుంది. డబ్బున్న వాళ్ళందరూ ఒకేలా వుండరు మరి.

* * *

కనకరాజు, ఆఫీసుకి బయల్దేరే ప్రయత్నంలో వుండి, బట్టలు మార్చుకుంటున్నారు.

"మన ప్రయాణం గురించి యేమాలోచించారండీ!" అంటూ లక్ష్మి అక్కడికి వచ్చింది.

"మీ చెల్లాయి పెళ్ళికి మనం వెళ్తున్నట్లే లక్ష్మీ! రాత్రి చెప్పాను కదా, కొంతపైకం యేర్పాటయ్యింది. అందులో కొంత నాన్నగారికివ్వాలి. మిగిలింది మన ప్రయాణానికి . . . మనం వెళ్ళేసరికి, నా జీతం కూడా దొరుకుతుంది కదా! ఎలాగో అడ్జస్ట్ అయిపోతాం.

లక్ష్మి, క్షణం తటపటాయించింది. "మీనాన్నగారు యిప్పుడు తీర్థయాత్రలకు వెళ్ళక పోతే, వచ్చిన నష్టమేమిటండీ?" అంది, సాలోచనగా.

"మన దృష్టిలో నష్టం యేమీ లేదు లక్ష్మి పుణ్యం ,పురుషార్థం వస్తుందని ఆయన తాపత్రయం. ఆ వయసులో అందరికీ వుండే తాపత్రయమే అది. అందుకే, మన పరిస్థితులేవీ ఆలోచించకుండా, ఆయన ప్రయాణానికి సిద్ధపడుతున్నారు."

"నేనోసారి చెప్పి చూస్తానుండండి"

"వద్దు లక్ష్మీ నువ్వు చెప్పినా, నేనే నిన్ను పురమాయించానని, ఆయన అపోహపడొచ్చు, వున్నంతలో, మనమే సర్దుబాటు చేసుకుందాం. ఖర్చులన్నీ ఒకేసారి వచ్చి పడ్డాయనిగాని, లేకపోతే యేదో విధంగా అడ్జస్టు అయ్యేవాళ్ళం." అన్నాడు, కనకరాజు

లక్ష్మి, మౌనంగా ఓ నిట్టూర్పు విడిచింది. భర్త మానసిక పరిస్థితిని అర్థం చేసుకుంది. ఆయనపట్ల జాలికలిగింది. ఇంటి యాజమానిగాఆయనకి, యింట్లోని సభ్యులందరి అవసరాలూ తీర్చే బాధ్యత వుంది. కాని, ఆస్తోమత వున్నదీ, లేనిదీ, యెవరు అవగాహన చేసుకుంటున్నారు?.... అనుకుంది లోలోన.

"సరే మీయిష్టం, మా చెల్లెలి కోసం వాచీ తీసుకోవడం మాత్రం మర్చిపోకండి. అది, నోరు విడిచి అడిగిందని చెబుతున్నానుగాని, లేకపోతే ప్రస్తుత పరిస్థితుల్లో, మనకి ఆ తాహతు లేదని తెలుసు. పోతే, హెచ్చెమ్టీ వాచీయే తీసుకోవాలనేం లేదు. కాస్త తక్కువలో వచ్చేదేదయినా తీసుకోండి" అంది లక్ష్మి.

అర్థాంగి ఆపాటి అర్థం చేసుకున్నందుకు సంతోషించాడు, కనకరాజు. అతనికి తెలుసు, లక్ష్మి మనస్తత్వం. ఆపాటి యింగితం, అవగాహన గల గృహిణి వుంది గాబట్టే, తాను సంసార సాగరంలో యీదుకొస్తున్నాడు.. అనుకున్నాడు



మనసులో.

"నువ్వయినా ఆపాటి అర్థం చేసుకున్నావు లక్ష్మి చాలా సంతోషం ఏదో చేద్దాంలే. మరి, నేను వెళ్ళొస్తాను." అంటూ, టేబిలు మీదున్న ఫైలు తీసుకుని నిష్క్రమించాడు.

లక్ష్మి, ద్వారం దగ్గర నించి వెనక్కి తిరిగి లోపలికి వచ్చేసింది.

"అమ్మా, నాన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోయారా?" అడిగింది, వసంత.

"అవనమ్మా! ఏం?"

"పిన్ని పెళ్ళి దగ్గర బడుతోంది. మరి, నాకు చీర యెప్పుడు కొంటారమ్మా?" అడిగింది, వసంత.

కూతురుకి యేం సమాధానం చెప్పాలో, బోధపడలేదు లక్ష్మికి. ఒక్కగానొక్క అమ్మాయి ఆమె ముద్దు ముచ్చట తీర్చాల్సిన బాధ్యత కూడా వుంది తండ్రికి. కాని, యిప్పటికే, ఆయన ఆర్థిక పరమైన యిబ్బందులతో సతమతమైపోతున్నారు. పరిస్థితి తెలిసికూడా, తానేమీ చెయ్యలేని అయోమయ స్థితిలో వుంది. అటువంటప్పుడు, కూతురికి యేం జవాబు చెబుతుందని? అయితే కూతుర్ని నిరుత్సాహపర్చడమూ ఆమెకి మనస్కరించడం లేదు.

"కొంటార్లే అమ్మా. ఇంకా వ్యవధి వుంది కదా?" అంది.

"పెళ్ళికి అందరూ మంచి మంచి చీరలు కట్టుకొస్తారు. నాకూ కొత్తరకం చీర యేదయినా కొనమ్మా" అంది వసంత.

" అలాగేలే అమ్మా." ఓ నిట్టూర్పు విడుస్తూ అంది, లక్ష్మి.

తల్లి సమాధానం, వసంతకి యెంతో సంతృప్తిని కలిగించింది. చిన్న కూనిరాగం తీసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

లక్ష్మి దిగులుగా వంట గదికేసి నడిచింది. గోధుమపిండి గిన్నెలో రాత్రి రొట్టెల కోసం తడుపుతోందేగాని, ఆమె మెదడులో యెన్నో ఆలోచనలు గింగురు మెడుతున్నాయి. ఏవిటో తమ జీవితాలు ఎదుగూ, బొదుగూలేని సామాన్య బ్రతుకులు? పిల్లల అచ్చట, ముచ్చటలు తీర్చే అవకాశాలు కూడాలేని అర్థరహిత జీవితాలు?... వ్యర్థ జీవితాలు. . . యిలా అనుకుంటూ వుంటే . ఆమె కళ్ళు, అప్రయత్నంగా చెమ్మగిల్లినయ్. "అమ్మాయ్ లక్ష్మి.." అన్న మావగారి పిలుపు వినేసరికి, ఆలోచనల నుండి తేరుకుని, వాస్తవలోకంలో పడింది, లక్ష్మి.

"వస్తున్నాను మావగారూ" అంటూ కేకవేసి, ముందుగదిలోకి వెళ్ళింది చరచరా.

"భోజనం వడ్డించేయ మంటారా మావగారూ?" అంది.

"కాస్సేపు ఆగమ్మా, ఇప్పుడేకదా వచ్చాడు యెండలోంచి కొంచెం రెస్టు తీసుకోని." అలసిపోయి వున్నట్టుగా అన్నాడు, ముకుందం.

"అయినా, మీరిలా యెండలో యెందుకు తిరుగుతారు మావగారు, బైట యెండ యెంత తీవ్రంగా వుందో చూడండి?"

"అవసరమైతే, వెళ్ళక తప్పుతుందా అమ్మా? అలా సీతారామయ్య

దగ్గరికి వెళ్ళొచ్చాను. ముందుగానే రైళ్ళల్లో రిజర్వేషన్లు చేసుకోకపోతే ప్రయాణాలు దుర్భరంగా వుంటాయంటున్నాడు, సీతారామయ్య. ఉత్తర భారతంలో మరీ యెండలాయె. అబ్బాయి, యిదిగో, అదిగో అంటాడేగాని, ఆ పైకం విషయం యేమీ తేల్చడు. నీతో యేమన్నా చెప్పాడా అమ్మా?" ఆసక్తిగా అడిగాడు, ముకుందం.

మావగారితో, తమ యింటి పరిస్థితులు చెప్పుకోడానికి మంచి అదను దొరికిందనిపించింది, లక్ష్మికి. అయితే, భర్త ముందుగానే, హెచ్చరికగా చెప్పిన మాటలు, ఆమె చెవుల్లో గింగురు పెట్టాయి. అందుకే, తన ఆలోచనల్ని ఆచరణలో పెట్టలేకపోయింది. "పైకం యేర్పాటు చేసినట్టే చెప్పారు మావగారూ సాయంత్రం వచ్చి, మీకిస్తారేమో? అంది.

ముకుందం మొహం విప్పారింది. అతని కళ్ళల్లో ఆనందానుభూతితో కూడిన వెలుగు తళుక్కుమంది. చిరకాల వాంఛ తీరబోతున్నందుకు, యెంతగానో సంబరపడిపోయాడు.

"నాకు తెలుసునమ్మా, వాడు తప్పకుండా యేర్పాటు చేస్తాడని. నేనంటే, వాడికి యెంతో గౌరవం. . . భక్తీను?" ఉత్సాహంగా అన్నాడు, ముకుందం.

మనిషి యే పరిస్థితుల్లో సంతోషిస్తాడో, యెందుకు సంతోషిస్తాడో, అప్పుడు తెలుసుకుంది, లక్ష్మి. ఎంత విచిత్రమైన మనస్తత్వం మనిషిది! అనుకుని, మరేం మాట్లాడకుండా వెనక్కి తిరిగి వెళ్ళి పోబోతుంటే, ముకుందమే అన్నాడు.

"వడ్డించేయమ్మా, వస్తున్నాను." అంటూ వుత్తరీయాన్ని భుజమ్మీద వేసుకుని, పెరట్లోకి దారితీశాడు, ముకుందం .

లక్ష్మి, వంటగది కేసి నడిచింది

* * *

ఆ రోజు సాయంత్రం, ముకుందం పార్కుకి బయల్దేరాడు.

ప్రతిరోజూ, సీతారామయ్య, ముకుందం, సాయంత్రం పూట అదే పార్కులో కలుసుకుంటారు. అది వాళ్ళకి దినచర్య.

ముకుందం వెళ్ళేసరికి, సీతారామయ్య ఒక్కడే కూచున్నాడు బెంచీమీద.

తానూ, తన ప్రయాణానికి డబ్బు యేర్పాటు చేసుకున్నానన్న ఆనందాన్ని వ్యక్తం చేసుకోవాలన్న తాపత్రయం మెండుగా వుంది, ముకుందంకి. అందుకే, వెళ్తూనే

"సీతారామయ్య, నా ప్రయాణం కూడా నిశ్చయమైనట్టే. మా అబ్బాయి పైకాన్ని యేర్పాటు చేశాడు. రేపు వుదయమే తెచ్చి యిచ్చేస్తాను." వుత్సాహంగా చెబుతూ, సీతారామయ్య పక్కనే ఆసీనుడయ్యాడు, ముకుందం.

సీతారామయ్య, చప్పున జవాబు చెప్పలేదు. అతని మొహంలోకి చూశాడు, ముకుందం. అతని మొహంలో, యేదో మార్పు వచ్చినట్టు పసిగట్టి, విస్తుపోయాడు. ఇంతలోనే మార్పా?. . . అనుకుని

"ఏవిటీ సీతారామయ్య, ఒక్కసారి అలా అయిపోయావు? ఏం జరిగింది?" ఆరాటంగా అన్నాడు, ముకుందం.

సీతారామయ్య, భారంగా ఓనిట్టూర్పు వదిలాడు.

"నా ప్రయాణాన్ని విరమించుకుంటున్నాను ముకుందం" అన్నాడు, నిర్లిప్తంగా.

షాక్ తగిలినట్టయ్యింది, ముకుందంకి. ఈ హఠాత్పరిణామానికి కారణం యేవిటో, అతనూహించలేక పోయాడు.

"ఆశ్చర్యంగా వుంది సీతారామయ్యా! నిజానికి నా ప్రయాణం అనుమానాస్పదంగా వుండేది. అటువంటిది, నా ప్రయాణం ఖరారయ్యింది. నిశ్చయమైన నీ ప్రయాణం తప్పిపోవడానికి కారణం యేవిటి?" విస్తుపోతూ అన్నాడు, ముకుందం.

" నా ఆరోగ్యం బావుండటం లేదు ముకుందం.." ముక్తసరిగ చెప్పాడు, సీతారామయ్య.

అది, నిజమైన కారణం అయ్యుండక పోవచ్చుననిపించింది, ముకుందంకి, అతను చెబుతున్న ధోరణి బట్టి.

" నేన్నమ్మను సీతారామయ్యా! నీ ఆరోగ్యంలో లోపమేం లేదు. వేరే కారణం యేదో వుంటుంది. నా దగ్గర దాపరికం యెందుకు చెప్పు?" చనువుగా అన్నాడు, ముకుందం.

"సీతారామయ్య, మళ్ళీ ఓ నిశ్వాసం వదిలాడు.

"అవులిస్తే, పేగులు లెక్కబెట్టేలా వున్నావయ్యా నువ్వు నీ అనుమానం కరక్టే! సమయానికి, మా అబ్బాయికి డబ్బు దొరకలేదు. అదనంగా యేవేవో ఖర్చులొచ్చి పడుతున్నాయి. సంపాదిస్తున్నవాడు, వాడొక్కడే. వాడే, నాకోసం డబ్బు సంపాదించడానికి పడుతోన్న యాతనల్ని చూసి, నాకే బాధనిపించింది. పుణ్యం, పురుషార్థం, లేకపోతే పోయే- అని నేనే ఓ నిర్ణయానికొచ్చి నా ప్రయాణానికి స్వస్తిచెప్పాను. పోనీ నువ్వు వెళ్ళొచ్చేయ్ ముకుందం." అన్నాడు, సీతారామయ్య.

ముకుందం, నిరాశతో దిగాలు పడ్డాడు. తాను ఒంటరిగా వెళ్ళడమన్నది సాధ్యంగాని పని. అందుబాటుకి వచ్చిందనుకున్న యీ అవకాశం, యిలా చేజారిపోయినందుకు, యెంతగానో బాధపడ్డాడు లోలోన. అయితే సీతారామయ్య ఆలోచించిన విధంగా తానెందుకు ఆలోచించలేకపోయాడో నన్న సందిగ్ధ, అతణ్ణి బాధపెట్టింది. కొడుకు కనకరాజు, తనకివ్వడానికి తీసుకొచ్చిన పైకం సంపాదించడానికి, యెన్ని ప్రయత్నాలు చేశాడో. తనకి తెలీదుకదా! సీతారామయ్య కొడుకులానే, తన కొడుకు పరిస్థితి వుంది. అయినా, సీతారామయ్యలా తాను ఆలోచించలేకపోయాడు. . . ఎందుకు? అది, అవగాహన లోపమా? . ఆలోచిస్తోన్న ముకుందంకి, యెవరో కడుపులో చేయిపెట్టి దేవుతున్నట్టనిపించింది. అతనూ ఒక నిర్ణయానికొచ్చేశాడు.

"నేనూ వెళ్ళడమనే ప్రసక్తే మరి లేదు సీతారామయ్యా! నువ్వన్నట్టు,

పుణ్యం, పురుషార్థం లేకపోతే పోయె. నేనూ నా ప్రయాణాన్ని విరమించుకుంటాను." అన్నాడు, ముకుందం.

"ముకుందం, నేను చాలా విచారిస్తున్నాను, నా మూలంగా నీ ప్రయాణం కూడా కాన్సిలయినందుకు.." బాధపడుతూ అన్నాడు, సీతారామయ్య.

ముకుందం సన్నగా నవ్వేడు.

"అబ్బే! అలా అనుకోకు సీతారామయ్య! ఇది ఒకందుకు మంచిదే అయ్యిందిలే..."

"మరో విషయం కూడా ఆలోచించాను ముకుందం. ఈ వయసులో మన వాళ్ళందర్నీ యిక్కడ వదిలిపెట్టి, పరభాషా రాష్ట్రంలో, అంతదూరంలో తిరగడం శ్రేయస్కరం కాదనిపించింది. మన ఆరోగ్యం, యెప్పుడెలా వుంటుందో, చెప్పలేం కదా!" అన్నాడు, సీతారామయ్య.

"అదీ నిజమే సీతారామయ్య మనం ఒక నిర్ణయానికి వచ్చేశాం కదా! అదే ఫైనల్.." అనేశాడు, ముకుందం.

ఆ తర్వాత, యేవేవో కబుర్లు చెప్పుకుని యింటిముఖం పట్టారు, వాళ్ళిద్దరూను.

* * *

అదే రోజు సాయంత్రం యేడున్నర ప్రాంతంలో శ్రీనివాస్, అతని స్నేహితుడు రవితో నోట్సు పుస్తకాలు కొనడానికని, బజార్లోకి వెళ్ళాడు.

వాళ్ళిద్దరూ భీమరాజు ఎంటర్‌ప్రైజెస్ మీదుగా వెళ్తున్నారు.

కనకరాజు, ఆషాపులో ఓ టేబిలు ముందు కూచుని, యేదో రాస్తూ వుండటాన్ని రవి చూశాడు. . . ఆశ్చర్యంతో అతని కళ్ళింతలయ్యాయి.

"ఒరేయ్ శ్రీని, మీనాన్నారులా వున్నారు.. అక్కడ చూడు అదిగో, ఆ టేబిలు ముందు కూచుని యేదో రాస్తున్నారు చూశావా?" అన్నాడు, రవి.

"ఎక్కడరా?" అటూ, యిటూ చూస్తూ అడిగాడు, శ్రీనివాస్.

"భీమరాజు ఎంటర్‌ప్రైజెస్‌లో. . . అటుచూడు."

శ్రీనివాస్, అటుకేసి చూశాడు. ఔను! అక్కడ కూచుని రాస్తున్నది నాన్నగారే అనుకున్నాడు మనసులో. ఆయన యిక్కడేం జేస్తున్నారో, అతడికి బోధపడలేదు.

"ఔరా రవి, మానాన్నగారే ఇక్కడేం చేస్తున్నారు చెప్మా.." సాలోచనగా అన్నాడు, శ్రీనివాస్.

"బహుశా యిక్కడ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నారేమో. ." అన్నాడు, రవి.

ఆ విషయం, శ్రీనివాస్‌కి తెలీదు. "అయ్యుండొచ్చునురా?" ముక్తసరిగ సమాధానం చెప్పాడు, శ్రీనివాస్.

"ఒక మనిషికీ, మరో మనిషికీ, యెంత వ్యత్యాసం వుంటుందో, చూశావ్రా.." అన్నాడు, రవి.

రవి, యెందుకలా అన్నాడో, శ్రీనివాస్‌కి బోధపడలేదు. ఏదో భావన మనసులో వుంచుకునే అలా అని వుంటాడని మాత్రం గ్రహించాడు.

"అంటే, యేవిట్రా నీ వుద్దేశం?" సూటిగ రవికేసి చూస్తూ ప్రశ్నించాడు.

"మీ నాన్నగారు, యెంతో వుత్తములురా శ్రీని. ఆయన యింటి బాధ్యతల పట్ల గౌరవం వుంది. తన బాధ్యతల్ని తీర్చడానికి, శ్రమించడానికి సహితం లెక్క చెయ్యడం లేదు. మా నాన్నారూ వున్నారు. . ఎందుకూ? ఇంటి బాధ్యతల్ని బొత్తిగా పట్టించుకోరు, ఆయన సంగతి మీకెవ్వరికీ తెలీదురా. డబ్బు చేతిలో వుంటే చాలు- తాగి, తందనాలాడుతూ, పేకాటలో యెక్కువ సమయం గడిపేస్తారు. కుటుంబం యెలా వుందో, వాళ్ళ జీవితాలు, నిత్యావసరాలు, యెలా సాగుతున్నాయో నన్న ధ్యాసే వుండదాయనకి. ఆయన గురించి చెప్పుకోడానికి, కొడుకుగా నాకే సిగ్గేస్తోంది. మా ఆర్థిక స్థితి, బాగా దిగజారడానికి కారకులు ఆయనే. ఈవిషయంలో యెవరయినా యేమైనా అన్నారనుకో, యింక చూడు. . యేమేమో దుర్భాషలాడుతూ, గంతులేస్తారు. అందుకే అందరమూ కిక్కురు మనకుండా, నోరుమూసుకుంటాం. ఇదే కారణం

వల్ల, నేను ఎక్స్‌కర్షన్‌కి డబ్బు కట్టలేకపోయాను. ఇప్పుడా అజంతా, ఎల్లోరాలు చూడకపోతేనేం- మన చదువుకి అంతరాయం వుండదని, నాలో నేనే సమాధానపడి, వూరుకున్నాను. కొన్ని అనుభవాలు, అందరికీ అందుబాటులో వుండవురా శ్రీని." బాధగా చెప్పుకు పోయాడు, రవి.

రవి కళ్ళు చెమర్చిన యేమో, జేబులోంచి రుమాలు తీసి, కళ్ళొత్తుకున్నాడు.

రవి మాటలు, అతడి అనుభూతి శ్రీనివాస్‌ని ఆలోచింప జేశాయి. రవి, వాళ్ళనాన్నగారిని విమర్శిస్తు, తన తండ్రి కనకరాజుని బాధ్యత గల తండ్రిగా వర్ణించి మెచ్చుకుంటున్నాడు. అయితే, తన తండ్రిని, తాను యెంతగా అర్థం చేసుకున్నాడని. ఆయన, తనకి నచ్చజెప్పడానికి చేసిన ప్రయత్నాన్ని పెడచెవిన బెట్టి, యేమేమో అనేశాడు. ఆయనలో అశాంతిని రేకెత్తించాడు. నిజంగా, తన ప్రవర్తన నాన్నగారిని బాధ పెట్టి వుంటుంది. . కలవర పరిచే వుంటుంది. ఎంత తొందరపాటుగా ప్రవర్తించాడు తను?. . అనుకున్నాడు.

శ్రీనివాస్‌లో, పశ్చాత్తాపం పొంగి పొర్లింది. భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు. "రవి, మన యిద్దరం సమ వయస్కులమే అయినా, నీ అవగాహన నాకు లేకపోయింది. నా తొందరపాటుకి పరోక్షంగా యెత్తి చూపి, నాకు కనువిప్పు కలిగించావు. అందుకు, నీకు కృతజ్ఞత చెప్పుకోవాలిరా." అన్నాడు శ్రీనివాస్.

రవి, నిర్ఘాంత పోయాడు, ఆశ్చర్యంగా చూశాడు, శ్రీనివాస్ కేసి.

"ఏవిట్రా నువ్వంటున్నది? నువ్వు నాకు కృతజ్ఞత చెప్పు కోవడం యేవిటి? ఏ సందర్భంలోన్రా? అంతా నాకు అయోమయంగా వుందిరా శ్రీని." కళ్ళింతలు చేసుకుని అన్నాడు, రవి.

"చెప్పుకోడానికే సిగ్గుగా వుందిరా రవి, నా మీద నాకే అసహ్యం వేస్తోంది.

విషయం చెబితే, నా ప్రవర్తనకి నువ్వు హర్షించవు సరికదా, గర్హిస్తావురా. అయినా సరే, నా తొందరపాటు వ్యక్తం చేసి, నా గుండెలోని భారాన్ని దించుకోవాలి." అంటూ, తాను తండ్రితో యేవిధంగా వాదించింది, వివరంగా చెప్పాడు, శ్రీనివాస్.

రవి, మరింత విస్తుపోయాడు, అంత మంచి తండ్రిని అర్థంచేసుకోకుండా, శ్రీనివాస్ యెందుకంత దురుసుగా ప్రవర్తించాడో, వూహించలేకపోయాడు.

"ఎంత తొందరపడ్డావురా శ్రీని? నువ్వు చదువుతున్న చదువుకి యిదేనా సార్థకత? నీలో భయభక్తులు బొత్తిగా లేకండా పోయాయా? ఇంతవరకూ, మానాన్న యెదుటికి వెళ్ళడానికే నాకు భయమేస్తోందే? మీనాన్నగారు పుత్తములు, సహృదయులు, ఆలోచనాపరులు గనక, నువ్వేం వాదించినా, యెలా వాదించినా, అవధుల్లేని సహనంతో విని, వూరుకున్నారు. అదే మానాన్నగారయితే, యేం జరిగి వుండేదో, వూహించడానికే భయంగా వుంది. నిజం చెప్పాలంటే, యీ నాటి ప్రపంచపు పోకడ అలా వుందిరా శ్రీని. మంచివారికి, తగిన గౌరవం, గుర్తింపు, లభ్యం కావడంలేదు. మంచితనం లోపించిన వారికి, అంతా దాసోహమంటారు. అది కేవలం భయం వల్లనేకావచ్చు. ఇదీ ప్రపంచపు రీతి. మరో విషయం శ్రీని. మీనాన్నగారు యీపావులో అదనంగా వస్తేస్తున్నారూ అంటే, అది ఆయన సుఖం కోసం కాదు. ఆయన సుఖాన్ని త్యజించి, కష్టపడుతున్నారంటే. అది కేవలం మీ కుటుంబం కోసమే. అటువంటి వ్యక్తిని పూజించాలిరా.." తమ యింటి పరిస్థితుల్ని దృక్పథంలో పెట్టుకుని అన్నాడు, రవి.

శ్రీనివాస్‌కి, మరింత బాధనిపించింది. రవి చెప్పింది అసత్యం కాదనిపించంది. బాధ్యతల్ని విస్మరించిన రవి తండ్రికంటె, తన తండ్రి యెంతో పున్నతంగా అగుపించాడు. తాను అసభ్యంగా ప్రవర్తించి నందుకు, లోలోన కుమిలిపోయాడు.

"రవీ, నా ప్రవర్తన తీరు తప్పేనని, యిప్పుడు తెలుసు కున్నాన్రా! అందుకు నా హృదయము రంపపుకోతకు గురవుతోంది. పరిస్థితుల్ని అర్థం చేసుకోకుండా, వుడుకురక్తం పురకలు వేస్తుంటే, అర్థరహితంగా, అనాలోచితంగా, యేమేమో అనేశాను. మా నాన్నగారు, నాగురించి యేమనుకున్నారో యేమో? ఆయనకి క్షమాపణ చెప్పుకోవాలి." పశ్చాత్తాప్త హృదయంతో అన్నాడు, శ్రీనివాస్.

"మనవి, మధ్యతరగతి కుటుంబాలురా శ్రీని మన జీవితాలు, త్రిశంకు స్వర్గాల్లాంటివి. అటు, మీదికి వెళ్ళలేం. . . ఇటు క్రిందికీ దిగలేం. బాగా వెనుకబడిన క్రింది తరగతి వాళ్ళని చూడు. . . యింట్లో వాళ్ళందరూ కష్టపడతారు, స్త్రీ పురుష భేధం లేకుండా, సంపాదిస్తారు, వున్నదాంతో, హాయిగా, తృప్తిగా బ్రతుకునీదుస్తారు. ఇహ, పై తరగతి వాళ్ళ విషయం చెప్పనవసరమే లేదు. వాళ్ళు ఆర్థికపరంగా, సామాజికపరంగా, పై అంతస్తులోనే వుంటారు. వాళ్ళకి, అనువైన అవకాశాలున్నాయి గాబట్టి, వాళ్ళ చదువులూ పై స్థాయిలోనే వుంటాయి. ఎటొచ్చి, మనలాంటి మధ్యతరగతి వాళ్ళకే యిబ్బందులన్నీను? సంపాదించే వాళ్ళు ఒకరిద్దరు అయితే, తినేవాళ్ళెంతోమంది. ఆత్మ గౌరవాన్ని

కాపాడుకునేందుకు, సంఘస్థాయిని నిలబెట్టుకుందుకు, కాస్తంత స్థాయిలో బ్రతకడానికే యత్నిస్తారు. ఆ ప్రయత్నంలో, యెన్నో తాపత్రయాలు.. యెన్నో ఆరాటాలు. ఇలా వుంటుంది జీవితం. తృప్తి అన్నది యేకోశాన వుండదు. అందుకే, మనవి త్రిశంకుస్వర్గాల్లాంటి జీవితాలంటారు." చిన్న వుపన్యాసం యిచ్చినట్టుగా చెప్పుకు పోయాడు, రవి.

రవి, యీ చిన్న వయసులోనే యింతటి పరిజ్ఞానాన్ని, వాక్చాతుర్యాన్ని, యెలా సంతరించుకున్నాడో, శ్రీనివాస్‌కి అవగాహన కాలేదు. తాను కూడా రవి వయస్కుడే అయినా, తనకి యివేమీ తెలివెందుకుని?... అనుకున్నాడు మనసులో. ఒక విధంగా మనసులో చిన్న బుచ్చుకున్నాడు కూడా.

"రవీ, యి వన్నీ నువ్వెలా చెప్పగలుగుతున్నావురా?" ఆశ్చర్యంగానే అడిగాడు, శ్రీనివాస్.

రవి, చిన్నగా మందహాసం చేస్తూ ఓ నిశ్వాసం వదిలాడు.

" ఇవన్నీ జీవితం నేర్పిన పాఠాలురా శ్రీనివాస్! ఆపైన పుస్తక పరిజ్ఞానం. నేను విపరీతంగా పుస్తకాలు చదువుతానని నీకూ తెలుసునుకదా? పుస్తక పరిజ్ఞానం వూరికనే పోదురా. అందుకనే, పరిస్థితుల్ని అర్థం చేసుకో గలుగుతున్నాను," సన్నగా నవ్వుతూనే అన్నాడు, రవి.

శ్రీనివాస్‌లో ఓ విధమైన మార్పు వస్తోందని, వూహించాడు, రవి. అటువంటి పరిణామం రావడం, యెంతో అవసరమనుకున్నాడు.

" రవి నీకు యెలా ధన్యవాదాలు చెప్పుకోవడమో, బోధపడ్డం లేదురా. నిశ్చింతగా జీవితం సాగిస్తున్న నాకు, అసలు జీవితమంటే యేవిటో, కొంతయినా బోధపడేలా చెప్పావు. థాంక్స్‌రా. ఎక్స్‌కర్షన్‌కి నేనూ వెళ్ళను." అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేసినట్టుగా చెప్పాడు, శ్రీనివాస్.

రవి, శ్రీనివాస్ కేసి అదోలా చూశాడు.

"అదేంరా! మీ నాన్నగారు డబ్బివ్వడం, దాన్ని నువ్వు మాష్టారు దగ్గర డిపాజిట్ చెయ్యడం జరిగింది కదా? ఇప్పుడిలా మనసు మార్చుకున్నావేమిటి?" అన్నాడు రవి ఆశ్చర్యంగా చూస్తూ.

"ఔన్రా! డిపాజిట్ చేశాను. కాని, ఆ పైకాన్ని మన సరదాలకి వినియోగించ దల్చలేదు. మా నాన్నగారు అన్నట్టు, చదువుకి, యెక్స్‌కర్షన్‌కి సంబంధమే లేదు. ఇదో రకమైన సాధారణ పరిజ్ఞానం మాత్రమే. నేను వెళ్ళక పోయినా, చదువుకి ఒరిగే నష్టమేమీ లేదనిపిస్తోంది. ఇప్పుడే వెళ్ళి నేను డిపాజిట్ చేసిన డబ్బు తీసుకుందాం పద."

రవి, మరేం అనలేకపోయాడు. " సరే, నీ యిష్టం..."

శ్రీనివాస్, రవి నేరుగా లెక్చరర్ రామం ఇంటికి వెళ్ళారు, ఆపైకం తిరిగి తీసుకుందుకు.

* *

ఉదయం యేడు గంటలు దాటింది.

కనకరాజు, ఈశ్వర్ వరండాలో కూచుని కాఫీ తీసుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల గురించి మాట్లాడుకుంటున్నారు.

కనకరాజువి, ఫక్తు గాంధియన్ భావాలయితే, ఈశ్వర్‌వి వాటికి భిన్నమైన భావాలు అందుకే, వాగ్వివాద ధోరణిలో సాగుతున్నాయి వారి మాటలు.

ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థని ఈశ్వర్ విమర్శిస్తూ వుంటే, కనకరాజు సమర్థిస్తూ వుంటాడు. ఏ పార్టీ వచ్చినా, పరిపాలనా వ్యవస్థలో సంపూర్ణ ఫ్పరిణామాలు శాశ్వతంగా రావని, కనకరాజు వాదన. అంతేకాదు- ప్రతిపక్షాలువుండి, యెన్ని విధాలయినా పాలక పక్షాన్ని విమర్శించ వచ్చును. గాని, అవే ప్రతిపక్షాలు పాలనా వ్యవస్థను చేపడితే, విమర్శలకు అతీతులు కాజాలరన్నదే, కనకరాజు సమాధానం.

అటువంటి తరుణంలో, ముకుందం వచ్చాడక్కడికి. ఈశ్వర్, బుద్ధిమంతుడిలా లేచి నుంచున్నాడు.

"కూచోండి మావయ్యగారూ.." అన్నాడు, సవినయంగా.

"నువ్వు కూచోవోయ్.." అంటూ కొడుకుని వుద్దేశించి " అబ్బాయ్, నా ప్రయాణం.." అని యింకేదో చెప్పబోతున్న ముకుందంకి అడ్డు వడ్డాడు, కనకరాజు.

"మీరు కావాలన్న అయిదొందలూ లక్ష్మి చేతికిచ్చాను నాన్నా, అడిగి తీసుకోండి. రిజర్వేషను విషయం త్వరగా చూసుకోండి." అన్నాడు, కనకరాజు.

"ఆ విషయాన్ని చెప్పడానికే వచ్చారా అబ్బాయ్ రాత్రే చెప్పాలనుకున్నాను. కాని, నువ్వు చాలా ఆలస్యంగా వచ్చావు. మరే.. నేనిప్పుడు తీర్థయాత్రలకి వెళ్ళడం లేదురా.." అన్నాడు, ముకుందం.

కనకరాజు, నిర్ఘాంత పోయాడు, అతని మొహంలో, హఠాత్తుగా రంగుమారింది. తండ్రికేసి వింతగా చూశాడు. తను డబ్బు యివ్వడం ఆలస్యమైనందుకే, కోపం తెచ్చుకుని, ప్రయాణం మానుకున్నారేమోనని, బాధపడ్డాడు. "అదేవిటి నాన్నా? మీరు డబ్బివ్వడం ఆలస్యమైందని, సీతారామయ్యగారు తనకోసమే రిజర్వేషను చేయించుకున్నారా యేంటి?" అనుమానాస్పదంగా అన్నాడు. ఒకవేళ అదే జరిగివుంటే, తప్పు తన మీదే పడుతుందని, అతని అభిప్రాయం.

ముకుందం, ముసి ముసి నవ్వేడు. "అదేం కాదులేరా అబ్బాయ్ సీతారామయ్యకి, వీలుపడదట.. అందుకే, అతను ప్రయాణం మానుకుంటున్నాడు. అతను వెళ్ళకపోతే, నాకు తోడెవరుంటారు చెప్పు? అందుకని, నా ప్రయాణాన్ని నేనూ కాన్సిలు చేసుకుంటున్నాను."

"బహూశా, సమయానికి అతనికి పైకం సమకూడలేదేమో మరి?" అన్నాడు ఈశ్వర్.

ముకుందం యేమీ అనలేదుగాని, కనకరాజు అందుకున్నాడు.

"అయ్యుండొచ్చు. ఆ విషయం బైటపెట్టకుండా, వీలుపడదన్న సాకు చెప్పి వుంటాడు. ఏదైతేనేం- మీ ప్రయాణం యిప్పట్లో కాన్సిల్ కావడం, మంచిదే అయ్యింది లెండి నాన్నా. ఎండలు చూస్తే విపరీతంగా వున్నయ్. ఉత్తరభారతంలో అయితే, మరీ అధికంగా వుంటాయి. ఆ వడదెబ్బ తట్టుకోలేక యెంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్టు మనం రోజూ పేపర్లో చూస్తున్నాం. అందుకే, మీ ప్రయాణం తప్పిపోవడం మంచికే అయ్యిందంటున్నాను. అన్నట్టు, యీ విషయం లక్ష్మితో చెప్పేయండి."

ముకుందం, అక్కణ్ణించి వంట గదికేసి దారి తీశాడు.

కనకరాజు మొహంలో, పెద్ద రిలీఫ్ అగుపించింది, ఈశ్వర్‌కి.

" మావయ్యగారి ప్రయాణం తప్పిపోవడం, మంచిదే అయ్యింది బావా." అన్నాడు, ఈశ్వర్.

"ఔను, ముఖ్యంగా, ఆయన యీ వయస్సులో అంత దూరం వెళ్ళడమే నాకు యిష్టం లేదు ఈశ్వర్. కాని, మొదట్లో నేను చెబితే వినలేదు. ఈ విధంగానైనా తప్పింది ప్రయాణం.. మంచిదే అయ్యింది."

"ఎట్లాగయినా, మావయ్యగారు కాస్త పట్టుదల గల మనిషే" చిన్నగా నవ్వుతూ అన్నాడు, ఈశ్వర్.

కనకరాజు, మెల్లగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఏం చేస్తాం ఈశ్వర్. ఎవరి ప్రవృత్తి వారిది, వాళ్ళని మార్చడం అంత సులువేం కాదు."

"అదీ నిజమే బావా!"

కనకరాజు అక్కణ్ణించి లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

* * *

ముకుందం వంటగదికి వెళ్ళేసరికి లక్ష్మి వంకాయలు తరుగుతోంది. వసంత, బియ్యంలో రాళ్ళేరుతుంది.

"అమ్మా, లక్ష్మి.." అంటూ ద్వారం దగ్గరే నిలబడి పోయాడు, ముకుందం.

"ఏవిటి మావయ్యగారూ! మీ అబ్బాయిగారు మీకిమ్మని డబ్బిచ్చారు. అది తీసుకుంటారా యిప్పుడు?" తాను చేస్తోన్నపని ఆపేసి, లేచింది లక్ష్మి.

ముకుందం, చిన్నగా నవ్వేడు. ఈ మధ్యన వుండే టెన్షను, తనలో యిప్పుడు లేనందుకు చాలా ఆనందించాడు.

"డబ్బు తీసుకోడానికి రాలేదమ్మా వద్దని చెప్పడానికి వచ్చాను.." అన్నాడు, మందహాసంతో,

లక్ష్మి మొహం, ఆశ్చర్యంతో రంగు మార్చుకుంది. బహూశ వేగిరం ఆ పైకాన్ని యివ్వలేదని, కోపం వచ్చిందేమో ఆయనకి?... అది చెప్పడానికి యిష్టంలేక, కృత్రిమమైన చిరునవ్వుతో యీ విధంగా తిరస్కరిస్తున్నారేమో.. అనుకుంది.

"డబ్బు వేగిరం యివ్వలేదని కోపం వచ్చిందా యేవిటి మావయ్యగారు! మీ అబ్బాయి, యెక్కడో యేర్పాటు చేసి తీసుకు రావాలికదా! ఈ అదనపు ఖర్చుల్ని తట్టుకోడానికి యేదో షాపులో సాయంత్రం పూట పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నారు కూడాను.." ఆయన సమస్యల్ని మీరూ ఆలోచించాలి.. పెద్దవారు.." అంది సంజాయిషీ చెప్పుకుంటూ.

ముకుందం, ఓ నిశ్వాసం వదిలాడు. "నువ్వు, నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నావమ్మా లక్ష్మి! నాలో యేవిధమైన కోపమూ లేదమ్మా. నిజానికి, సీతారామయ్య తీర్థయాత్రలకు వెళ్ళడం లేదుగాబట్టి నేనూ విరమించుకుంటున్నానమ్మా. పరిస్థితుల్ని అవగాహన చేసుకోకుండా, తీర్థయాత్రలకు వెళ్తానని పట్టుబట్టడంలో నా తొందరపాటుకు, నేను సిగ్గుపడుతున్నానమ్మా." అన్నాడు, మెల్లగా.

లక్ష్మికి, యేవీ బోధపడలేదు. మావగారు, నిజంగానే ఆ మాటలంటున్నారో లేక కొడుకుఅన్న మాటలకి అభిమానం దెబ్బతిని, అలా అంటున్నారో ఆమె వూహకి అందని విషయమయ్యింది. మావగారికేసి అదోలా చూస్తూ అనబోయేటంతలో, ముకుందమే మళ్ళీ అందుకున్నాడు.

"నిజమేనమ్మా లక్ష్మి! నేను సిగ్గుపడాల్సిన విషయమే. ఎందుకూ అంటే, నాకున్న ప్రాపంచికానుభవాన్ని విస్మరించి తొందరపాటుతో ప్రవర్తించాను. మన కుటుంబంలో, సంపాదిస్తున్నవాడు అబ్బాయి ఒక్కడే. వాడి సంపాదన మీదే, మనం యింతమంది వ్యక్తులం ఆధారపడి వున్నామంటే, అబద్ధం కాదు. నిత్యావసర వస్తువులు, ఆకాశానంటుకుంటున్న యీ రోజుల్లో వాడొక్కడి సంపాదన, మనందరి భుక్తికే సమంగా చాలదేమో! అటువంటి పరిస్థితుల్లో, నేను తీర్థయాత్రలకి వెళ్తానంటూ తయారవ్వడమే, మూర్ఖత్వమేమోనని పిస్తోందమ్మా! ఈ నిజాన్ని నేను ముందుగా గ్రహించలేకపోయాను. సీతారామయ్య కూడా సరిగ్గా యిటువంటి పరిస్థితుల్లోనే యిరుక్కుని, నిజాన్ని అవగాహన చేసుకుని ప్రయాణం మానుకున్నాడమ్మా! వాడు చెప్పేవరకూగాని, నాకు కనువిప్పు కలగలేదు. అందుకే, సిగ్గు పడుతున్నా నంటున్నాను. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, కేవలం సంపాదించేవాడి మీదే వదిలేయడం, దారుణమే అవుతుంది. అందుకనే, అందరమూ విచక్షణతో ఆలోచించాలి. అవగాహన చేసుకోవాలి. అప్పుడే కుటుంబంలో ప్రశాంతత యేర్పడుతుంది. ఈ అవగాహన లేకనే, చాలా కుటుంబాలు ఒడిదుడుకుల్లో పడుతున్నా యేమోనని, యిప్పుడనిపిస్తోంది నాకు. ఇటీవల, ఆర్థిక ఒత్తిడులవల్ల, అబ్బాయి యెంతటి మనోవ్యధకు, ఆందోళనకు గురి అవుతున్నాడో, వాడి



మొహం చూస్తేనే తెలుస్తోందమ్మా. ఇవన్నీ యోచించే, యీ నిర్ణయానికి వచ్చాను." అంటూ సుదీర్ఘమైన తన వివరణని ముగించాడు, ముకుందం.

లక్ష్మి, తృప్తిగ వూపిరి పీల్చుకుంది. మావగారు అటువంటి నిర్ణయాన్ని తీసుకోవడం, శుభ సూచకంగా తోచిందామెకి.

"మావయ్యగారూ, మీరు యిటువంటి నిర్ణయాన్ని తీసుకున్నందుకు, నేనెంతో ఆనందిస్తున్నాను. మిమ్మల్ని అభినందిస్తున్నాను. ప్రస్తుత పరిస్థితిలో మీ యీ నిర్ణయం, యింట్లో అందరికీ చేయూతనిస్తుంది. ఆలోచింపజేస్తుంది. మీ యీ నిర్ణయాన్ని, మీ అబ్బాయిగారితో చెప్పారా?" అంది, లక్ష్మి.

"చెప్పానమ్మా! వాడేమో నీతో చెప్పమన్నాడు."

"మీ అబ్బాయిగారు యెప్పుడూ యింతేలెండి." ముసిముసి నవ్వుకుంది.

ముకుందం, అక్కణ్ణించి నిష్క్రమించాడు. అతని మనస్సు యిప్పుడెంతో ప్రశాంతంగా వుంది.

లక్ష్మి, తన పనిలో నిమగ్న మయ్యింది. వసంత, తన చీర విషయం మరోసారి గుర్తుచెయ్యాలనుకుంది. కాని, తల్లి కోప్పడుతుందేమోననుకుని, వూరుకుంది.

అప్పుడే శ్రీనివాస వచ్చాడు.

"ఇవ్వాళ! కాలేజీ లేదేవిట్రా?" ప్రశ్నించింది లక్ష్మి.

"లేదమ్మా సెలవిచ్చారు.."

"ఏం? ఎందుకు?"

"ఎవరో చనిపోయారటలే.."

"అలాగా! సరేగాని, నీ ఎక్స్‌కర్షన్ ప్రయాణమెప్పుడూ? మీ పిన్ని పెళ్ళికి వుంటావే, లేదో?"

"నా ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నానమ్మా. ఇదిగో నాన్నగారు నాకిచ్చిన రెండువందల రూపాయలూ, యిప్పుడే లెక్చరర్ దగ్గర్నుంచి తీసుకొచ్చేశాను." అంటూ జేబులోంచి డబ్బు తీసి తల్లికి అందించాడు, శ్రీనివాస.

లక్ష్మి, విస్తుపోతూ కొడుక్కేసి చూసింది. ఈవేళ అన్నీ యిటువంటి సంఘటనలే జరుగుతున్నాయేవిటి?.... అనుకుంది.

"ఇదేవిట్రా? ఎవ్వరూ వెళ్ళడం లేదా?" అంది.

"కొందరు వెళ్తున్నారు... కొందరు వెళ్ళడం లేదు. ఆ వెళ్ళని వాళ్ళల్లో నేనూ వున్నానమ్మా.."

"ఏం? ఎందుకని మానేస్తున్నావురా?"

"నాన్నగారు మొదట్లోనే చెప్పారమ్మా, యెక్స్‌కర్షన్‌కి వెళ్ళడం మానుకుంటేకాదా అని! విజ్ఞానికి, చదువుకీ, ఎక్స్‌కర్షన్‌కి సంబంధం లేదని కూడా చెప్పారు. కాని, నా మొద్దు బుర్రకి అప్పట్లో అర్థంకాలేదు. ఏవేవిటో వాదించాను. నిష్ఠూరంగా వాగేను. నాన్నగారి మనస్సు నొప్పించే వుంటాను.

అదనంగా యీ డబ్బు సంపాదించడానికి, నాన్నగారు ఓ షాపులో సాయంత్రం పూట జాబ్‌వర్క్ చేస్తుండటం చూశాను. నా స్నేహితుడు రవి, నాన్నగారి బాధ్యతను, ఆయన మంచితనాన్ని గుర్తించి, యెంతగానో మెచ్చుకున్నప్పుడు గాని, నాన్నగారి ఔన్నత్యాన్ని నేను గుర్తించలేకపోయాను. అప్పుడనిపించింది, ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళకపోతేనేం? అని! రవి, మరికొందరు విద్యార్థులూ వెళ్ళడం లేదు. వాళ్ళందర్నీ చూశాక, నేనీ నిర్ణయానికొచ్చానమ్మా. నువ్వు లేవుగాని, నాన్నగారి సమక్షంలో ఆరోజు యెందుకలా ప్రవర్తించానో, తల్చుకుంటే నాకే సిగ్గుగా వుందిప్పుడు. అందుకే, ఆయనెదుటికి వెళ్ళడానికి ధైర్యం చాలక, యీ డబ్బు నీకే యిస్తున్నాను.." అన్నాడు, శ్రీనివాస.

శ్రీనివాస మాటల్లో పశ్చాత్తాపం ద్యోతక మౌతోంది.

లక్ష్మి మొహంలో, సంతృప్తి ఛాయలు ముసురుకున్నాయి. ఆమె కనుకొనల్లో ఆనంద బాష్పాలు గిర్రున తిరుగుతున్నయ్. కొడుకులో యిటువంటి అవగాహన రావడం, తమ అదృష్టమే అనుకుంది.

"చాలా మంచిపని చేశావురా శ్రీని! బాధ్యత గల యింటి యాజమానిగా మీనాన్నగారు యెన్ని యిక్కట్లు పడుతున్నారో, మనందరం అర్థం చేసుకోవాలి." అంది, తృప్తిగా.

అప్పుడే కనకరాజు, ఈశ్వర్, అక్కడికి వచ్చారు.

"పిలుస్తూ వుంటే, యెవ్వరూ పలకరేం లక్ష్మి? ఏవిటీ కాన్ఫరెన్సూ?" అన్నాడు, కనకరాజు చిరునవ్వుతో.

లక్ష్మి, మెల్లగా నవ్వింది.

"కాన్ఫరెన్సు కాదండీ, అబ్బాయి, మీరు వాడికిచ్చిన రెండొందలూ తిరిగి యిచ్చేశాడు, వాడు యెక్స్‌కర్షన్‌కి వెళ్ళడం లేదట..." అంటూ తన చేతిలో వున్న రెండువందలూ భర్తకి అందించింది.

కనకరాజు మొహం, ఆశ్చర్యంతో తెల్లబోయింది. ఆరోజు యెన్నో మాటలన్న కొడుకు హఠాత్తుగ యిలా మారిపోవడానికి కారణం యేవిటా, అని ఆలోచించసాగాడు.

"ఏంరా శ్రీనూ, యేమయ్యింది?" అన్నాడు, కనకరాజు కొడుకుకేసి చూస్తూ.

శ్రీనివాస, సిగ్గుతో మొహం దించేసుకున్నాడు.

"వెళ్ళడం లేదు నాన్నగారూ! నా స్నేహితులు కూడా కొందరు వెళ్ళడం లేదు , వాళ్ళతో పాటే నేనూను. ఆరోజు మీరు చెబితే, నేను వినిపించుకోలేదు. అర్థరహితంగా వాదించాను. మీ మనసుని నొప్పించాను. అందుకు, నేను యెంతో బాధపడుతున్నాను. ఈ రెండువందలూ వుంటే, మరో ముఖ్యమైన అవసరానికి అక్కరకొస్తాయనుకున్నాను యిప్పుడు." అన్నాడు శ్రీనివాస, యెంతో బాధ్యత గుర్తించిన వాడిలా.

కనకరాజు మొహంలో, కొంతకాంతి మెరిసింది.

"ఇప్పటికయినా, నీలో యిటువంటి మార్పు వచ్చినందుకు యెంతో ఆనందిస్తున్నా(రా అబ్బాయ్.." అన్నాడు కనకరాజు.

వసంతకి, మంచి అదను దొరికినట్టనిపించింది.

"అమ్మా, నా చీర గురించి నాన్నగారికి చెప్పవే.." గుర్తుచేస్తూ అంది, వసంత.

"నాకు గుర్తుందిలే అమ్మా, ఇవ్వాళ సాయంత్రమే బజారుకి వెళ్దాం.." హామీ యిచ్చాడు. కనకరాజు.

వసంత, మురిసిపోయింది. ఆడవాళ్ళకి, కొత్త బట్టలంటే, యెంత ఆనందమో, ఆమె మొహం అప్పట్లో చూసిన వాళ్ళకి తెలుస్తుంది.

బైట సైకిలు గంట ఒకటేపనిగా మ్రోగుతూవుంటే.. శ్రీనివాస్ వెళ్ళాడు.

టెలిగ్రామ్ మెసెంజరిచ్చిన టెలిగ్రామ్ తీసుకుని, దాన్ని చదువుకుంటూ వస్తున్నాడు, శ్రీనివాస్.

టెలిగ్రామ్‌ని చూడగానే, కంగారు పుట్టింది, కనకరాజుకి, అది సహజమేమరి.

"ఎక్కణ్ణించిరా ఆ టెలిగ్రామ్?" ఆత్రంగా ప్రశ్నించాడు.

"అత్తా, మావయ్యా, రేపు మధ్యాహ్నం బండిలో వస్తున్నారట నాన్నా.." అంటూ తండ్రి చేతికి అందించాడు, టెలిగ్రామ్.

"అంతేకదా! ఏవిటోనని కంగారు పడ్డాను. టెలిగ్రామ్ అంటేనే భయమేస్తుంది. చూశావా ఈశ్వర్, యేదో ఒక ఖర్చు తప్పిందంటే, మరో ఖర్చు తాజాగా యెదుట నిల్చుంది. మధ్య తరగతి బ్రతుకులంటే, యిలాగే వుంటాయోయ్. ఎక్కడికక్కడ అడ్జస్టవుతూ బ్రతుకును యీడ్చుకురావడమే, మధ్యతరగతి కుటుంబాలు అలవర్చుకోవల్సిన స్వభావం. అదీ చిరునవ్వుతోనే అందుకే మనలో యెన్ని బాధలున్నా సమస్యలున్నా, ఊరికే కంగారు పడిపోము. కృత్రిమమైన మందహాసం, యెప్పుడూ పెదాలపై లాస్యం చేస్తూనే వుంటుంది. అదే మన గొప్పతనం." అన్నాడు. చిన్నగా నవ్వుతూ, కనకరాజు ముందుగదిలోకి నడుస్తూ.

ఈశ్వర్, బావని అనుసరించాడు.

శ్రీనివాస్, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

లక్ష్మి, వంటపనిలో నిమగ్నమయ్యింది.

వసంత, సాయంత్రం తాను కొనబోయే చీర గురించి కలలుగంటోంది.

*　　　*　　　*

Edited, Printed and Published by B. Venkata Rayudu From 1-8-519/11
Chikkadapally, P.B.No.1824, Hyderabad, Phone 64104.
Printed at Mahesh Proces, Phone : 864327

Edi
Chikk